పదహారో జన్మదిన ప్రత్యేక సంచిక

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 16 సంచిక : 1 హైదరాబాద్ 198 జనవరి 2018 పేజీలు : 76 రు. 25

- ❊ గుజరాత్‌లో బిజెపి గెలుపూ ఓటమీ
- ❊ మెట్రో ప్రాజెక్టు ఎవరి కోసం?
- ❊ ధ్వంసమవుతున్న దళిత బహుజనుల విద్య
- ❊ న్యాయమూర్తిని హత్య చేసిందెవరు?
- ❊ పెచ్చరిల్లిపోతున్న హిందుత్వ ఫాసిజం
- ❊ పశ్చిమాసియాలో ప్రమాద ఘంటికలు
- ❊ అలీదా గువేరా ఇంటర్వ్యూ

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తమాపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100
విధ్వంసక అభివృద్ధి	డిఎస్‌యు	180
రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే	రైతు సేవా సమితి	100
భారతదేశంలో ఉత్పత్తి విధానం- ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
కార్టూన్లలో మార్క్స్	రీయూస్	100

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	150
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

మా బతుకులు	బేబి కాంబ్లే	130
భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా పూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	120
నేను హిందువునెట్లయిత?	కంచె ఐలయ్య	100

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
సామాజికం	వి. చెంచయ్య	30
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీలాదేవి	75
దారులేసిన అక్షరాలు	భారతీయ మహిళల రచనలు	400
కొలిమి రవ్వలు	గౌరి లంకేశ్ రచనలు	150

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం ప్రచురణ	125
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50
మార్క్సిస్టు నిఘంటువు-1	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	350
మార్క్సిస్టు పదకోశం	లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్	50

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	120
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్సన్	150
24 గంటలు	కె.జి. కన్నబిరాన్	200
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
మహాత్మా జ్యోతిరావ్ పూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100

విప్లవోద్యమం

మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220
జనతన రాజ్యం	పాణి	300
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
అభాగ్యజీవులు	విరసం ప్రచురణ	170
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60

కథ - నవల

దండకారణ్య కథలు (2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు - రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నా గొడవ	కాళోజీ కవితలు	400

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, న్యూస్ ఏజెంట్లకు
2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు

198

ISSN 2231-6892

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జనవరి 2018
సంపుటి : 16
సంచిక : 1

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2017 నవంబర్ నెలలో వచ్చిన విరాళాలు - కె. రమేష్, విజయవాడ, - రు. 1,000; ముత్తన్నగారి సంపద, భూంపల్లి-సిద్దిపేట - రు. 400; జి. సూరి, హైదరాబాద్ - రు. 10,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

నవంబర్ 2017 సంచికలో వచ్చిన నా వ్యాసాన్ని విమర్శిస్తూ ఎ.వీరస్వామి రాసిన వ్యాసం డిసెంబర్ సంచికలో వచ్చింది. రష్యా విప్లవం కూలిపోవడానికి కారణమైన బీజాలు స్టాలిన్ సమయంలోనే పడ్డాయనేది బెతెల్‌హామ్ విమర్శ. బెతల్‌హామ్ లేవనెత్తిన కొన్ని అంశాలనే నేను, నా వ్యాసంలో రాసి, వాటి గురించి చర్చ జరగాలని కోరాను. ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన అక్టోబర్ విప్లవం ఎందుకు నిలవలేక పోయిందనేదే అసలు ప్రశ్న. వీరస్వామి గారు ఈ అంశాలను చర్చించనేలేదు. ఇప్పటికైనా ఆ విషయాలను ఎవరైనా చర్చించాలి. మార్క్స్ రాసిన 'పెట్టుబడి' గ్రంథం శ్రామిక వర్గానికి పాఠ్య పుస్తకం లాంటిదని ఎంగెల్స్ పేర్కొన్నాడు. ఈ గ్రంథంలోని జ్ఞానం ఎంతటి విలువైనదో ఎంగెల్స్ అభిప్రాయం తెల్పుతుంది. శ్రామిక వర్గం ఖచ్చితంగా నేర్చుకోవల్సిన జ్ఞానమది. మరి ఈ 'పెట్టుబడి' గ్రంథాన్ని సోవియట్ యూనియన్‌లో శ్రామిక వర్గానికి నేర్పినట్టు ఎక్కడా కనపడదు. ఫ్యాక్టరీలలో షిఫ్టుల పద్ధతిని, మేనేజర్ల పద్ధతిని, జీతాలలో అంతరాల పద్ధతిని మార్క్సిజం నిరసిస్తుంది. ఇవి దోపిడీ పద్ధతులు. వీటికి ప్రత్యామ్నాయాలను మార్క్స్ 'పెట్టుబడి' సూచించింది. కానీ, సోవియట్ యూనియన్‌లో వీటిని స్టాలిన్ హయాంలో చివరికంటా ఎందుకు కొనసాగించారు? శారీరక – మేధో శ్రమల మధ్య వైరుధ్యాలను తగ్గించడానికి 'క్యాపిటల్' సూచించిన ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించిన దాఖలాలు లేవు. ప్రభుత్వాధికారులకు, కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎందుకు ఎక్కువ జీతాలు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించబడ్డాయి? ఈ రెండు రకాల వారూ కొత్త పాలక వర్గంగా తయారయి ధనిక వర్గంగా ఎందుకు మారారు? సాధారణ శ్రామికులకూ ఈ వర్గాల వారికీ ఆర్థిక అంతరాలు ఎందుకు పెద్ద ఎత్తున పెరిగాయి? వ్యవసాయ సమిష్టీకరణ సమయంలో, పేద – మధ్య తరగతి రైతుల్ని కూడా ఎందుకు అణిచివేశారు? భూస్వాముల్ని కూడా పనిలోకి దింపాల్సింది పోయి ఎందుకు చంపేశారు?

ఫ్యాక్టరీలలో యంత్రాలు, టెక్నాలజీ పెరుగుతున్న క్రమంలో షిఫ్టుల పద్ధతి పోవాలని 'పెట్టుబడి' గ్రంథం చెపుతుంది. కానీ, రష్యాలో అది ఎందుకు పోలేదు? "1930ల నాటికే రష్యా సమాజంలో వర్గాలు అంతమయ్యాయి. దొంగల నుండి సోషలిస్టు ఆస్తిని రక్షించేందుకే ఇంకా రాజ్యం ఉనికిలో ఉంది" అన్న స్టాలిన్ సూత్రీకరణ సరైనదేనా? రెండో ప్రపంచ యుద్ధానికి ముందు, యుద్ధం ప్రారంభ కాలంలో రష్యా, జర్మనీ– హిట్లర్, ఇటలీ–ముస్సోలినీలతో స్నేహం చెయ్యడం సరైనదేనా? హిట్లర్‌ని గౌరవిస్తూ, స్టాలిన్ టోస్ట్ ఇవ్వడాన్ని ఏమనాలి? 1936 ప్రాంతాల పార్టీ ప్రక్షాళన పేరుతో జరిగిన మరణాల మాటేమిటి? 1934 లో ఎన్నికయిన 134 మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో 98 మంది, అంటే 70 శాతం చంపివేయబడడం ఎందుకు జరిగింది? ఇందులో ట్రాట్స్కీ, బుఖారిన్, కామినెవ్, జినొవియేవ్, రైకోవ్, టామ్‌స్కీ వంటి అగ్ర నాయకులున్నారు. లెనిన్, స్టాలిన్‌లతో పాటు వీరంతా అక్టోబర్ విప్లవానికి నాయకత్వం వహించినవారు. వీరు చేసిన నేరాలేమిటి? 70 శాతం కేంద్ర కమిటీ చేసిన కుట్రల గురించి, వారిని మరణ శిక్షకు గురి చేసిన సంగతి గురించి ఎప్పటికప్పుడు ఎందుకు బహిరంగపర్చలేదు. ప్రజలకు తెలీకుండా ఎందుకు రహస్యంగా ఉంచారు?

'1953 వరకూ స్టాలిన్ నాయకత్వంలోని పార్టీ, మార్క్సిస్టు దృక్పథంతోనే పనిచేసింది. కానీ, ఆ తర్వాత నుండి కృశ్చేవ్ నాయకత్వాన పార్టీ మార్క్సిస్టు దృక్పథాన్ని వదిలేసింది' – అంటున్నారు. అప్పటి వరకూ స్టాలిన్‌కు విధేయంగా ఉన్న వారందరూ (లేదా మెజారిటీ) ఒక్క సారిగా కృశ్చేవ్‌కు విధేయంగా మారిపోయారా? విప్లవ పార్టీలో (కమ్యూనిస్టు పార్టీలో) జనరల్ సెక్రటరీకి అన్ని విశేషాధికారాలు ఉండవచ్చా? స్టాలిన్‌ని జనరల్ సెక్రటరీగా తీసివేసి, ఆ స్థానంలో వేరొకరిని ఎంచుకునే విషయం ఆలోచించమని లెనిన్ ఎందుకు చెప్పాడు? స్టాలిన్ పట్ల ద్వేషంతో చెప్పాడని అనవల్సి ఉంటుందా?

బెతెల్‌హామ్ విశ్లేషణలు – నిర్ధారణలు తప్పయితే విప్లవ పతనానికి అసలు కారణాలేమిటని మీరనుకుంటున్నారు? బెతల్‌హామ్ విశ్లేషణలోని 'మార్క్సిస్టు వ్యతిరేక చెత్త' ఏమిటి? పై ప్రశ్నలు కమ్యూనిస్టు ఉద్యమ అభిమానులందరికీ సంబంధించినవే! కాబట్టి, చర్చించవల్సిందిగా కోరుతున్నాను.

చివరిగా, వీక్షణం కలెక్టివ్ వారి ప్రకటన గురించి: నా వ్యాసాన్ని అచ్చువేసి ఉండాల్సింది కాదని అభిప్రాయపడుతున్నట్టు రాశారు. నా వ్యాసాన్ని అచ్చుకు ఎంపిక చేసే ముందు సంపాదక వర్గానికి ఉన్న దృక్పథం ఎందుకు మారింది? నా వ్యాసంలో, లేదా బెతల్‌హామ్ నిర్ధారణల్లో ప్రగతిశీల దృక్పథానికి వ్యతిరేకమైనవి ఏమున్నాయి?

– ఎం. నిర్మల్‌కుమార్
ఖమ్మం

వీక్షణం డిసెంబర్ సంచికలో ఎం. రత్నమాల రాసిన వ్యాసంలో ఆదివాసుల, లంబాడాల మధ్య జరిగిన వివాదాన్ని, ఘర్షణను వాస్తవికంగా చిత్రించారు. ఇంకా మూలాల్లోకి వెళితే ప్రపంచ బ్యాంక్ షరతులలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ వ్యతిరేక విధానాలు పాటించడం వల్ల చాలామంది ప్రజలు వ్యవసాయాన్ని వదిలి సేవారంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఇది రెండో ప్రపంచ యుద్ధంలో ప్రగతిశీల శక్తులు ప్రారంభించడం జరిగింది. క్రమంగా అసంఘటిత రంగంలో కార్మికులు ఎక్కువకావడం జరిగింది. వీరికి ఏలాంటి చట్టాలు లేకపోవడం వల్ల కారుచౌకగా శ్రమను దోచుకోవడం జరుగుతుంది. అందువల్లనే చాలామంది కేవలం 1 శాతం ఉన్న సంఘటిత రంగంలోని ప్రభుత్వ ఉద్యోగుల కోసం భారత దేశంలోని ప్రజలు రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నారే తప్ప మార్క్స్ చెప్పిన ప్రకృతి, సమాజం మధ్యల అవినాభావ సంబంధం విచ్ఛిన్నం ఏర్పడినప్పుడు ఆదాన ప్రదానాల లాంటి విషయాలలో సేవారంగం ఎలా అసంఘటిత రంగంగా మారుతుందో అనే విషయం గుర్తించడం లేదు. భారత రాజ్యాంగంలో గిరిజనులకు ఇచ్చిన పొందుపర్చిన 5, 6 షెడ్యూల్ ఒకటి పాలకులు చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. మైదాన ప్రాంతంతో పరిచయం అయిన గిరిజనులలోని ఒక వర్గం ఉద్యోగాలు, చిన్న చిన్న రాజకీయ పదవులను ఆశిస్తూ ఉన్నారే తప్ప మార్క్స్ చెప్పిన ఉత్పత్తి సాధనాల మధ్య విషయాన్ని గ్రహించడం లేదు. ఏ అంబేద్కర్ అయితే 5, 6 షెడ్యూల్‌ను గిరిజనులకు ఇచ్చాడో ప్రత్యేక ఎస్‌సి, ఎస్‌టి నియోజకవర్గాల అభ్యర్థులు ప్రశ్నించడం లేదని బుద్ధిజీవులు, ప్రగతిశీల మేధావులు ఆరోపిస్తున్నారు. చివరికి చెప్పే విషయం ఏమంటే పాలకులు అనేక పేర్లతో, అనేక పథకాల పేర్లతో గిరిజనులను, ఆదివాసులను నెట్టివేయడం వల్లనే ఈ తాత్కాలిక రిజర్వేషన్ల గురించి ఆలోచిస్తున్నారు. కావున సహజ వనరులను, కొండలను, గుట్టలను

(మిగతా 70వ పేజీలో...)

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

గుజరాత్, హిమాచల్, ఆర్.కె. నగర్ ఎన్నికల ఫలితాలు

డిసెంబర్ 18న వెలువడిన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల ఫలితాలు, డిసెంబర్ 24న వెలువడిన ఆర్కె నగర్ ఎన్నిక ఫలితాలు దేశ రాజకీయాలలో మార్పును, ప్రజలలో అసంతృప్తిని, పార్లమెంటరీ రాజకీయాల వైఫల్యాన్ని సూచిస్తున్నాయి. ఆ ఫలితాలు ఒకవైపు తనకు ఎదురులేదని విర్రవీగుతూ దేశాన్ని విద్వేష రాజకీయాలకు బలిచేస్తున్న భారతీయ జనతా పార్టీకి ఎదురుదెబ్బగా ఉన్నాయి. మరొకవైపు పార్లమెంటరీ రాజకీయాలలోనైనా భారతీయ జనతా పార్టీకి బలమైన ప్రతిపక్షంగా ఎదిరించడానికి కాంగ్రెస్‌కు శక్తి లేదని చూపుతున్నాయి. అంతే కాదు, పార్లమెంటరీ రాజకీయాల లోపల కూడ అణగారిన వర్గాలకు స్థానం అన్వేషించే ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలు చూస్తున్నారనీ, అధికార రాజకీయ కుతంత్రాల పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేసే క్రమంలో అభ్యర్థులపై అవినీతి ఆరోపణలను కూడ పట్టించుకోవడం లేదనీ ఈ ఎన్నికల ఫలితాలు చూపుతున్నాయి.

ఈ ఎన్నికలన్నిటిలో గుజరాత్ ఎన్నికలు దేశ ప్రజల దృష్టిని ప్రధానంగా ఆకర్షించాయి. ఇరవై రెండు సంవత్సరాలుగా ఆ రాష్ట్రాన్ని నిరాటంకంగా పాలిస్తున్న భారతీయ జనతా పార్టీ ఈ ఎన్నికల్లో విజయం సాధించగలదా లేదా అనేది ప్రధాన చర్చనీయాంశం అయింది. దళితులు, ముస్లింలు, పాటిదార్లు, వెనుకబడిన కులాలు, చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులు వంటి వర్గాలన్నీ భాజపా పట్ల అసంతృప్తితో ఉన్నారని, అందువల్ల ఆ పార్టీ గెలుపు అంత సులభం కాదనీ పరిశీలకులందరూ భావించారు. అంతకు ముందు నుంచీ దళితుల్లో రగులుతున్న అసంతృప్తి ఏడాది కింద ఊనా ఘటనతో, జిగ్నేష్ మేవానీ నాయకత్వంలో ఆందోళన స్థాయికి చేరింది. 2002 మారణకాండ నాటి నుంచీ భయభీతావహంలో బతుకుతున్న ముస్లిం సమాజం ఇప్పుడిప్పుడే భయం నుంచి బైటపడుతూ, భాజపాను ఓడించడం సాధ్యమేనని నమ్మే స్థితికి వస్తున్నారు. గుజరాత్ నమూనా గురించి ఎంత ఊదరగొట్టినప్పటికీ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగ సంక్షోభం పాలన పట్ల అసంతృప్తినే మిగిల్చింది. జడలు విప్పిన నిరుద్యోగ సమస్య ముఖ్యంగా యువతరంలో అసంతృప్తినీ ఆగ్రహాన్నీ రగిలిస్తున్నది. పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎగరేసిన పాటిదార్ల నాయకుడు హార్దిక్ పటేల్ రాష్ట్ర జనాభాలో 12 శాతంగా ఉన్న పాటిదార్లందరినీ తనతో తీసుకు పోలేకపోవచ్చు గాని పాలన పట్ల రాష్ట్రంలోని గణనీయమైన సామాజికవర్గపు అసంతృప్తిని ప్రతిఫలించాడు. అలాగే గుజరాత్ జనాభాలో ప్రముఖమైన చిన్న, మధ్యతరహా వ్యాపారులు, వర్తకులు కేంద్ర ప్రభుత్వ పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు నిర్ణయాలతో చితికిపోయారు. భాజపా వాగ్దానాల ఉల్లంఘన పట్ల అన్ని ప్రజావర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. అలా రాష్ట్రంలోని ప్రధాన సామాజిక వర్గాలన్నీ భాజపాను ఓడించే దిశగా కదిలాయి. అయితే వారికి విశ్వసనీయమైన ప్రత్యామ్నాయమేమీ లేదు. కాంగ్రెస్ నిజంగా ప్రజానుకూల ప్రత్యామ్నాయం కాగలదనే ఆశ ఏమీ లేదు. పార్లమెంటరీ రాజకీయాల లోపల అన్ని పార్టీలూ ఒకే తానులో ముక్కలే తప్ప నిజమైన ప్రజా ప్రత్యామ్నాయమేదీ లేదు. అయినా అధికారంలో ఉన్నవారు దిగిపోతే చాలు అనే విరక్తి భావనతోనైనా విస్తృత ప్రజా అసంతృప్తి భాజపాను గద్దె దించుతుందని పరిశీలకులు భావించారు. అయితే ఆ రాష్ట్రానికే చెందిన ప్రధానమంత్రి, పార్టీ అధ్యక్షుడు ఇద్దరూ ఎట్టి పరిస్థితుల్లోనైనా తాము ఓడిపోగూడదని కంకణం కట్టుకున్నారు. విషప్రచారాలకూ, దుష్ప్రచారాలకూ, సామదానభేద దండోపాయాలకూ పూనుకున్నారు. విచ్చలవిడిగా విపరీతంగా డబ్బు వెదజల్లారు. చివరి నిమిషంలో ప్రచారంలోకి దిగిన మోడీ పాకిస్తాన్ బూచినీ, తన మీద హత్యకు కుట్ర చేశారనే అబద్ధాన్నీ వాడి, దొంగ ఏడుపులు ఏడ్చి, గుజరాత్ బిడ్డ అనే భావోద్వేగాన్ని వాడి సానుభూతి సంపాదించాడు. ఏమైనా సరే భాజపాను గెలిపించదలిచి, ఎట్టకేలకు గెలుపు సాధించాడు.

మొత్తం మీద ప్రభుత్వం స్థాపించగలిగిన ఆధిక్యత పొందినప్పటికీ ఇది భాజపా గర్వించదగిన విజయమేమీ కాదు. గత ఎన్నికలలో 115 స్థానాలు సాధించిన భాజపా ఈ ఎన్నికలలో 99 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. తమ లక్ష్యం "కాంగ్రెస్ ముక్త్ భారత్‌ను సాధించడం" అని భాజపా ఎంత చెప్పినప్పటికీ కాంగ్రెస్‌కు గతంలో కన్న 16 స్థానాలు ఎక్కువ వచ్చాయి. గత శాసనసభలో 61 స్థానాలు ఉండిన కాంగ్రెస్ ప్రస్తుతం 77 స్థానాలు గెలుచుకుంది.

పట్టణ వోటర్లు భాజపాను ఆదరించారని, గ్రామీణ వోటర్లు కాంగ్రెస్‌ను ఆదరించారని ఫలితాలు చూపుతున్నాయి. ఎన్నికలలో, ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ల వినియోగంలో అక్రమాలు జరిగాయని హార్దిక్ పటేల్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడానికి వీలులేదు. దళితుల పార్టీగా చెప్పుకునే బహుజన్ సమాజ్ పార్టీ ఒక్క స్థానం కూడ గెలుచుకోనప్పటికీ, మోడీ స్వస్థలం వడ్గామ్ లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన జిగ్నేష్ మేవాని, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిని కూడ ఎదుర్కొని గెలుపొందడం దేశంలో దళిత రాజకీయాలలో ఒక కీలకమైన పరిణామమే.

హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఓడిపోయి, భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం కూడ ప్రభుత్వాన్ని నడుపుతున్న పాలకవర్గ ముఠా పట్ల ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తికీ, ఆ అసంతృప్తిని వాడుకోగలిగితే మరొక పాలకవర్గ ముఠా అధికారం చేపట్టడానికీ సూచికే.

ఇక తమిళనాడులో జయలలిత మరణం వల్ల జరిగిన ఆర్కె నగర్ నియోజకవర్గ ఉప ఎన్నిక ఆసక్తికర ఫలితాలను చూపింది. జయలలిత మృతి తర్వాత తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి భారతీయ జనతా పార్టీ అనేక దుష్ప్రయత్నాలు, కుట్రలు సాగిస్తూ వచ్చింది. అన్నా డిఎంకెలో చీలిక తెచ్చి, తమ అనుకూల వర్గాన్ని గద్దెనెక్కించింది. ప్రభుత్వ వ్యతిరేక అన్నా డిఎంకె వర్గం మీద అవినీతి ఆరోపణలు, నిర్బంధాలు కొనసాగించి వారి విశ్వసనీయతను దెబ్బ తీయడానికి ప్రయత్నించింది.

ఈ సందర్భంలో జరిగిన ఉప ఎన్నికలో అన్నా డిఎంకె నాయకురాలు శశికళ మేనల్లుడు టిటివి దినకరన్, ఎడిఎంకె ఎన్నికల చిహ్నం విషయంలో ఎన్నికల సంఘం అధికారులకు లంచం ఇవ్వజూపాడని కుట్ర, లంచగొండితనం నేరారోపణలపై అరెస్టయి, విచారణ ఎదుర్కొంటూ, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. గతంలో జయలలిత సాధించినదానికన్న ఎక్కువ ఆధిక్యత సాధించడం మాత్రమే కాదు, ఎడిఎంకె, డిఎంకె, బిజెపి అభ్యర్థులను చిత్తుగా ఓడించాడు. బిజెపి అభ్యర్థికి నోటాకు పడిన వోట్లు కూడ పడకపోవడం ప్రత్యేకంగా గుర్తించదగినది.

మన పార్లమెంటరీ ప్రజాస్వామిక ఎన్నికలు ప్రజాభిప్రాయానికి నిజమైన సూచికలు కావని, అందరూ దొంగలే అయినప్పుడు ఏదో ఒక దొంగను ఎంచుకోవడం కన్న గత్యంతరం లేదని, ఎన్నికల రాజకీయాల పరిధిలో ప్రజల ముందర నిజమైన ప్రత్యామ్నాయం లేదని ఈ ఎన్నికలు మరొకసారి మరింత బలంగా రుజువు చేశాయి. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

సామరస్య పరిష్కారం దిశగా ఆదివాసి-లంబాడీ వివాదం

ఆర్థిక జీవనంలో సముచిత అవకాశాలు దక్కడం లేదనే పునాది, మతాచారాల, సంప్రదాయాల, భావోద్వేగాల ఉపరితలం కలగలిసి ప్రజల మధ్య ఎటువంటి ఘర్షణలు సృష్టిస్తాయో, ప్రజాజీవనాన్ని ఎట్లా అల్లకల్లోలం చేయగలవో, ఆ సంక్షుభిత వాతావరణాన్ని పాలకవర్గాలు మరెంతగా కలుషితం చేయగలవో తెలియాలంటే ఇవాళ తెలంగాణలో ఆదివాసులకూ లంబాడీలకూ మధ్య జరుగుతున్న విచారకరమైన ఘర్షణలను చూడాలి. ఈ ఘర్షణలేమీ పాలక పాలిత, పీడక పీడిత వర్గాల మధ్య ఘర్షణలు కావు. స్థూలంగా చెప్పాలంటే ప్రజల మధ్య వైరుధ్యాలే. కాని సాధారణంగా ప్రజల మధ్య ఉండే మిత్ర వైరుధ్యాల స్థాయి నుంచి శత్రు వైరుధ్యాల స్థాయికి రెచ్చగొట్టడంలో పాలకవర్గాల పాత్ర ఉంది. ఈ సమస్య పరిష్కారానికి అనుసరించవలసిన సామరస్యపూర్వక వాతావరణం లేకుండా చేయడంలో పాలకవర్గాల పాత్ర ఉంది. నిజానికి ఈ సమస్యకు చారిత్రక, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, పాలనాపరమైన కోణాలెన్నో ఉన్నాయి. వీటిలో ఏదో ఒక కోణాన్ని ఆదరాబాదరాగా పరిష్కరించడం మొత్తం సమస్యను పరిష్కరించ జాలదు. రెండు వైపులా సమన్వయంతో, ఓపికతో, దీర్ఘకాలిక దృష్టితో, ఇది ప్రజల మధ్య మిత్ర వైరుధ్యమేననే అవగాహనతో పరిష్కారాలు అన్వేషించవలసి ఉంది. ఈలోగా అటు, ఇటు పాలకవర్గాల జోక్యాన్ని, ప్రభావాన్ని, ప్రలోభాలను తిరస్కరించి రెచ్చిపోకుండా ఉండవలసి ఉంది. మైదాన ప్రాంతాల్లో, గ్రామశివార్ల చిట్టడవులలో, అడవులలో, షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఉండే అన్ని తెగలనూ షెడ్యూల్డ్ ట్రైబ్స్ గా గుర్తించడం పాలకవర్గాలు చేసిన మొదటి తప్పు. ఆ తప్పును ఎప్పటికైనా సవరించవలసిందే. రాజ్యాంగం ప్రకారం అసలు షెడ్యూల్డ్ తెగ అనే మాటే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే ఆదిమ తెగలను మాత్రమే సూచించేది. ఆ షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసుల రక్షణ ప్రభుత్వాలు తమ ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని రాజ్యాంగం నిర్దేశించింది. కాని, షెడ్యూల్డ్ ప్రాంతాలకు చెందని వారిని కూడ రాజకీయ ప్రయోజనాల కోసం షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించి ఈ చిచ్చు పెట్టింది పాలకవర్గాలే. అలాగే, రాష్ట్ర సరిహద్దులకు అటూ ఇటూ ఉండేవారిని ఒకే తరగతిలో కాకుండా వేరువేరు తరగతుల్లో గుర్తించడం, అందువల్ల ఎక్కువ అవకాశాలు ఉన్నదగ్గరికి వలసలను ప్రోత్సహించడం కూడ పాలకవర్గాల కుట్ర. ఆ కుట్రను ప్రతిఘటించడం సామాజిక న్యాయ సాధనకు అత్యవసరం. నాలుగు దశాబ్దాల కింద జరిగిన ఒక పాలనా పరమైన చర్య వల్ల విద్యా ఉద్యోగ అవకాశాలలో అత్యధిక భాగాన్ని ఒక సామాజిక వర్గం ఆక్రమించుకున్నదనేది ఒక చారిత్రక వాస్తవం. అందువల్ల తలెత్తిన అసమానతలను తొలగించడం, తగ్గించడం సామాజిక న్యాయ భావన రీత్యా అత్యవసరంగా జరగవలసిన పని. ఈ స్థితిలో ఒకరి సంప్రదాయాలను, ఆచారాలను మరొకరు అవమానించడం, భావోద్వేగాలను రెచ్చగొట్టడం, భౌతిక ఘర్షణలకు అనుచితం. అవి సమస్యను మరింత జటిలంగా మారుస్తాయి. ఇప్పటివరకూ రిజర్వేషన్ల వల్ల ఏ ఆదివాసి తెగకు ఎంతమేరకు విద్యా ఉద్యోగావకాశాలు అందాయో శాస్త్రీయమైన పరిశోధన జరపడం, సామరస్య పూర్వకమైన పరిష్కారం కోసం ఆదివాసి నాయకులతో, లంబాడా నాయకులతో చర్చలు జరపడం, ఇప్పటికే రిజర్వేషన్ ఫలాలలో తమ వాటాకన్న ఎక్కువ అనుభవించిన వారికి సామాజిక న్యాయ అవగాహనను కల్పించడం, అవకాశాల కోసం మాత్రమే సరిహద్దులు దాటి వలస వచ్చేవారికి ఆ అవకాశాలలో కోత విధించడం వంటి ఎన్నో చర్యలకు, చర్చలకు తెలంగాణ పౌరసమాజం పూనుకోవలసి ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ప్రజల సొమ్ము ప్రజలకివ్వడం ఎవరి పేరు మీద?

ప్రపంచీకరణ భావజాల సమర్థకుడు, ప్రచారకుడు, నిర్వాహకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సరుకు మీద, సరుకీకరణ మీద, బ్రాండ్ల మీద, బ్రాండ్ ఇమేజ్ మీద చాల మోజు ఉండడం సహజమే. ఆయన గత పాలనా కాలంలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే తన లక్ష్యమని ఎన్నోసార్లు చెప్పుకున్నారు. ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన మరొక అడుగు ముందుకువేసి తన పేరునే బ్రాండ్ గా మార్చి, దానికి బ్రాండ్ ఇమేజ్ సమకూర్చ దలచుకున్నట్టున్నారు. గత మూడున్నర సంవత్సరాలలో చంద్రబాబు నాయుడు ప్రకటించిన సంక్షేమ పథకాలలో చంద్రన్న బీమా, చంద్రన్న సంక్రాంతి కానుక, చంద్రన్న రంజాన్ తోఫా, చంద్రన్న క్రిస్మస్ కానుక, చంద్రన్న కాపు భవన్ అంటూ 21 పథకాలకు తన పేరే పెట్టుకున్నారని ఒక జాతీయ ఇంగ్లిష్ దినపత్రిక ఆసక్తికరమైన కథనం రాసింది. నిజానికి ఇలా విచ్చలవిడిగా తమ పేరు పెట్టుకోవడానికి సంక్షేమ పథకాలనేవి అధికారంలో ఉన్నవారి సొంత ఔదార్యమేమీ కాదు, వారేమీ సొంత డబ్బులు వెచ్చించడం లేదు. అదంతా ప్రజాధనమే. అది ప్రజల కోసం వెచ్చించవలసిన ధనమే. ఐదు సంవత్సరాల కోసం వారికి వచ్చిన అధికారం వారికి కేవలం ప్రజాధనాన్ని సక్రమంగా వినియోగించడం మీద అధికారం మాత్రమే ఇస్తుంది. కాని గత ఏడు దశాబ్దాలుగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరు మీద, ఎన్నికల ద్వారా ఏర్పడిన చట్టబద్ధ ప్రభుత్వం అనే పేరు మీద అధికారానికి వచ్చినవారందరూ ఆ అధికారాన్ని తమ సొంత ఆస్తిగా భావిస్తున్నారు. ప్రజాధనాన్ని తమ ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతూ, వాటిని అభివృద్ధి, సంక్షేమ పథకాలని పిలుస్తూ తమ ఇష్టం వచ్చిన పేర్లు పెట్టడం సాగించారు. బ్రిటిష్ వ్యతిరేక జాతీయోద్యమంలో పని చేసిన నాయకుల పేర్లు పెట్టే సంప్రదాయం తొలిరోజుల్లో ఉండేది గాని అది కాంగ్రెస్ పాలనలో క్రమక్రమంగా నెహ్రూ, ఇందిర, రాజీవ్ ల పేర్లకు మారింది. ఒక్కొక్క రాష్ట్రంలో ఈ మూడు పేర్ల మీదనే హాస్యాస్పదంగా డజన్ల కొద్దీ కార్యక్రమాలు, నిర్మాణాలు ఉన్నాయి. ఇదే వదులుకోవలసిన అలవాటు కాగా, తమ సొంత పేర్ల మీదనే పథకాలు ప్రారంభించే తప్పుడు సంప్రదాయం కూడ ఇదివరకే ఇతర రాష్ట్రాలలో మొదలయింది. ఆ తప్పుడు సంప్రదాయాన్ని ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది. ఇప్పుడు ఆయన వందిమాగధులు ఇది బ్రాండ్ ఇమేజి అని సమర్థించుకుంటున్నారు. ప్రభుత్వాలను, ప్రభుత్వ విధానాలను, చర్యలను సాధారణంగా ప్రశ్నించే పౌరసమాజం, మేధావులు కూడ ఇటువంటి అంశాల మీద దృష్టి పెట్టడం లేదు. అది ఆయావ్యక్తుల వినయానికి, ధూర్తత్వానికి సంబంధించిన విషయంగా వదిలేస్తున్నారు గాని నిజానికి ఇది ఆయా వ్యక్తులకు సంబంధించిన తప్పుడు అలవాటు మాత్రమే కాదు. ఇది ప్రజాధన వినియోగం పట్ల సరైన దృక్పథం లేని అహంకార పూరిత, వ్యక్తిగత ప్రాయోజిత, ప్రోత్సాహక వైఖరి. ఇది ప్రజల సంపద పంపిణీ అధికారం చేజిక్కినవారు ఆ సంపద తమదేనని అనుకోవడానికి, తమ పేరు చిరస్థాయిగా ఉండిపోవాలని అనుకోవడానికి సంబంధించిన భూస్వామ్య, రాచరిక వైఖరి. ఇది ఎంతమాత్రమూ ప్రజాస్వామిక వైఖరి కాదు. పాలకుల అప్రజాస్వామిక వైఖరులనూ చర్యలనూ అన్నిటినీ ఖండించినట్టుగానే, ఇటువంటి తప్పుడు పనులను కూడ ఖండించడం బుద్ధిజీవుల బాధ్యత. వీ

జెరూసలెంపై ట్రంప్ క్రూసేడ్


- ఎ. నర్సింహారెడ్డి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియాలో మరో నిప్పుల కుంపటి రగిలించారు. తాజాగా ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను గుర్తిస్తున్నట్లు, తమ దౌత్య కార్యాలయాన్ని టెల్ అవివ్ నుండి జెరూసలెంకు తరలించనున్నట్లు ప్రకటించాడు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంశంపై ఏకపక్షంగా ప్రకటన చేయడం ట్రంప్ దూకుడుకు నిలువెత్తు నిదర్శనం. జెరూసలెంతో సంబంధం గల పాలస్తీనా వాదనను విస్మరించి, ట్రంప్ చేసిన ప్రకటన సహజంగానే తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. 1948 యుద్ధంలో జెరూసలెం పశ్చిమ భాగాన్ని, 1967 యుద్ధంలో తూర్పు ప్రాంతాన్ని ఇజ్రాయిల్ స్వాధీనం చేసుకున్నది. జెరూసలెం నగరాన్ని తన రాజధానిగా ప్రకటించుకుంది. అంతర్జాతీయంగా అనేక అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ అమెరికా దన్నుతో తన వాదనకే కట్టుబడి ఉంది. నగరంలోని పశ్చిమ ప్రాంతాన్ని ఇజ్రాయిల్, తూర్పు ప్రాంతాన్ని పాలస్తీనా రాజధానిగా ప్రకటించాలన్నది స్థూలంగా ఐక్యరాజ్యసమితితో పాటు ప్రపంచ దేశాల అభిప్రాయం. అరాఫత్ హయాం నుంచి పాలస్తీనా కూడా ఇదే కోరుకుంటోంది. 1949లో ఐరాస నియమించిన ఆర్మిస్టిస్ కమిషన్ సైతం నగరంలోని పశ్చిమ, తూర్పు ప్రాంతాలను స్పష్టంగా విభజించింది. జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా ట్రంప్ గుర్తించడం ద్వారా అసలే సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఇజ్రాయిల్–పాలస్తీనా మధ్య మరింత అగ్గి రాజేశారు. జెరూసలెం మూడు మతాలకు చెందిన కోట్లాదిమంది ప్రజలకు ఆరాధనీయ ప్రదేశం. ఇజ్రాయిల్–పాలస్తీనా రెండు స్వతంత్ర దేశాల ఏర్పాటు ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించగలమని దశాబ్ధాలుగా ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలు అభిప్రాయ పడుతున్నాయి.


జెరూసలెంను ఇజ్రాయిల్ పూర్తి రాజధానిగా ప్రకటించుకోవడానికి వీలుకాదని ఐక్యరాజ్యసమితి తీర్మాణం 478 స్పష్టం చేస్తున్నది. అంతేకాదు... కోట్లాది మందికి పవిత్ర నగరంగా ఉన్న జెరూసలెం నుంచి దౌత్య కార్యాలయాలను ఉపసంహరించుకోవాలని కూడా సభ్య దేశాలను ఆ తీర్మాణం కోరింది. ఇప్పుడు అమెరికా ఆ తీర్మాణం స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. 2000లో ఇజ్రాయిల్ ప్రధాని ఎహుద్ బరాక్, పాలస్తీనా అధినేత యాసర్ అరాఫత్ మధ్య సమస్య పరిష్కారానికి సంబంధించి ఓ అవగాహన ఒప్పందం కుదిరింది. అంతకుముందు 1990లో ఓస్లో వేదికగా ఐరాస అధ్వర్యంలో శాంతి ఒప్పందం చేసింది. అలాగే ఐక్యరాజ్యసమితి ఈ సమస్యపై ఆర్మిస్టిన్ కమిషన్‌ను నియమించి పరిష్కారాలను సూచించాల్సిందిగా కోరింది. చర్చల ద్వారా రెండు దేశాల ఏర్పాటు మాత్రమే శాశ్వత పరిష్కారంగా కమిషన్ అభిప్రాయపడింది. వీటన్నిటినీ తోసిరాజని ట్రంప్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు. ఈ దుశ్చర్యను ముస్లిం దేశాలే కాదు, అమెరికా మిత్రపక్షాలైన ఫ్రాన్స్ జర్మనీ, బ్రిటన్‌తో సహా ప్రపంచంలో చాలా దేశాలు తీవ్రంగా నిరసించాయి. పోప్ ఫ్రాన్సిస్ సైతం ట్రంప్ చర్యకు వ్యతిరేకంగా గళం విప్పారు. జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించే ప్రశ్నే లేదని కరాఖండిగా అరబ్ దేశాలు తేల్చి చెప్పాయి. భారత్ మాత్రం అమెరికాతో అంటగా గటమే కాదు, పూర్తిగా మోకరిల్లినట్లుగానే కన్పిస్తుంది. పశ్చిమాసియాలో అశాంతికి ఆజ్యం పోసే ఈ మతిమాలిన చర్యను మానుకొమ్మని ట్రంప్‌ను పలుదేశాలు హెచ్చరించాయి. ప్రమాదకరమైన ట్రంప్ ఒంటెత్తు పోకడలను తీవ్రంగా నిరసించటమే అంతర్జాతీయ సమాజం ముందున్న తక్షణ కర్తవ్యం.

వీ






❖ **మొదటితరం రాయలసీమ కథలు** (1882-1944) – సంపదాకులు: డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి – అబ్జ క్రియేషన్స్ – 240 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 200, ప్రతులకు: కె. మురళీమోహన్, 9111, బ్లాక్ నం. 9ఎ, జనప్రియ మహానగర్, మీర్‌పేట్, హైదరాబాద్–97, ఫోన్: 9701371256




❖ **శ్రీకృష్ణదేవరాయ జయంత్యుత్సవ** ఉపన్యాసాలు – వ్యాసాలు (1929-1936)–సంపదాకులు: డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి – శ్రీమతి జెన్నె (ఎం) మాణిక్యమ్మ పబ్లికేషన్స్ – 160 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150




❖ **సీమ సాహితీ స్వరం శ్రీ సాధన పత్రిక** – సంపదాకులు: డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి – శ్రీమతి జెన్నె (ఎం) మాణిక్యమ్మ పబ్లికేషన్స్ – 268 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 200


పై రెండు ప్రతులకు: శ్రీమతి జెన్నె (ఎం) మాణిక్యమ్మ పబ్లికేషన్స్, 11-1-568, కృపానంద నగర్, అనంతపురం. ఫోన్: 9885736776, 9966450897




❖ **వదరుబోతు** వందేళ్ల కానుక – 1917 – పునర్ముద్రిత సంపదాకులు: డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి – వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం – 136 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 500, ప్రతులకు: వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం, తాళ్లకలవ (గ్రా., గండ్లపెంట మం., అనంతపురం జిల్లా – 515 521, ఫోన్: 9963917187



❖ **భారత వ్యవసాయంలో సమకాలీన సంక్షోభం** – వేములపల్లి వెంకట్రామయ్య – అఖిల భారత రైతు కూలీ సంఘం – 84 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 50, ప్రతులకు: వాయిస్ ఆఫ్ న్యూ డెమోక్రసీ, మార్క్స్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ – 500 044. అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు



❖ **మహిళా విముక్తి – కమ్యూనిస్టు దృక్పథం** – ప్రగతిశీల మహిళా సంఘం – 124 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 80




❖ **మహిళా ఉద్యమం** – లెనిన్ – ప్రగతిశీల మహిళా సంఘం – 40 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 30

పై రెండు ప్రతులకు: వి. సంధ్య, కా. సి.పి భవన్, ఇ.నెం. 2-1-594, (బి-34, ఎఫ్-1) విద్యానగర్ రైల్వే స్టేషన్ గల్లీ, విద్యానగర్, హైదరాబాద్ – 500 044. ఫోన్: 040 27668471
email:matruka2015@gmail.com




❖ **సినిమా వ్యాసాలు** – శ్రీశ్రీ – శ్రీశ్రీ సాహిత్య నిధి – 48 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 40, ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతినగర్, విజయవాడ – 520 004. ఫోన్: 0866 6617375, 9848504649, 9246277375
email:srisri_sahityanidhi@yahoo.com



❖ **ఇలా ఒక జీవితం** – కవితల జంపు – కన్నడ మూలం: ముద్దాకూడు చిన్నస్వామి, అనువాదం: స. రఘునాథ – కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం – 96 పేజీలు, 1/8 డెమీ, వెల రు.80, ప్రతులకు: డా. ఎన్. వసంత్, కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2/1097, బస్తీ, ఆవులపల్లి రోడ్డు, హోసూరు–635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు. ఫోన్: 09488330209




❖ **వెన్నెల గువ్వ** – బత్తుల ప్రసాదరావు – శరత్‌సిరి పబ్లికేషన్స్ – 104 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150, ప్రతులకు: శరత్‌సిరి పబ్లికేషన్స్, ఎంఐజి 170, భరత్‌నగర్ కాలనీ, బాలానగర్ (మం.) హైదరాబాద్; ఫోన్: 8500457122




❖ **అంతరాని దైవం** – అనువాద కథలు – డా. పార్థసారథి చిరువోలు – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 232 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 160



❖ **నీలవేణి** – కథల సంపుటి – పి.వి. సునీల్ కుమార్ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 188 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 125



❖ **తెలంగాణ దారిదీపాలు – రాజా నాయని వేంకట రంగారావు బహద్దరు** – కేశవ పంతుల నరసింహ శాస్త్రి ఆచార్య తూమాటి దొణప్ప – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 38 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 30




❖ **ఘంటారావం** – ఎర్నెస్ట్ హెమింగ్వే, అనువాదం: అమరేంద్ర – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ–414 పేజీలు, 1/8 డెమీ, వెల రు.290

పై మూడు పుస్తకాల ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, జిఎస్ఐ పోస్టు, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్–68; ఫోన్: 24224453/54



❖ **కొలిమి రవ్వలు** – గౌరి లంకేశ్ రచనలు – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 232 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్–500006 ఫోన్: 23521849;
www.hyderabadbooktrust.blogspot.com



❖ **మూడో మనిషి** – కవిత్వం – మాడభూషి సంపత్ కుమార్ – పాలపిట్ట బుక్స్ – 64 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 50, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 0036

గుజరాత్‌లో బిజెపి గెలుపూ ఓటమీ

గుజరాత్‌లో హిందూ భావజాలాన్ని, అభద్రతను కేంద్రంగా చేసుకొని బిజెపి గెలుపొందింది తప్ప ప్రజలను అభివృద్ధిచేసి కాదని తాజా ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయని అంటున్నారు బైరెడ్డి సతీశ్

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సాధారణ ఎన్నికలు ప్రత్యేకించి గుజరాత్ ఎన్నికలు దేశవ్యాప్తంగా ఆసక్తిని, ఉత్కంఠను రేకెత్తించాయి. 'అజేయుడు' అనిపించుకుంటున్న దేశ ప్రధాని నరేంద్రమోడీ, వ్యూహ చతురుడుగా మీడియా ప్రచారం చేస్తున్న అమిత్‌షాల స్వంత రాష్ట్రం కావడమే కాకుండా మోడీ ప్రధాని అయ్యాక ఆ రాష్ట్రంలో జరుగుతున్న తొలి ఎన్నికలు కూడా కావడంతో దేశమంతటా కూడా అటువంటి స్థితి ఏర్పడింది. రెండు దశాబ్దాలకు పైగా అధికారం చెలాయిస్తున్న బిజెపి ఆరోసారి అధికారంలోకి వచ్చింది. గుజరాత్‌ను హిందుత్వ రాజకీయాలకు ప్రయోగశాలగా మార్చిన నరేంద్రమోడీ 'గుజరాత్ అభివృద్ధి నమూనా' పేరుతో పదేళ్ల యుపిఏ అధికారంలో జరిగినవని చెప్పుకుంటున్న అనేక కుంభకోణాలు, అవినీతి అంశాలను కార్పొరేట్ సంస్థల వెన్నుదన్నుతో దేశమంతటా ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ముక్తభారత్ అంటూ కేంద్రంలో అధికారంలోకి వచ్చాడు.

దేశమంతటా హిందుత్వ అభివృద్ధి నమూనాను బలంగా ముందుకు తోసే క్రమంలో భాగంగా పెద్దనోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) వంటి దేశాన్ని కుదిపేసిన ఆర్థిక నిర్ణయాలతో పాటు భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజల సాంస్కృతిక హక్కులపై ప్రత్యేకించి దళితులు, ముస్లింల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై దాడులే కాకుండా హేతువాదుల హత్యలు, అసహనపూరితమైన వాతావరణం నెలకొనిఉన్న నేపథ్యంలో జరిగిన ఎన్నికలవడంతో సహజంగానే దేశం యావత్తు దృష్టి నిలిపింది. 2014 సాధారణ ఎన్నికలలో చతికిలబడిన కాంగ్రెస్ ఇంకా కోలుకోకుండానే ఈ ఎన్నికలు రావడం బిజెపికి కేంద్ర రాష్ట్రాల అధికారం చేతుల్లో ఉండడంతో అమిత్‌షా మిషన్-150+ పేరుతో సంవత్సర కాలంగా ఎన్నికల తంత్రాన్ని నడుపుతూనే ఉన్నాడు.

గత సంవత్సర కాలంలో గుజరాత్ ఎన్నికల దృష్ట్యా నెలకు మూడు సార్లు ప్రధాని మోడీ గుజరాత్ పర్యటనలు చేస్తూ వచ్చాడు. అమిత్‌షా అయితే దేశమంతా ఎంతగా పర్యటిస్తున్నాడో ఒక్క గుజరాత్‌లోనే అంతగా కేంద్రీకరించాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోడీ 40 మీటింగులు, 35 రోడ్‌షోలు, 28 వేల కిలోమీటర్ల పర్యటనలు ఒక్క 15 రోజుల్లోనే జరిపాడు. బూత్ కమిటీల నుండి 'పన్నా ప్రముఖ్'లుగా విభజింపబడిన కమిటీలవరకు విస్తృతంగా ప్రచార కమిటీలను వేసి వేలాది మంది 'ప్రచారక్'లను మోహరించి అంగబలం, అర్థబలంతో ఎన్నికలకు సిద్ధమయ్యాడు. దీనికి తోడు ప్రధాన స్రవంతి మీడియా, సోషల్ మీడియాలో 'నమోడీ' నామాన్ని జపించే ఏర్పాట్లు భారీగానే జరిగినాయి. అటు కాంగ్రెస్ రాష్ట్రంలో దశాబ్దాలుగా అధికారానికి దూరమై కేంద్రంలోనూ అధికారం కోల్పోయి సంస్థాగతంగా బలహీనపడి ఎంతో బలాఢ్యులైన నరేంద్రమోడీ - షాల ద్వయాన్ని ఢీకొని నిలబడగలదా అనే అనుమానం కాంగ్రెస్ నేతలకే కలిగింది. బయటికి బలంగా కనపడినప్పటికి క్షేత్ర స్థాయిలో బిజెపికి ప్రతికూలించేలా అనేక సమస్యలు, సామాజిక ఉద్యమాలు వేళ్లూనుకున్నాయి. పటిదార్ అనామత్ అందోళన్ పేరుతో హార్థిక్ పటేల్ నాయకత్వంలో విద్య, ఉద్యోగ రంగంలో రిజర్వేషన్లు డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న బలమైన సామాజిక వర్గం, ఊనాలో దళితులపై జరిగిన దాడుల నేపథ్యంలో వెలుగులోకి వచ్చి బలమైన దళిత ఉద్యమ నాయకుడిగా ఆవిర్భవించిన జిగ్నేష్‌మేవాని, వెనుకబడిన వర్గాల ప్రయోజనాల కోసం సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న అల్పేష్ ఠాకూర్ లాంటి యువ నాయకత్వాలను కాంగ్రెస్ తనవైపు తిప్పుకోగలిగింది. నిజానికి ఈ వర్గాలేవి కాంగ్రెస్‌పై నమ్మకముండో, వారి భావజాలం పట్ల ఏకీభావముండో దగ్గరకాలేదు. కాని వారి ఉమ్మడి శత్రువైన బిజెపిని ఎదుర్కొనే క్రమంలోనే కాంగ్రెస్‌తో చేతులు కలపడం జరిగింది. ఆ మాటకొస్తే పటీదార్ల ఉద్యమ డిమాండ్లు మిగిలిన ఆ రెండు వర్గాలకు ఆమోదనీయం కాదు. కాంగ్రెస్‌కున్న అనివార్యత వల్ల పటీదార్ల రిజర్వేషన్ల డిమాండును నెరవేర్చుతామనే అసాధ్యమైన హామీనిచ్చి వారితో జతకట్టింది. పరస్పర ప్రయోజనాల ఘర్షణ కలిగిన, ఎదురెదురు నిలిచిన సమూహాలతో కాంగ్రెస్ తన ఉదారవాద విధానాలతో ఆకట్టుకోగలిగింది. ఇంత భిన్నమైన సామాజిక సమూహాలతో పొత్తులు పెట్టుకోవడంలో సఫలమైన కాంగ్రెస్ బిఎస్‌పి, ఇతర చిన్నా చితక రాజకీయ పార్టీలతో జతకట్టలేకపోయింది. పొత్తులు, సమీకరణాలు ఎలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ గుజరాత్‌లో పూర్తి విశ్వాసంతో ఎన్నికల బరిలోకి దిగలేదనేది వాస్తవం. కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నికయ్యే ప్రక్రియలోఉన్న రాహుల్ గాంధీ ఉత్సాహంగా రాష్ట్రమంతటా తిరిగి ప్రచారం చేశాడు. అననుకూలమైన పరిస్థితిని కూడా బిజెపి తనకు అనుకూలంగా మలుచుకుంటే కాంగ్రెస్ అనుకూలమైన పరిస్థితులను కూడా తన గెలుపునకు ఉపయోగపడేలా మలుచు కోలేకపోయింది.

పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నిర్ణయాలతో గుజరాత్‌లో సంఘటిత, అసంఘటిత రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. అసంఘటిత రంగ ప్రజలైతే మరింతగా చితికిపోయారు. 15 ఏండ్లుగా కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వ్యవసాయదారులకు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరకూడా లభించలేదు. 2012లో ఏడు వేల రూపాయలు పలికిన పత్తి మూడు వేలకు పడిపోయింది. రైతులకు రుణభారం భరించలేని స్థాయికి చేరుకున్నది. వ్యవసాయ కూలీలకు పని కరువైన పరిస్థితి. మరోవైపు దినసరి కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు తగ్గిపోవడంతో వారి బతుకు భారమైంది. భారీ పరిశ్రమలకు లభించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనల పేరుతో వారికి దొరికిన ప్రభుత్వ తోడ్పాటు చిన్నా, మధ్య తరహా గ్రామీణ పరిశ్రమలకు లభించకపోవడంతో ఆ రంగాలన్నీ కుదేలయ్యాయి. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలేమో కానీ ప్రైవేట్ ఉపాధి కూడా దొరకని పరిస్థితి నెలకొని ఉన్నది. వీటన్నిటికి తోడూ అనేక సామాజిక శ్రేణుల ఉద్యమాలు ఊపందుకున్న నేపథ్యంలో బిజెపి మళ్లీ ఎలా

గెలవగలిగింది? అయితే పైన ప్రస్తావించిన అంశాలకంటే మరేదో ప్రజల్ని ప్రభావితం చేసేలా ప్రచారం జరిగిందని అర్థమవుతుంది.

ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూడా బిజెపి గెలుస్తుందనే చెప్పాయి. బహుశా కాంగ్రెస్ కూడా పైకి ఏమి చెప్పినప్పటికీ అలాంటి భావనతోనే ఉన్నది. కాంగ్రెస్ గెలిస్తే బాగుండు అని కాంగ్రెస్ అంటే గిట్టకపోయినా, బిజెపి మతరాజకీయాలను వ్యతిరేకించే వాళ్లు, ప్రగతిశీల భావన కలిగినవాళ్లు, సామాజిక ఉద్యమకారులు భావించారు. ఎగ్జిట్‌పోల్స్ పూర్తి వాస్తవం అన్నట్టు కాకపోయినా అమిత్‌షా 150+ మిషన్‌ను అవహేళన చేసేలా మొత్తం ఫలితాలు వెలుబడ్డాయి. చావుతప్పి కన్ను లొట్టబోయినట్టు బిజెపి విజయం సాధించింది. 2012 ఎన్నికలతో పోలిస్తే 16 సీట్లను కోల్పోయి 99 సీట్లకే పరిమితమైంది. 19 సీట్లను పెంచుకున్న కాంగ్రెస్ 80 దగ్గర ఆగిపోయింది. ఓట్ల శాతం పరంగా చూసినపుడు 3 శాతం కాంగ్రెస్‌కి, 1 శాతం బిజెపికి పెరిగింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి పొందిన ఓట్లలో 11 శాతం కోల్పోయింది. నగరాలలో బిజెపికి భారీ విజయం దక్కింది. గ్రామీణ ప్రాంతాలలో మెజార్టీ సీట్లు కాంగ్రెస్ పొందగలిగింది. అహ్మదాబాద్, రాజ్‌కోట్, సూరత్, వడోధరా లాంటి నగరాలలో బిజెపి 90 శాతంకు పైగా సీట్లను సాధించుకున్నది. గిరిజన ప్రాంతాలు సంప్రదాయకంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉండేవి. ఈసారి బిజెపి ఆ స్థానాన్ని చేజిక్కుంచుకున్నది. పట్టణ, నగర ప్రాంతాలలో ఉన్న 55 సీట్లలో 44 సీట్లను బిజెపి గెలుచుకుంటే 127 గ్రామీణ సీట్లలో 71 కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. బిజెపి గెలుచుకున్న సీట్లు తక్కువ మెజార్టీతో కాంగ్రెస్‌కు లభించిన సీట్లు ఎక్కువ మెజార్టీతో గెలుచుకున్నదనే విషయం గమనించదగినది. ఆరు జిల్లాలలో అయితే బిజెపి ఖాతానే తెరవనేలేదు. వ్యవసాయ ప్రధానమైన సౌరాష్ట్రాలో ఘోరంగా ఓడిపోయింది. నోటా కు ఐదున్నర లక్షల ఓట్లు పోలై 1.8 శాతంగా నిలిచింది. ఈ ఓట్లు, సీట్లు, శాతాలు, మెజార్టీ అనే అంశాలు ఎలా ఉన్నా ఎన్నికల ప్రచార సందర్భంలో ఏఏ అంశాలు ప్రధానంగా తెరపైకి బలంగా తీసుకురాబడినయి అనేది విశ్లేషించుకోవడం దేశ భవిష్యత్తు ప్రయోజనాల పరంగా ప్రధానంగా దళిత, వెనుకబడిన కులాల, వర్గాల, మైనార్టీల హక్కుల, ప్రయోజనాల రీత్యా కూడా చాలా అవసరమైనది. దేశ భిన్నత్వం, ప్రజాస్వామ్య లౌకిక విలువలు, పౌర స్వేచ్ఛలు, ప్రగతిశీల, హేతువాద భావనలను కాపాడుకునేందుకు వాటిని ఎత్తిపట్టే భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించుకునేందుకు బాగా ఉపకరిస్తుంది.

2014 దేశ సాధారణ ఎన్నికలలో 'వికాస పురుషుని'గా, 'సుపరిపాలన', గుజరాత్ అభివృద్ధి నమూనా కమండలాన్ని దేశమంతటా విస్తరించేలా హిందుత్వ శక్తుల ప్రతినిధిగా ప్రధాని అయిన నరేంద్రమోడీ నోటి వెంట ప్రజల జీవన్మరణ సమస్యలు, అభివృద్ధి నినాదం, సుపరిపాలనా, గుజరాత్ నమూనా, సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ అనే అంశాలేవి రాలేదు. ప్రజల ఉపాధి, ఉద్యోగం ఊసే లేదు. నోట్ల రద్దు, జిఎస్‌టితో ఛిద్రమైన అశేషమైన అసంఘటిత రంగ ప్రజలను ఊరడించే మాటలేవి లేవు. చిక్కి శల్యమైన వ్యవసాయాన్ని ఉద్దరించే చర్యల ప్రస్తావనలు అసలే లేవు. ఊనాలోనో, మరోచోటో దళితులపైన జరిగిన 'గోరక్షకుల' దుర్మార్గాలపై పల్లెత్తు మాటలేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసులను అక్కున చేర్చుకునే ఆశ్వాసనలేవి లేవు. ముస్లింలు! వీళ్లెవ్వరు? వీళ్లు ఉన్నారా? అనేలా సాగింది మోడీ–షా ప్రచార పర్వం. గుజరాత్ అభివృద్ధి నమూనా అనేది ఓ పెద్ద మిథ్. ఆ నమూనా ఎంటో ఇప్పటికీ వాళ్లే చెప్పలేదు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అభివృద్ధి అంశాలతో సంబంధం లేకుండా వారిలో భావోద్వేగాలను రగిలించేలా సాంస్కృతిక అంశాలపై ప్రజలను రెచ్చగొట్టేలా ప్రచారమంతా జరిగింది. మనుగడ ప్రశ్నార్థకమై దినదిన గండంగా ఉన్న ప్రజల్లో 'మందిర్' మదిలో నిలిపేలా భాషాడంబరాలతో నిండిన వాగాడంబరాలే తప్ప బతుకు బరోసానిచ్చే భాషణలేవి జరగలేదు. ఇంతకు గుజరాత్ అభివృద్ధి నమూనా మార్కెట్ మతాన్ని జతకలిపే హిందుత్వ అభివృద్ధి నమూనాయే. ఈ అభివృద్ధి నమూనాలో శ్రమ జీవులచేత సంపద సృష్టించి నియంత్రణ, యాజమాన్యాన్ని సర్వ హక్కుల్ని అగ్రకుల సంపన్నుల చేతిలో పెట్టడమే. ఇది ప్రధానంగా పట్టణాలలో, నగరాలలో స్థిరపడిన అగ్రకుల సంపన్న వర్గాల ప్రయోజనాలు కేంద్రంగా జరిగేదే.

సరిగ్గా ఈ 'అభివృద్ధే' నగరాల్లో బిజెపికి భారీ విజయాన్ని తెచ్చి పెట్టింది. బ్రాహ్మణ బనియా అభివృద్ధి కాబట్టే నగరాలు పీట్ల రూపంలో నజరానాగా బిజెపికి ఇస్తున్నాయి. ముంబయి- అహ్మదాబాద్ బుల్లెట్ రైళ్ల ప్రతిపాదనంతా ఈ సామాజిక వర్గాల అభివృద్ధికే తప్ప అది గుజరాత్ మెజార్టీ ప్రజలది కాదు. ఆకాశ హర్మ్యాలు, బుల్లెట్ రైళ్లు, సీ ప్లేన్‌లు వారి అభివృద్ధికి ప్రతీకలు. గుజరాత్ గౌరవ్ యాత్ర పేరుతో భారీ ర్యాలీలు నిర్వహించి 'గుజరాత్ అస్మిత'ను నిలబెట్టుకోవాలని చెబుతూ రెచ్చగొట్టడమే కాకుండా, గుజరాత్‌కు చెందిన వల్లభాయిపటేల్, మురార్జీ దేశాయిలను నెహ్రూ కుటుంబం అవమానపరిచిందని, సోమనాథ ఆలయాన్ని తిరిగి నిర్మించడం నెహ్రూకు ఇష్టం లేదని, పటేల్ ఆలోచన అయిన నర్మదా ప్రాజెక్టును నెహ్రూ అడ్డుకున్నాడని పరోక్షంగా, రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ లక్ష్యంగా మోడీ ప్రచారం జరిగింది. దేశంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్ అవినీతిని కడిగేసే మోడీ ఈసారి ఆ ఊసే ఎత్తలేదు. అమిత్‌షా కొడుకు అనతి కాలంలోనే అపర కుబేరుడయిన విషయం చెప్పాల్సి వస్తుందనేమో! బిజెపిలో వారసత్వ రాజకీయాలే లేనట్టు రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ వికాస్‌వాద్ – వంశ్‌వాద్ మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతుందన్నారు. ఒక గుజరాతీ ప్రధానీ అయితే ఓర్వలేని కాంగ్రెస్ పాకిస్థానీ వాళ్లకి సుపారి ఇచ్చి తనను అంతం చేయాలని చూస్తుందని, డోక్లాంలో చైనాతో తాను తలపడుతుంటే కాంగ్రెస్ మంతనాలు జరిపిందని 'దేశభక్తి'ని ప్రేరేపించే పనిని బాగా చేశాడు. అబద్ధాలు, అతిశయోక్తులతో కూడిన చౌకబారు ప్రచారంతో ప్రజల్లో అభద్రతను పెంచేలా చేయడంలో మోడీ సఫలమయ్యాడు.

ఇదిలా ఉంటే బిజెపి పరిచిన హిందుత్వ ట్రాప్‌లో కాంగ్రెస్ చిక్కుకోవడమే అసలు ప్రమాదం. బిజెపి తెర ముందు హిందుత్వాన్ని ప్రదర్శిస్తే కాంగ్రెస్ తెర వెనుక హిందుత్వ నాటకాన్ని బాగానే ఆడింది. ఎన్నికల ప్రకటన వెలుబడిన తొలినాళ్లలో రాహుల్ గాంధీ గుజరాత్ ప్రజల సంక్షేమ, అభివృద్ధి అంశాలు ప్రస్తావించినట్టు కనిపించినా బిజెపి గేమ్ ప్లాన్‌లో ఇరుక్కొని కనిపించిన గుళ్లోకల్లా దూరిపోవడం, ఎదురైన విగ్రహం చుట్టూ ప్రదక్షణలు చేయడం, నేనూ శివ భక్తున్నే, బ్రాహ్మణున్నే అని 'జంధ్య' ప్రదర్శనకు పూనుకున్నాడు. అభివృద్ధి అంశాలతో పాటు దేశంలో పెరుగుతున్న మతోన్మాదం, అసహన సంస్కృతి, దళితులు, ముస్లీంలపై భౌతిక దాడులు, భిన్నాభిప్రాయాలపైన దాడులు, లౌకిక విలువల వంటి సూత్రబద్ధ అంశాలను ప్రస్తావించి ప్రజలను ఆకట్టుకోవడం కంటే అదే మత సంబంధ, 'మనోభావాల' అంశాల చుట్టూ రాహుల్ గాంధీ ప్రదక్షణలు చేయడం ప్రమాద సంకేతం కాక మరేమిటి?

పది శాతంపైగా ఉన్న గుజరాత్ ముస్లీంల పరిస్థితి మరీ ఘోరం. దళితులకు ఓ జిగ్నేష్‌మేవానీ, పటీదార్లకు హార్ధిక్ పటేల్, వెనుకబడిన కులాలకు అల్పేష్ ఠాకూర్ వంటి యువ నాయకత్వం ఎన్ని లోపాలున్నా ఏదో రూపంలో వారి డిమాండ్ల సాధనకు ఉద్యమాన్ని నడిపిస్తూ ఉన్నారు. ముస్లీంలకు నాయకత్వమేది మరి?

కాంగ్రెస్ బిజెపి మెజార్టీ హిందుత్వ ట్రాప్‌లో పడి ముస్లింల

మెట్రో రైలు ప్రాజెక్టు ఎవరికోసం?

***పాలకులు విద్య, వైద్య రంగాలను ప్రైవేట్ రంగాలకు అప్పగించినట్లుగానే మెట్రో రైలు ప్రాజెక్టును సైతం ప్రైవేట్ రంగానికి అప్పగించి, రియల్ ఎస్టేట్ చేశారని, గతంలో అడ్డుకుంటాం, సమీక్షిస్తాం అన్నవారు అధికారంలోకి వచ్చాక మాట మార్చారని అంటున్నారు* బి. రామకృష్ణ**

మెట్రోరైలు వస్తే ట్రాఫిక్ సమస్య తీరిపోతుందని, కాలుష్యం తగ్గుతుందని, ప్రపంచస్థాయి రవాణా వ్యవస్థ సాక్షాత్కరిస్తుందని ప్రభుత్వాలు చెబుతూ వచ్చాయి. హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై సమగ్రమైన, శాస్త్రీయమైన అధ్యయనాలు జరిగి మెట్రోనే పరిష్కారమని చెప్పాయా? ఎవరకీ తెలియదు. హైదరాబాద్‌లో, దాని చుట్టుపక్కల ఉన్నటువంటి భారతీయ రైల్వే లైన్లను ఉపయోగించుకుంటూ 2003లో మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం (ఎంఎంటిఎస్)ను ఏర్పాటు చేశారు. అప్పట్లో దీనికి సంబంధించి 167 కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించాయి. ఎంఎంటిఎస్‌ను అనుసంధానిస్తూ బస్ సర్వీసులు లేకపోవడం ఒక లోపంగా ఉండిపోయింది. 2003లోనే హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు (ఎచ్‌ఎంఆర్‌పి)పై సర్వే చేయమని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డిఎంఆర్‌సి)ను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. ఈ ప్రణాళిక ప్రకారం మెట్రోను అప్పటికే ఉన్న ఎంఎంటిఎస్‌తో అలాగే ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలతో అనుసంధానించాలి. ఇందుకోసం 4 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రస్థుత మెట్రో రైలు ఇలా ఏమైనా నిర్మించ బడిందా, బస్‌స్టాప్‌లకు దగ్గరగాగాని, మెట్రో స్టేషన్‌కు రాకపోకల కోసం ప్రజా రవాణా ఏర్పాట్లు ఏమైనా ఏర్పాటు చేశారా అంటే సమాధానం కష్టమే.

హైదరాబాద్‌కు వలసలు ఎందుకు పెరుగుతున్నాయి? హైదరాబాద్‌లో జనాభా ఎందుకు పెరుగుతున్నది? వికేంద్రీకృత, సుస్థిరమైన అభివృద్ధి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఎక్కడికక్కడ జరిగే పద్ధతుల గురించి ఆలోచిస్తున్నారా. ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధులు ఎక్కడికక్కడ లభించే ప్రయత్నాలు చేస్తూ, వాటికి పరిష్కారాలు తెలుసుకోగలిగితే హైదరాబాద్ వంటి నగరాలకు వలసలు ఎందుకు పెరుగుతాయనేది మౌలికమైన ప్రశ్న.

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యకు మెట్రోను ఒక పరిష్కార మార్గంగా భావిస్తే తప్పు లేదేమో గాని అదే సర్వరోగ నివారిణి అయితే కాదు. విశ్వనగరంగా ఎదగడానికి మెట్రో దోహదపడుతుందని, ప్రజలకు రవాణా వేగవంతంగా, సౌకర్యవంతంగా మారుతుందని ప్రచారం చాలానే జరిగింది. మెట్రో రైలు రావడం భాగ్యంగా, అపురూపంగా, ఆనంద డోలికలతో విశ్వనగరంగా హైదరాబాద్ రూపొందుతున్నదని ప్రభుత్వాలు పరవశింప చేస్తున్నాయి. పాక్షికంగా పూర్తయిన మెట్రో రైలును 2017 నవంబర్ 28న భారత ప్రధానమంత్రి మోడీ చేతుల మీదుగా ప్రారంభించారు.

హైదరాబాద్‌ను విశ్వనగరంగా ప్రొజెక్ట్ చేయాలని తపిస్తున్న ప్రభుత్వం మరో పార్శ్వాన్ని కూడా వెలుగులోకి తెచ్చి పరిష్కరించవల్సి ఉన్నది. అధికారిక లెక్కల ప్రకారమే జిఎచ్‌ఎంసి పరిధిలో 80.45 చ.కి.మీ. విస్తీర్ణంతో మొత్తం 1,476 మురికివాడలు ఉన్నాయి. అందులో 68,09,970 ప్రజలు నివసిస్తున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వీరిలో కొద్ది మంది కోసం ఉద్దేశించబడినవే. వీటిని అపార్ట్‌మెంట్‌లలో ఐదారువందల చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఫ్లాట్లుగా నిర్మించాలని ప్రతిపాదించారు. ఇంత ఇరుకు ఫ్లాట్‌లలో సంసారాలు నెట్టుకురావడం కష్టమే అయినప్పటికీ అవైనా సరే దొరికితే అదే మహాభాగ్యంగా, భావించి వాటివైపు ఆశగా ఎదురుచూస్తున్న పరిస్థితిని, లేబర్ అడ్డాలలోని కూలీలను, ఇళ్లలో పనిచేసే వాళ్లను, మరితర నిరుద్యోగులను, నిరుపేదలను చూస్తుంటే విశ్వనగరం(?) ప్రజల స్థితిగతులు ఎంత దారుణంగా ఉన్నాయో చెప్పకనే చెబుతున్నాయి. విలాసవంతమైన జీవితాలు ఓ వైపు, మురికివాడల్లో ఎంతోమంది కష్ట నష్ట జీవితాలు మరోవైపు అసమ అభివృద్ధితో సాగుతున్న హైదరాబాద్ నగరానికి మెట్రో వచ్చి విశ్వనగర వెలుగులు చిమ్ముతుందన్నమాట.

హైదరాబాద్ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినప్పుడు ఎవరైనా మెట్రోవైపు చూడడం సహజంగానే జరుగుతున్నది. మెట్రో వస్తే ఈ సమస్యలు తీరుతాయని అనుకోనివారు తక్కువగానే ఉంటారు. వాస్తవంలో అలా జరుగుతుందా అని, హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు వెనుకున్న అసలు ఉద్దేశాలేమై ఉంటాయని గాని లోతుల్లోకెళ్లి ఆలోచించింది ఎంతమంది. అలా ఆలోచించిన వారిలో సహితం ఏమైతేనేమి కొంతవరకైనా ట్రాఫిక్

ఊసెత్తలేదు. స్వయంగా ముస్లింలకు విశ్వాసం కలిగించగల సమర్థ నాయకత్వమూ లేదు. ఉంటే గింటే మతపెద్దలు మాత్రమే నాయకులుగా చెలామణి అవుతున్నారు. మతం, విశ్వాసపరమైన అంశాలకు స్పందించినంతగా, ఉద్యమించినంతగా విద్యావికాస అంశాల్లో, రాజకీయ ప్రక్రియలో ప్రాతినిధ్యం పెంచేలా వ్యవహరించే నాయకత్వాన్ని మత'పెద్దలు'గా ఉన్నవాళ్లు ఇవ్వడంలేదు.

ఈ ఎన్నికల్లో ఎవరికీ పట్టనివారయింది ముస్లింలే. అభివృద్ధి పాచిక పనిచెయ్యకపోవడంతో కమ్యూనల్ ఎజెండాను బహిరంగంగా ప్రదర్శించి మెజార్టీ ఓట్లను సమీకరించింది బిజెపి. ఆ వెనుకాలే కాంగ్రెస్ నడిచింది. అసలే ఈ రొచ్చులో పడి కాంగ్రెస్ దొర్లుతుంటే ఆ పార్టీ నాయకుడు మణిశంకర్ అయ్యర్ 'నీచ్' వ్యాఖ్యను గుజరాత్ పత్రికలు పతాక స్థాయిలో ప్రచురించి గుజరాత్ 'బిడ్డ'కు జరిగిన అవమానాన్ని గుజరాత్ అస్మితకు జరిగిన అవమానంగా చిత్రించి ప్రజల్ని బాగానే రెచ్చగొట్టాయి.

ఏదీ ఏమైనా బిజెపి ఉన్మాదోత్సాహంపైన గుజరాత్ ప్రజలు కొంతమేరకైనా నీళ్లు చల్లారు. నమోః వర్సెస్ రాగాః మధ్య జరిగిన పోటీ అన్నట్టు చిత్రించబడిన ఈ ఎన్నికల్లో బిజెపి అబివృద్ధి డొల్ల అని తేలిపోవడమే కాకుండా మోడీ ప్రభ కూడా మసకబారింది. హిందుత్వ శక్తులు ఊరుకుంటాయా 'యోగి నమూనా' ముందుకు తెస్తాయి తస్మాత్ జాగ్రత్త!

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

సమస్య తీరకపోతుందా అని అనుకున్న వారే అధికం. 2003 నుండి మొదలైన మెట్రో రైలు ఆలోచన 2007 మే 14న హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు కావడంతో కార్యరూపంలోకి వచ్చింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం(పిపిపి)నమూనాలో ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 71.16 కి.మీ పొడవైన మెట్రోరైలు మార్గాన్ని నిర్మించడం కోసం 2008 సెప్టెంబర్ 19న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మైటాస్ కంపెనీతో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పై ఒప్పందం జరిగింది. మైటాస్ కంపెని రు. 12,132 కోట్లతో కాంట్రాక్టు కుదుర్చు కుంది. ఈ ఒప్పందానికి ముందు టెండర్లు పిలిచినప్పుడు మైటాస్ సంస్థ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం కోరకుండానే ప్రభుత్వానికే రాయల్టీగా ఎదురు ధనాన్ని ఇస్తానని కోట్ చేసింది. నిజానికి కాంట్రాక్ట్ సంస్థలు ప్రభుత్వం నుండి సబ్సిడీలను కోరతాయి. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు విషయంలో మైటాస్ సంస్థ ప్రభుత్వానికి తిరిగి ఇస్తాననడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏ ప్రయోజనాలను ఆశించకుండానే మైటాస్ ఇలా ప్రకటిస్తుందా? దాని వెనుక ఉన్న అంతర్యాన్ని అర్థం చేసుకుంటే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఎవరికోసం అనేది అర్థమవుతుంది.

మైటాస్‌కు హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును కట్టబెట్టడంపై భారత మెట్రో మనిషిగా పిలువబడే శ్రీధరన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ సెప్టెంబర్ 2008లో అప్పటి ప్రణాళికా సంఘ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ అహ్లువాలియాకు ఉత్తరం రాశాడు. 269 ఎకరాల అతి ఖరీదైన భూములను వ్యాపార ప్రయోజనాల కోసం మైటాస్‌కు నిర్మించు, నిర్వహించు, బదిలీచేయు (బిఒటి) పద్ధతిలో అప్పచెప్పడం సరైంది కాదని ఇందులో ల్యాండ్ మాఫియా చేతులున్నాయని అనుమానించాడు. మెట్రో కారిడార్ ను కాంట్రాక్టు సంస్థ తన భూములున్న చోటు వరకు పొడిగించుకుని ఆ భూముల ధరలను నాలుగైదింతలు పెంచుకునే రహస్య అజెండా ఉందనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. రాబోయే కాలంలో ఇదొక రాజకీయ కుంభకోణంగా మారవచ్చనే అనుమానాలు అప్పట్లోనే వచ్చాయి.

శ్రీధరన్ రాసిన ఉత్తరం అప్పట్లో తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. దీనికి ప్రతిగా అప్పటి ఆర్థిక శాఖామంత్రి రోశయ్య, మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి కోనేరు రంగారావు, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి సంయుక్తంగా పత్రికా సమావేశం నిర్వహించారు. శ్రీధరన్ అనవసర ఆరోపణలు చేస్తున్నారని, దీనికి సంబంధించి క్షమాపణలు చెప్పాలని లేదంటే కోర్టులో కేసు వేస్తామని ఆ పత్రికా సమావేశంలో చెప్పారు. అయితే శ్రీధరన్ తన మాటలకే కట్టుబడి ఉన్నాడు కాని క్షమాపణలు చెప్పలేదు. ప్రభుత్వం కూడా అతనిపై ఎలాంటి న్యాయపర చర్యలు తీసుకోలేదు. అతి తక్కువ బిడ్డర్‌కే ప్రాజెక్టును అప్పగిస్తామని అందులో భాగంగానే మైటాస్ సంస్థతో అంగీకారానికి వచ్చామని దానివల్ల ప్రభుత్వానికి పదివేల కోట్లు ఆదా అవుతాయని అప్పటి ప్రభుత్వం చెప్పింది.

పిపిపి నమూనాలో ప్రపంచ వ్యాప్తంగా మెట్రో ప్రాజెక్టులేవి కూడా నిర్మించు, నిర్వహించు, బదిలీ చేయు (బిఒటి) పద్ధతిపై ఆధారపడి విజయ వంతం కాలేదని శ్రీధరన్ చెబుతూ వస్తున్నాడు. కేవలం ప్రయాణీకులు చెల్లించే చార్జీల నుండి ప్రాజెక్టు ఖర్చు వ్యయాన్ని రాబట్టుకోవడం కుదరనిపని. ఊహించిన ప్రయాణీకుల్లో సగం మంది కూడా భవిష్యత్‌లో ప్రయాణించరు. ఏ ప్రైవేట్ కంపెనీ అయినా కూడా పెట్టుబడి పెడుతున్నదంటే లాభాలను ఆశించే కదా! ఆ లాభాలు ఎక్కువా? తక్కువా? అనేది వేరే విషయం. తాము పెట్టిన పెట్టుబడి పిల్లలు చేయకపోతే ఏ కంపెనీ అయినా ఎందుకు ముందుకొస్తుంది అనేది చిన్న ప్రశ్న. ఈ ప్రశ్నను శోధిస్తూ పోతే పాలకుల, ప్రైవేటు కంపెనీల దుర్మార్గమైన కుటిల నీతులు బయటపడతాయి. వారిపై వ్యతిరేకత, ఆగ్రహాన్ని తెప్పిస్తాయి.

టిక్కెట్ల ద్వారా రాబడి రాదన్నది ప్రభుత్వాలకు, ప్రైవేటు కాంట్రాక్టు సంస్థలకు తెలియందేమికాదు. దీన్ని అధిగమించడానికి 269 ఎకరాలు అతి ఖరీదైన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం కాంట్రాక్ట్ సంస్థలకు కట్టబెట్టే అంగీకార ఒప్పందాన్ని సిద్ధం చేశారు. అంతేకాదు మెట్రో నిర్మాణం కోసం కావల్సిన స్థలాలను ప్రభుత్వమే సేకరించి పెడుతుంది. ఆ స్థలాలకు సంబంధించిన పరిహారాలు, అంగీకారాలు, రోడ్డు వెడల్పుపనులు, న్యాయపరమైన చిక్కులు మొదలైన వ్యవహారా లన్నింటిని ప్రభుత్వమే చూసుకుంటుంది.

హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు పైకి ఎంతో ఉపయోగకరంగా గొప్పగా కనిపిస్తున్నప్పటికీ అంతర్యం మాత్రం అతి ఖరీదైన భూములను పొంది రియల్ ఎస్టేట్ వ్యాపారాల్ని చేయడం ద్వారా అధిక లాభాలను రాబట్టుకోవడంగా ఉన్నది. మియాపూర్ వద్ద 99 ఎకరాలు, ఫలక్‌నుమా వద్ద 17 ఎకరాలు, నాగోల్ వద్ద 96 ఎకరాలు, 34 మెట్రో స్టేషన్ల వద్ద 57 ఎకరాల భూమిని ఒప్పందంలో భాగంగా లార్సన్ అండ్ టుబ్రొ కంపెనీకి ఇచ్చారు. భూములు అదనంగా ఇవ్వవద్దని ఒప్పందంలో లేదు. కాబట్టి కాంట్రాక్టు సంస్థల ప్రయోజనాల కోసం మరిన్ని భూములను భవిష్యత్‌లో కేటాయించినా ఆశ్చర్యపోవల్సిందేమిలేదు.

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రు. 240 కోట్లు చెల్లించకపోవడం, మైటాస్ పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడం, మైటాస్‌కు ఉన్న ఆర్థిక ఇబ్బందులు, తదితర కారణాల రీత్యా మెట్రో నిర్మాణాన్ని మైటాస్ నిర్వహించలేదని అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూలై 2009లో ఒప్పందాన్ని రద్దు చేసింది. మైటాస్‌కు అనధికార మాతృ సంస్థ సత్యం కంప్యూటర్స్ అధినేత రామలింగరాజు ఆర్థికనేరాలు, ఆ సంస్థ పాల్పడిన ఆర్థిక అక్రమాలు ఒక్కొక్కటిగా అప్పుడప్పుడే వెలుగులోకి వస్తున్నాయి. మొత్తానికి మైటాస్‌తో మెట్రోరైలు ప్రాజెక్టు మైత్రి తెగిపోయింది.

జూలై 2010లో రెండోసారి హైద్రాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (ఎచ్ఎంఆర్ఎల్) టెండర్లు పిలిచింది. దీని ద్వారా ఎల్.అండ్.టి హైదరాబాద్ మెట్రో రైల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం 2010 సెప్టెంబర్ 4న ఒప్పందం జరిగింది. రూపకల్పన, నిర్మాణం, సొంత పెట్టుబడి, నిర్వహించడం, అప్పగించడం (డిబిఎఫ్ఓటి) అనే పద్ధతి ఆధారంగా ఈ ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టు వ్యయం రు. 14,132 కోట్లు, ఇందులో వయోబిలిటీ గ్రాంట్ ఫండ్ కింద రు. 1,458 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. 5 ఏళ్ల నిర్మాణ కాలాన్ని కలుపుకుని మొత్తం 35 ఏళ్లు మెట్రోరైల్‌ను ఎల్.అండ్.టి హైదరాబాద్ మెట్రో ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తుంది. ఈ కాలాన్ని మరో 25 ఏళ్లు పొడిగించుకునే అవకాశం ఉన్నది. ఈ ప్రాజెక్టును మియాపూర్ నుండి ఎల్‌బినగర్ వరకు (28.87కి.మీ.), జూబ్లీ బస్‌స్టేషన్ నుండి ఫలక్‌నుమా వరకు (14.78కి.మీ), నాగోల్ నుండి శిల్పారామం వరకు (27.51కి.మీ.)

మొత్తం మూడు కారిడార్లుగా నిర్మిస్తున్నారు. రవాణా ఆధారిత అభివృద్ధి (టిఓడి) పేరుతో మెట్రో రైల్ నిర్మాణం జరుగుతున్నది. మెట్రో కారిడార్‌లో 1.85 కోట్ల చదరపు అడుగుల వాణిజ్య సముదాయాల నిర్మాణాలను చేపట్టవచ్చని, ఒప్పందంలో భాగంగా అందించబడే 269 ఎకరాల భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికి అంగీకారం ఒప్పందంలో ఉన్నాయి. నిర్మాణ వ్యయాన్ని తిరిగి పొందడానికి టిక్కెట్ల ద్వారా 50 శాతం, రియల్ ఎస్టేట్ ద్వారా 45 శాతం, ప్రకటనల ద్వారా 5 శాతం సొమ్మును రాబడతారని ప్రకటించారు.

మెట్రోరైలు మార్గంలో చారిత్రక కట్టడాలు/స్థలాలు ఎన్నో ఉన్నాయి. వాటికి మెట్రో రైలు మార్గ నిర్మాణం వల్ల నష్టం కలుగుతుందని అప్పుడే నేటి తెలంగాణ ముఖ్యమంత్రి నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిని అలాగే ఎల్&టి సంస్థను తీవ్రంగా విమర్శించారు. చారిత్రక కట్టడాలకు, స్థలాలకు నష్టం కలిగించే పక్షంలో మెట్రో రైలు మార్గాన్ని కూల్చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. తొందరపడి మెట్రో నిర్మాణాన్ని కొనసాగించవద్దని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొత్తం హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టును సమీక్షిస్తామని కఠినంగా మాట్లాడారు. కోఠి సుల్తాన్‌బజార్, మొజాంజాహి మార్కెట్, కోఠి మహిళా కళాశాల, యూనివర్సిటీ స్థలాలు అసెంబ్లీ, తెలంగాణ అమరవీరుల స్థూపం వంటి ఎన్నింటికో మెట్రో నష్టం కలుగచేస్తున్నదని/మసకబారుస్తున్నదని వాటిని రక్షించడం కోసం మెట్రో మార్గాన్ని మార్చుకోవాలని కెసిఆర్ చెప్పారు. చారిత్రక ప్రదేశాల వద్ద భూగర్భ రైలుమార్గాన్నే నిర్మించాలని కెసిఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్ తాను గతంలో చెప్పిన వాటిని ఎంతమేరకు హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టులో మార్పులు చేయగలిగారో అప్పటి ప్రభుత్వానికి ఎల్&టి మధ్య జరిగిన అవకతవకల రహస్యాలను ఎంతమేరకు బయట పెట్టగలిగారో ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత కెసిఆర్‌పై ఉండకుండా పోతుందా? లేని పక్షంలో ఈ ప్రభుత్వాన్ని ఎలా అంచనా వేయాల్సి ఉంటుందో ఎవరికి వారు తేల్చుకోవల్సిందే.

2017 నాటికి 80 శాతం పనులు పూర్తిచేసి 30 కి.మీ. మేర నాగోల్ నుండి మియాపూర్ వరకు 2017 నవంబర్ 28న ప్రారంభించారు. మిగతా మొత్తాన్ని నవంబర్ 2018 లోగా పూర్తి చేస్తామని ఎల్&టి ప్రకటించింది. ప్రాజెక్టు నిర్మాణ సందర్భంలో భూముల సేకరణ, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, ప్రాజెక్టు మార్గంలో మార్పు, కోర్టు కేసులు వంటి కారణాల రీత్యా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని, ఈ జాప్యం వల్ల అదనంగా 3,700 కోట్ల భారం పడుతున్నదని దాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని ఎల్&టి పట్టుపడుతున్నది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రు. 14,132 కోట్లలో వయబుల్ గ్రాంట్ ఫండ్‌గా రు. 1,458 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి వస్తాయి. మిగిలిన దాంట్లో ఎస్‌బిఐ ప్రధాన బ్యాంకుగా మొత్తం పది బ్యాంకుల నుండి 11 వేల కోట్ల రూపాయలకు పైగా రుణాలు పొందింది. దీంతో ఎల్&టి స్వంతంగా పెట్టుకున్నది తక్కువేనన్నమాట. ఒప్పందం పూర్తయ్యాక మెట్రో పనులు సంవత్సరంన్నరకు పైగా ఆలస్యంగా ప్రారంభం అయ్యాయి. మెట్రో పనులు ప్రారంభం అయినప్పటి నుండి హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు అంతా ఇంతా కావు. రోడ్ డివైడింగ్‌లు, రోడ్ డైవర్షన్‌లు, తవ్వకాలు, దుమ్ము ధూళి, శబ్ద కాలుష్యం, వాతావరణ కాలుష్యం వంటివి ఎన్నో నగర ప్రజల్ని నానా యాతనలకు గురి చేశాయి. ఇప్పటికీ చేస్తూనే ఉన్నాయి. గత ఐదారేళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్య నుండి ఇంకా బయట పడలేదు.

మెట్రో రైలు మార్గానికి ఇరువైపులా శబ్ద కాలుష్యానికి, సున్నితమైన ప్రాంతాలైన పాఠశాలలు, కాలేజీలు, దవాఖానాలు, ప్రార్థనా మందిరాలు అలాగే కోర్టులు వంటివెన్నో ఉన్నాయి. ఇక్కడ ధ్వని కాలుష్యానికి సంబంధించిన కాలుష్య నియంత్రణ బోర్డు ప్రమాణాలేవి పాటించడం లేదు. అయినా మెట్రో నిర్మాణ పనులు జరిగాయి. జరుగుతున్నాయి.

ఒప్పందం ప్రకారం మెట్రో చార్జీలు 8 రూపాయల నుండి 19 రూపాయల వరకు ఉండాలి. మెట్రో ప్రారంభం అయిన నాడు ఈ రేట్లు రు. 10 నుండి రు. 60 ఉన్నాయి. దీనిని ప్రభుత్వం వ్యతిరేకించడం లేదు. రేట్ల నిర్ణయ హక్కు ఎల్&టి చేతిలో ఉన్నది. రద్దీ సమయంలో మెట్రో టిక్కెట్ ధరలు సాధారణ ధరల కంటే 25 శాతం అధికంగా వసూలు చేసుకోవచ్చు. అంతే కాకుండా హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు పరిధిలో 25 ఏళ్ల వరకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాల్లోని ప్రజా రవాణా వ్యవస్థలో టికెట్ ధరలు మెట్రో రైలు ధరల కంటే కనీసం 25 శాతం అధికంగా ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. ఫలితంగా భవిష్యత్‌లో ఆర్‌టిసి ఆధునిక బస్సులను తక్కువ ధరల్లో అందించే అవకాశాన్ని కోల్పోతున్నది.

హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుకు ప్రభుత్వం సమకూర్చిన అతి ఖరీదైన భూములను, వ్యాపార సముదాయాలుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారంగా, చేసుకుంటున్నప్పుడు, ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చబడుతున్నప్పుడు టికెట్ ధరలు తక్కువగానే ఉండాలి. కాని అలా జరుగలేదు. అసలు రవాణా వ్యవస్థ అనేది ప్రజల సౌకర్యం కోసం ఉంటుంది. దాని ద్వారా వ్యాపారాలు చేసి లాభాలు గడించడానికి కాదు.

మొన్న ప్రారంభించిన మెట్రో మార్గంలోని స్టేషన్‌లలో మరుగుదొడ్ల సౌకర్యం సరిగ్గాలేవు. పార్కింగ్ స్థలాలు లేవు. మెట్రోస్టేషన్ల నుండి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లడానికి అనుసంధానంగా రవాణా వ్యవస్థ లేదు. ఒప్పంద సమయంలోనూ ఆ తరువాత ఎల్.అండ్.టి చెప్పినటువంటి అనుసంధాన రవాణా వ్యవస్థ(మెర్రిగోరౌండ్)ను ఏర్పాటు చేయనేలేదు. ఇప్పుడు ఆ మాటే ఎత్తడమే లేదు.

మెట్రోరైలు కోసం ప్రైవేటు కాంట్రాక్టు సంస్థకు 269 ఎకరాల అతి ఖరీదైన భూములను ఇచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం అదే డబ్బును ఆర్‌టిసి కోసమో అలాగే ప్రస్తుతమున్న ఎంఎంటిఎస్ రైలు వ్యవస్థను అభివృద్ధి చేయడం కోసమో వినియోగించడానికి చేతులు రావడం లేదు. పోనీ అదే డబ్బుతో ప్రైవేటు కాంట్రాక్టు సంస్థలకు ఇచ్చి వారికి లాభాలు చేకూర్చి పెట్టడం కాకుండా ప్రభుత్వమే ఆ పని చేసి ఉండవచ్చు కదా అంటే సమాధానం ఉండదు. ఈ ప్రాజెక్టు ప్రజల కోసం, ప్రజా రవాణా కోసం, ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం అనే కంటే ప్రైవేటు కంపెనీల, పాలక వర్గాల్లో కొందరి ప్రయోజనాల కోసమని అనుకోకుండా ఉండలేని పరిస్థితి ఉన్నది.

హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల ప్రాజెక్టు రిపోర్టు(డిపిఆర్)ను చర్చకు పెట్టలేదు. ఇంత పెద్ద ప్రాజెక్టును చేపట్టే ముందు అసెంబ్లీలో సహితం బయటపెట్టలేదు. రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిల గత కాంగ్రెస్ ప్రభుత్వాలైతేనేమి నేటి కెసిఆర్ ప్రభుత్వమైతేనేమి పారదర్శకత లేకుండా ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రైవేటు కాంట్రాక్టు సంస్థలకు ప్రయోజనాలు చేకూర్చేలా ఒప్పందాలు చేసుకున్నాయనేది స్పష్టం. పెద్దపెద్ద ప్రాజెక్టులకు సంబంధించి ప్రజాక్షేత్రంలో చర్చించబడాలనేది, వాటి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండడమనేది ప్రజలహక్కు. దీన్ని ఉల్లంఘిస్తూ పాలన జరుగుతున్నది.

ఇప్పటికే విద్య, వైద్యంను ఇంచుమించుగా ప్రైవేటు రంగాలకు వదిలేసి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను కూడా ప్రైవేటు కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది ఇప్పుడు గాని, భవిష్యత్‌లో గాని వ్యతిరేక ఫలితాలనిస్తుంది. మొన్న ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం మెట్రో రైల్ విధానాన్ని ముందుకు తెచ్చింది. అందులో పిపిపి నిబంధనను తప్పనిసరిచేస్తూ ప్రైవేటు రంగానికి అనుకూలంగా కీలకమైన నిర్ణయాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం పేరు మీద ప్రజల అభిప్రాయాలకు విలువలేకుండా చేస్తూ కార్పొరేటు శక్తులకు అనుకూలంగా విధానాలు చేపడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమే తప్ప మరొకటి కాదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

ధ్వంసమవుతున్న దళిత బహుజనుల విద్య

చంద్రబాబు పాలనలో విద్య వ్యాపార వస్తువుగా మారి, దళిత బహుజనుల విద్యా వ్యవస్థను మరింత దిగజారిపోయిందనీ, ప్రజలు పాలకవర్గాన్ని ఎదిరించే చైతన్యం, నిరాకరించే సామర్థ్యం పెంచుకోవాల్సిన సందర్భం వచ్చిందనీ అంటున్నారు **డా. కత్తి పద్మారావు**

రాష్ట్రంలో దళిత బహుజన విద్య నానాటికి వెనుకబడుతుంది. ప్రభుత్వ పాఠశాలల పనితీరు అధ్వాన్న స్థితికి చేరింది. మరీ ముఖ్యంగా ఈ సంవత్సరం ఉపాధ్యాయుల బదిలీలు పెద్ద ఎత్తున జరగడంతో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక, బోధన సక్రమంగా జరుగక, అనేక జిల్లాలకు డి.ఇ.ఒ.లు లేక, మిగిలిపోయిన ఉపాధ్యాయులకు పని కేటాయింపు లేక ప్రభుత్వ విద్య అట్టడుగు స్థితికి చేరింది. ఎం.ఇ.ఒ. ఆఫీసుల్లో అనేక మంది ఉపాధ్యాయులు పనిలేక కూర్చుంటున్నారు. బయోమెట్రిక్ హాజరు విధానం ప్రవేశ పెట్టినా ఉపాధ్యాయులు ఆలస్యంగానే స్కూళ్లకు వెళుతున్నారు. ఎం.ఇ.ఒ.లు, డి.వై.ఇ.ఒ.ల పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. కొన్ని పాఠశాలల్లో ముగ్గురు పిల్లలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.

అనేక పాఠశాలల్లో చెట్ల కింద, నడి ఎండలో పాఠాలు చెప్తున్నారు. మధ్యాహ్న భోజనం అయితే అధ్వాన్నంగా నడుస్తుంది. భోజనశాలలు లేవు. మధ్యాహ్న భోజనం నిర్వహించే వారికి బిల్లులు చెల్లించక నాసిరకం కూరగాయలు, పుచ్చులు ఉన్న కూరగాయలు, నిల్వవున్న చింతపండు, కందిపప్పు వంటి అనేక కల్తీ వస్తువులు వాడడం వల్ల మధ్యాహ్న భోజనం శక్తి ఇవ్వకపోగా అనేక సందర్భాల్లో పిల్లలు విరోచనాలు, వాంతులకు గురి అవుతున్నారు. సంవత్సరం పూర్తి కావస్తున్నా పిల్లలకు ఏకరూపు దుస్తులు చాలా స్కూళ్లల్లో ఇవ్వలేదు. పాఠశాలల్లో ఉన్న కంప్యూటర్లు అన్నీ బూజుపట్టి పోతున్నాయి. కంప్యూటర్ విద్య పూర్తిగా మృగ్యమై పోతుంది. అనేక పాఠశాలలకు వాచ్‌మెన్ లేక రాత్రిపూట మందు తాగేవాళ్లకు, పేకాట ఆడేవాళ్లకు కేంద్రాలు అయ్యాయి. అనేక ప్రాంతాల్లో ఆయా సీజనల్ పనులకు వెళ్లడం వల్ల విపరీతంగా స్కూళ్ల హాజరు సంఖ్య తగ్గిపోతుంది. ఆ పిల్లలు పనికి వెళ్లకపోతే ఇంట్లో జరగదు. కొన్ని ప్రాంతాల్లో 9,10వ తరుగతుల ఆడపిల్లలకు పెండ్లిళ్లు చేయడం వల్ల క్లాసు పెరిగే కొద్దీ సంఖ్య తగ్గిపోతుంది. టీచర్ల యూనియన్లు ఉపాధ్యాయుల హక్కుల కోసం మాట్లాడుతున్నంతగా వారి బాధ్యతల కోసం మాట్లాడం లేదు.

సంవత్సరానికి 360 రోజులు ఉంటే 220 రోజులు పనిదినాలు. సెలవులు 15 రోజులు ఇంకా మిగతా సెలవులు మరో 15 రోజులు వాడుకుంటారు. వీరు మొత్తం 190 రోజులు పనిచేసేది. విద్యార్థులకు ఉన్న సిలబస్ బృహత్తరమైంది. మధ్యలో పెండ్లిళ్లని, బ్యాంకు పనులని, మీటింగులని, మరణాలని పర్మిషన్లు పెట్టుకొని పోతుంటారు. ఇవి గాక యూనియన్ లీడర్లు అయితే యూనియన్ల పనుల మీద తిరుగుతుంటారు. తక్కువమంది పిల్లలు ఉన్న స్కూళ్లలో టీచర్లు ఎక్కువ ముచ్చట్లు ఆడుకుంటున్నారు అని పరిశోధనలో తేలింది. దీనికి కారణం వారి పని మీద వారికి శ్రద్ధలేకపోవడం. ఇతర వ్యాపకాలపై ఆసక్తి పెరగడం.

విద్యా వ్యవస్థకు అనుకూలంగా లేని గృహ వ్యవస్థ

విద్య అంటే ఒక ప్రత్యేకమైన వ్యవస్థ. ఆ వ్యవస్థకు తగిన పరిసరాలు ఇంట్లో లేకుండా విద్యను పిల్లలు నేర్చుకోలేరు. ముఖ్యంగా తల్లిదండ్రులు పనులకు వెళ్లడం, సరైన సమయానికి వీళ్లకు అన్నం పెట్టకపోవడం, విద్యను నేర్చుకోవడానికి వారికి ఒక గది లేకపోవడం, చదువుకునే సమయంలో టి.వి.లు పెట్టడం ఇవన్నీ కూడా పిల్లల విద్యకు అవరోధంగానే ఉన్నాయి. విద్య అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరికి ఇల్లు ఉండాలి. కొత్తగా పెండ్లి అయిన వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి నాలుగు దశాబ్దాలు అయ్యింది. ప్రభుత్వం ఇండ్లు ఇవ్వకపోవడం వల్ల కూడా విద్యా సంస్కృతికి విఘాతం కలుగుతుంది. ఈ విషయంగా గృహిణిల్లోనూ ఎక్కువ మార్పు రావాలి. ఇంట్లో చదువుకునే వాతావరణం పూర్తిగా వారు కోల్పోతున్నారు. ముఖ్యంగా తండ్రికి తాగుడు అలవాటు ఉన్న ఇంట్లో పిల్లలు చదవలేక పోతున్నారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉండడం, పిల్లలకు ఉదయాన్నే పాలు ఇవ్వలేకపోవడం, పౌష్టికహారాన్ని పిల్లలకు అందించలేకపోవడం వల్ల పిల్లలు విద్యను గ్రహించలేక పోతున్నారు. విద్యకు ప్రతి ఇంట్లో ఎన్నో కొన్ని పుస్తకాలు ఉండాలి. చాలా మంది స్త్రీలు పుస్తకాలను ప్రేమించడం లేదు. వస్తువుల్ని, చీరల్ని, నగల్ని ఎక్కువగా ప్రేమిస్తున్నారు. చదువుకునే వాతావరణం లేకుండా చదువు రాదు. ఎంతవరకో ఎందుకు! టీచర్ల ఇండ్లలో కూడా పుస్తకాలు ఉండడం లేదు. పుస్తకాల గది ఉండడం లేదు. అదే చీరలకు అయితే రెండు మూడు బీరువాలు ఉంటాయి. ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు వాటిని విప్పదీసి చూపించే ఆనందం వలన పిల్లలకు వస్తు వ్యామోహ గుణం పెరుగుతుంది.

ఇది వరకు ఉపాధ్యాయుల పిల్లలు ఎక్కువ ఉపాధ్యాయులు అయ్యేవారు. ఇప్పుడు ఉపాధ్యాయుల పిల్లలు ఎక్కువ ఇంజనీర్లు అవుతున్నారు. ఇది వరకు డైనింగ్ టేబుల్ దగ్గర అందరూ కూర్చోని భోజనం చేసేవారు. విజ్ఞానాత్మకమైన విషయాలు మాట్లాడుకునే వారు. ఇప్పుడైతే ఎవరి భోజనం వారిదే. ఏ సమయంలో ఎవరు తింటారో తెలియదు. కొంతమంది అయితే 10 గంటలకు లేచి అప్పుడు మొఖాలు కడుక్కుంటారు. గృహ వాతావరణం విద్యకు అనుకూలంగా లేకుండా పేదల్లోనే కాకుండా మధ్య తరగతిలో ఉన్నత వర్గాల్లోను మారిపోతోంది.

ధనవంతుల ఇళ్లలో తగ్గుతున్న క్రమశిక్షణ

మరి ముఖ్యంగా ఉన్నత వర్గాలు అంటే డబ్బులు ఉన్న ఇండ్లల్లో అయితే పూర్తిగా విద్యా వాతావరణం లేదు. ఇటీవల పబ్బుల్లో కొన్ని వందల మంది డబ్బులు ఉన్న వాళ్ల పిల్లలు డ్యాన్సులు చేయడం మత్తు మందులు తీసుకుంటూ తెల్లవారు జామున 2 గంటల వరకు బయట గడుపుతున్నారు. అప్పుడు డ్రైవర్లు తీసుకొచ్చి ఇండ్ల దగ్గర వదలడం, కొన్నిసార్లు అత్యాచారాలకు కూడా వారు గురికావడం జరుగుతుంది.

విద్యా వాతావరణం అనేది మనకు గృహాల్లో రూపొందాలంటే తప్పకుండా గృహ గ్రంథాలయాలు ఏర్పాటు అవ్వాలి. ఈ రోజున స్త్రీలకు రీడింగ్ హ్యాబిట్ బాగా తగ్గింది. ఎక్కువగా స్త్రీలు మతాలకు సంబంధించిన వ్రతాలు, నోములు, దేవాలయ ప్రదర్శనలు చేస్తున్నారు. క్రైస్తవులు అయితే మతాచారాన్ని ఒక దిన చర్యగా చేయడమే గాక తెల్లవారు జామున నాలుగున్నరకే మైకులు పెట్టి చుట్టుపక్కల చదుకునే పిల్లలకు విద్యకు విఘాతాన్ని కల్గిస్తున్నారు. చాలా మంది టీచర్లు లెంటిల్ డేస్‌లో ఉపవాసాలు ఉండడం వల్ల మంచినీళ్లు కూడా తాగకూడదనే నియమంతో నీరసం వచ్చి పిల్లలకు పాఠాలు చెప్పలేక పోతున్నారు.

ముఖ్యంగా క్రైస్తవ మతం మూఢ విశ్వాసాల ఊబిలో కూరుకుపోతా ఉంది. ఎనిమిది చదివిన వాళ్లు కూడా బైబిల్ పట్టుకొని పాస్టర్లుగా చెలామణి అవుతూ అమాయకులైన స్త్రీలకు పరలోక రాజ్యాన్ని గురించి చెప్తూ వారికి వచ్చే జీతంలో దశమ భాగాలు కూడా పొందుతున్నారు. దిన పత్రిక చదివితే లౌకికులు అవుతారని బోధించి దిన పత్రికలు కూడా కొంత మందిని చదవనివ్వడం లేదు. ఇంటికి వచ్చేటప్పటికి పిల్లలకు విద్యా వాతావరణం లేకపోగా గుంపులుగా ప్రార్థనల వాతావరణం ఉండేటప్పటికీ క్రైస్తవ కుటుంబాల్లో కూడా చదువు సాగడం లేదు. ముస్లిం కుటుంబాల్లో కూడా అనేకమైన మూఢాచారాలు ఉన్నాయి. ఇప్పటికీ స్త్రీలకు తలాక్ నుంచి విముక్తి కలుగలేదు. ఇలా మత ఆచారాలు కూడా గృహంలో విద్యా వాతావరణాన్ని నాశనం చేస్తుంది.

ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా ధ్వంసం చేయాలనే ఒక నిర్మాణాత్మకమైన పద్ధతిలో వెళుతుంది. దేనినైనా నిర్మించడం కష్టం గాని ధ్వంసం చేయడం తేలికే. నారాయణ సంస్థల వ్యవస్థాపకుడు మున్సిపల్ మంత్రి అయిన దగ్గర నుంచి ఆంధ్ర రాష్ట్రంలో కార్పొరేట్ విద్యకు ప్రోత్సాహం ఎక్కువైంది. ప్రభుత్వ విద్యకు విధ్వంసన ప్రారంభమైంది. విద్యకు ఉండే పునాదిని దెబ్బతీయడానికి చైతన్య, నారాయణ సంస్థలు ఆరాచకంగా పనిచేస్తున్నాయి. ఒక్క పేరా రాయడం రాకుండా పిల్లలకు మొదటి పది ర్యాంకుల్లో స్థానం సంపాదించేటట్లు బట్టి విద్యను ప్రవేశపెట్టి, క్వశ్చన్ పేపరు ముద్రించబడే దగ్గర కూడా తమ మనుషులను పెట్టుకొని, ఇంటర్‌నెట్‌ను, సెల్‌ఫోన్‌ను అన్నింటిని ఉపయోగించి, తమకు అధిక డబ్బు ఇచ్చిన వారికి ర్యాంకులు తెప్పించి, కష్టపడి చదివే పిల్లల గుండె మీద దెబ్బకొడుతున్నారు. అసలు చదువు అంటే ఆసక్తి లేకుండా చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు అయితే తమ కులం పిల్లలకే గ్రూపు-2 జాబులు రావాలని ప్రిలిమ్స్‌లో రిజర్వేషన్ ఎత్తివేసి ఫైనల్లో ప్రశ్నాపత్రం మూలాలు తమ వర్గం ప్రజలకు అందేటట్టు చేసుకొని పెద్ద కుంభకోణానికి తెరతీశారని విద్యార్థులు తెలుసుకున్నారు. దానితో చంద్రబాబు పరిపాలించేంతకాలం వేరే కులాల వారికి ఉద్యోగాలు రావు అనే భావానికి ఆయన తీసుకొచ్చారు. అంతేకాదు ఎస్‌సి, ఎస్‌టిల్లో ఎక్కువ మంది టీచర్లు అయ్యారు. వీరిలో ఒక్క శాతం మంది కూడా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించలేదు. తమకు వస్తున్న జీతాలన్నింటిలో సగభాగం కంటె ఎక్కువ తీసుకెళ్లి నారాయణ, చైతన్య సంస్థలకు దారదత్తం చేసి జ్ఞానం లేని చదువు, సామాజిక స్పృహలేని చదువును తమ పిల్లలకు అందిస్తున్నారు. ఏ పిల్లల ద్వారా అయితే వాళ్లు వేలు, లక్షలు తీసుకుంటున్నారో వారి మీద వాళ్లకు ప్రేమ లేదు. ఏ సందర్భంలో కూడా వాళ్లకు ఒక్క చాక్లెట్ ఇచ్చిన దాఖలాలు లేవు.

లంపెన్ కల్చర్లోకి ఉపాధ్యాయులు

పెద్ద జీతాలు వచ్చే లెక్చరర్లు అయితే సాయంత్రం 6 అయితే టీ షెర్టులు ధరించి పేకాట క్లబ్బులకు, మందు పార్టీలకు, రియల్ ఎస్టేట్ బిజినెస్‌కు, వడ్డీ వ్యాపారాలకు అటెండ్ అవుతున్నారు. తమ పిల్లలు తండ్రి తాగి రావడాన్ని అలుసుగా తీసుకుంటున్నారు. ఫ్రిజ్‌లో ఉన్న మందు సీసాలకు అలవాటు పడితే పిల్లల్ని ఏమనలేని పరిస్థితికి తండ్రి చేరుకుంటున్నాడు. కల్చర్ ముదిరిపోయిన కొన్ని కుటుంబాల్లో అయితే తండ్రి కొడుకులు అన్నదమ్ములు కలిసి తాగే సంస్కృతిని కూడా తీసుకొస్తున్నారు. ఇక పెండ్లి అయితే కొత్తగా మందు నేర్చుకునే వారికి అదొక ఉత్సవంగా మారిపోయింది. అంటే విద్యా సంస్కృతి నశించి లంపెన్ సంస్కృతీ అన్ని దశల్లో కూడా పెరిగిపోతూ ఉంది. ఎం.టెక్ చదువులు మరీ బూటకంగా మారాయి. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు కడితే చాలు పరీక్షలు రాయడానికే మళ్లీ రావడమే. ఇక ఇంజనీరింగ్ కాలేజీలు క్వాలీఫైడ్ వారిని లెక్చరర్లుగా తీసుకోకుండా వాళ్ల సర్టిఫికెట్లు మాత్రమే తీసుకొని కమిటీలు వచ్చినప్పుడు చూపించి వారికి డిన్నర్లు, లంచాలు ఇచ్చి కాలేజీలు నడిపిస్తున్నారు. ఈ అన్ని విషయాలు ప్రభుత్వానికి తెలుసు. ప్రభుత్వంలో అనేక మంది విద్యా సంస్థలు నడిపేవాళ్లు కీలకపదవుల్లో ఉన్నారు. తల్లిదండ్రులకే తమ పిల్లలు విద్యావంతులు కావాలి, జ్ఞానవంతులు కావాలి, నీతి మంతులు కావాలి, ఇతరులకు సహాయం చేసేవారిగా ఉండాలనే కోరికలు లేకపోతే వ్యాపారం కోసం విద్యా వ్యవస్థలు నడిపేవాళ్లకు ఆ దృక్పథం ఎక్కడి నుండి వస్తుంది. అందుకనే అసలు కుటుంబం, సమాజం, పరిపాలన మూడు వ్యవస్థల్లోను నైతిక విలువలు పెరగాలి. సామాజిక విలువలు పెంపొందించుకునే ఒక వ్యవస్థ రావాలి. అప్పుడే కొందరు చదువుకునే వాళ్లు కొందరు చదువుకోని వాళ్ల వ్యవస్థపోయి ఎక్కువ మంది చదువుకునే వాళ్ల సంఖ్య పెరుగుతుంది.

చలిలో వణుకుతున్న విద్యార్థులు

ఇకపోతే రాష్ట్రంలో చలిపులి గాండ్రిస్తుంది. శిశువులు, వృద్ధులు, హాస్టల్ విద్యార్థులు గజగజ వణుకుతున్నారు. కొందరేమో వెచ్చని గదుల్లో ఉన్న రగ్గులు కప్పుకొని పడుకుంటే చదువుకునే విద్యార్థులేమో వసతి గృహాల్లో దుప్పట్లు లేక ఎముకల్లోకి కూడా చలి వెళ్లి బిగపట్టుకొని పడుకుంటున్నారు. రాష్ట్రంలోని 220 వసతి గృహాల్లో 1,88,917 మంది పిల్లలు దుర్భరమైన పెను చలికి కాళ్లుచేతులు కొంగర్లు పోయి కళ్లు పీక్కుపోయి, నాలుక పిడచగట్టి వెచ్చదనం లేక అల్లాడుతుంటే కరుణా, దయ లేని ప్రభుత్వం లక్షా యాభైయారు కోట్ల వార్షిక బడ్జెట్ చేతిలో పెట్టుకొని ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది అంటే భవిష్యత్తు తరాల్లో దేశాన్ని నిర్మించాల్సిన పిల్లలు ఎన్నో వ్యాధులకు గురి అవ్వడాన్ని చూస్తూ ఊరుకుంటుంది అంటే ఆశ్చర్యకరమైన విషయం.

నిజానికి ఎస్.సి. విద్యార్థులకు 984 వసతి గృహాలు రాష్ట్రంలో ఉన్నాయి. 88,214 మంది విద్యార్థులు అందులో చదువుతున్నారు. ఎస్.టి.లకు 139 వసతి గృహాలు ఉన్నాయి 13,034 మంది విద్యార్థులు అందులో చదువుతున్నారు. బి.సి. విద్యార్థులకు 897 వసతి గృహాలు ఉన్నాయి. 87,669 మంది విద్యార్థులు అందులో ఉండి చదువుతున్నారు. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు నాలుగు జిల్లాల్లో కలసి 62 వేల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 62 వేల మంది 528 వసతి గృహాల్లో ఉన్నారు. 62 వేల మందికి కలిపి 14 వందల మరుగుదొడ్లే ఉన్నాయి. ఇది అమానుషమైన విషయం. ఈ విషయంగా ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఉమ్మడి రాష్ట్రంలో హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు వెళ్లడం కూడా జరిగింది. కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరుగుదొడ్లు కట్టమని ఆదేశించింది ఫలితం లేదు. మూడు వందల భవనాలకు కిటికీలు లేవు. చదువుకోవడానికి వెలుగు కోసం తగినన్ని బల్బులు లేవు. ఈ నాలుగు

జిల్లాల మొత్తంగా సంపద చూస్తే ప్రపంచంలోనే కొన్ని దేశాలు సరితూగలేవు. ఇక్కడ ధనవంతులు, భూస్వాములు, పారిశ్రామిక వేత్తలు చాలా ఎక్కువగానే ఉన్నారు. వీళ్ల పిల్లలందరూ పెద్ద పెద్ద కాలేజీల్లో, భవంతుల్లో చదువుకుంటున్నారు. కానీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థుల విషయం వచ్చేటప్పటికి ప్రభుత్వం చాలా నిర్ధాక్షిణ్యంగా ప్రవర్తిస్తుంది. ప్రభుత్వ విధానాల్లో కులాధిపత్య భావాలు ఉన్నాయి. కింద కులాల వారు చదువుకుంటే పై కులాల వారి ఎదుగుదలకు అడ్డువస్తారనే కులవివక్షతా భావాలు ఉన్నాయి. ప్రభుత్వం డబ్బులేక కాదు పూర్తిగా కులతత్వ భావాలతో వ్యవహరిస్తుంది అనేది ఇక్కడ మనకు అర్థమౌతుంది. ఒక ప్రపంచంలోనే గ్రీన్ ల్యాండ్‌గా పేరొందిన ఉభయ గోదావరి జిల్లాలో 260 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 32,800 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. ఒక సర్వేలో 20 వేల మందికి అసలు కప్పుకోవడానికి దుప్పటే లేదు. రగ్గు అనేది హాస్టల్ మొత్తానికి అసలు కనిపించడం లేదు. కిటికీలు ఇరవై నాలుగు వేల హాస్టళ్లకు లేవు. దోమల బెడదతో రోగాల రొస్టులుగా హాస్టళ్లు ఉన్నాయి.

చదువులో వ్యత్యాసాలు

రాష్ట్రమంతా భూస్వాములు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు, ధనవంతులు వారి పిల్లల్ని భారతదేశ వ్యాప్తంగా ఉండే పెద్ద పెద్ద విద్యాలయాల్లో చదివించుకోగలుగుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి పిల్లలు మాత్రం కప్పుకోవడానికి దుప్పటిలేని పరిస్థితుల్లో, దోమతెరలేని పరిస్థితుల్లో, మలమూత్రాలు విసర్జించుకోవడానికి మరుగుదొడ్లు లేని పరిస్థితుల్లో జీవిస్తున్నారు. ఈ విషయాలన్ని ముఖ్యమంత్రికి, పంచాయితీరాజ్ మంత్రికి, సాంఘిక శాఖ మంత్రికి క్షుణ్ణంగా తెలుసు. కానీ దయావిహీనత వెంటాడుతుంది. విద్యార్థుల నోటి వద్ద డబ్బుని దొంగ బిల్లులు పెట్టి కాజేస్తున్నారు. హాస్టళ్ల భవనాల మరమ్మత్తు కోసం 15 కోట్ల 50 లక్షలు నిరుటేడు మంజూరు చేశారు. అందులో 5 కోట్లు ఇంతవరకు ఖర్చు చేయలేదు. ఖర్చు చేసిన వాటిలో సగానికి పైగా మింగేశారు. దళితులే దళితుల్ని దోచుకుంటున్న సందర్భాలు ఎక్కువ ఉన్నాయి. వార్డెన్‌లో దళితులు కూడా ఉన్నారు. కానీ వారు పిల్లల దగ్గర పిల్లలకు ఖర్చుపెట్టాల్సిన సొమ్మును కాజేసి వ్యక్తిగత ఆస్తి పెంచుకొంటున్నారు. సాంఘిక సంక్షేమ శాఖలో అడుగడుగునా అవినీతే ఉంది. ప్రభుత్వం కానీ ఒక హైకోర్టు న్యాయమూర్తి చేత కమీషన్ వేసి విచారణ చేయించగలిగితే అవినీతి ఊబిలో సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నట్లుగా ఆధారాలతో ఋజువు అవుతుంది. ఇక ఉత్తరాంధ్రలో 372 వసతి గృహాలు ఉంటే 28,094 మంది విద్యార్థులు చదువుతున్నారు. 137 వసతి గృహాల్లో 50 వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో ఉన్నాయి. ఎంతో మంది విద్యార్థులు ముఖ్యంగా పాడేరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మండలాల్లో డెంగ్యూకి, మలేరియాకి, అనేక జబ్బులకు గురి అయ్యారు. దోమతెరలు లేక గుంపులు గుంపులుగా దోమలు అక్కడ హాస్టల్ నిండా కమ్ముకొని ఉంటాయి. మరీ ప్రభుత్వానికి ఎస్‌టిలు అంటే ఎంతో చులకన భావన. ప్రభుత్వం ఇంతవరకు ఎస్‌టిలను మనుషులుగానే చూడలేదు. వారి సబ్‌ప్లాన్ నిధులు వారికి ఖర్చుపెట్టడం లేదు. ప్రాజెక్టుల పేరుతో వారి భూములను ఆక్రమించడం వల్ల తల్లిదండ్రులు కూడా ఎక్కడెక్కడో వలసలు పోయి పని చేసుకుంటున్న సందర్భంలో సెలవులకు కూడా వచ్చి ఎస్‌టి పిల్లల్ని పలకరించేవారు లేరు. ఆంధ్రుల చరిత్రకు మూల పురుషులు అయిన యానాదులు, ఎరుకల, కొండరెడ్డి, చెంచు, సవర అనేక ఎస్‌టి కులాలు విద్య ద్వారా తమ పిల్లలకు మేలు కల్పించాలని ప్రయత్నం చేస్తున్న సందర్భంలో ప్రభుత్వం కులవివక్షతో వారు ఉంటున్న హాస్టళ్లని మురికి కూపాలుగా మార్చి, జబ్బులకు గురిచేసి, ఎదగాల్సిన వయస్సులో వారికి పౌష్టిక ఆహారం పెట్టకుండా పడకకు జానెడు చోటు ఇవ్వకుండా చలిలో కునారిల్లేటట్టు బుద్ధిపూర్వకంగా చేస్తున్నారనేది ఈనాడు హాస్టళ్లలో ఉండే దుర్భర పరిస్థితులు మనకు బొమ్మకడుతున్నాయి. ఇకపోతే రాయలసీమలో ఉన్న 508 వసతి గృహాల్లో 67వేల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 67వేల మందికి గాను 900 మరుగుదొడ్లే ఉన్నాయి. హాస్టళ్లల్లో నీటి వసతి లేదు. హాస్టళ్ల భవనాలన్ని పాడుపడిపోయి ఉన్నాయి. హాస్టళ్లలో ఉండలేక కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో పిల్లలు ఇంటికి వెళ్లొద్దామంటే ఎక్కువ మంది తల్లిదండ్రులు వలసల్లో ఉన్నారు. ముఖ్యంగా రాయలసీమలో పనులు లేక బెంగుళూరు, హోసూరు, చింతామణి ఎన్నో ప్రాంతాలకు చివరకు కేరళలో కూడా పేవ్‌మెంట్ల మీద తల్లిదండ్రులు పడుకొంటే పిల్లలేమో ఇక్కడ వణుకుతూ హాస్టళ్లలో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

బాబులో కులతత్వం

ఈ విషయాలను మనం లోతుగా చూస్తే చదువుకోవాల్సిన వయస్సులో వారి ఆరోగ్యాన్ని దెబ్బతీసి వారికి ఉండే ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసి వారు చదువుకొనే ఉత్సాహాన్ని దెబ్బతీసే ప్రయత్నాన్ని ప్రభుత్వం కులవివక్షతతోనే చేస్తుందనే దానిలో ఎటువంటి సందేహం లేదు. ఇది రాష్ట్రంలో తీవ్రమైన విషయమే. కానీ ఇంతవరకు ముఖ్యమంత్రి గానీ, ఆయన కుమారుడు గానీ ఒక్క హాస్టల్లో కూడా నిద్రపోలేదు. దళితుల్లో ఉండే అనేక మంది ప్రతినిధులు ఆయన కొలువులో రకరకాల పదవుల్లో ఉన్నారు. ఆయన తరుపున వాదిస్తున్నారు కూడా. మనం జాగ్రత్తగా పరిశీలిస్తే హాస్టళ్లల్లో ఉండే దుర్భర పరిస్థితి గురించి మాట్లాడడం లేదు. హాస్టళ్లల్లో నిద్రించడం లేదు. ఇవే హాస్టళ్ల నుండి వాళ్లు వచ్చారు. కానీ వారు వెనుకటి జీవితాన్ని మరచిపోయారు. దీని వల్ల ఎస్‌టి, ఎస్‌సి, బిసిల విద్యా వ్యవస్థ పునాదిలోనే కుంటుపడిపోతుంది. ఈ మధ్యలో చదువు మానేసిన పిల్లలు అటు చదువుకి, ఇటు భౌతిక శ్రమకి పనికిరాకుండా పోతున్నారు. జీవితానికి ఒక భరోసా లేకుండా పోవడమే గాక అగ్రకులాల్లో ధనం ఉన్న వారి పిల్లలకి వీరికి జీవించే విధానంలో విపరీతమైన తేడా వచ్చేస్తుంది. ఒకే రాష్ట్రంలో చదువుకున్న పిల్లలు పరీక్షలకు వెళ్లేటప్పుడు ఒక విద్యుత్తు దీపం లేకుండా, ఒక గ్లాసు పాలు లేకుండా, పౌష్టికాహారం లేకుండా, కప్పుకోవడానికి దుప్పటి లేకుండా, మలమూత్రాలకు విసర్జనకు కూడా అవకాశం లేకుండా ఎదగాలంటే ఎంత కష్టమో ఆలోచించవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలో అనేక అనౌచిత్యమైన అంశాలకు ప్రభుత్వం కోట్లు కోట్లు ఖర్చుపెడుతుంది. విద్యార్థిని ప్రేమించడం, బతికించడం, విద్యార్థికి ఊపిరిపోయడం అనే అంశాన్ని బుద్ధిపూర్వకంగా విస్మరించడం పాలకవర్గాల దుర్నీతికి నిదర్శనం గాక తప్పదు. ఈ సందర్భంగా ప్రజలు చైతన్యవంతులు కావాలి. తల్లిదండ్రులు మరింత బాధ్యతతో మెలగాలి. కులవివక్షతో నిర్దయ పాలక వర్గాన్ని ఎదిరించే చైతన్యం, నిరాకరించే సామర్థ్యం కూడా తెచ్చుకోవాల్సిన సందర్భం ఇది. అణగారిన ప్రజల నుంచే, అణచివేయబడిన సమాజం నుంచే ఉద్యమాలు, ఉప్పెనలు వస్తాయి. కరుణవిహీనమైన పాలక వర్గాలు కూలిపోతాయి. చలికి వణకుతున్న విద్యార్థే చైతన్య కెరటంగా ఎగిరే రోజు వస్తుంది. గుండెల్లో దాగి ఉన్న నిప్పుకణికలు రాబోయే కాలానికి అగ్ని దివ్వెలు అవుతాయని ఆశిద్దాం.

(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ) వీ

భూస్వామ్య, బ్రాహ్మణ్య, ఆధిపత్య సభలు

ఆధిపత్యవర్గాల కార్యక్రమాలు, రాజకీయ ప్రాబల్యం, నిర్వహణ లోపాలు, భిన్నస్వరాల అణచివేతలతో ప్రపంచ తెలుగు మహాసభల జాతర వాస్తవంగా భాషకూ సాహిత్యానికీ చేసింది అతి స్వల్పమంటున్నారు **ఎన్. వేణుగోపాల్**

గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగు ప్రపంచ తెలుగు మహాసభలు ఏ ప్రయోజనాల కోసం జరిపి, ఏ ప్రయోజనాలు సాధించిందో, దాదాపుగా అవే ప్రయోజనాల కోసం, అదనంగా కొన్ని కొత్త సమర్థనలతో, కొత్త ప్రగల్భాలతో, కొత్త ఆకర్షణలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐదో ప్రపంచ తెలుగు మహాసభలు జరిపింది. గత నాలుగు మహాసభలలో, సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రెండు మహాసభలకు తెలంగాణ వ్యతిరేకత, "తెలుగువారి ఐక్యత" పునాదిగా ఉండగా, ఈ సభల్లో పైకి చూడడానికి, రూపంలో తెలంగాణ అనుకూలత, కొందరు తెలంగాణ సాహిత్యకారులకు గుర్తింపు, తెలంగాణలో జరిగిన మొదటి మహాసభలు అనే అదనపు ఆకర్షణలు ఉన్నాయి గాని సారాంశంలో పాత మహాసభలలోని "తెలుగువారి ఐక్యత"తో సహా అన్ని ప్రజావ్యతిరేక, ఆధిపత్య లక్షణాలూ యథాతథంగా కొనసాగాయి. ఐదు రోజుల పాటు జరిగిన కార్యక్రమాలలో, రాజకీయ ప్రాబల్యంలో, అధికార పటాటోపంలో, నిర్వహణ లోపాలలో, సభల సందర్భంగా జరిగిన నిర్బంధాలలో, అంతిమంగా తెలుగు భాషకూ, తెలంగాణ భాషా సాహిత్యాలకూ సంస్కృతికీ ఏ మేలూ జరగకపోవడంలో – అన్నిటిలోనూ సమైక్య ఆంధ్రప్రదేశ్ తెలుగు మహాసభల ఆనవాయితీని తెలంగాణ తెలుగు మహాసభలు అక్షరం పొల్లుపోకుండా కొనసాగించాయి. బహుశా మరిన్ని అదనపు సొబగులు అద్దాయి.

వచన కవిత, కథ, నవల, విమర్శ వంటి ఆధునిక ప్రక్రియల మీద, చరిత్ర మీద, భాష మీద చర్చల్లో కొంత భాగం మినహాయిస్తే మొత్తంగా సభలు ప్రాచీన, పండిత, బ్రాహ్మణ, భక్తి సాహిత్య ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచాయి. సభ ప్రారంభం నుంచి చివరిదాకా హిందూ బ్రాహ్మణీయ భావజాలపు చిహ్నాల ప్రదర్శన, సంస్కృత శ్లోకాలు, ప్రార్థనలు, తెలుగు అని చెప్పుకునే సంస్కృత పద భూయిష్ఠ పద్య పఠనాలు, అవధానాలు, పాదాభివందనాలు, వందిమాగధ అతిశయోక్తి ప్రశంసలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభ స్వాగతాలు, శతగళ సంకీర్తన, శాస్త్రీయ నృత్యాలు, పద్యకవితా సమ్మేళనాలు, అష్టావధానం, శతావధానం, అక్షర గణితావధానం, నేత్రావధానం వంటి సర్కస్ ఫీట్లు వగైరా హిందూ బ్రాహ్మణీయ కసరత్తుల కంపు సభల్లో ఎల్లెడలా వ్యాపించింది. "మన భాషకు బ్రహ్మోత్సవం", "భాషకు బ్రహ్మరథం" అని పత్రికలు పతాక శీర్షికలు పెట్టాయంటేనే ఈ సభలు ఎంతగా బ్రాహ్మణీయ భావజాలంతో నిండిపోయాయో అర్థమవుతుంది. ఇది కేవలం బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాల ప్రచారానికి మాత్రమే పరిమితం కాలేదని, కాంట్రాక్టులలో, ఆహ్వానాలలో, ప్రాధాన్యతలలో బ్రాహ్మణ, అగ్రవర్ణ కాంట్రాక్టర్లకు, సంగీతకారులకు, చిత్ర నిర్మాతలకు, గాయకులకు దక్కవలసిన స్థానం కంటె ఎక్కువ దక్కిందని విమర్శలు వస్తూనే ఉన్నాయి.

ఒకవైపు ఇలా హిందూ, బ్రాహ్మణీయ, ఆధిపత్య ధోరణులకు, వ్యక్తులకు పెద్ద పీట వేస్తూ, తెలంగాణ తెలుగు సమాజంలోని అసంఖ్యాక అనాదృత వర్గాల భాషలకు, కళా సాహిత్యాలకు, సంస్కృతులకు నామమాత్రపు ప్రాతినిధ్యాలు మాత్రమే కల్పించారు. గత ఆంధ్రప్రదేశ్ పాలనలో ఏ భాషా, సాహిత్య, సంస్కృతీ ప్రదర్శనలు జరిగేవో ఈ సభల్లోనూ అవే జరిగాయి. అదనంగా అక్కడక్కడ తెలంగాణ సంస్కృతి అనో, తెలంగాణ సాహిత్యం అనో, తెలంగాణ భాష అనో, తెలంగాణ సాహిత్యకారులు అనో ఒక మాటో, ఒక నాట్యమో, ఒక పేరో ప్రదర్శన వస్తువుగా జతచేశారు. గత తెలుగు మహాసభల్లో తెలంగాణ చరిత్రకు, భాషకు, సాహిత్యానికి, సంస్కృతికి సముచిత స్థానం దక్కలేదని ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన ప్రస్తుత నిర్వాహకులే తమ సభలలో తెలంగాణ సంస్కృతికి ఆ స్థానం ఇవ్వాలని అనుకోలేదు. పాత సభల సంస్కృతిలో అత్యధిక భాగాన్ని అలాగే ఉంచి, దానికి కొన్ని తెలంగాణ ఆభాసలను అద్దితే సరిపోతుందనుకున్నారు. అందువల్లనే ఈ సభలను ప్రారంభించిన ఉప రాష్ట్రపతితో సహా ఎందరో వక్తలు, పత్రికా రచయితలు, వ్యాఖ్యాతలు గతంలో జలగం వెంగళరావు నిర్వహించిన మొదటి తెలుగు మహాసభలను తలచుకున్నారు. ఆ పోలిక కేవలం లాల్ బహదూర్ స్టేడియం అనే ఒకే వేదికలో మాత్రమే కాక, మొత్తంగా నిర్వహణ గురించే చేశారు. ఆ మొదటి తెలుగు మహాసభలు నెత్తురుటేర్లు పారించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను అణచివేసిన ఆంధ్రప్రదేశ్ పాలకవర్గాలు ప్రకటించిన విజయగర్వపు చిహ్నం. మరి ఈ సభలు దానికి కొనసాగింపు అనే మాట ప్రారంభోత్సవంలోనే వినబడడం తెలంగాణకు దక్కిన గౌరవమో, అగౌరవమో నిర్వాహకులే తేల్చుకోవాలి.

మాది తెలుగే కాదని ఉద్యమ సమయంలో అనేకసార్లు ప్రకటించిన, వాదించిన నిర్వాహకులు ఇప్పుడు మాత్రం తెలంగాణ భాష అనడానికి సిగ్గు పడ్డారు. స్వయంగా తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులొకరు ఈ సభల్లో మాట్లాడుతూనే ఉద్యమ కాలం నాటి వ్యాఖ్యలు తలచుకుంటే సిగ్గు వేస్తుందని అన్నారు. నాటి ఉద్యమ నాయకులు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఆంధ్ర – తెలంగాణ భేదానికి ప్రధాన సూచికగా చెప్పిన ఆనపకాయ – సొరకాయ, పుంటికూర – గోంగూర ఇప్పుడు "రెండూ సమానమే", "ఉద్యమ కాలంలో ఎన్నో అంటాం" అనే సమర్థనలకు చేరుకున్నాయి. సభల్లో, సదస్సుల్లో, కవిసమ్మేళనాల్లో పాల్గొన్న వందలాది వక్తలు, కవుల్లో వేళ్ల మీద లెక్క పెట్టదగినంత మంది కూడ తెలంగాణ భాష ఉపయోగించలేదు. నిజానికి సభల వేదికల మీద "రెండున్నర జిల్లాల రెండున్నర కులాల భాష" సరేసరి, సంస్కృతానికి దొరికిన స్థానంలో సగం కూడ తెలంగాణ భాషకు దొరకలేదు. తెలంగాణ భాషను అవమానించిన, వక్రీకరించిన, చిన్నచూపు చూసిన "ఆంధ్ర" సినిమా నటులకు, నిర్మాతలకు దొరికిన స్థానంలో పదో వంతయినా తెలంగాణ

భాషకు దొరకలేదు. తెలంగాణ జనహృదయాన్ని ప్రతిఫలించిన, తెలంగాణ భాషలోనే తమ జీవితమంతా కళా సాహిత్య సృజన చేసిన కవులకూ కళాకారులకూ ఎందరికో ఆహ్వానాలూ లేవు, పొరపాటుల ఆహ్వానాలు అందినా సముచిత గౌరవం దక్కలేదు.

తెలంగాణ భాషను, కళను, సాహిత్యాన్ని, సంస్కృతిని ఇంతగా విస్మరించిన, పక్కనపెట్టిన, చిన్నచూపు చూసిన తెలుగు మహాసభలు సహజంగానో, ఉద్దేశపూర్వకంగానో రాజకీయ ప్రాబల్యానికీ, అధికార పటాటోపానికీ వేదికలుగా మారాయి. అసలు భాషలో, సాహిత్యంలో పాలకవర్గాల, ప్రభుత్వాల జోక్యం ఎంత స్వల్పమైనదైనా అనవసరమైనదీ, స్వార్థప్రయోజనాలతో నిండినదీ అయి ఉంటుంది. ఇక అది స్వల్ప స్థాయిలోనే ఆగిపోక, వేదికలను ఆక్రమించి చెలరేగిపోయేదైతే ఇక అక్కడ భాషా సాహిత్యాలు మిగలవు, రాజకీయ ప్రాబల్యం, అధికార పటాటోపమే మిగులుతాయి. ప్రస్తుత తెలుగు మహాసభల్లో అక్కడక్కడ నిజమైన భాషా ప్రేమికులూ, సాహిత్యకారులూ ఉన్నప్పటికీ, వారు నిజంగానే ప్రజలకూ, భాషకూ, సాహిత్యానికీ ఉపయోగకరమైన మాటలు చెప్పినప్పటికీ, అక్కడ విస్తరించి ఉన్న రాజకీయ, అధికార ప్రాబల్యం కింద ఆ మంచి మాటలు కూడ అణగారిపోయాయనే చెప్పవలసి ఉంటుంది. ప్రారంభోత్సవం, ముగింపు ఉత్సవం సరేసరి, ఎట్లాగూ ప్రభుత్వమే నిర్వాహకురాలు గనుక రాజకీయ నాయకుల తోనే వేదిక నింపుకుంటుంది. కాని కవి సమ్మేళనాలలో, సాహిత్య సదస్సులలో, భాషా, చరిత్ర సదస్సులలో కూడ ఆ విషయాల గురించి ఏమీ తెలియని రాజకీయ నాయకులు జొరబడ్డారు. తెలుగు సాహిత్య చరిత్రలో అధికార రాజకీయాల నుంచి దూరంగా ఉన్న ఉజ్వలమైన సంప్రదాయం ఘోరంగా అవమానం పాలయింది. రాజకీయ, అధికార ప్రాబల్యం ఇంతగా ఉన్నప్పుడు సహజంగానే కవులూ రచయితలతో సహా వేదిక ఎక్కే అవకాశం దొరికినవాళ్లందరూ రాజకీయాధికార పీఠాధిపతికి వందిమాగధ స్తోత్రాలు చేయక తప్పదు. అందువల్లనే ముఖ్యమంత్రిని శ్రీకృష్ణదేవరాయలనీ, సర్వజ్ఞ సింగభూపాలుడనీ, అశోకుడనీ, కారణజన్ముడనీ, ప్రధానమంత్రి కావలసిన వాడనీ, తెలుగు భాషా భగీరథుడనీ అసంఖ్యాక స్తోత్ర పాఠాలు, భజన సంకీర్తనలు వినిపించాయి.

ఇవి భాషా, సాహిత్య సభల్లా జరగలేదని, అధికార పటాటోపాన్ని ప్రదర్శించుకునే సర్కస్‌లా, తమాషాలా జరిగాయని అనడానికి ప్రతి సాహిత్య సమావేశంలోనూ రాజకీయ నాయకుల జోక్యం, ప్రధాన పాత్ర మాత్రమే కాక పోలీసుల భద్రతా ఏర్పాట్లే ముఖ్యమైన నిదర్శనం. ఈ అధికార పటాటోపం, పోలీసు అజమాయిషీ ఎంత దూరం వెళ్లిందంటే స్వయంగా ఈ సభల ప్రధాన నిర్వాహకులైన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిని ఒక పోలీసు అధికారి లోపలికి వెళ్లకుండా అడ్డుకుని ప్రవేశపత్రం చూపకపోతే లోపలికి వెళ్లనివ్వనన్నాడు.

ఇక రాజ్యం, పాలకవర్గాలు నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో జరిగినట్టుగానే ప్రపంచ తెలుగు మహాసభల్లో కూడ ఎన్నో నిర్వహణ లోపాలు, అవకతవకలు, అధికార దుర్వినియోగం, వృథా ఖర్చులు వెల్లువెత్తాయి. పాలకవర్గాలు ఏ పని చేసినా తమ అధికారాన్ని పదిలం చేసుకోవడానికి, అందులో కూడ తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి శ్రద్ధ వహిస్తాయి గాని అసలు పని మీద పూర్తి శ్రద్ధ, ఏకాగ్రత, అవగాహన చూపవు. ఇక భాషా, సాహిత్య, సాంస్కృతిక అంశాలైతే పాలకవర్గాలకు తెలియనే తెలియవు. భాష, సాహిత్యం, సంస్కృతి ప్రజలవి. ఆ ప్రజల నుంచి వాటిని కొల్లగొట్టి వాటి మీద కూడ తమ ఆధిపత్యం స్థాపించుకోవడానికే పాలకవర్గాలు ప్రయత్నిస్తాయి గాని వాటిని, వాటివెనుక ఉన్న ప్రజలను గౌరవించడానికి, గుర్తించడానికి, ఎత్తిపట్టడానికి ఎంతమాత్రం శ్రద్ధ చూపవు. ఈ సార్వత్రిక సత్యాన్ని ప్రపంచ తెలుగు మహాసభలు మరొకసారి నిరూపించాయి. అలాగే ఈ వైఖరి వల్ల అనివార్యంగానే నిర్వహణలో అనేక లోపాలు తలెత్తుతాయని కూడ ఈ సభలు రుజువు చేశాయి.

మహాసభలు దిగ్విజయంగా జరిగాయని, 42 దేశాల నుంచి, 17 రాష్ట్రాల నుంచి 1500 కవులు, 500 మంది రచయితలు పాల్గొన్నారని, వందకు పైగా సదస్సులు, 20కి పైగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయని, 250 పుస్తకాలు, పది ప్రత్యేక సంచికలు ఆవిష్కరించామని, మొత్తం మీద మహాసభలకు 16 వేల మంది ప్రతినిధులు వచ్చారని, ప్రారంభ సభకు, ముగింపు సభకు నలభై వేల మంది హాజరయ్యారని నిర్వాహకులు ప్రకటించారు. అయితే ఒక భాషా, సాహిత్య సభకు ఎంతమంది, ఎక్కడినుంచి హాజరయ్యారనేది గీటురాయి కాదు. రాశి గీటురాయి కాదు. అక్కడ ఏ చర్చలు, ఏ నిర్ణయాలు జరిగాయి, ఆ చర్చలు, నిర్ణయాలు తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యాభివృద్ధికి ఏ దోహదం చేశాయి అనేది ప్రధానమైన ప్రమాణం కావాలి.

మహాసభల్లో ఎన్నో లోటుపాట్లున్నాయని, సరైన సౌకర్యాలు కల్పించలేదని భాషాభిమానులు ఆరోపిస్తున్నారని, కిట్లు, గుర్తింపు కార్డుల కోసం వందలాది మంది భాషాభిమానులు ఎంతోసేపు క్యూలలో వేచి చూసి, మహాసభలకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారని, సాహిత్య అకాడమీ అధ్యక్షుడిని నిలదీశారని పత్రికలు రాశాయి.

మహాసభలకు రు. 50 కోట్లు కేటాయిస్తున్నానని ప్రభుత్వం ముందుగా ప్రకటించింది గాని నిర్వహణాలోపాల వల్ల, దుబారా వ్యయం వల్ల ఆ ఖర్చు రు. 100 కోట్లు అయిందని, రు. 80 కోట్ల వ్యయానికి మాత్రమే లెక్కలు తేలాయని, ఇంకా తేలవలసిన లెక్కలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయ వంద సంవత్సరాల వేడుకలకు రు. 200 కోట్లు ప్రకటించి, రు. 50 కోట్లు కూడ విడుదల చేయని ప్రభుత్వం ఈ సభలకు చెప్పినదానికన్న రెట్టింపు ఏ ప్రయోజనాల కోసం ఇచ్చిందో ఊహించడం కష్టం కాదు. ఒకవైపు ఇలా పదుల కోట్లు దుబారా అవుతున్న రోజునే కూతవేటు దూరంలో రు. 5 లక్షల అప్పు చెల్లించలేక ఒక కుటుంబానికి కుటుంబమే ఆత్మహత్య చేసుకున్నదనే వాస్తవం కూడ ప్రభుత్వపు ప్రాధాన్యతలేమిటో చూపుతున్నది.

సభల సందర్భంగా ఒక డాక్యుమెంటరీ చిత్రం తయారు చేయించారని, మామూలుగా రు. 20 లక్షల లోపు ఖర్చుతో తయారయ్యే ఆ చిత్రానికి రు. 2.5 కోట్లు చెల్లించారని వార్తలు వచ్చాయి. సభల ప్రారంభోత్సవంలోనూ, ముగింపు ఉత్సవంలోనూ పదిహేను నిమిషాల పాటు బాణసంచా, లేజర్ షో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిలో పది నిమిషాల్లో తగులబడిపోయే బాణసంచాను విదేశాల నుంచి రు. 2.35 కోట్లతో తెప్పించామని, లేజర్ షో ప్రదర్శించిన కంపెనీకి రు. 3 కోట్లు చెల్లించామని అధికారులే చెప్పారు. రాజుల సొమ్ము రాళ్ల పాలు అని గతంలో ఉన్న సామెత, ఇప్పుడు రాజుల సొమ్ము క్షణిక ఆడంబరాల పాలు అన్నట్టు అయిపోయింది.

నిజానికి అది ఎప్పుడూ కూడ రాజుల సొమ్మేమీ కాదు, అది ప్రజల సొమ్ము. ప్రజల నెత్తుటినీ చెమటనూ రాజులు తమ సొమ్ముగా మార్చుకుని, తమ కీర్తి ప్రతిష్ఠల కోసం, “ఆచంద్ర తారార్కం” తమ పేరు నిలబడడం కోసం భగవంతుడి పేరిట రాళ్ల మీద, తమను కీర్తించే లలిత కళల మీద, సాహిత్యం మీద ఖర్చు పెట్టేవారు. చట్టబద్ధంగా రాజరికం ఎప్పుడో పోయింది గాని, ఇప్పుడు తమను తాము ప్రజాస్వామిక

ప్రభుత్వాలమని చెప్పుకునే పాలకవర్గాలు ఆ రాజరికాన్నే కొనసాగిస్తూ, ప్రభుత్వ బొక్కసాలలోని ప్రజాధనాన్ని తమ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింప జేసుకోవడానికి వెచ్చిస్తున్నారు. మహాసభలకు విదేశాల నుంచి ఆహ్వానితులైన, హాజరైన ప్రతినిధులకు మొదట నాలుగు రోజుల కోసం బుక్ చేసిన హోటళ్లను మరో మూడు రోజులు పెంచారు. వారికి రాను పోను టికెట్లు మాత్రమే కాక, ఇక్కడ ఘనమైన ఆతిథ్యం, వాహనాలు సమకూర్చారు. కవిత్వం చదివిన ప్రతి ఒక్కరికీ ఒక శాలువా, జ్ఞాపికతో పాటు రు. 3000 చెల్లించారు. ఇటువంటి విపరీతమైన వ్యయంతో, మితిమీరిన ప్రవర్తనతో సభలు అంగరంగ వైభోగంగా జరిగాయనీ, 'ఆహా ఏమి రుచి' అనేలా భోజన ఏర్పాట్లు చేశామనీ, అంచనాలకు మించి ఆహూతులు హాజరయ్యారనీ నిర్వాహకులు చెప్పుకుంటున్న గొప్పలన్నీ భాషా సాహిత్య సభలకు వర్తించే విశేషణాలు కావు. రాజకీయ సభలకు వర్తించే ప్రమాణాలు మాత్రమే.

నిర్వహణా లోపాలలో ఖర్చు ఒక అంశమైతే, అంతకన్న మించి తెలుగు భాషా సాహిత్యాల మీద కనీసమైన శ్రద్ధ లేకపోవడం మరొక అంశం. ఆర్భాటంగా, విపరీతమైన ఖర్చుతో, బహుశా ప్రతి పనిలోనూ పెద్ద ఎత్తున ముడుపులతో నగరం నిండా నిర్మించిన తోరణాలలో, ఏర్పాటు చేసిన ఫ్లెక్సిలలో, బానర్లలో ఎన్ని భాషాపరమైన అక్షరదోషాలు, సమాచార లోపాలు ఉన్నాయో లెక్కలేదు. సాహిత్యకారుల పేర్లలో అక్షరదోషాలు, ఒకరి ఫొటో కింద మరొకరి పేరు, ఫొటోలు లభ్యమవుతున్న సందర్భంలో కూడ ఖాళీలు వదలడం, ముప్పై ఏళ్ల లోపే మరణించిన వ్యక్తి చిత్రపటాన్ని అరవై డెబ్బై ఏళ్ల వృద్ధుడిగా చిత్రించడం వంటి నిర్వహణాలోపాలు ఎన్నో జరిగాయి. స్వయంగా ముఖ్యమంత్రి బొమ్మ వేసి, పేరు రాసి, దానికింద ఆయన హోదా రాసిన ఫ్లెక్సిలో ఆ హోదాను ఇంగ్లిష్ లో 'ఆనరబుల్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ తెలంగాణ' అని తెలుగు లిపిలో రాయించదలిచారు. అందులోనూ ఆనరబుల్ అనేది మామూలుగా అధికారపత్రాలలో ఆన్ అని రాసి అపాస్ట్రఫీ పెట్టి బుల్ అని రాసే అర్థం లేని అలవాటు ఒకటి వలసవాదం రోజుల నుంచీ వస్తోంది. ఈ ఫ్లెక్సీ తయారు చేయించినవారికి అది ఆనరబుల్ అనే మాటకు సంక్షిప్త రూపం అని కూడ తెలిసినట్టు లేదు, దాన్ని విస్తరించాలని అనిపించినట్టు లేదు, జరుగుతున్నవి తెలుగు మహాసభలనీ, ఆ హోదాను తెలుగులో చెప్పవచ్చుననీ తెలిసినట్టు లేదు. చివరికి దాన్ని "హాబిల్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ తెలంగాణ" అనే హాస్యాస్పదమైన విశేషణంగా మార్చారు. ఇదీ తెలుగును గౌరవించడానికీ, పునరుద్ధరించడానికీ చేసిన ప్రయత్నం, చిత్తశుద్ధి!!

నిర్వహణాలోపాలతో పాటు తెలుగు మహాసభల నిర్వాహకుల దృక్పథంలోనే ఒక విచిత్రమైన అంశం కనబడుతుంది. ఒక కవి సమ్మేళనాన్ని అంచనా కట్టడానికి అందులో పాల్గొన్న కవుల స్థాయి, కవితల స్థాయి, ఆ కవితా పఠనంతో శ్రోతలు పొందిన ప్రేరణ వంటి సాహిత్య ప్రమాణాలు కాక ఎంతమంది కవులు పాల్గొన్నారు, ఎంత పెద్ద వేదిక నిర్మించారు అనేవే గీటురాళ్లు అయ్యాయంటేనే భాషా సాహిత్యాలకు దొరికిన స్థానం ఎంతో అర్థమవుతుంది. ఎంతమంది అనే లెక్క రాజకీయాలకు, సంతర్పణలకు పనికొచ్చే లెక్క మాత్రమే గాని వేమన అన్నట్టు కడివెడైననేమి ఖరము పాలు అనవలసి వస్తుంది. ఈ భారీ లెక్కలు సరుకులకు, వ్యాపారసంస్కృతికి, రాజకీయ వ్యాపారానికి మాత్రమే పనికి వస్తాయి. ఆ భారీ లెక్కల ప్రమాణాలతో చూసినప్పుడు, వెయ్యి మంది కవులు హాజరైతే, వారందరికీ కప్పడానికి శాలువాలు కూడ సరిపోక, ఒకే శాలువాను 250 మంది కవులకు కప్పారంటే అది ఆ కవులకూ గౌరవం కాదు, సాహిత్యాన్ని గౌరవించినట్టూ కాదు. అంతేకాదు, ఇలా మంది ఎక్కువైనందువల్ల కవులను "రెండు నిమిషాల్లో ముగించండి", "ఒక్క నిమిషమే చదవండి", "మొత్తం కవిత చదవకండి, కొన్ని పాదాలు చదివితే చాలు" అని తొందర చేశారంటే, మరొకవైపు రాజకీయ నాయకులు, సాహిత్య నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు దంచారంటే తెలుగు మహాసభలు కనీసం తమ ప్రకటిత లక్ష్యమైన భాషా సాహిత్యాల పట్ల గౌరవానికి కూడ నిలబడలేదన్న మాట.

ఈ తెలంగాణ ప్రభుత్వపు ప్రపంచ తెలుగు మహాసభలు 1975 నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ప్రపంచ తెలుగు మహాసభల కన్న ఒక ఆకు ఎక్కువ చదివాయని అణచివేతలో నిరూపించుకున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని, శ్రీకాకుళ విప్లవోద్యమాన్ని నెత్తురుటేర్లలో ముంచి అణచివేసిన హోం మంత్రి, 1974 రైల్వే సమ్మెను అణచివేసిన ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మొదటి ప్రపంచ తెలుగు మహాసభ లను విజయగర్వంతో నిర్వహించాడు. ఆ తెలుగు మహాసభలు పెట్టుబడిదారుల, భూస్వాముల కైవారానికే తప్ప ప్రజలవి కావని చెపుతూ వాటిని బహిష్కరిస్తున్నానని శ్రీశ్రీ నెల ముందే ప్రకటించాడు. సభా ప్రారంభ సమయానికి చెరబండరాజు, ఎంటి ఖాన్, నగ్నముని తదితరులతో లాల్ బహదూర్ స్టేడియం గేటు దగ్గరికి చేరి నిరసన ప్రదర్శన జరపబోయాడు. ఆయననూ, పన్నెండు మంది సహచరులనూ నిర్బంధంలోకి తీసుకున్న పోలీసులు ముప్పై గంటల అక్రమ నిర్బంధం తర్వాత వదిలేశారు. కె. చంద్రశేఖర రావు ప్రభుత్వం ఆ వెంగళరావు రికార్డును మించిన రికార్డును సృష్టించదలచుకుంది. గత ప్రభుత్వం లాగనే బూటకపు ఎన్‌కౌంటర్లు, దళితుల మీద అత్యాచారాలు, కనీస వాక్సభా స్వాతంత్ర్యాల మీద ఆంక్షలు వంటి రికార్డును మాత్రమే కాదు, తెలుగు మహాసభల ప్రారంభ సమయానికి తొమ్మిది మంది విప్లవకారు లను పట్టుకుని దుర్మార్గంగా కాల్చిచంపి నెత్తుటి తోరణాలు వేలాడదీసింది. సభలను బహిష్కరించండి అని పిలుపు ఇచ్చి, టాంక్‌బండ్ మీద శ్రీశ్రీ విగ్రహం దగ్గర నిరసన ప్రదర్శన జరపడానికి సన్నాహాలు చేస్తున్న విప్లవ రచయితల సంఘం సభ్యులను, ఇతర ప్రజా సంఘాల సభ్యులను టాంక్‌బండ్ కూడ ఎక్కకుండానే ఇళ్ల దగ్గర, దారిలో నిర్బంధించి, ఏడెనిమిది గంటల పాటు అక్రమ నిర్బంధంలో ఉంచింది. బహిష్కరణ, నిరసన ప్రదర్శన పిలుపు ఇచ్చిన సంస్థలో సభ్యుడు కాకపోయినా, కేవలం తెలుగు మహాసభల మీద విమర్శనాత్మక వ్యాసం ('ఎవరివీ ప్రపంచ తెలుగు మహాసభలు?' వీక్షణం డిసెంబర్ 2017) రాసిన నేరానికి వీక్షణం సంపాదకుడిని పోలీసులు సభా ప్రారంభానికి మూడు గంటల ముందే ఇంటి నుంచి నిర్బంధంలోకి తీసుకుని ఎనిమిది గంటల పాటు అక్రమ నిర్బంధంలో ఉంచారు.

గతంలో కళా సాహిత్యాలలో పాలకవర్గాల, ప్రభుత్వాల జోక్యాన్ని నిరసించినవారిలో కొందరు ఈసారి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులుగా ఉండడం, చాల మంది వాటిలో పాలు పంచుకోవడం, తమ భాగస్వామ్యాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నించడం విచారకరమైన అంశాలు. అయితే ఈ సభల్లో పాల్గొనడం, పాల్గొనక పోవడం అనే రాజకీయ వైఖరి ఒక్కటే సమస్తం కాదు. ఎప్పుడైనా పాలకపక్ష సాహిత్యకారులు, ప్రజాపక్ష సాహిత్యకారులు, తటస్థ సాహిత్యకారులు ఉంటారు. తటస్థ సాహిత్యకారులు గాలి ఎటువీస్తే అటు ఉంటారు గనుక వారి గురించి పెద్దగా ఆలోచించనక్కరలేదు. కాని ఇంతకాలమూ ప్రజాపక్ష సాహిత్యకారులుగా పేరు తెచ్చుకున్నవారు కూడ తెలుగు మహాసభల నిర్వాహకులు కావడం, పాల్గొనడం, పాల్గొనడానికి

ఉవ్విళ్లూరడం కనబడి, చాలమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సభల్లో పాల్గొన్నంత మాత్రాన వారు పాలకపక్ష సాహిత్యకారులుగా మారిపోయారని ముద్ర కూడ కొట్టనక్కర లేదు. పాలకవర్గాలకూ ప్రజలకూ జరిగే సుదీర్ఘ యుద్ధంలో బుద్ధిజీవులు అటూ ఇటూ ఊగిసలాడడం, ఏవో తాత్కాలిక భ్రమలతో, ఆకర్షణలతో, రూపాలను చూసి మోసపోతూ పాలకవర్గాల వైపు మొగ్గు చూపడం ప్రపంచ చరిత్రలో చాలసార్లు జరిగినదే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి సభలు అనో, గతంలో తెలంగాణ కళా, సాహిత్య, సంస్కృతులకు జరిగిన అవమానాన్ని, అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇది ఒక అవకాశమని భావించడం వల్లనో, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకాలంలో రాజకీయ నాయకులతో ఏర్పడిన సాన్నిహిత్యం వల్ల తలెత్తిన మొహమాటాల తోనో, ఒక పెద్ద సాహిత్య గుర్తింపు ఆశతోనో, మరే ప్రలోభాలతోనో సభల్లో పాల్గొన్నవాళ్లు ఉంటారు. వారందరూ ప్రభుత్వం ఈ మూడున్నర సంవత్సరాల్లో చేసిన, చేస్తున్న దుర్మార్గాలన్నిటినీ సమర్థిస్తున్నారని కూడ అనుకోనక్కర లేదు. వారిలో కొందరికి ఆ దుర్మార్గాల గురించి పూర్తి సమాచారం కూడ లేకపోవచ్చు. లేదా పాలకులు చూపిస్తున్న కోణాలు మాత్రమే చూస్తుండవచ్చు. అసలు రాజ్యానికి, పాలకవర్గాలకు, ప్రభుత్వానికి ప్రజల భాష గురించి సభలు పెట్టే అర్హత, యోగ్యత ఉండవనే తాత్విక అవగాహన అందరికీ ఉండకపోవచ్చు. సభలకు వెళ్లినవాళ్లు, వెళ్లనివాళ్లు అనే లిట్మస్ పరీక్ష జరిగిన మాట నిజమే గాని అదే సర్వస్వం కాదని, వెళ్లినవారిలో అత్యధికులు హృదయం సరైన స్థానంలో ఉన్నవారే నని, అంతిమంగా ప్రజాపక్షంలో చేరే, చేరవలసిన వారేనని సమ్యగ్ దృక్పథంతో వ్యవహరించవలసిన బాధ్యత ప్రజా సాహిత్యకారుల మీద ఉంది.

నిజానికి యాబై కోట్ల రూపాయలో, వంద కోట్ల రూపాయలో ఖర్చు పెట్టి, అందులో సగమో ముప్పాతికో దుబారా చేసి, ఆడంబరంగా సభలు నిర్వహించామని గొప్పలు చెప్పుకోవడం కన్న నిజంగా భాషాభివృద్ధికి, సాహిత్యాభివృద్ధికి ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు చేయవలసిన పనులు చాల ఉన్నాయి. సభలు జరిపినా, జరపకపోయినా ఆ పనులు చేయవచ్చు. కాని చనిపోయినవారికి ఘనంగా తద్దినాలు పెట్టి, బతికి ఉన్నవారిని నిర్లక్ష్యం చేసే బ్రాహ్మణీయ ఆచారంలాగనే సభలు ఆర్భాటంగా జరిపి, దాని నుంచి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నించే పాలకవర్గాలు ఆ అవసరమైన పనులను చేయవు, చేయదలచుకోవు. భాషాభివృద్ధి జరగాలంటే భాషా వినియోగం విపరీతంగా పెరగాలి. అంటే ఆ భాషను బోధనా భాషగా, పాలనా భాషగా, న్యాయస్థానాల భాషగా, మార్కెట్ భాషగా, ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాలను వ్యక్తీకరించగల భాషగా తీర్చిదిద్దాలి. ఈ పనులన్నీ ప్రభుత్వం చేయగలిగినవే, చేయవలసినవే. వాటిలో కొన్ని దీర్ఘకాలికమైనవి కావచ్చు గాని కొన్నయితే ప్రభుత్వం తలచుకుంటే ఒక్క సంతకంతో, క్షణాల మీద జరిగిపోయే పనులే. ఉదాహరణకు, పాలనా ప్రక్రియలో కీలకమైన ప్రభుత్వ ఉత్తర్వులు (గవర్నమెంట్ ఆర్డర్స్) వలస పాలన నాటి నుంచీ కూడ ఇంగ్లిష్‌లో విడుదల చేయడం ఆనవాయితీ అయింది. అధికార మార్పిడి తర్వాత కూడ రాష్ట్ర ప్రభుత్వాలూ కేంద్ర ప్రభుత్వాలూ ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నాయి. నాలుగు ప్రపంచ తెలుగు మహాసభలు జరిపిన, తెలుగును ఉద్ధరిస్తున్నామని ప్రగల్భాలు పలికిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు కూడ ఇంగ్లిష్ లోనే వెలువడేవి. ప్రస్తుతం మూడున్నర సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులన్నీ ఇంగ్లిష్ లోనే వెలువడుతున్నాయి. చివరికి ప్రపంచ తెలుగు మహాసభలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కూడ ఇంగ్లిష్ లోనే వెలువడ్డాయి. తెలుగు వినియోగం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఎంతో దీనితోనే తేటతెల్లమవుతుంది. అలాగే న్యాయస్థానాలలో దరఖాస్తు పత్రాలు, వాదనలు, వాంగ్మూలాలు, తీర్పులు అన్నీ అందులో కక్షిదార్లకు, ప్రజలకు అర్థం కాని ఇంగ్లిష్ లోనే జరుగుతున్నాయి. తెలుగులో తీర్పులు ఇవ్వాలని, ఇస్తామని ప్రకటించిన కొద్దిమంది న్యాయమూర్తుల ప్రతిపాదనలు ఉదాహరణప్రాయమే అయిపోయాయి. విద్యాబోధన మాతృభాషలో ఉండాలా, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి ఇంగ్లిష్ అవసరమా అనే తాత్విక, సామాజిక చర్చను అలా ఉంచినా, ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు తప్పనిసరి అంశంగా ఉండాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఉపాధ్యాయుల నియామకం, సరళమైన భాషలో పాఠ్య పుస్తకాలు తయారు చేయించడం, తెలుగును చిన్నచూపు చూసే వాతావరణం లేకుండా చేయడం వంటి పనులవైపు శ్రద్ధ పెట్టనే లేదు. కొన్ని రాష్ట్రాలలో ఉన్నట్టుగా స్థానిక, మాతృభాష మాధ్యమంగా చదువుకున్న వారికి ఉన్నత విద్యలో, ఉద్యోగాలలో, ఉపాధి అవకాశాలలో, పదోన్నతులలో అదనపు అవకాశాలు, రాయితీలు ఇవ్వడం అనే పద్ధతి ద్వారా తెలుగు పట్ల ఆసక్తిని పెంచడానికి ప్రభుత్వం ప్రయత్నించవచ్చు.

భాషాభివృద్ధిలో, భాష ఆదరణలో మరొక కీలకమైన అంశం ప్రతి మాటకూ పర్యాయపదాలు దొరికే స్థితి ఉండడం, ప్రతి కొత్త భావననూ ఆ భాషలో వ్యక్తీకరించగలిగే అవకాశం ఉండడం. అనేక చారిత్రక, రాజకీయార్థిక కారణాల వల్ల తెలుగు, ప్రత్యేకించి తెలంగాణ తెలుగు ఈ దిశలో ఎటువంటి ప్రోత్సాహాలనూ పొందలేదు. ఆరు దశాబ్దాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో సొంత, వ్యక్తిగత ప్రయత్నాలతో తయారైన నిఘంటువులే తప్ప సమగ్ర నిఘంటు నిర్మాణ ప్రయత్నం జరగలేదు. మాండలిక, వృత్తి పదకోశాల నిర్మాణ ప్రయత్నం మధ్య దారిలో ఆగిపోయింది. వెరసి, ఎప్పుడో ఎనబై సంవత్సరాల కింద ఒక జమీందారు తయారు చేయించిన, అంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అప్పటి సాహిత్య అకాడమీ పునర్ముద్రించిన సూర్యరాయాంధ్ర నిఘంటువు తప్ప సమగ్రమైన తెలుగు నిఘంటువు ఇంతవరకూ తయారు కాలేదు. ఆ నిఘంటువు ఎంత లోపభూయిష్టంగా ఉన్నదో ఎందరో విమర్శించారు. అందులో తెలంగాణ నుడికారానికి స్థానం దొరకలేదనే విమర్శ కూడ బలంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఇవాళ ప్రపంచ తెలుగు మహాసభల పేరుతో వృథా చేసిన సొమ్ములో పదో వంతు ఖర్చుపెట్టినా ఒక సమగ్ర తెలంగాణ తెలుగు నిఘంటు నిర్మాణ ప్రయత్నం సాధ్యమవుతుంది. అలాగే, నానాటికీ విస్తరిస్తున్న ఆధునిక శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, సాంకేతిక పరిజ్ఞానాలు అభివృద్ధి చేస్తున్న కొత్త కొత్త భావనలెన్నో ఉన్నాయి. గతంలో తెలుగు అకాడమీ చేసినట్టుగా ఆ కొత్త భావనలకు నోరు తిరగని, అర్థం కాని సంస్కృత సమాసాలు తయారు చేయడం కాకుండా, ఆధునిక దృక్పథంతో తెలుగు మాటలు తయారు చేయవచ్చునా, పరభాషా పదాలను అలాగే ఉంచి, తెలుగు అర్థబోధకు అవకాశం ఇవ్వవచ్చునా ఆలోచించాలి.

అలాగే భాషాభివృద్ధిలో మరొక ముఖ్యాంశం, సాహిత్యాభివృద్ధి, గ్రంథాలయాల అభివృద్ధి, ఇప్పటివరకూ సాహిత్యానికి ఎక్కని అనాదృత వర్గాల భాషను, సాహిత్యాన్ని, కళను, సంస్కృతిని అభివృద్ధి చేయడం. ఇవన్నీ కూడ ప్రభుత్వం తలచుకుంటే చేయగల, చేయదగిన పనులే. కాని గ్రంథాలయాల సెస్ పేరుతో ప్రజల నుంచి వసూలు చేసిన నిధులను కూడ గ్రంథాలయాలకు అప్పగించకుండా ఉంటున్న ప్రభుత్వం ఇవి చేస్తుందని అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. వీ

(రచయిత వీక్షణం సంపాదకులు)

న్యాయమూర్తిని హత్య చేసిందెవరు?

భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షాపై హత్యా నేరారోపణను విచారిస్తున్న న్యాయమూర్తి హఠాన్మరణం వెనుక రహస్యాలు మూడు సంవత్సరాల తర్వాత ఎలా బైటపడుతున్నాయో వివరిస్తున్నారు జి. లింగమూర్తి

ముంబైలో కేంద్ర నేరపరిశోధక విభాగం (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ - సిబిఐ) ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా ఉండిన బ్రిజ్ మోహన్ హరికిషన్ లోయా 2014 నవంబర్ 30 రాత్రి నాగపూర్ లో రవి భవన్ అనే ప్రభుత్వ అతిథి గృహంలో గుండెపోటుతో హఠాత్తుగా మరణించారని మూడు సంవత్సరాల కింద వెలువడిన వార్త నిజం కాదని, ఆయన హత్యకు గురై ఉండవచ్చునని ప్రస్తుతం వెలువడుతున్న కొత్త సమాచారం, లేవనెత్తుతున్న ప్రశ్నలు సంచలనం రేపుతున్నాయి. ఆ న్యాయమూర్తి సోహ్రాబుద్దీన్ షేక్, కౌసర్ బీల బూటకపు ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తూ ఉండడం, ఆ కేసులో అప్పటి గుజరాత్ హోం మంత్రి, ప్రస్తుత భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు అమిత్ షా ప్రధాన నిందితుడుగా ఉండడం, ఈ హఠాన్మరణం సంఘ్ పరివార్ కేంద్ర కార్యాలయపు నాగపూర్‌లో జరగడం, మరణవార్తను, న్యాయమూర్తి సెల్‌ఫోన్‌ను సంఘ్ పరివార్ కార్యకర్తలే కుటుంబానికి చేరవేయడం, తర్వాత వచ్చిన న్యాయమూర్తి అమిత్ షా మీద కేసు ఎత్తివేయడం, మూడు సంవత్సరాలలో న్యాయమూర్తి మరణంపై కనీస విచారణ జరగకపోవడం వంటి ఎన్నో అంశాలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. అటు 2005లో జరిగిన సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ విషయంలోను, ఇటు 2014లో జరిగిన న్యాయమూర్తి లోయా మృతి విషయంలోను ఎన్నో జవాబు లేని ప్రశ్నలు, అనుమానాలకు ఆస్కారమిచ్చే సందేహాస్పద ప్రవర్తనలు ఉన్నాయి.

న్యాయమూర్తి లోయా మృతి గురించి తెలుసుకోవడానికి ముందు అసలు నేపథ్యమైన సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ గురించి తెలుసుకోవాలి. అహ్మదాబాద్‌లోని విశాలా సర్కిల్ ప్రాంతంలో 2005 నవంబర్ 26న సోహ్రాబుద్దీన్ షేక్ మోటర్ సైకిల్ మీద వెళ్తూ కనబడ్డాడని, ఆయనను ఆపడానికి పోలీసులు ప్రయత్నించగా ఆపకుండా దూసుకువెళ్లడమే కాక, పోలీసుల మీద కాల్పులు జరిపాడని, పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆయన మరణించాడని పోలీసుల కథనం. ఆయన లష్కర్ ఎ తోయిబా సభ్యుడని, పాకిస్తాన్ కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటిలిజెన్స్ (ఐఎస్ఐ) తరఫున గుజరాత్ లోని ఒక అత్యున్నత రాజకీయ నాయకుడిని, బహుశా అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోడీని, చంపడానికి వచ్చాడని పోలీసులు ప్రకటించారు.

ఈ కుట్ర గురించి మొదట రాజస్తాన్ పోలీసులకు తెలిసిందని, వారు ఆ అనుమానితుడిని పట్టుకోవడానికి గుజరాత్ వచ్చారని గుజరాత్ పోలీసులు ప్రకటించారు. గుజరాత్ పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో చేసిన వందలాది హత్యలలో ఒకటిగా ఈ ఉదంతం కాలగర్భంలో కలిసిపోయి ఉండేది. కాని సోహ్రాబుద్దీన్ సోదరుడి నిరంతర ప్రయత్నాలు, కొన్ని యాదృచ్ఛిక సంఘటనలు, అధికారవర్గంలో కొందరు నిజాయితీగా చేసిన పరిశోధన, సుప్రీం కోర్టు జోక్యం కలిసి ఈ ఎన్‌కౌంటర్ తీగలాగితే డొంక కదిలింది. ఈ ఎన్‌కౌంటర్ హత్యతో అప్పటి హోం మంత్రి అమిత్ షా కు, అరడజను మంది ఐపిఎస్ అధికారులకు, పాలరాతి వ్యాపారులకు నేరుగా సంబంధం ఉందని తేలింది.

తన సోదరుడి ఎన్‌కౌంటర్ విషయంలో పోలీసులు చెపుతున్న కథనం నమ్మశక్యంగా లేదని, ఆ సమయానికి సోహ్రాబుద్దీన్ భార్య కౌసర్ బీ కూడ ఆయనతో ఉన్నదని, ఆమెను పోలీసులు ఏమి చేశారో తెలియడం లేదని సోహ్రాబుద్దీన్ సోదరుడు రుబాబుద్దీన్ షేక్ 2005 డిసెంబర్‌లో భారత ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశాడు. ఆ ఎన్‌కౌంటర్‌నూ, మృతుడి భార్య అదృశ్యాన్నీ విచారించాలని సుప్రీంకోర్టు గుజరాత్ పోలీసులను ఆదేశించింది. సరిగ్గా అప్పుడే గుజరాత్‌లో అగ్రశ్రేణి దినపత్రిక విలేఖరి ప్రశాంత్ దయాల్ కు కొందరు పోలీసు అధికారులకూ జరిగిన మద్యపానపు సంభాషణలలో ఈ ఎన్‌కౌంటర్ లోగుట్టు బైటపడింది.

విలేఖరిగా మారకముందు ప్రశాంత్ దయాల్ స్వయంగా ఆటోరిక్షా నడుపుతూ, ఒక గారేజిలో పనిచేస్తుండేవాడు. మద్య నిషేధం అమలులో ఉన్న గుజరాత్ లో పోలీసు అధికారులకు అక్రమ మద్యం సరఫరా చేస్తూ, వారితో సత్సంబంధాలలో ఉండి, లోపలి సమాచారం తెలుసుకుంటుండేవాడు. ఆ తర్వాత విలేఖరిగా మారి, పోలీసు వ్యవస్థలోని లోపలి రహస్య సమాచారం తెలిసిన ప్రముఖుడుగా మారాడు. ఆ వరుసలోనే ఒక విందులో తాగిన మత్తులో కొందరు పోలీసు అధికారులు తాము కొందరు దేశ వ్యతిరేక శక్తులను ఎలా మట్టుబెట్టామో ప్రశాంత్ దయాల్ కు చెప్పారు. దయాల్ పరిశోధనలో ఇద్దరు పురుషులను, ఒక బుర్ఖా ధరించిన స్త్రీని పోలీసులు ఒక ఫార్మ్ హౌజ్‌లో నిర్బంధించారని ఆధారంతో పాటు మరెన్నో ఆధారాలు దొరికాయి. ఈ ఆధారాలతో ఆయన నవంబర్ 2006లో, అంటే ఎన్‌కౌంటర్ జరిగిన ఏడాదికి ఒక సంచలనాత్మక కథనం ప్రచురించాడు.

సోహ్రాబుద్దీన్ షేక్‌ను, కౌసర్ బీ ని అరెస్టు చేసి, మొదట సోహ్రాబుద్దీన్ షేక్‌ను కాల్చి చంపారని, తర్వాత రెండు రోజులకు కౌసర్ బీని చంపారని ఆ కథనంలో ఆధారాలతో సహా రాశాడు. ఈ వార్త రాసినందుకు ప్రశాంత్ దయాల్ మీద గుజరాత్ పోలీసులు 2008లో రాజద్రోహం కేసు పెట్టారు. ఆ కేసును న్యాయస్థానం 2013లో కొట్టివేసి ప్రశాంత్ దయాల్ ను నిర్దోషిగా విడుదల చేసింది.

ఆ వార్త గుజరాత్‌లో కలిగించిన సంచలనాత్మక పరిణామాలలో ప్రభుత్వం గుజరాత్ కు చెందిన ఐపిఎస్ అధికారులు డి జి వంజారాను, రాజ్‌కుమార్ పాండియన్‌ను, రాజస్తాన్ ఐపిఎస్ అధికారి ఎంఎన్ దినేష్ కుమార్‌ను ఈ హత్యానేరంలో ముద్దాయిలుగా చూపుతూ అరెస్టు చేయక తప్పలేదు. ఈ కేసు విచారణ సుప్రీంకోర్టు నేతృత్వంలో గుజరాత్ ఐపిఎస్ అధికారి గీతా జోహ్రీ నిర్వహించారు. ఎన్‌కౌంటర్ గురించి పోలీసు నివేదిక అబద్ధమని, తప్పుల తడక అని ఆమె నివేదికలో స్పష్టం చేశారు.

సొహ్రాబుద్దీన్ నడుపుతున్నాడని పోలీసులు చెప్పిన మోటర్ సైకిల్ వాస్తవంగా గుజరాత్ తీవ్రవాద వ్యతిరేక పోలీసు బృందంలో ఒక కానిస్టేబుల్ సోదరుడిదని కూడ బైటపడింది. అది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఎన్‌కౌంటర్ జరగలేదని స్వయంగా గుజరాత్ ప్రభుత్వ న్యాయవాది సుప్రీంకోర్టులో ఒప్పుకోక తప్పలేదు.

సొహ్రాబుద్దీన్ షేక్, కౌసర్ బీ, వారి స్నేహితుడు తులసిరామ్ ప్రజాపతితో కలిసి 2005 నవంబర్ 22న హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని సాంగ్లికి ఒక ప్రైవేటు బస్సులో వెళ్తుండగా దారిలో గుజరాత్, ఆంధ్రప్రదేశ్ పోలీసులు కలిసి అరెస్టు చేశారని రుజువైంది. మొదట పోలీసులు పురుషులు ఇద్దరినే పట్టుకుపోవాలని ప్రయత్నించారనీ, కాని కౌసర్ బీ తానూ వారి వెంట ఉంటానని పట్టుపట్టిందనీ తేలింది. అలా ముగ్గురినీ బస్సులోంచి దించి గుజరాత్ తీసుకువెళ్లి వేరువేరుగా ఫార్మ్ హౌజుల్లో ఉంచారని తేలింది. ప్రజాపతిని రాజస్తాన్ పోలీసులకు అప్పగించి, కేసు పెట్టి జైలుకు పంపారు.

సొహ్రాబుద్దీన్‌ను నవంబర్ 26న చంపేశారు. కౌసర్ బీ మీద అత్యాచారం జరిపి, చంపేసి, నవంబర్ 29న మృతదేహాన్ని రహస్యంగా కాల్చేశారు. ఆ మృతదేహం గురించి కూడ బైటపెట్టకుండా అసలు కౌసర్ బీ అనే మనిషి ఉండిందనే ఆధారాలనే తుడిచేశారు.

సొహ్రాబుద్దీన్ అరెస్టుకు సాక్ష్యంగా ఉన్నదనే కారణంతోనే కౌసర్ బీని చంపినప్పుడు, తనను కూడ చంపుతారని భయపడిన ప్రజాపతి రాజస్తాన్ జైలులో తోటి ఖైదీలతో, తన న్యాయవాదితో ఆ విషయాలు చెప్పుకున్నాడు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు తన అరెస్టు, భయాలు అన్నీ రాసి, తన ప్రాణాలు కాపాడడానికి జోక్యం చేసుకొమ్మని విజ్ఞప్తి చేశాడు. కేసుల పేరు మీద పోలీసులు తనను వేరువేరు ప్రాంతాలకు తీసుకు వెళ్తున్నప్పుడు రక్షణగా అదే రైలులో ప్రయాణించమని తన బంధువులను, కుటుంబ సభ్యులను కోరాడు.

ఇన్ని చేసినా ఆయనను కూడ మరొక బూటకపు ఎన్‌కౌంటర్‌లో గుజరాత్ పోలీసులు చంపేశారు. ఆయనను రాజస్తాన్ పోలీసులు 2006 డిసెంబర్ 26న కోర్టు కేసు కోసం అహ్మదాబాద్ తీసుకువచ్చారు. ఆ కేసు అయిపోయాక ఆ రాత్రే తిరిగి ఉదయపూర్ వెళ్లే రైలు ఎక్కించారని రికార్డులలో రాశారు. కాని డిసెంబర్ 28 తెల్లవారు జామున గుజరాత్ – రాజస్తాన్ సరిహద్దులలో చాప్రి అనే గ్రామంలో గుజరాత్ పోలీసులు ఆయనను కాల్చి చంపారు.

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో ఆయనను ప్రశ్నించడానికి పరిశోధనాధికారి రానున్న సమయంలోనే ఈ హత్య జరిగింది. ఆ అధికారి నిజాయితీతో పరిశోధన సాగిస్తున్నందు వల్ల, ఆయన పరిశోధనను అడ్డుకొమ్మని స్వయంగా హోంమంత్రి అమిత్ షా తననూ ఇతర పోలీసు అధికారులనూ తిట్టి, ఈ సంగతి ఇక్కడితో ముగించమని ఆదేశించాడని, ఆ తర్వాతే ప్రజాపతి ఎన్‌కౌంటర్ జరిగిందని అందులో పాల్గొన్న పోలీసు అధికారి ఆ తర్వాత సిబిఐ విచారణలో చెప్పాడు.

సుప్రీం కోర్టు 2010లో ఈ కేసు మొత్తం పరిశోధనను సిబిఐకి అప్పగించింది. ఆ విచారణలో సొహ్రాబుద్దీన్‌కు అంతకు ముందు నేరాలతో, హత్యలతో సంబంధం ఉందని, సీనియర్ పోలీసు అధికారుల తరఫున వ్యాపారస్తుల నుంచి మామూళ్లు వసూలు చేస్తుండేవాడని బైటపడింది. ఉదయపూర్ లోని పాలరాతి వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేయడంలో సొహ్రాబుద్దీన్ అతిగా ప్రవర్తించాడని, దానితో అత్యున్నత రాజకీయ నాయకులతో సాన్నిహిత్యం ఉన్న ఆ వ్యాపారులు సొహ్రాబుద్దీన్‌ను చంపించడానికి పథకం అల్లారని బైటపడింది.

ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులకు అమిత్ షా 331 సార్లు ఈ విషయమై ఫోన్ చేశాడని, ఈ కేసులో ఆయనకు మితిమీరిన ఆసక్తి ఉందని సిబిఐ విచారణలో తేలింది. దీనితో మరికొందరు పోలీసు అధికారుల అరెస్టు, హత్య కేసులో ప్రధాన ముద్దాయిగా అమిత్ షా పేరు చేర్చడం జరిగాయి.

ఈ కేసు విచారణ గుజరాత్‌లో జరిగితే అక్కడి రాజకీయ నాయకులు ప్రభావితం చేసే అవకాశం ఉంది గనుక ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అలా ముంబై లోని సిబిఐ న్యాయస్థానంలో ఈ విచారణ కొనసాగుతూ వచ్చింది.

సొహ్రాబుద్దీన్, కౌసర్ బీల బూటకపు ఎన్‌కౌంటర్ కేసును మొదటి నుంచి చివరి వరకూ ఒకే న్యాయమూర్తి విచారించాలని కూడ సుప్రీంకోర్టు ఆదేశించింది. అలా జెటి ఉత్పల్ అనే న్యాయమూర్తి దగ్గర ఈ కేసు విచారణ మొదలైంది.

ఈలోగా దేశ రాజకీయ చిత్రపటంలో నరేంద్ర మోడీ, అమిత్ షాల స్థానాలు మారాయి. 2014 ఎన్నికల్లో మోడీ ప్రధాన మంత్రిగా మారాడు. అమిత్ షా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడయ్యాడు. నేరస్తులని రుజువైన, తీవ్రమైన నేరారోపణలతో విచారణలో ఉన్న గుజరాత్ పోలీసు అధికారులందరికీ పునరావాసాలు, పాత పదవులు, పదోన్నతులు వచ్చాయి.

ఈ నేపథ్యంలో తాను కోర్టుకు హాజరు కానక్కరలేని మినహాయింపు ఇవ్వాలని అమిత్ షా 2014 జూన్ 6న ముంబై సిబిఐ కోర్టును కోరగా న్యాయమూర్తి జెటి ఉత్పల్ అది సాధ్యం కాదని మందలించారు. అయినా ఆ తర్వాత వాయిదాకు జూన్ 20న అమిత్ షా గైర్హాజరయ్యాడు. న్యాయమూర్తి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసి కేసు విచారణను జూన్ 26కు వాయిదా వేసి, ఆరోజైనా ముద్దాయి కోర్టుకు రావలసిందేనని ఆదేశించారు.

ఒక్కరోజు ముందు, జూన్ 25న ఆ న్యాయమూర్తిని బదిలీ చేశారు. ఒకే న్యాయమూర్తి మొదటి నుంచి చివరివరకూ విచారించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని తుంగలో తొక్కి, తమకు వ్యతిరేకంగా ఉన్నాడనుకున్న న్యాయమూర్తిని బదిలీ చేశారు. ఆ స్థానంలో బ్రిజ్ మోహన్ లోయాను నియమించారు. అయితే లోయా కూడ వారు చెప్పినట్టు వినేవాడు కాదని త్వరలోనే తేలింది.

అక్టోబర్ 31న వాయిదాకు అమిత్ షా హాజరు కాకపోతే, ఆ రోజు గైర్హాజరుకు మినహాయింపు ఇస్తూనే, నిందితుడు ఆరోజు ముంబై లోనే ఉన్నాడు గదా, కోర్టుకు ఎందుకు రాలేదని న్యాయమూర్తి లోయా తన ఆగ్రహం, అసంతృప్తి ప్రకటించారు. ప్రధాన నిందితుడైన అమిత్ షా మీద, నిందితుల న్యాయవాదుల మీద కఠినమైన వ్యాఖ్యలు చేశారు. తర్వాత వాయిదా డిసెంబర్ 15కు వేశారు. ఆ తర్వాతి వాయిదా ఇంకా పదిహేను రోజులు ఉందనగా, నవంబర్ 30న నాగపూర్ లో ఒక సహచర న్యాయమూర్తి కూతురి పెళ్లికి లోయాకు ఆహ్వానం వచ్చింది.

మొదట లోయా ఆ పెళ్లికి వెళ్లాలని అనుకోలేదు గాని ముంబై కోర్టులోని ఇద్దరు సహ న్యాయమూర్తులు బలవంతాన ఆయనను ఒప్పించి నాగపూర్ తీసుకువెళ్లారు. పెళ్లి తర్వాత నవంబర్ 30 రాత్రి 11 గంటలకు లోయా ముంబైకి ఫోన్ చేసి భార్యతో నలభై నిమిషాలకు పైగా మాట్లాడారు. ఆ సమయంలో కూడ ఆయన తనకు నలతగా ఉందని ప్రస్తావించలేదు. తర్వాత మూడు నాలుగు గంటల్లోనే ఆయన ఛాతీ నొప్పి అన్నారని, కొద్ది సేపట్లోనే మరణించారని నమోదయింది.

మొదట దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి ప్రత్యేక హృద్రోగ ఆస్పత్రికి తీసుకువెళ్లే సరికే మరణం సంభవించిందని 2014 డిసెంబర్ 2న పత్రికల్లో వార్తలు వచ్చాయి. మరణించే సమయానికి ఆయన వయసు 52 సంవత్సరాలు. అప్పటివరకూ గుండెపోటుతో సహా ఏ అనారోగ్యమూ ఉన్నట్టు దాఖలాలు లేవు. అయినా ఇటువంటి ఆకస్మిక మరణాలు సంభవించే అవకాశం ఉంది గాని ఈ మరణాన్ని ప్రత్యేకంగా చూడడానికి, అనుమానించడానికి చాల అవకాశాలున్నాయి.

లోయా ఛాతీ నొప్పి అన్నారని చెపుతున్నప్పటి నుంచి మరణించిన దాకా జరిగిన పరిణామాలు, ఆ తర్వాతి పరిణామాలు ఎన్నో అనుమానాలకు తావిస్తున్నాయని కుటుంబ సభ్యులు భావిస్తున్నారని సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత నవంబర్ 20 సంచికలో కారవాన్ పత్రిక ఒక సుదీర్ఘ కథనాన్ని ప్రచురించింది. ఆ కథనంలోనూ, తర్వాత జరిగిన పరిణామాలలోనూ ఎన్నో జవాబు లేని ప్రశ్నలు, సాక్ష్యాధారాల తారుమారు జరిగిన ఉదాహరణలు బైటపడుతున్నాయి.

ఆయన న్యాయమూర్తి అయినప్పటికీ, ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్నప్పటికీ ఆయనను సమీపంలోని ఆస్పత్రికి కారులో కాకుండా ఆటోలో తీసుకువెళ్లారనే ప్రశ్న ఉంది. ఆ అతిథి గృహంలో ఆరోజటికి సంబంధించిన రికార్డులను తారుమారు చేశారని, ఆరోజు అక్కడే మరొక గదిలో ఉన్న దళిత నాయకుడొకరు సాక్ష్యాధారాలతో నిరూపించారు. ఆయన ఆ గదిలో చేరిన తేదీ ఆ రోజే (2014 నవంబర్ 30) గా ఉండగా, గది ఖాళీ చేసిన తేదీ 2017 గా దిద్దారు. అంటే మొత్తంగా రికార్డును దిద్దడం జరిగి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

లోయా మరణించారని ఉదయం 5 గంటలకే కుటుంబ సభ్యులకు చెప్పారుగాని, ఆస్పత్రి రికార్డులలో 6.30 కు మరణించినట్టుగా నమోదు చేసి ఉంది. ఆ మరణం గురించి కుటుంబ సభ్యులకు తెలియజేసిన వ్యక్తి కుటుంబంతో ఏ సంబంధమూ లేని, లాతూరుకు చెందిన ఒక ఆర్ఎస్ఎస్ కార్యకర్త. అది సహజ మరణమే అయినప్పటికీ పోస్ట్ మార్టం అవసరం లేనప్పటికీ పోస్ట్ మార్టం చేశారు. పోస్ట్ మార్టం నివేదిక మీద కుటుంబానికి ఏమీ సంబంధం లేని ఎవరో వ్యక్తి "జ్ఞాతి సోదరుడు" అని సంతకం చేశాడు. కుటుంబ సభ్యులు నాగపూర్ వస్తామంటే అవసరం లేదని చెప్పారు. మృతదేహాన్ని ఎవరూ తోడు లేకుండా లాతూరు దగ్గరి స్వగ్రామానికి పంపించారు. చొక్కా మీద నెత్తుటి మరకలు చూసిన కుటుంబ సభ్యులు రెండో పోస్ట్‌మార్టం కోరితే ఇప్పుడెందుకు అని నిరుత్సాహపరిచి, హడావిడిగా అంత్యక్రియలు జరిపించారు.

మరణవార్త చెప్పిన ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తే మూడు రోజుల తర్వాత లోయా మొబైల్ ఫోన్ తెచ్చి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఆ ఫోన్‌లో డాటా అంతా చెరిపేయబడి ఉంది. ఆయనను బలవంతపెట్టి నాగపూర్‌కు తీసుకువెళ్లిన సహన్యాయమూర్తులు మృతదేహంతోనూ రాలేదు, అంత్యక్రియలకూ రాలేదు.కేసులో అమిత్ షా కు అనుకూలంగా తీర్పు ఇస్తే వంద కోట్ల రూపాయలు ఇప్పిస్తానని ఒక సహన్యాయమూర్తి తనతో అన్నారని లోయా తమకు చెప్పారని కుటుంబ సభ్యులు చెపుతున్నారు. ఆ డబ్బు ఇవ్వజూపిన సహన్యాయమూర్తి ఆ తర్వాత ముంబై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడ అయ్యారు.

ఈ అనుమానాలన్నిటికి తోడు, లోయా మృతి తర్వాత నియమితులైన కొత్త న్యాయమూర్తి ఎంబి గోసావి అసలు మొత్తంగా కేసులోంచి అమిత్ షాను నిందితుడిగా తప్పించారు. అమిత్ షా మీద నేరారోపణకు ఆధారాలేమీ లేవని, సిబిఐ కేవలం రాజకీయ కారణాలతో ఆ ఆరోపణలు చేసిందని అన్నారు. ప్రధాన నిందితుడైన అమిత్ షా ను మాత్రమే కాదు, మరెంతో మంది కీలకమైన రాజకీయ నాయకులను, పోలీసు అధికారులను కూడ ఈ కొత్త న్యాయమూర్తి కేసు నుంచి తప్పించారు.

మామూలుగా ఏ నేరంలోనైనా, నిస్సందేహమైన సాక్ష్యాధారాలు లేకున్నా, పరిస్థితుల సాక్ష్యాధారాలు, నేరం వల్ల ప్రయోజనం పొందిన సందర్భం ఉంటే ఆరోపణ రుజువైనట్టే భావిస్తారు. సొహ్రాబుద్దీన్ హత్య కేసులోనూ, న్యాయమూర్తి లోయా అనుమానాస్పద మృతి కేసులోనూ పరిస్థితుల సాక్ష్యాధారాలు హంతకుడెవరో, హత్యల వల్ల లాభపడినదెవరో సూటిగా చూపుడువేలు ఒకే వ్యక్తి వైపు చూపుతున్నది. ఆ వ్యక్తి ఇవాళ పాలకపార్టీ అధ్యక్షుడిగా, అత్యున్నతాధికారంలో ఉన్నవారి సహచరుడుగా ఉన్నాడు. హంతకులే రాజ్యాధినేతలవుతున్న, హత్యల సాక్ష్యాధారాలను తుడిచేస్తున్న ఈ దేశం ఏమవుతున్నదో, ఏమి కాబోతున్నదో ఇప్పటికైనా ఆలోచించకపోతే ఆలోచనాపరులు అనే మాటకు అర్థం లేదు.

(రచయిత పాత్రికేయులు) వీ

పాఠకులు ఫిర్యాదులు, సమాచారం కోసం వీక్షణం కార్యాలయానికి పనిదినాల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 6.00 గంటలలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు. మిగతా సమయాల్లో ఫోన్ చేస్తే అది ఫ్యాక్స్‌లోకి వెళ్లి మీకు జవాబు రాదు. అప్పుడు మీరు ఫోన్ ఎత్తికూడా మాట్లడడంలేదని అనుకునే అవకాశం ఉంది. ఇది గమనించగలరు. – సం.

ప్రపంచ వ్యాపార ఔత్సాహికతా సదస్సు

హైదరాబాద్‌లో జరిగిన 8వ ప్రపంచ వ్యాపార ఔత్సాహికతా సదస్సుకు తెలంగాణ ప్రభుత్వం చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదనీ, ఈ సదస్సుల వల్ల రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదనీ అంటున్నారు బి.ఎస్. రాజు

హైదరాబాద్ లో 2017, నవంబర్ నెలాఖరి వారంలో 8వ ప్రపంచ వ్యాపార ఔత్సాహికతా సదస్సు జరిగింది. ఈ సదస్సును అమెరికా, ఇండియా ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో హైదరాబాద్ నగరంలో నిర్వహించారు. అమెరికా వ్యాపార ప్రతినిధుల బృందానికి అమెరికా అధ్యక్షుడైన డోనాల్డ్ ట్రంప్ కుమార్తె, ఆయన సలహాదారుగా చెప్పుకుంటున్న ఇవాంకా ట్రంప్ నాయకత్వం వహించింది. 'ఉమెన్ ఫస్ట్, ప్రోస్పెరిటీ ఫర్ ఆల్' అంటే 'మహిళలు ముందు, సౌభాగ్యం అందరికీ' అనే ప్రాధాన్యత ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పుకున్నారు.

హైదరాబాద్‌లో జరుపుకున్న ఈ సదస్సుకన్నా ముందే వాషింగ్టన్, టర్కీ, యు.ఎ.ఇ, మలేషియా, మొరాకో, కెన్యా, కాలిఫోర్నియాల్లో ఏడు సదస్సులు జరిగేయి. ఒక్క అమెరికా మినహా ఈ సదస్సులు జరిగిన దేశాలన్నీ ముస్లిం దేశాలే! దీని ముఖ్య ఉద్దేశం ముస్లిం దేశాల్లో వ్యాపార ఔత్సాహికతను పెంచడం ద్వారా ఇస్లాం ఛాందస వాదాన్ని, ఉగ్రవాదాన్ని తగ్గించడం. ఔత్సాహికతా సదస్సు అనే ప్రక్రియకు బీజం వేసినవాడు బరాక్ ఒబామా. అమెరికా, ముస్లిం వ్యాపార వేత్తలను ఒక వేదికపైకి తేవడం ద్వారా కొత్త అవకాశాలను, ఉద్యోగ కల్పనను విస్తృత పరచవచ్చని, తద్వారా ఇస్లామీయ ఉగ్రవాదాన్ని ఓమేరకైనా అరికట్ట వచ్చని బయటకు చెప్పుకున్న ఆయన అభిప్రాయం. ఈ జిఇసిల వెనుక అప్రకటిత అంతఃసూత్రమొకటి ఉంటుంది. అది అమెరికా వ్యాపారస్తులకు, వ్యాపార రంగానికి మూడవ ప్రపంచ దేశాల్లో చవకగా లభ్యమయ్యే, అందివచ్చే కొత్త ఆలోచనలను, నైపుణ్యాలను, ఆవిష్కరణలను వలవిసిరి పట్టుకోవడం. అయితే దీనికే చాక్లెట్ తీపి కోటింగ్, జిలుగు వెలుగుల ఆకర్షణీయపు రాపింగ్ బయటకు నోరూరేలా చూపించే ప్రావీణ్యం అమెరికా దోపిడీ వ్యాపార నీతి, వాళ్ల ప్రావీణ్యత. ఈ ప్రావీణ్యతనే ఉపయోగించి మూడో ప్రపంచ దేశాల నుండి లబ్ధిపొందుతూ ఉంటారు. ఈ నైపుణ్యానికి పెట్టుబడుల జోడింపు అనే అందని ద్రాక్షపళ్ల గుత్తిని పైకి వేలాడదీస్తారు. ఇదీ జిఇసి సదస్సుల అసలు మంత్రం, తంత్రం. గత ఏడు ప్రపంచ ఔత్సాహికతా సదస్సులవల్ల అవి జరుపుకున్న దేశాలకు ఒనగూరిన ఫలితాలు ఏమైనా ఉన్నాయా అని లెక్కలు కడితే అగుపించేది గుండు సున్నానే! అంతేగాక ఈ దేశాల చేతి చమురుతో అమెరికాకు బాడీ మసాజ్, ఒంటికి ఉచిత మాలిష్ భోగం ఒనగూరింది.

ఇటు అమెరికాలోనూ గాక, అటు ముస్లిం దేశాల్లోనూ గాక ఈ 8వ ప్రపంచ వ్యాపార ఔత్సాహికతా సదస్సు ఇపుడు ఇండియాకు, అందునా తెలంగాణకు వచ్చిందంటే ఎందుకు వచ్చింది? ఎందుకంటే కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం, సహజంగా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఉబలాటంతో ఉంటుంది కాబట్టి, సొంత చమురు వదిలించుకుని అయినా ఇటువంటి సదస్సులను నిర్వహించడం ద్వారా ఏమైనా పెట్టుబళ్ల ఏపిల్ పళ్లు రాలకపోతాయా అనే ఓ భ్రమ ఉంటుంది. ఇటువంటి సదావకాశాన్ని అమెరికా వాడుకుంటూ ఉంటుంది. సదస్సుకు వచ్చిన వాళ్లను చూపించుకుని విదేశీ పెట్టుబడుల వెల్లువ వస్తుందని, స్టార్ట్-అప్ కంపెనీలు ప్రాంతీయంగా వెలిసి ఉద్యోగాలు ముంచెత్తుతాయని ప్రాంతీయ పాలకులు ప్రజలను నమ్మమని ప్రచార భేరీ మోగిస్తారు. ఇంతకు మించి ఈ సదస్సుల ఉపయోగం ఏమీ ఇంతవరకు కనబడలేదు, ముందు కనబడదు కూడా !

అమెరికాలో ఏ గుర్తింపు లేని ఇవాంకాకు ఇక్కడ తెలంగాణాలో 'టిఆర్ఎస్' రాష్ట్ర ప్రభుత్వం, 'బిజెపి' పాలనలో ఉన్న కేంద్ర ప్రభుత్వం బ్రహ్మరథం పట్టాయి. ఈ ఆర్భాటం చూస్తే మన పాలకులు ఇంకా సామంత రాచరికాన్ని, వలస బానిస మనస్తత్వాన్ని వదులుకోలేదని స్పష్టంగా తెలుస్తుంది. అమెరికా దేశమన్నా, అమెరికా ప్రభుత్వమన్నా, అమెరికా కంపెనీలన్నా మన పాలకులు ఒళ్లుమరిచి భక్తి పారవశ్యంతో ఊగిపోతారు, ఎందుకో మరి? ఒక దేశం ఇంకో దేశాన్ని ఇంతగా అందలం ఎక్కించాల్సిన, నెత్తినెక్కించుకు భజన చెయ్యాల్సిన అగత్యమేముంది?

ఆదరణ చూపడం, ఆతిథ్యమివ్వడం, సౌహార్ద్రతతో ఆహూతులకు ఆహ్వానం పలకడం సత్ సంస్కారమే. మనమిచ్చే ఆతిథ్యం మన తాహతుకు తగినట్లుగా ఉంటే అది హుందాగా, గౌరవంగా ఉంటుంది. అలాకాక ఎరువు తెచ్చుకున్న, అరువు తెచ్చుకున్న పద్ధతులు, ఖర్చులు, ఆర్భాటాలవల్ల మన వికృత చేష్టలు బయటపడి మనలని మనం పల్చబర్చుకోవడం, చమురు వదిలించుకోవడం తప్ప మనకు కలిసి వచ్చేదేమీ ఉండదు. అలా మన ఆహ్వానితులను మెప్పించి సాధించేది కూడా ఏమీ ఉండదు.

మన పాలకులు ఇటువంటి వికృత చేష్టలనే జిఈసి సందర్భంగా అతిగా ప్రదర్శించారు. ఇటువంటి దిగజారుడు ప్రదర్శనతో రాష్ట్ర, దేశ ప్రజల స్వతంత్రతా భావాలను, పౌరాభిమానాన్ని, హుందాతనాన్ని చులకన చేశారు. ఇక మీడియా వీరంగం ఇంతా అంతా కాదు. మీడియా సమస్తం, ఇవాంకా ఫొటోలతో, కథనాలతో ఓలలాడింది. ఎన్ని వందల కోట్లు ఈ ప్రపంచ వ్యాపార ఔత్సాహికతా సదస్సు నిర్వహణా తంతుకై ఖర్చుపెట్టారో లెక్క ఇంకా తెలియదు గాని, దీని కోసం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ముందుగా ఏర్పాటు చేసుకున్న 500 కోట్ల రూపాయల ప్రణాళికా వ్యయం, పలు శాఖల పోటాపోటీ ప్రదర్శనలతో మితిమీరిన ఖర్చువల్ల రెండింతలైయ్యిందనే వార్తా కథనాలు వచ్చేయి.

మన ప్రజా సౌకర్యం కోసం మనం రహదార్లు నిర్మించుకోవడం, గతుకుల, గోతుల రోడ్లను బాగుచేసుకోవడం, పరిసరాల శుభ్రత పట్ల మక్కువ పెంచుకుని చక్కబెట్టుకోవడం, పచ్చని వాతావరణం సృష్టించుకోవడం, వీటికోసం కోట్లు ఖర్చు పెట్టుకోవడం మంచిదే, కాదనం.

మన మురికి, మన జీవన స్థితిగతులు, మనసమస్యలు మనకెంత తెలుసో అంతకన్న ఎక్కువే బయటనుండి ఈ జిఈసి సదస్సుకు వచ్చిన

సుప్రీంకోర్టు - కొలీజియం వ్యవస్థ

హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల నియామకాలు పారదర్శకంగా జరగడం లేదని, బంధుప్రీతి, పక్షపాతధోరణి, అవినీతికి అస్కారం కలిగించేలా ఉన్నాయని అంటున్నారు చిమ్మె జాన్ బర్నబాస్

భారత న్యాయ వ్యవస్థలోని హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల నియామకానికి ఎలాంటి రాత పరీక్ష లేదు. పైగా ఆ నియామకాలన్నీ పారదర్శకంగా, న్యాయ సూత్రాల పద్ధతిలో జరగనప్పటికీ, వాటిని అడిగేవారు లేరన్నట్లుగా కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శి ద్వారా రాష్ట్రపతి 'ఆమోదముద్ర'తో నియామకాలు జరుగుతున్నాయి. 'వారంట్'ను రాష్ట్రపతి జారీ చేయడం ద్వారా హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీలుగా వెంటనే ప్రమాణ స్వీకారానికి అర్హత పొందినవారవుతారు. అయితే ఆ నియామకాలను జాతీయ స్థాయిలో ఒక 'రాత పరీక్ష' నిర్వహించడం ద్వారా చేపట్టాలని (హైకోర్టు న్యాయమూర్తులకు) ఇటీవల భావించారు. ప్రస్తుతం అమలులోకి రాలేదు. ప్రస్తుతానికి పాత విధానాన్నే కొనసాగిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా ఉన్న చర్చ ఏమంటే, కోర్టులలో నియమించే చిన్న 'దఫేదార్' (బిల్ల జమాను) ఉద్యోగానికే నేడు పరీక్ష నిర్వహిస్తుండగా, హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి ఎందుకు పరీక్ష నిర్వహించడం లేదనేది? న్యాయవాద వర్గాలలోనూ, కోర్టు, కక్షిదారుల విషయంలోనైతేమి పెద్ద చర్చ జరుగుతూ ఉన్నది. అంతే కాకుండా, అధికారంలో ఉన్న పార్టీ నాయకుల అండదండలతోను లేదా వారి బంధువులో నియమించ బడుతున్నారనేది మరో చర్చ. ఇవి రెండు మాత్రమే కాకుండా, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (జెఎఫ్‌సిఎం), అడిషినల్ జిల్లా జడ్జి లేదా జిల్లా జడ్జి పరీక్షలు మాత్రమే ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. అందులోను కూడా జిల్లా జడ్జీలకు గ్రేడింగ్‌లు పెట్టి, అందులో అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రథమ 3 స్థానాలలో నిలిచిన వారిని, ఖాళీగా ఉన్న హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సిఫారసు చేస్తుండడం కూడా జరుగుతూ ఉన్నది. ఈ ప్రక్రియలన్నీ న్యాయ వ్యవస్థలోని 'హైకోర్టు రిజిస్ట్రార్–రిక్రూట్‌మెంట్' ద్వారా జరుగుతూ ఉన్నవే. ఇందులో ఎంత వరకు పారదర్శకత, నిజాయితీ ఉంటాయన్నది ప్రశ్నార్థకమే. సామాన్య ప్రజలకు అంతుచితక్కని ఎన్నో ప్రశ్నలకు నేడు న్యాయ వ్యవస్థ సమాధానం ఇవ్వాల్సి ఉంది. దాచేస్తే దాగని సత్యాలెన్నో న్యాయ వ్యవస్థ మరుగున పడేస్తున్నది.

వాళ్లకు తెలుసు. వాళ్లను మెప్పించడానికి మన ఒంటికి మనమే వాతలు పెట్టుకుంటున్నట్లు వాళ్లకు తెలియనిది కాదు. మనం పెట్టుబడులు పెట్టండి మొర్రో అని బిచ్చపు చిప్పలతో దేవిరిస్తున్నామంటేనే మన కథ తెలియనిదెవరికి?

ఇక్కడో విషయం ప్రస్థావించాలి. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు చాలా సాదా సీదాగా తాను రోజూ వాడే దుస్తులు, చెప్పులు ధరించి వచ్చి ప్రసంగించారు. ఇది చాలా అభినందనీయమైన విషయమే! అయితే ఇదే సామాన్యత, సింప్లిసిటీ మిగతా అన్ని విషయాల్లో పాటించి ఉంటే ఎంత హుందాగా, గౌరవంగా ఉండేదో కదా! అలాకాక ఒక సామంత రాజు తన చక్రవర్తిని మెప్పించడం లో పాటించే ఆర్భాట పరంపరనుండి బయట పడలేని మానసికత ఇక్కడ ప్రదర్శితమైంది. ఇటువంటి విన్యాసాలు ప్రజలకు భారమౌతాయనే ధ్యాస లేకపోయింది. తాను వ్యక్తిగతంగా పాటించే సింప్లిసిటీ సమాజపరంగా, సామాజిక శ్రేయస్సు కోరి ఆలోచించి ఆచరించి ఉంటే వందల కోట్ల ప్రజాధనం గాలికి కొట్టుకు పోకుండా ఉండేది.

ఈ ఎనిమిదో ప్రపంచ వ్యాపార ఔత్సాహికతా సదస్సుకు పూర్వం జరిగిన ఏడు సదస్సుల అనుభవాలు మన పాలకులు అధ్యయనం చేసి ఉంటే ఇటువంటి సదస్సుల వల్ల అవి జరిగిన ఆయా దేశాల సామాన్య శ్రామిక ప్రజలకు ఒరిగిందేమీ లేదని విధితమయ్యేది. ప్రజల బాగుకోరే ప్రజానాయకత్వమైతే ఖచ్చితంగా ఇటువంటి సదస్సుల జోలికి పోకుండా జాగ్రత్తపడి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడేది.

ఈ సదస్సు 'ఉమెన్ ఫస్ట్, ప్రోస్పెరిటీ ఫర్ ఆల్' – 'మహిళలు ముందు, సౌభాగ్యం అందరికీ' అనే ముఖ్యోద్దేశాన్ని ఆర్భాటంగా ప్రకటించుకుంది. ఇది ఎంతవరకు నెరవేరుతుంది? దీనివల్ల ఎన్ని స్టార్టప్ కంపెనీలు మొదలై, నడిచి ఎంతమంది తెలంగాణ మహిళా యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయి?

ముక్కుసూటిగా చెప్పాలంటే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి బోర్డులు పెట్టి, పైసలు దండుకుని, బోర్డులు తిప్పేసే తంతు లాంటిదే ఇదని చెప్పడం కరువుగా అనిపించినా చెప్పాల్సిన విషయం చెప్పక తప్పదు. ఇక్కడ ప్రభుత్వం ఖర్చుపెట్టిన సొమ్ము ప్రత్యక్షంగా వ్యక్తులకు చెందినది కాకపోవచ్చు గాని, పరోక్షంగా ప్రజలు ప్రభుత్వానికి జమచేసిన ప్రజాధనమే కదా!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి మేళాలు చాలానే చూశాం. విడిపోయాక ఇప్పుడు ఇరు రాష్ట్రాలైన తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో గత తంతులే కొనసాగడం చూస్తున్నాం. అమెరికా, యూరోప్ దేశాలు పరాన్నభుక్కు దేశాలు. వాటి గత చరిత్రంతా వలసదేశాల, జాతుల దోపిడీ పీడనా చరిత్రే. ఇప్పుడు వాటి మనుగడంతా ఇదే ఆర్థిక దోపిడీపై ఆధారపడి నడుస్తోంది. అప్పటి రూపం ప్రత్యక్ష దురాక్రమణ అయితే , ఇప్పటి దోపిడీ రూపం పరోక్ష ఆర్థిక పీడన. మనలను దోచుకుని మోసపుచ్చి మనకు పెట్టుబడులు పెట్టడమంటే అర్థమేమిటి? మనం అటువంటి పెట్టుబడుల వెంట పరుగులు తీయడమేమిటి? దీనర్థం అస్వతంత్రత. గులామీ. ఇంకా చెప్పాలంటే గాంధీ గారి 'చరఖా' లో 'చక్రం' సామ్రాజ్యవాదుల ముళ్ళ రుధిర రథచక్రంగా మారిపోవడం. నిఖచ్చిగా, నిజాయితీగా మాట్లాడాలంటే ఈ దేశంలో యువతకు ఈ సదస్సులు, మేళాలు, మోళీలు ఏమీ ఒరగబెట్టవు, మరింత గులాంగిరీ తప్ప. ఇప్పుడు వారికి మిగిలున్న మార్గమొక్కటే – అదే.. లాల్ బనో! గులామీ చోడో!

(రచయిత 'శ్రామిక నేస్తం' పత్రిక సంపాదకులు) వీ

'సుప్రీంకోర్టు కొలేజియం' అనగా ప్రస్తుతం సుప్రీంకోర్టులో పదవిలో ఉన్న సీనియర్ న్యాయమూర్తుల సమూహం అని అర్థం. ప్రస్తుతం దాని సంఖ్య మూడు. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) వీరికి అధ్యక్షుడిగా ఉంటారు. అవసరం రీత్యా సభ్యుల సంఖ్యను పెంచుకునే స్వేచ్ఛ కూడా చీఫ్ జస్టిస్‌కు ఉంటుంది. దీని సమావేశాలు అన్నీ చీఫ్ జస్టిస్ పరిధిలోని అంశాలే. ఆయన అధికార పరిధి – స్వేచ్ఛ పూర్తిగా ఆయన విచక్షణాధికారం లోబడి ఉంటుంది. ఇది కేవలం హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియకు మాత్రమే సంబంధించిన అంశానికి లోబడి పనిచేస్తుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టు కొలేజియం సభ్యులుగా చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్ ఉన్నారు.

సుప్రీంకోర్టు కొలేజియానికి సంబంధించి రాజ్యాంగంలోని ఏ 'అధికారం' (ఆర్టికల్) లేదు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 124, 127, 224 భారతదేశంలోని హైకోర్టు, సుప్రీంకోర్టు నియామకాలకు సంబంధించినవి. దీనికి లోబడే నియామకాల ప్రక్రియ జరుగుతుంది. అయితే ఇదంతా పేర్లను సూచించే వరకు మాత్రమే. చివరి నిమిషంలోనైనా ఈ ప్రక్రియ అంతా రాష్ట్రపతి ఆమోదముద్ర పడకపోతే రద్దు కూడా కావచ్చు.

ఇటీవల వచ్చిన బాధాకరమైన, విచారకరమైన విషయం ఏమంటే, కొలేజియం వ్యవహారం పైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి, కొలేజియం సభ్యుడైన జస్టిస్ జె. చలమేశ్వర్ బహిరంగంగానే తీవ్ర అసంతృప్తిని, అసమ్మతిని వ్యక్తపరచడం వలన న్యాయ వ్యవస్థలోని కొన్ని లొసుగులు బయటపడ్డాయి.

జార్ఖండ్‌కు చెందిన పంకజ్ కుమార్ అనే అడ్వకేట్‌ను జార్ఖండ్ హైకోర్టుకు జడ్జిగా 'ఎలివేషన్' చేసే క్రమంలో ఆయనకు అనేక ప్రజా సంఘాలతో సంబంధాలున్నాయనే కారణం చేత ఆయనను జడ్జిగా నియమించడానికి పంపే ప్రక్రియలో వెనుకంజ వేయడానికి కొలేజియం సూచించిన కారణం సహేతుకంగా లేదు. దీనికి 'ఇంటలిజెన్స్ బ్యూరో' (ఐబి) ఇచ్చిన నివేదిక ఆధారంగా కొలేజియం నిర్ణయం తీసుకోవడం కూడా విచారకరం. ఎందుకనగా 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ' (ఇండిపెండెంట్ జుడిసియరి) అర్థమే మారిపోయే పరిస్థితి నెలకొంది. ఇంటలిజెన్స్ పోలీస్ వ్యవస్థ సూచించిన పేర్ల ఆధారంగా జడ్జీల నియామకం జరిగే పరిస్థితి నెలకొనడం దారుణం. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఇది బహిరంగమై ప్రజలలో న్యాయ వ్యవస్థపై అగౌరవం ఏర్పడే పరిస్థితి వచ్చింది.

వాస్తవానికి ఇంటలిజెన్స్ పోలీస్ వ్యవస్థ అంతా అధికారంలో ఉన్న వారికి భజన చేస్తూ, వారికి అనుకూలంగా ఉన్నవారి పేర్లు మాత్రమే పరిశీలనకు పంపుతారు. గతంలో పోలీస్ అధికారులకు వ్యతిరేకంగా వాదించిన వారి పేర్లు కూడా నామమాత్రంగానైనా పంపబడవు. ఒకవేళ పంపినప్పటికీ వారికి ప్రత్యేకంగా లాబీయింగ్ చేసే పరిస్థితి నేడు నెలకొన్నది. అన్నింటికన్నా ముఖ్యమైన ఆరోపణ ఏమంటే కొలేజియం సభ్యులను కూడా డబ్బులతో మభ్యపెట్టవచ్చనేది. ఇది కోట్ల రూపాయలలో ఉన్నదనే విషయం చర్చనీయాంశమైనది. ఇది ఎంత దారుణమో ప్రజాస్వామ్య వాదులంతా ఆలోచించాలి. దీని ద్వారా న్యాయాధికారులను పోలీసులు నియంత్రించే పరిస్థితి నెలకొంటుంది. పోలీసులు బ్లాక్‌మెయిల్ చేసే పరిస్థితి కూడా వస్తుంది. ఇది గమనించాల్సిన విషయం.

న్యాయవాదులైన కైలాస్ ప్రసాద్, అరిందం లోథ్, వాసుదేవన్, వి. నాదతూర్ తదితరుల విషయంలో కొలేజియం వ్యవస్థ పేర్లను న్యాయమూర్తుల నియామకానికి పరిశీలనలోకి తీసుకోకుండా వెనక్కి పంపడం కూడా కొలేజియం వ్యవస్థను సంతృప్తి పరచలేదనే కారణం కూడా బయటపడింది.

దేశ వ్యాప్తంగా చాలా హైకోర్టులలో న్యాయమూర్తుల పదవులు ఖాళీగా ఉన్నాయి. ఒకవైపు వాటిని భర్తీ చేయరు. భర్తీ చేయడానికి అనుభవజ్ఞులైన వారిని, న్యాయ కోవిదులను, న్యాయ శాస్త్రంలో ప్రావిణ్యం సంపాదించిన వారిని, అన్ని అర్హతలు ఉన్నవారిని అప్లై చేసుకోవడం, వారికి ఇష్టమొచ్చిన వారిని న్యాయమూర్తులుగా నియమించడం వెనుక అనేక రకాలైన అనుమానాలకు, వివాదాలకు దారి తీస్తున్నది న్యాయ వ్యవస్థ ప్రక్రియ. ఇలాంటి పరిస్థితి పోవాలి. 'రాజు తప్పు చేయడు' అనే పరిస్థితి నుంచి, రాజు తప్పుచేస్తే శిక్షించనూవచ్చు అనే పరిస్థితికి 'ప్రజాస్వామ్య వ్యవస్థ' ఎదిగింది. అలాంటి క్రమంలో స్వతంత్ర న్యాయ వ్యవస్థ మనుగడను కాపాడుకోవాల్సిన పరిస్థితి, పరిరక్షించుకోవాల్సిన పరిస్థితి, అన్నింటికన్నా ముఖ్యంగా రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగ విలువలను, మౌలిక లక్ష్యాలను పరిరక్షించుకోవాలి. ఇది న్యాయవాద వర్గాలకే కాకుండా సామాన్య ప్రజల మనుగడ కోసం అత్యంత ఆవశ్యకం. భారతదేశంలో ఇప్పటికీ న్యాయ వ్యవస్థపై ప్రజలకు కొద్దో గొప్పో విశ్వాసం – భయం ఉన్నది. కావున న్యాయ వ్యవస్థ పారదర్శకత, నీతి, నిజాయితీలపై కూడా ప్రజలకు ఒక బాధ్యత, నిఘా, చొరవ కూడా ఉండాల్సిన అవసరర ఉన్నది. భారతదేశం లో నెలకొన్న భావ దారిద్ర్యం రీత్యా ప్రజలలో ముఖ్యంగా విద్యావంతులైన వారిలో సైతం 'న్యాయవ్యవస్థ'ను అధ్యయనం చేయడంలో కొంత లోపభూయిష్టంగా కనబడుతున్నది.

ప్రధానంగా ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ బాధ్యత భారత రాజ్యాంగం, హైకోర్టు (ఆర్టికల్ 226), సుప్రీంకోర్టు (ఆర్టికల్ 32) లకు ఇచ్చింది కాబట్టి హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం కూడా పలు కోణాలలో విచారించబడి రావాలి. కేవలం మాజీ న్యాయమూర్తుల కుటుంబ సభ్యులకు లేదా వారితో సాన్నిహిత్యం ఉన్న వారితో అన్ని అర్హతలున్నప్పటికీ కేటాయించడం చాలా అనుమానాలకు తావిస్తుంది.

న్యాయ వ్యవస్థ ధనస్వామ్యానికి, కులానికి, బంధుప్రీతికి, ఆశ్రిత పక్షపాతానికి లోనవ్వడం వలన సామాన్యునికి న్యాయ వ్యవస్థ మరింత దూరమయ్యే ప్రమాదముంది. ఇప్పటికే కార్పొరేట్ శక్తులకు అనుకూలురైన న్యాయమూర్తులు, హిందూ మతోన్మాదాన్ని సమర్థించే న్యాయమూర్తులు (రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి బహిరంగంగానే హైదరాబాద్‌లో ఆర్ఎస్ఎస్–బిజెపి అనుబంధ సంఘాల సభలకు అతిథిగా హాజరవుతున్నారు) ఉంటున్నారు. మొత్తం న్యాయ వ్యవస్థ ఇప్పటికిప్పుడు మారుతుందని ఊహించలేం కానీ, మరింత ప్రజాస్వామిక, విప్లవ పోరాటాల నేపథ్యం – ముందడుగు వేయడం ద్వారా న్యాయ వ్యవస్థను ప్రక్షాళించవచ్చు. దీనికి విద్యా వంతులు, న్యాయవాదులు నడుం బిగించాలి. ఇప్పటికే హైకోర్టు – సుప్రీంకోర్టులలో న్యాయం పొందడం ఆలస్యమవుతున్నది, ఖరీదుగా కూడా మారుతున్నది. ప్రొఫెసర్ సాయిబాబాకు శిక్ష విధించడం – ఉన్నత న్యాయ స్థానాలలో బెయిల్ నిరాకరించడం ఇవన్నీ రాబోయే తరానికి హెచ్చరికల లాంటివి. భారత న్యాయ వ్యవస్థ స్పందించాల్సిన చోట స్పందించకపోవడం కూడా న్యాయాన్ని నిరాకరించడంతోటే సమానం. అన్యాయం జరుగుతున్నట్లు గానే భావించాలి. చట్టం ముందు అందరూ సమానమనే భావనను ముందుకు తీసుకొని పోవాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

పదునెక్కని నేతకు ఏకగ్రీవ పట్టాభిషేకం

***కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పటి నుంచి నెహ్రూ కుటుంబమే అధిక భాగం అధ్యక్ష బాధ్యతలు చేపట్టిందనీ, ఇప్పటి అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అధ్యక్ష పదవి చేపట్టేంత పరిపక్వత ఇంకా రాలేదనీ అంటున్నారు* ఎస్. కిశోర్ కుమార్**

భారత స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భారత జాతీయ కాంగ్రెస్ స్వాతంత్ర్యానంతరం ఒక రాజకీయ పార్టీగా రూపాంతరం చెంది దేశంలో పాలనా పగ్గాలు చేపట్టింది. 1947 నుంచి నేటి వరకు గత డెబ్భై సంవత్సరాల కాలంలో అటు కేంద్రంలోనూ, ఇటు దేశంలోని అనేక రాష్ట్రాలలోనూ అనేకమార్లు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి సుదీర్ఘకాలం పాటు పాలనను నిర్వహించిన అపార అనుభవం కలిగి ఉన్నది కాంగ్రెస్ పార్టీ. అంతటి చరిత్ర కలిగి ఉన్న కాంగ్రెస్ పార్టీలో సహజంగానే అపారమైన అనుభవాన్ని మూటగట్టుకున్న రాజకీయ దురంధరులకు కొదువ లేదు.

అలాంటి పార్టీకి తాజాగా నెహ్రూ కుటుంబ వారసుడు రాహుల్ గాంధీ 14 డిసెంబర్ 2017న జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాడు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే ఈ దేశంలో వారసత్వ రాజకీయాలను ఆది నుంచి ఒక సంస్కృతిగా పెంచి పోషిస్తున్న అతి పెద్ద కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ సంస్కృతి వారసత్వాన్ని 21వ శతాబ్దంలోకి నెడుతూ మరోసారి ఈ దేశ ప్రజలకు బలవంతంగా రుచి చూపించింది.

రాహుల్ గాంధీ ప్రజాజీవితంలోకి అడుగుపెట్టిన 2004 సంవత్సరం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ దిగ్గజాలు ఆయనను తమ భావి నేతగా భావించి తమ శక్తిమేరకు అసాధారణ శిక్షణనిస్తూ ఆయనను సానపడుతున్నప్పటికీ, ఆయన మాత్రం నేటికీ పదునెక్కని ఒక అసమర్థ, విఫల నాయకత్వానికి సాక్ష్యంగా మిగిలిపోతున్నాడు. ఆరిపోతున్న దీపం మాదిరిగా కాంగ్రెస్ పార్టీ రాజకీయ బలం దేశంలో రోజురోజుకీ దిగజారుతున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ రాచరిక గుణగణాలను మాత్రం వదులుకోలేక పోతుంది. అవకాశం చిక్కినప్పుడల్లా తన బలహీనతను చాటుకుంటుంది. తత్ఫలితంగానే పందొమ్మిది సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి, 132 సంవత్సరాల కాంగ్రెస్ చరిత్రలో రికార్డు నెలకొల్పిన సోనియా గాంధీ తన పదవీ విరమణ అనంతరం ఆమె కుమారుడు రాహుల్ గాంధీని పోటీలేని ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిని చేసింది.

ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి మిగిలిన ఆసరా అతడే అనే ఒక బలహీనమైన సందేశాన్ని పార్టీ శ్రేణులకు పంపించారు. తద్వారా కాంగ్రెస్ పార్టీ మనుగడకు నెహ్రూ కుటుంబమే ఏకైక దిక్కు అని చాలాకాలంగా పార్టీలో అంతర్లీనంగా నెలకొని ఉన్న ఒక స్థిరమైన అభద్రతా భావనను మరింత సుస్థిరం చేసినట్లయింది. పార్టీలో ఉన్న వ్యక్తి పూజ సంస్కృతిని మరింత ప్రోత్సహించినట్లయింది.

నెహ్రూ కుటుంబం నుంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన వారిలో మొదటి వ్యక్తి మోతీలాల్ నెహ్రూ (1919లో) కాగా, ఆరవ వ్యక్తి రాహుల్ గాంధీ (2017లో).

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌ను స్థాపించిన 1885 నుంచి నేటి వరకు 132 సంవత్సరాలలో ఒక్క నెహ్రూ కుటుంబం నుంచి మాత్రమే ఆరుగురు కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపడితే, ఇతరులు 57 మంది ఆయా సందర్భాలలో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఇతరులైన 57 మందిలో ఏ ఒక్క కుటుంబం నుండి కూడా మరొకరు కాంగ్రెస్‌కు జాతీయ అధ్యక్షులు కాలేకపోయారు. అలాగని కాంగ్రెస్‌ను స్థాపించిన వారిలో నెహ్రూ కుటుంబ సభ్యులెవరూ లేరు.

దేశానికి స్వాతంత్రం సిద్ధించే సమయంలోనే కాంగ్రెస్ పార్టీపై పట్టు సాధించి తమ కుటుంబ పార్టీగా కాంగ్రెస్ పార్టీని సొంతం చేసుకున్నారు నెహ్రూ కుటుంబ సభ్యులు, వారసులు. అందుకు సాక్ష్యంగా, దేశానికి స్వాతంత్ర్యం లభించిన గత డెబ్భై సంవత్సరాల కాలంలో ఒక్క నెహ్రూ కుటుంబమే సగ కాలం పైగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించింది. అంతేగాక, స్వాతంత్ర్యానంతరం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సుదీర్ఘకాలంలో లాల్‌బహదూర్ శాస్త్రి, పి.వి. నరసింహారావులను మినహాయించి మిగతా కాలమంతా జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కుటుంబ వారసులే ప్రధాన మంత్రులుగా అధికారాన్ని చేజిక్కించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి మన్మోమోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పటికీ అప్పుడు అధికారంలో ఉన్నది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఏ కూటమి. ఆ కూటమికి ఛైర్‌పర్సన్‌గా నెహ్రూ కుటుంబ సభ్యురాలు సోనియా గాంధీ నేతృత్వంలోనే యూపిఏ కూటమి ప్రభుత్వం నడిచింది. కాంగ్రెస్ పార్టీపైన, కాంగ్రెస్ పార్టీ ద్వారా ఏర్పడిన ప్రభుత్వంపైనా నెహ్రూ కుటుంబ ప్రత్యక్ష పెత్తనం, అజమాయిషీ కొనసాగింపు ఒక ఆనవాయితీగా మిగిలిపోతూ ఉంది.

2004 నుంచి నేటి వరకు రాహుల్ గాంధీలో నాయకత్వ సమర్థత లోపాలు ప్రతి సందర్భంలోనూ స్పష్టంగా సాక్షాత్కరిస్తున్నప్పటికీ ఆయననే పార్టీ అధ్యక్షుడిని చేయడం పార్టీకి, పార్టీ శ్రేణులకు నష్టదాయకం. అంతేకాదు, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన ప్రతిపక్షం బలంగా లేకపోతే అది ప్రభుత్వం నుంచి ప్రజలకు సహజంగా జరిగే నష్టాన్ని మరింతగా పెంచినట్లవుతుంది. ప్రభుత్వంలో నియంతృత్వ ధోరణి కూడా పెరుగుతుంది. 2004లో క్రియాశీల రాజకీయాలలోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ తమ కుటుంబానికి 1980 నుంచి, కాంగ్రెస్ పార్టీకి

1966 నుంచి అత్యంత సురక్షిత స్థానంగా ఉన్న అమేథి (ఉత్తర ప్రదేశ్) లోకసభ నియోజక వర్గం నుంచి పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికయ్యాడు.

2007లో 403 స్థానాలున్న ఉత్తర ప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికలలో రాహుల్ గాంధీని ప్రచారాస్త్రంగా రంగంలోకి దింపి కాంగ్రెస్ పార్టీ కేవలం 22 స్థానాలను దక్కించుకోగలిగింది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఉత్తరప్రదేశ్ చరిత్రలో కనివినీ ఘోర పరాజయాన్ని మూట గట్టుకుంది. అదే సంవత్సరం రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టాడు.

2012లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీ ప్రచారం అక్కడ కాంగ్రెస్ పార్టీ తిరిగి కోలుకోడానికి ఏమాత్రం ఉపయోగపడలేదు. అప్పుడు రాహుల్ గాంధీ రెండు నెలలు శ్రమించి రెండు వందల ర్యాలీలలో ప్రసంగించినప్పటికీ విజయం కేవలం 28 అసెంబ్లీ సీట్లకే పరిమితమైంది. ఫలితంగా, అదే సంవత్సరం గుజరాత్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో ప్రచార నిర్వహణ బాధ్యతలకు దూరంగా ఉన్నాడు. 2013లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడుగా నియమింపబడ్డాడు.

చివరగా 2017లో కూడా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ మరింత ఘోర పతనాన్ని చవిచూసింది. అక్కడి ఓటర్లను రాహుల్ గాంధీ ఏమాత్రం ఆకర్షించలేకపోయాడనేది మరోసారి నిరూపితమయింది. ముఖ్యంగా 2017లో ఉత్తరప్రదేశ్ ఎన్నికల బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌గాంధీ సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుకోసం వెంపర్లాట, స్థానాల కోసం జరిపిన బేరసారాల వ్యవహారాలు నెహ్రూ కుటుంబానికి ఆది నుంచి అత్యంత అనుబంధంగా, సానుకూలంగా ఉన్న సొంత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నైతికత అంచెలంచలుగా ఏమేరకు దిగజారిపోయిందో స్పష్టంగా బహిర్గతమైంది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి కేవలం 7 అసెంబ్లీ స్థానాల్లో విజయం లభించింది.

గత పదమూడేళ్లలో రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి ఒక ప్రచారాస్త్రంగా సాధించిన అపజయాలు కేవలం ఉత్తర ప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. దేశంలో అనేక రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికలలో ఇలాంటి వరుస అపజయాలే ఎదురయ్యాయి. ముఖ్యంగా 2009లో లోక్‌సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల అనంతర కాలంనుంచి 2014 సార్వత్రిక ఎన్నికల వరకు రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ భావి ప్రధాని అభ్యర్థిగా బహుళ ప్రచారం జరిగింది. ఫలితంగా 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కేవలం 44 లోకసభ స్థానాలను కైవసం చేసుకుని దేశ చరిత్రలో కనివినీ ఎరుగని ఓటమిని మూటగట్టుకుంది. 2009లో 206 లోకసభ స్థానాల్లో విజయం సాధించి ప్రథమ స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికలలో ఆ సంఖ్య 44కు దిగజారి అసాధారణ పతనాన్ని చవిచూసింది.

భారతీయ జనతా పార్టీకి సంపూర్ణ మెజారిటీ లభించడంలో దోహదం చేసింది. సుదీర్ఘకాలంగా దేశంలో ప్రాంతీయ, జాతీయ రాజకీయ పార్టీల సంఖ్య అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ఇక పార్లమెంటు ఎన్నికలలో అసాధ్యమని భావించిన ఒక పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధన కోసం గత ముప్పై సంవత్సరాలుగా ఆవురావురమని ఎదురుచూస్తున్న భారత రాజకీయ వ్యవస్థకు ఊపిరి పోసినట్లయింది. ఆ సమయంలో, అనంతర కాలంలో దేశంలోని అనేక రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఎన్నికల బాధ్యతలను చేపట్టి విస్తృత ప్రచారం నిర్వహించిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి వరుస ఓటములను అందించాడు. రాహుల్ గాంధీ ఓటములకు బాధ్యత వహించిన సందర్భాలు, తన పదవుల రాజీనామాకు సిద్ధపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ పార్టీ మాత్రం అతడి వెన్నుతట్టి ప్రోత్సహించి ముందుకు నడిపించే ఏకైక కర్తవ్యాన్ని ప్రత్యామ్నాయం చేసుకుంది.

తన జీవితంలో రాజకీయ అనుభవం సంవత్సరాల రూపంలో పెరుగుతున్నప్పటికీ రాహుల్ గాంధీ ఒక భావి నాయకుడిగా ప్రజల నుంచి చెప్పుకోదగిన గుర్తింపు, ఆదరణను ఏ దశలోనూ పొందలేక పోయాడు. తన పరిపక్వతకు సూచికగా సహేతుకమైన ఒక్క విజయాన్నైనా పార్టీకి అందించలేకపోయాడు. ఇలాంటి నాయకుడిని 2009-2014 మధ్య కాలంలో కాంగ్రెస్ పార్టీలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మొదలుకొని ఆ స్థాయి హేమాహేమీ నాయకులు సైతం.. రాహుల్ గాంధీకి దేశ భావి ప్రధాని కాదగిన అర్హతలు, లక్షణాలు మెండుగా ఉన్నాయంటూ వేనోళ్ల పొగడడం, భజన చేయడం ఒకింత ఆశ్చర్యం కలిగించేది, అంతకుమించిన వ్యక్తి పూజను తలపించేది.

రాహుల్ గాంధీ ప్రచారంతో ఓవైపు కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉన్న రాష్ట్రాల్లో సైతం ఆ పార్టీకి కోలుకోలేని పతనాలు ఎదురయ్యాయి, మరోవైపు కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లను కూడా తమ వైపుకు మలుపుకోలేక పోయింది కాంగ్రెస్ పార్టీ. 2015లో ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును ఆమ్ ఆద్మీ పార్టీ గుండుగుత్తగా తన్నుకు పోతుంటే చేష్టలుడిగి చూసే పరిస్థితి మించి రాహుల్ గాంధీ ప్రచారం సాధించిందేమీ లేదు. తదుపరి తమ పార్టీకి వచ్చిన జీరో ఫలితాలను చూసి ముఖం దాచుకున్న దుస్థితి ఏర్పడింది.

అక్టోబర్ 2015లో బీహార్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ఆర్‌జెడి-జనతాదల్ (యు)తో కాంగ్రెస్ పార్టీ జత కలిసి మహా కూటమిగా ఏర్పడింది. బిజెపిని రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా చేయడమే ఆ మహా కూటమి లక్ష్యం. ఆ ఎన్నికలలో మహా కూటమి అనూహ్యం విజయం సాధించింది. ఆ మహాకూటమి ఏర్పాటులో భాగస్వామి అయిన రాహుల్ గాంధీ తొలిసారి విజయగర్వంతో ఉప్పొంగిపోయాడు. అది కేవలం పాక్షిక విజయం.

2016లో పశ్చిమ బెంగాల్ శాసనసభకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అక్కడ వామపక్ష పార్టీలతో జతకూడి ఆ నాయకులతో కలిసి రాహుల్ గాంధీ విస్తృత ప్రచారం నిర్వహించి కొత్తగా సాధించిన ఘనత ఏమీ లేదు. మళ్లీ తృణమూల్ కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పజెప్పి చేతులు దులుపుకున్నాడు.

ఫిబ్రవరి 2017లో పంజాబ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో రాహుల్ గాంధీ విస్తృతంగా ప్రచారం చేశాడు. అక్కడ కాంగ్రెస్ పార్టీ కూటమి విజయం సాధించింది. రాష్ట్రంలో మాదకద్రవ్యాలను అరికట్టడంలో అప్పటి ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. ఈ విషయాన్ని రాజకీయ విశ్లేషణలు చాలా ముందునుంచే కోడై కూశాయి. దేశవ్యాప్తంగా దుమారం లేసింది. తత్ఫలితంగా ఏర్పడిన ప్రభుత్వ వ్యతిరేకత సహజంగా అక్కడ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి లాభించింది. రాహుల్ గాంధీ ఖాతాలో దాఖలైన ఏకైక గొప్ప విజయం కూడా ఇదే.

రాహుల్ రాకతో కాంగ్రెస్ గట్టెక్కేనా?

సుదీర్ఘ కాలం దేశ రాజకీయాలపై ఆధిపత్యం చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు గడ్డుకాలం ఎదుర్కొంటోందనీ, పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ పార్టీకి ఏ మేరకు జవసత్వాలు నింపుతాడో చూడాలనీ అంటున్నారు **డా. సిలువేరు హరినాథ్**

దేశ రాజకీయాలల్లో నూట ముప్పది రెండు సంవత్సరాల చరిత్ర కల్గిన కాంగ్రెస్ పార్టీకి భారత స్వతంత్ర్యానంతరం పదిహేడవ జాతీయ పార్టీ అధ్యక్షునిగా రాహుల్ గాంధీ పదవీ బాధ్యతలు చేపట్టడంతో కాంగ్రెస్ పార్టీలో ఒకింత నూతనోత్సాహం ఉరకలేస్తుంది. నెహ్రు-గాంధీ కుటుంభం ఏకంగా 38 సంవత్సరాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీ పగ్గాలను చేపడితే సోనియా గాంధీ 19 సంవత్సరాల పాటు అధ్యక్షురాలిగా కొనసాగింది. ఈ నేపథ్యంలోనే రాజకీయ కుటుంబ వారసత్వంగా రాహుల్ గాంధీ పార్టీ రథసారధిగా ఎన్నికవ్వడం ద్వారా తన శక్తి సామార్థ్యాలతో పార్టీకి గత పూర్తి వైభవం తీసుకురాగలడా లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ 1991 మే 21న నేలకొరిగిన తరువాత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఒత్తిడి మేరకు 1998 లో సోనియా గాంధీ పార్టీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేపట్టక తప్పలేదు. తదనంతరం రాజకీయ పరిణితి చెంది కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జీవం పోయడమే కాకుండా 1998 నుండి 2004 వరకు అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని గద్దె దించేలా చేయగలిగింది. 2004లో జరిగిన 14వ లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలతో కలిసి అధికార పీఠం దక్కించుకోగలిగింది. సోనియా గాంధీకి భారత ప్రధానిగా అందలం ఎక్కే అవకాశం ఉన్నప్పటికీ దేశీయతపై విమర్శలు తెరమీదకు రావడంతో ఆ అవకాశం మన్మోహన్ సింగ్‌కి దక్కింది. ఆ తరువాత 2009లోను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మన్మోహన్ సింగ్‌నే ప్రధానిగా కొనసాగింది కాంగ్రెస్ పార్టీ. అయితే ప్రధానిగా మన్మోహన్‌సింగ్ పది సంవత్సరాల పాటు హోదాలో ఉన్నప్పటికీ సోనియా కనుసన్నుల్లోనే పరిపాలన కొనసాగిందనే విమర్శలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఫలితాలను పరిశీలించి నప్పుడు 2004లో జరిగిన14 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 417 స్థానాలల్లో పోటీ చేయగా 145 స్థానాల్లో గెలుపొంది 26.53 శాతం ఓట్లు సాధించగలిగింది. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ రాజశేఖర్‌రెడ్డి సారథ్యంలో తిరుగులేని రాజకీయ శక్తిగా అవతరించడం వల్ల దేశంలోనే అత్యధికంగా 29 స్థానాలల్లో గెలిచి రికార్డు సృష్టించడమే

మరో విజయం కోసం తాపత్రయపడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఇటీవల దొరికిన మరొక సదవకాశం గుజరాత్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలు. ప్రధాని నరేంద్రమోడీ సొంత రాష్ట్రం కావడంతో ఈ ఎన్నికలు అటు అధికార పక్షమైన భారతీయ జనతా పార్టీకి, ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 182 స్థానాలున్న గుజరాత్ శాసనసభ ఎన్నికలలో రెండు పార్టీలు పోటాపోటీగా తలపడ్డప్పటికీ మళ్లీ భారతీయ జనతా పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలయినప్పటికీ తాను ఎన్నికల బాధ్యతలు నిర్వహించి రాష్ట్రంలో గతంలో కన్నా మెరుగైన ఫలితాలతో 77 సీట్లు సాధించిన ఆనందంలో మునిగి తేలుతున్నాడు రాహుల్ గాంధీ.

గుజరాత్‌లో పాటీదార్లు, ఠాకూర్లు, క్షత్రియులు, ముస్లింలు, దళితులు కలిపి ఆ రాష్ట్ర జనాభాలో సుమారు సగం శాతం. వీరిలో 70 నుంచి 90 శాతం మద్దతు ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకేనని ఎన్నికల ముందు విశ్లేషణలు స్పష్టం చేశాయి. పైగా, గుజరాత్‌లో గత 22 ఏళ్లుగా బిజెపి అధికారంలో ఉండడం మూలంగా కొంత మార్పు కోరుకొనే వాతావరణం, ముఖ్యంగా గత ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారిన సందర్భంలో సహజంగానే ప్రజల్లో నెలకొని ఉండే ప్రభుత్వ వ్యతిరేకత, నోట్ల రద్దు ప్రభావ ఫలితాలు, జిఎస్‌టి పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తదితర ఇత్యాది అవకాశాలను అందిపుచ్చుకోలేని వైనాన్ని విస్మరించి, సీట్ల సంఖ్యలో పెరుగుదలను చూసి అదే తమ నైతిక విజయంగా సంబర పడుతూ పార్టీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాడు రాహుల్ గాంధీ.

ఓవైపు బిజెపి 'కాంగ్రెస్ ముక్త భారత్' లక్ష్యానికి సమీపంలో ఉంది. మరోవైపు, గడ్డుకాలంలో కాంగ్రెస్ పార్టీ ఒక అసమర్థ నేతను తన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకుంది. పదమూడేళ్లుగా పార్టీకి రికార్డు స్థాయిలో పరాజయ సేవలను అందించిన రాహుల్ గాంధీని ఏకగ్రీవంగా అధ్యక్షుడిని చేయడమంటే ఆ పార్టీలో ఎంతటి నియంతృత్వం దాగుందో అర్థమవుతూ ఉంది. తొలి నుంచీ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాలలో తమ పార్టీని కాపాడుకోవడమే కష్టంగా ఉందంటే, బిజెపి పటిష్ఠంగా ఉన్న రాష్ట్రాలలో, దేశంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాలలో ఓట్లను కొల్లగొట్టి రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు రాగలడా అనేది స్పష్టమైన సందేహం. పరాజయాల పరంపర మరింత కొనసాగిన రోజున కాంగ్రెస్ పార్టీని కాపాడడానికి నెహ్రూ కుటుంబంలోని మరో వ్యక్తి ప్రియాంక వధేరా గాంధీ రాక కోసం ఎదురుచూడడమే కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మిగిలిన అంతః బాహ్య ప్రజాస్వామ్యం.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

కాకుండా పార్టీకి పెద్ద దిక్కుగా నిలిచింది. అలాగే మహారాష్ట్రలో 13, గుజరాత్‌లో 12, తమిళనాడులో 10, అస్సాం, ఉత్తరప్రదేశ్‌లో, హర్యానా రాష్ట్రాలలో 27 స్థానాలల్లో గెలవగా ఇతర రాష్ట్రాలల్లో పార్టీ ప్రభావం అంతగా చూపలేకపోయింది.

కాంగ్రెస్ పాలనలో ముఖ్యంగా పేదల సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని చెప్పవచ్చు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో వారికి జీవనాధారం లేకపోవడం వల్ల పేదరికం పెరిగింది. ఆ వర్గాలను ఆర్థికంగా ఆదుకునేందుకు 2006 లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టింది కాంగ్రెస్‌పార్టీ.

దాని ఫలితంగా ఈనాడు దేశంలో 685 జిల్లాలోని 2,62,712 గ్రామ పంచాయితీలల్లో సుమారు 25.14 కోట్ల మంది పేద ప్రజలు లబ్ది పొందుతున్నారు. ఈ పథకానికి ప్రపంచ వ్యాప్తంగా మంచిపేరు ప్రఖ్యాతలు వచ్చిందని చెప్పాలి. తద్వారా పేద వర్గాల మద్దతు కాంగ్రెస్ పార్టీకి భారీగానే పెరిగింది. 2009 లో జరిగిన 15 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 440 స్థానాల్లో పోటీచేయగా 206 స్థానాలల్లో గెలుపొంది 28.85 శాతం ఓటు బ్యాంకు సాధించింది. అంటే 2004-2009 మధ్యకాలంలో కాంగ్రెస్‌పార్టీ 61 స్థానాల్లో ఆధిక్యతను పొందగలిగింది. అయితే కాంగ్రెస్ పార్టీ 2004-13 మధ్యకాలంలో విద్యారంగ అభివృద్ధికి బాటలు వేసింది. దేశంలో 2004 నాటికి 17 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉండేవి. కాని కాంగ్రెస్ పార్టీ కొత్తగా 27 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసి విద్యార్థులను ఉన్నత విద్యారంగం వైపు ప్రోత్సహించేందుకు భారీస్థాయిలో ఫెలోషిప్స్‌ని ప్రవేశపెట్టింది. అలాగే విద్యా హక్కు చట్టాన్ని 2009లో అమలు చేయడం వల్ల 6-14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు నిర్బంధ విద్యా విధానం కొనసాగుతుంది. అదే విధంగా 2013లో ఆహార చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం వల్ల ఈ రోజు దేశంలో సుమారు 81.35 కోట్ల మంది ప్రజలు లబ్ధిపొందుతున్నారని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ తన పది సంవత్సరాల పరిపాలనలో మంచి సంస్కరణలు తీసుకువచ్చినప్పటికీ అదే స్థాయిలో భారీ అవినీతి అక్రమాలకు తెరలేపిందని చెప్పవచ్చు. ముఖ్యంగా కాంగ్రెస్ మిత్రపక్షమైన డిఎంకె పార్టీ నేత రాజా టెలికాం మాత్యులుగా 2008లో ఉన్న సమయంలో 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో సుమారు 1.76 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండికొట్టినట్లు, దానికి రాజాయే ప్రధాన దోషిగా ఉన్నాడు. అయితే సిబీఐ కోర్టు నిందితులు నిర్దోషులని తీర్పు వెలువరించింది. 2010లో ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో సుమారు 70వేల కోట్ల రూపాయల భారి అవినీతికి కాంగ్రెస్‌పార్టీ లోఖసభ సభ్యులైన సురేష్ కల్మాడి నేతృత్వంలో చోటు చేసుకుంది. అందులో నాటి ఢిల్లీ ముఖ్యమంత్రి శీలాదీక్షిత్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నేతలకు ప్రమేయం ఉందనే ఆరోపణలు మూటకట్టుకుంది. 2012 లో జరిగిన బొగ్గు కుంభకోణంలో సుమారు 1.86 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన 194 బొగ్గు గనులల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని కాగ్ రిపోర్టు సైతం బహిర్గతం చేసి కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పెట్టింది. మచ్చుకకు ఇవి కొన్ని అవినీతి అక్రమాలే అయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం భారీ అవినీతికి పాల్పడింది కాంగ్రెస్‌పార్టీ. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో, ఇందిరమ్మ గృహ మంజూరులో ప్రభుత్వ సొమ్ము దారిమళ్లిందని కాగ్ రిపోర్టు నిగ్గుతేల్చింది. ఈ పరిమాణాల ద్వారా కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించిందని చెప్పాలి.

కాంగ్రెస్ పార్టీ అవినీతి అక్రమాలపై ఎక్కుపెట్టిన భారతీయ జనతా పార్టీ ప్రజలను తమ వైపు ఆకర్శించుకోగలిగిందని చెప్పాలి. 2004లో భారతీయ జనతా పార్టీ 364 స్థానాలల్లో పోటి చేయగా 138 స్థానాల్లో గెలుపొంది 22.16 శాతం ఓట్లు సంపాదించింది.

అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 25 స్థానాలు, రాజస్థాన్‌లో 21, కర్ణాటకలో 18 స్థానాలు గెలువగా మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒరిస్సా రాష్ట్రాలల్లో తన ఉనికిని కాపాడుకోగలిగింది. అయితే అప్పట్లో భారతీయ జనతా పార్టీకి సరైన నాయకత్వం లేకపోవడం వల్ల అనేక ప్రాంతాలల్లో పార్టీ బలహీనపడింది. దాని కారణంగా 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 433 స్థానాలల్లో పోటిచేయగా కేవలం 116 స్థానాలల్లో మాత్రమే గెలిచింది. అంటే 2004-09 మధ్య కాలంలో 22 స్థానాలల్లో పట్టు కోల్పోయి 3.36 శాతం ప్రజా బలాన్ని కోల్పోయింది. కానీ 2014లో జరిగిన 16వ లోఖసభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ హోరాహోరిగా తలబడినప్పటికీ మోడీ నినాదంతో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోయి భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. కాంగ్రెస్ పార్టీ 464 స్థానాలల్లో పోటీ చేయగా కేవలం 44 స్థానాలల్లో మాత్రమే గెలుపొంది ఆ పార్టీ చరిత్రలో ఘోర వైఫల్యాన్ని నమోదు చేసుకుంది. ఏకంగా 178 స్థానాలల్లో కాంగ్రెస్ సభ్యులు డిపాజిట్లు కోల్పోయారు. అంటే 2009-14 మధ్య కాలంలో కాంగ్రెస్‌పార్టీ 162 స్థానాలు కోల్పోయి 9.03 శాతం ఓటర్లకు దూరం అయ్యింది. కర్ణాటకలో 9, కేరళలో 9 స్థానాలల్లో గెలుపొంది ఇతర రాష్ట్రాలల్లో ఎక్కడ కూడా ఆధిక్యతను చాటుకోలేకపోయింది. అంతేకాదు 12 రాష్ట్రాలల్లో ఒక స్థానం కూడా కైవసం చేసుకోలేకపోయింది.

భారతీయ జనతా పార్టీ 2014 ఎన్నికల్లో 428 స్థానాలల్లో పోటీ చేయగా 282 స్థానాలల్లో గెలుపొంది 31.34 శాతం ఓట్లను సాధించింది అంటే 2009-14 నాటికి పోల్చితే భారతీయ జనతా పార్టీ 166 స్థానాలల్లో తమ పార్టీ కార్యక్రమాలను విస్తరించడమే కాకుండా 12.54 శాతం ఓటర్లను తమ వైపు మళ్లించుకోగలిగిందని చెప్పవచ్చు. భారత ప్రధానిగా నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చి మూడున్నార సంవత్సరాలు కావస్తుంది.

కాంగ్రెస్‌పార్టీ అధినేతగా రాహుల్‌గాంధీ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ముందుగా తాను ఎంచుకున్న ఎనిమిది అంచెల బృంద సభ్యులతో ఏ మేరకు పార్టీ కార్యకలాపాలను ముందుకు తీసుకుపోతారనేది వేచి చూడాల్సి ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు రాష్ట్రాలల్లో మాత్రమే సొంతంగా అధికారంలో ఉంది. అటు భారతీయ జనతా పార్టీ నేరుగా 13 రాష్ట్రాలల్లో అధికారంలో కొనసాగుతుంది. మిగతా 11 రాష్ట్రాలల్లో స్థానిక పార్టీలు అధికారంలో ఉన్నాయి.

(రచయిత సెస్‌లో రీసెర్చ్ అసిస్టెంట్) వీ

మళ్లీ గ్రంథాలయ ఉద్యమం

తెలంగాణ సమాజ చైతన్యంలో గ్రంథాలయాలు ఎటువంటి పాత్ర పోషించాయో తెలుపుతూ, ఇప్పుడు పాలకులు వాటిని విస్మరించారని గ్రంథాలయ పునరుజ్జీవనం కోసం విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు గ్రంథాలయోద్యమాన్ని చేపట్టాలని అంటున్నారు **వడ్డేపల్లి మల్లేశం**

పుస్తకాలు ఒక జాతి సంస్కృతి, చరిత్రకు ఆనవాళ్లు. సమకాలీన అంశాలను ప్రస్తావించడం ద్వారా పరిష్కారాలను చూపడంతో పాటు భవిష్యత్ చరిత్రకు నమోదుగా స్థిరపడి పోతుంది. పుస్తకాలను విస్మరిస్తే పురోగతి శూన్యం. ఆలోచన అసంపూర్ణం. అంతేకాదు భావవ్యాప్తి కొరవడి అంతరాలు ఏర్పడుతాయి. పుస్తకాలు అందుబాటులో ఉండడం ఎంత ముఖ్యమో వాటి అధ్యయనం అంతకంటే ముఖ్యం. గత చరిత్ర వర్తమాన అంశాలతో పాటు భవిష్యత్ ఆలోచనలు అధ్యయనం వల్లనే సాధ్యం. దీనివల్ల సంస్కారం, క్రమశిక్షణ, మానవీయ విలువలు, ప్రేమ, ఆరాధనా భావం, బాధ్యతలను గుర్తించే నైజం. విశ్లేషణా శక్తి, పరిష్కార మార్గాలు అన్వేషించే అన్వేషణా ధోరణులు సమాజం పట్ల విభిన్న వైఖరులు ఏర్పడుతాయి.

నెహ్రూ జన్మదినంను పురస్కరించుకొని నవంబర్ 14-20 వరకు జరిగే వారోత్సవాలను 1968 నుండి వరుసగా దేశ వ్యాప్తంగా నిర్వహించుకుంటూ, గ్రంథాలయ వారోత్సవాలలో గ్రంథాలయోద్యమ విశేషాలు ఉద్యమకారుల సాహితీ, సాంస్కృతిక కృషిని కొనియాడుతూ ప్రస్తుత కర్తవ్యాలను నిర్దేశించుకుంటున్నాం. కాని ఈ వారోత్సవాలు 'నేల విడిచి సాము చేసినట్లు' మొక్కుబడిగా కొనసాగడం వలన గ్రంథాల ప్రయోజనం. గ్రంథాలయాల వల్ల సమాజానికి చేకూరవలసిన సామూహిక, వ్యక్తిగత ప్రయోజనం అందడం లేదు.

50వ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 20తో ముగియనున్న వేళ రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయి నుండి రాష్ట్ర రాజధానిలోని కేంద్రీయ గ్రంథాలయం వరకు వాటి స్థితిగతులు, అవసరాలు, సౌకర్యాలపై గత ప్రభుత్వాల నుండి నేటి వరకు నిర్లక్ష్యం వహించి నిధులు మంజూరు చేయక, పక్కా భవనాలు కొరవడి, ఉద్యోగులు పూర్తి స్థాయిలో లేక అధునాతన, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను సరఫరా చేయని కారణంగా నామ మాత్రంగానే నిర్వహించబడుతున్నాయి.

ఈ వారోత్సవాల సందర్భంగా పాలకులలో చైతన్యం తీసుకువచ్చే కృషిజరగాలి. విద్యార్థులు, యువతను ఆకర్షించే సౌకర్యాలను కల్పించడం ద్వారా అనేక మంది పేద విద్యార్థులకు పరామర్శక గ్రంథాలు, పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందించి ఆదుకోవచ్చు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే కృషి వారిని సభ్యులుగా చేర్చుకుని, పుస్తకాలను ఇచ్చి చదివించే వీలుంది. స్థానిక గ్రంథాలయ అభివృద్ధిలో వీరి సహకారాన్ని పొందడానికి కూడా గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సాహితీ లోకం కవులు, కళాకారులు సామూహికంగా కృషి చేయాలి.

ప్రభుత్వం తెలుగు భాషా వికాసానికి సంబంధించి భాషను సుసంపన్నం చేస్తున్న ప్రజల గూర్చి, మాతృ భాషలో విద్యా బోధన, తెలుగు భాషా పరిరక్షణ, పాలనలో తెలుగు చట్టబద్ధ వాడుకను గూర్చి పట్టించుకున్న దాఖలాలు లేని కారణంగా 'కొఠారీ' మాతృ భాషలో విద్యా బోధన అనేది అటకెక్కింది.

ప్రపంచ తెలుగు మహా సభలను తొలిసారిగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వం అశేష ప్రజానీకాన్ని వారి భాష, సంస్కృతి, కళలు, జానపద సంపద, ఆదిమ సంచార జాతుల కళలు, సంస్కృతిని విస్మరించి దేశ దేశాల నుండి వచ్చే సాహితీ వేత్తలు, పండితులకు రాచ మర్యాదలు చేస్తాం అనడంలో ప్రభుత్వం ప్రజలను విస్మరించినట్లుగానే భావించ వలసి వస్తుంది.

తెలంగాణ ప్రజల భాషా పరిరక్షణ, సంస్కృతి, చైతన్యానికి సంబంధించిన మహా ఉద్యమమే గ్రంథాలయోద్యమం. గ్రంథాలయ వారోత్సవాల వేళ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం, భాషా పరిరక్షణ కోసం తెలుగు భాషను సుసంపన్నం చేసి తమ రచనల ద్వారా, పత్రికలు, స్థాపించిన సంస్థల ద్వారా అనేక గ్రంథాలను ప్రచురించిన భాషా ఉద్యమ కారుల కృషిని ప్రస్తావించకుండా ఉండలేం. కొమర్రాజు లక్ష్మణరావు 1906లో విజ్ఞాన చంద్రికా మండలి ఏర్పరచి 4000 మందిని చందా దారులుగా చేర్పించి విజ్ఞాన వ్యాప్తికి తోడ్పడ్డాడు. తాను స్వయంగా జీవిత చరిత్రలు, చారిత్రక నవలలు రాయడంతో పాటు 1912లో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం వెలువడడానికి వందలాది పేజీల విజ్ఞానాన్ని సమకూర్చాడు.

1912 సెప్టెంబర్ 1న లక్ష్మణరావు వారి మిత్రులైన రావిచెట్టు రంగారావు, వెంకట రంగారావులతో కలిసి హైదరాబాద్‌లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపించి ఆంగ్ల, ఇతర భాషల గ్రంథాలను తెలుగులోకి అనువాదించి పాఠకలోకానికి అందుబాటులో ఉంచారు. పరిశోధనా గ్రంథాలను ప్రచురించడంతో పాటు విజ్ఞాన చంద్రికా పరిషత్ ప్రారంభించి గ్రంథ పఠనం పట్ల ఆసక్తి పెంపొందింప జేశారు.

వట్టికోట ఆళ్వారుస్వామి 1938లో దేశోద్ధారక గ్రంథమాల ద్వారా కాళోజీ 'నా గొడవ'తో సహా అనేక పుస్తకాలు ప్రచురించారు. కమ్యూనిస్టు, పౌరహక్కుల నేత. ఆంధ్ర మహాసభలలో పనిచేసిన వీరి ఉద్యమ స్ఫూర్తి, అనుభవాలను నిజాం పాలనలోని ప్రజల కడగండ్లను 'ప్రజల మనిషి', 'గంగు' నవలల ద్వారా ప్రజానీకాన్ని చైతన్య పరిచి భాషా సేవ చేసినారు. తెలంగాణ నేలలో గ్రంథాలయాల ఏర్పాటుకు, గ్రంథాలయోద్యమ తీవ్రతకు శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం ఎంతో తోడ్పడింది.

వరంగల్ జిల్లాలోని ఇనుగుర్తిలో వద్దిరాజు సోదరులు విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాలను ఏర్పాటు చేసి అనేక నవలలు, నాటకాలు గ్రంథాలు రాసి అందుబాటులో ఉంచడంతో పాటు తెలుగు – వెలుగు పత్రిక స్థాపించి భాషా, సాంస్కృతిక చైతన్యానికి కృషి చేశారు. నల్లగొండలో వెంకట నరసింహారావు 'నీలగిరి' పత్రిక నడపగా, సూర్యాపేటలో పువ్వాడ వెంకటప్పయ్య 'కృషి ప్రచారిణ' గ్రంథమాలను, వెల్దుర్తి మాణిక్యరావు, కెసి గుప్తా 'అణా గ్రంథమాల'ను నెలకొల్పి అనేక పుస్తకాలను ప్రచురించి అణా, రెండణాలకే అమ్మి పుస్తక పఠనంను అలవాటు చేశారు.

ఆంధ్ర ప్రాంతమైన కర్నూలుకి చెందిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 'గ్రంథాలయ సర్వస్వం', ఆంధ్ర గ్రంథాలయ పత్రిక సంపాదకులుగా పనిచేయడమే గాక, 'ఇండియన్ లైబ్రరి అసోసియేషన్‌కు ఉపాధ్యక్షులుగా పనిచేసిన ఆయన ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో 10వ అఖిల భారత గ్రంథాలయ సభలు జరిగాయి.

నిజాం పాలనలో భాష, సంస్కృతి కనుమరుగై తెలుగు పాఠశాలలు లేని కాలంలో అభ్యుదయ వాదులు పాఠశాలలు స్థాపించి, తెలుగు భాషలో పాఠాలు బోధించే ఏర్పాట్లు చేసి 'నా సోదరులకు తెలుగు చదువుకునే హక్కున్నదని' జబ్బచరిచి నిశితంగా విమర్శిస్తూ సురవరం ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికను నిర్వహించి తెలంగాణలో కవులు లేరన్న ఆకతాయి విమర్శకు ధీటుగా 1890 – 1934 మధ్య తెలంగాణలో రచనలు చేసినవారి నుంచి రచనలు సేకరించి 354 మంది పేరున 'గోలకొండ కవుల సంచిక' వెలువరించి మెప్పించాడు. 1924 నుండి 1947 దాకా వెలువడిన 'గోలకొండ' ఆ తర్వాత 'ప్రజావాణి' పత్రికను స్థాపించి నిర్వహించాడు. గ్రంథాలయోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన సురవరం హిందువుల పండుగలు, హైందవ ధర్మ వీరులు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషములు వంటి రచనలు చేసి సమాజానికి అందించారు. 'విజ్ఞాన వర్ధని' స్థాపించి సాహిత్య గ్రంథాలను ప్రచురించారు. వీరి ప్రచురణల ద్వారా కవులలో చైతన్యం, రచనా రంగం పరిపుష్టి కావడంతో పాటు అనేక మంది రచయితలు, కవులు, కళాకారులు ఈ ఉద్యమం నుండి పుట్టుకొచ్చారు. 'గోల్కొండ' పత్రిక నాటి ప్రజానీకంలో రాజకీయ చైతన్యం తేగా 'ఆంధ్ర సారస్వత పరిషత్' ద్వారా వీరి సేవలను మరింత విస్తృతం చేశారు.

వరంగల్‌లో 1904లో స్థాపించబడిన రాజరాజ నరేంద్ర భాషా నిలయం భవనం నేటికి కనపడుతున్నా దాని ద్వారా జరిగిన రాజకీయ చైతన్యం, సామాజిక స్ఫూర్తి, భాషా సాంస్కృతిక వికాసాన్ని చర్చించుకొని నాటి వైభవాన్ని నెమరువేసుకుంటూ తెలంగాణ భాషా ఔన్నత్యాలకు ఈ నేల మీద భాషను, సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీ వేత్తలు, భాషను సజీవంగా ఉంచుతున్న సాధారణ, గ్రామీణ ప్రజానీకాన్ని మరీ ముఖ్యంగా కేంద్రంగా చేసుకుని తెలంగాణ ప్రభుత్వం భాషా, సాహిత్య సాంస్కృతిక విధానాన్ని తెలుగు మహా సభల సందర్భంగా ప్రకటించాలి.

ఇప్పటికీ చాలా మండల కేంద్రాలలో గ్రంథాలయాలు లేవంటే గ్రామాల పరిస్థితి చెప్పనక్కర లేదు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా కొనసాగుతున్న రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత ప్రజానీకంలో చైతన్యం నింపాలన్నా, అవగాహన కలిగించాలన్నా, నూతన జ్ఞానాన్ని అందించాలన్నా గ్రామ గ్రామాణ గ్రంథలయాలు స్థాపించడాన్ని ప్రభుత్వం తక్షణ కర్తవ్యంగా భావించాలి. ఆదాయ వనరులు, ప్రచార ఆర్భాటాలు, పాలకుల స్వప్రయోజనాలకు పాకులాడే పాలకులు ప్రజా సంక్షేమం, అభివృద్ధి, చైతన్యం కోసం పనిచేయాలి. ప్రజలే కేంద్రంగా సాగే పాలనే పది కాలాలు నిలబడుతుందని ప్రభుత్వాలు గమనించాలి.

సినిమా, టివి, సెల్‌ఫోన్, ఆధునిక మీడియా, మార్కెట్ మాయాజాలంలో మనిషి విలువలు, శ్రమను, వాస్తవాన్ని, నిజాయితి కోల్పోయి మార్కెట్ సరుకుగా మారిపోతున్న తరుణంలో కూడా అనేక మంది రచయితలు, కవులు, సామాజిక రుగ్మతలు, ప్రజల దైనందిన సమస్యల మీద ఆలోచింపచేసే రచనలు చేస్తున్నప్పటికీ పాఠకుల సంఖ్య తగ్గడం ప్రచురించబడిన పుస్తకాల పట్ల నిర్లక్ష్యం ఆధునిక మీడియా ఆధిపత్యం వల్ల మానవ నైపుణ్యం మసకబారిపోతున్నది. చివరికి కాగితం పైనా రాసుకుని చదవాల్సిన కవితను సెల్‌ఫోన్‌లో చూస్తూ చదువుకునే దుర్గతి పట్టడం బాధాకరం.

అందుకే ఉత్తమ సాహిత్యం వెలుగులోకి రావాలన్నా దానిని పాఠకులు, సామాన్య ప్రజానీకం చదివి సంస్కారవంతులు కావాలన్నా, తెలంగాణ భాషా, సంస్కృతి పదికాలాల పాటు నిలవాలన్నా, సామాజిక, రాజకీయ చైతన్యం సమాజ గమనాన్ని శాసించాలన్నా తిరిగి మరోమారు గ్రంథాలయ, సామాజిక, చైతన్య, సామూహిక ఉద్యమం ఉవ్వెత్తున రావాల్సిన అవసరం ఎంతో ఉంది.

'ఆ ఉద్యమం ఎలా ఉండాలి'?

పాఠశాల, కళాశాలల్లో గ్రంథాలయాలు ఆధునీకరించబడాలి. ఆ గ్రంథాలను నిత్యం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలి. పాఠ్యేతర పుస్తకాల అధ్యయనం విద్యార్థులలో విలువలు నేర్పి యాంత్రికత నుండి దూరం చేస్తుంది.

నేటి యువత మత్తు పానీయాలు, డ్రగ్స్‌తో పాటు మీడియా ప్రభావంలో పడి పుస్తక పఠనానికి దూరం అవుతున్నారు. యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రభుత్వాలు వీరి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించి కౌన్సిలింగ్ బృందాలు ఏర్పాటు చేసి పఠనాన్ని ప్రోత్సహించాలి.

పత్రికలను ఎక్కువ సంఖ్యలో వెలువరించాలి. చందా దారులను చేర్పించి పాఠకుల సంఖ్యను పెంచాలి. ఆ వాతావరణం సృష్టించాలి.

పాఠకులు గ్రంథాలను కొని చదవడాన్ని అలవాటు చేసుకోవాలి. సభలు, సమావేశాల్లో ఆ పరిస్థితులు కల్పించాలి. భాషల వాడకం అంతరించిపోతే సంస్కృతి కనుమరుగై జాతులే అంతరిస్తాయి. ప్రపంచంలో ఇప్పటికీ 6000 భాషల్లో సగం 3000 భాషలు అంతరించినట్లు ఒక అంచనా. మాతృ భాషను విస్మరించితే తెలుగు భాష, సంస్కృతి కూడా ప్రశ్నార్థకం కావచ్చు.

'తెలుగు మహా సభల్లో తెలుగు తేజమేనంటూ; ఆడంబర ప్రకటనలను ఆపి చిత్తశుద్ధిగా; తెలుగు భాషలోనే పరిపాలన కొనసాగాలి; తెలంగాణ తెలుగును విశ్వవ్యాప్తం చేయాలి'.

తెలంగాణలో ప్రమాదపుటంచున గల గిరిజన భాషలను బతికించి, వారి భాషలో రచనలు చేయించి వారికి గ్రంథాలయాలు అందుబాటులో ఉంచాలి.

పెచ్చరిల్లుతున్న హిందుత్వ ఫాసిజం

దేశంలో దళిత, ముస్లిం, మైనారిటీలపై పెచ్చరిల్లుతున్న హిందుత్వ ఫాసిస్టు దాడుల పట్ల ప్రజలను చైతన్యపరిచే ఐక్య ఉద్యమాలను నిర్మించాల్సిన తక్షణ అవసరం ఉందని అంటున్నారు **ఎ. నర్సింహా రెడ్డి**

బ్రిటిష్ వలసానంతరం, దేశం స్వతంత్రమై, ప్రజాస్వామిక రాజ్యాంగం అమలులోకి వచ్చి, దేశం స్వయం నిర్ణయాధికార ప్రతిపత్తితో కూడిన గొప్ప గుణాత్మక మార్పుగా, గతం నుంచి పూర్తి తెగతెంపులు చేసుకున్న మహోజ్వల పరిణామంగా పాలకులు ప్రజల్లో భ్రమలు కల్పించారు. ఇంకా కల్పిస్తూనే ఉన్నారు. ఏడు దశాబ్దాలుగా ప్రజాస్వామ్యం పేరుతో, ఎన్నికల పేరుతో దోపిడీ వర్గాల దుశ్చర్యలకు చట్టబద్ధత కల్పించడమే జరుగుతున్నది తప్ప విస్తృత జన జీవనంలో వచ్చిన మార్పేమీ లేదు. ఎన్నికల తంతు దోపిడీకి సాధికారత కల్పించడమే తప్ప ప్రజల సమస్యలు పరిష్కరించుకోవడానికి కాదని ఏడు దశాబ్దాల అనుభవం రుజువు చేస్తుంది. ఫలితంగా భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు భ్రమలు తొలిగిపోయాయి. నిజానికి బూర్జువా ప్రజాస్వామ్యంలో ఎన్నికలంటే వేర్వేరు పార్టీల పేరుతో ఒకేవర్గం మధ్య జరిగే పోరు అని గుర్తించాలి. ఎవరికి వారు అధికారం కోసం పోటీపడినా 'సారాంశంలో ఈ పార్టీలన్నీ తరతమ తేడాలతో భూస్వామ్య సంస్కృతినీ, పెట్టుబడిదారీ విధానాన్నీ, సామ్రాజ్యవాద దోపిడీనీ పరిరక్షించడానికే నన్నది యదార్థం. ఇవి బడా దళారీ పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల ప్రయోజనాల్ని కాపాడే జాతీయ, ప్రాంతీయ పాలకవర్గ పార్టీలే. దోపిడీ వర్గాల, కులాల మార్కెట్ పోటీలో ఏర్పడిన అంతర్గత వైరుధ్యాలు ఎన్నికల రూపంలో ప్రభుత్వాధికారం కోసం భిన్న పార్టీల మధ్య పోటీ మనకు కన్పిస్తుంది.

మనదేశంలో ఇవాల్టీ సామాజికార్థిక – రాజకీయ పరిస్థితులు 1930ల నాటి జర్మనీ పరిస్థితులను పోలి ఉన్నాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓటమికి గురైన తదనంతరం దానిమీద మిత్ర రాజ్యాలు విధించిన ఆంక్షలతో జర్మనీ సమాజంలో పెల్లుబికిన రాజకీయార్థిక సంక్షోభాన్ని, ప్రజల అసమ్మతిని, అభివృద్ధి ఆకాంక్షల్ని వాడుకుంటూ క్రమక్రమంగా బలపడి 14 సంవత్సరాలలో అఖండ విజయం దాకా సాగిన హిట్లర్ నాజీ పార్టీ లాగానే, మనదేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలతో పెరిగిన అంతరాలను, పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, అవినీతిని, అసంతృప్తిని వాడుకుంటూ, మత విద్వేషాలను రెచ్చగొడుతూ సంఘ పరివార్ ఫాసిస్టు శక్తులు రాజకీయంగా పార్లమెంట్‌లో రెండు స్థానాల నుంచి 282 స్థానాలకు ఎదిగింది. ఈ కాలమంతా అభివృద్ధి ఆకాంక్షలను, హిందుత్వ మతవాదాన్ని ఆయుధాలుగా వాడుకుంది.

మనదేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం మధ్య యుగాల నాటి అహేతుక ముసుగు తగిలించుకున్నప్పటికీ ఆధునిక కాలంలో ఆవిర్భవించిందని మర్చి పోరాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్త పెట్టుబడిగా పరిణామం చెందిన తర్వాతనే ఫాసిజం ఆవిర్భవించింది. మధ్య యుగాలనాటి కాలంచెల్లిన భావాలనే పునాదిగా చేసుకునే విచ్ఛిన్నకర ధోరణులను ఇది ఉపయోగించుకుంటున్నది. మన దేశంలో ఫాసిజం అహేతుక, అప్రజాస్వామిక, అమానవీయ, విచ్ఛిన్నకర పద్ధతులు పాటిస్తూనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మిలాఖతైంది. అందువల్ల

మేధో సంపత్తిని పెంచే విజ్ఞాన భాండాగారాలుగా గ్రంథాలయాలు విలసిల్లాలంటే స్థానిక కవులు, రచయితలు రాసిన పుస్తకాలను ప్రభుత్వమే ప్రచురించి ప్రోత్సహించాలి. సభలు విరివిగా జరగాలి. గ్రంథాలయాలలోకి అన్ని స్థాయిల పత్రికలు విధిగా సరఫరా చేయాలి.

గ్రంథాలయాలు కేంద్రాలుగా యువత, విద్యార్థులకు పోటీలు, శిక్షణ, కవిత్వ పఠనం ద్వారా యువ కవులకు స్వాగతం పలకాలి. రచయితలు, కవులను గుర్తించి ప్రశంసించడం, ప్రోత్సహించడం జరగాలి. తక్కువ ధరకు ప్రభుత్వమే పుస్తకాలను ప్రజలకు అందించాలి.

మహిళా రచయితలను పెంచుకోవడానికి గ్రంథాలయాలు వేదికలు కావాలి.

గ్రంథాలయాలలో సమావేశ మందిరాలు ఉండాలి. తరచుగా జరిగే భాషా, సంస్కృతి, చరిత్ర గోష్టులలో పాఠకులు కూడా పాల్గొనడం చైతన్యానికి ప్రతీక.

గ్రంథాలయాలకు రాజకీయ, అధికారగణం, అందరూ విధిగా పాల్గొనే సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తే పఠనంపై ఆసక్తి పెరుగుతుంది.

గ్రంథాయలయాలకు వెళ్లి చదువుకునే అలవాటును ముమ్మరం చేయడానికి, స్వచ్ఛంద సంస్థలు మరింత ఎక్కువ గ్రంథాలయాలు నెలకొల్పడానికి ప్రోత్సహించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిధులు నియామకాల ఆధునికీకరణతో పాటు అధికార బాషా సంఘం, సాహిత్య అకాడమి వంటి సంస్థలు భాసా, చరిత్ర, సంస్కృతి పరిరక్షణలో మనస్ఫూర్తిగా కృషి చేసేలా ప్రజల ఒత్తిడి తీవ్రతరం చేయాలి. యువత, పత్రిక యాజమాన్యాలు, కవులు, అన్ని వర్గాల సహకారంతో గ్రంథాయల, సాహిత్య రంగంలో మరో ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా మాత్రమే భాషా వికాసాన్ని, సంస్కృతిక ఔన్నత్యాన్ని సాధించగలం. అది నేటి చారిత్రక అవసరం.

(రచయిత తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ సభ్యులు)

వీ

సామ్రాజ్యవాదుల ముందు సాగిలపడడం, భారత దళారీ బడా బూర్జువా వర్గం ప్రయోజనాలకు అనుకూలంగా ఉంది. ఈ సెక్షన్ మద్దతుతోనే 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఈ సెక్షన్ మద్దతుతోనే అధికారంలో కొనసాగుతుంది. అధికారం చేజిక్కిన వెంటనే దేశ వనరులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారు.

ఫాసిజం అంటే ఏమిటి ?

పెట్టుబడిదారీ విధానం తన అత్యున్నత దశలో ఒక సాధారణ సంక్షోభ సమయంలోకి ప్రవేశించిన కాలంలో బోల్షివిక్ విప్లవ విజయం తరువాత ప్రపంచ ప్రజల ముందు సోషలిజం ఒక నిజమైన ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించిన సమయంలో ఫాసిజం తలెత్తింది. ఫాసిజం అంటే బూర్జువా ప్రత్యక్ష నియంతృత్వం. ఫాసిజం అంటే "ద్రవ్య పెట్టుబడి అత్యంత ప్రతిక్రియవాదులైన, అత్యంత దురహంకారులైన, సామ్రాజ్యవాద తాబేదార్ల బహిరంగ భయోత్పాత నియంతృత్వమని" కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యవర్గ సమితి 13వ ప్లీనరీ నిర్వచించింది. సంక్షిప్తంగా చెప్పాలంటే, భయోత్పాతం, చట్టాతీత సాయుధ ముఠాలు, పార్లమెంటరీ విధాన వ్యతిరేకత, గుడ్డి జాతీయతా దేశభక్తితో రెచ్చగొట్టే భావజాలం ఫాసిజపు ప్రత్యేక లక్షణాలు అనవచ్చు. పెట్టుబడిదారీ విధానపు తీవ్రతరమవుతున్న సంక్షోభానికి పాలకవర్గాల స్పందనే ఫాసిజం. తన అభిప్రాయాలతో ఏకీభవించని వారిని భౌతికంగా అంతమొందించాలనుకోవడం ఫాసిస్టు మూల సిద్ధాంతం. ఫాసిస్టు నియంతృత్వం భయోత్పాత పాలనతోనూ, నియంతృత్వ రాజ్యంతోనూ, కార్మికవర్గపు వర్గ సంఘాలను, ఇతర అన్ని పార్టీలను, ప్రజాసంఘాలను హింసాపూరితంగా అణచివేస్తుంది.

పెట్టుబడిదారీ దేశాల్లో 1930లో ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభ కాలంలో మహా ఆర్థిక మాంద్యం, రెండు అంతర్ – సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధాల విరామ కాల సమయంలో ఉద్భవించిన ఫాసిజానికి ఉండిన అనేక లక్షణాలను బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం కలిగి ఉంది. ఇటాలియన్ ఫాసిజం, జర్మనీ నాజీజం ల లాగా బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం కూడా సామ్రాజ్యవాదం– కార్మికవర్గ విప్లవ యుగపు ఒక లక్షణంగా ఉంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామిక ముసుగులోనో లేదా ముసుగు లేకుండా కూడా మితవాద లేదా ఫాసిస్టు పార్టీలు, సంస్థలు, సాయుధ బలగాలు, ముఠాలతో పాటుగా ఉద్భవిస్తోంది. సామ్రాజ్యవాద పాలకవర్గాల మనుగడే ప్రమాదంలో పడినప్పుడు ఆనాటి ఇటలీ, జర్మనీ, జపాన్ తదితర ఫాసిస్టు పాలనలు వచ్చాయి. ఇవాళ మనదేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు తెచ్చిన తన తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభం నుండి బయటపడడానికి, ప్రతిఘటిస్తున్న శ్రామిక వర్గంపై, రైతాంగంపై, మైనారిటీలపై, మహిళలపై, దళితులపై, ఆదివాసులపై చేస్తున్న దాడిగా బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు పాలనను చూడవలసి ఉంది.

హిందుత్వ ఫాసిజం హిట్లర్ జర్మనీకి చెందిన నాజీయిజమూ కాదు, ఇటలీకి చెందిన ముస్సోలినీ ఫాసిజమూ కాదు. జర్మనీ, ఇటలీలలో ఫాసిస్టులు తమ దేశాల జాతీయ బూర్జువాల ఆదేశాల కనుగుణంగా వ్యవహరించారు, జాతీయ పెట్టుబడికి అండగా నిలిచారు. విదేశీ ప్రాబల్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. భారత్‌లో ఆర్ఎస్ఎస్ భారతీయ దళారీ బడా బూర్జువాల తరపున పని చేస్తున్నప్పటికీ సామ్రాజ్యవాదంతో సాన్నిహిత్యంగా ఉంటుంది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి భౌతిక పునాది మన దేశంలోని సామాజిక పరిస్థితులలో, వెనుకబడిన అర్ధభూస్వామ్య, అర్ధవలస ఉత్పత్తి సంబంధాలలో ఉన్నది. ఈ ఉత్పత్తి సంబంధాలు ప్రధానంగా భూస్వామ్య ప్రయోజనాలను, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలను కాపాడుతాయి. అందుకే హింసను ప్రయోగించి పాత వ్యవస్థను కొనసాగించడానికి చేసే ప్రతీఘాతుక శక్తి.

బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు భావజాలం

మన దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ 1925లో ఆవిర్భవించింది. కె బి హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు. ఇది ఇటలీ, జర్మనీలలో అధికారంలోకి వచ్చిన శక్తుల భావజాలాన్ని, నియంతృత్వ ధోరణులని, జాత్యహంకారాన్ని పుణికి పుచ్చుకుంది. మనువాదం ఆధారంగా హిందుత్వ సామాజిక-ఆర్థిక వ్యవస్థని కొనసాగించడం లక్ష్యంగా ప్రకటించుకుంది. గత వైభవాన్ని పునరుజ్జీవింప చేయాలనే లక్ష్యంతో ఆర్య జాతి సిద్ధాంతాన్ని ముందు పెడుతూ పూర్తి మితవాద తిరోగమన సామాజిక-రాజకీయ ఎజెండాను తలకెత్తుకుంది. ఈ వ్యవస్థలో శూద్రులకు, అతి శూద్రులకు మౌలిక హక్కులేమీ ఉండవు. స్త్రీలకు పురుషులతో సమాన హక్కులుండవు. అలాంటి దుర్మార్గమైన సమాజ నిర్మాణాన్నే 'జాతి నిర్మాణం' అని 'దేశభక్తియుత కర్తవ్యం' అని గొప్పగా చెప్పుకుంటూ ఉంటుంది.

హిందూ ఫాసిస్టు సంస్థల సంస్థాగత నిర్మాణాలలో కూడా ఈ హిందూ ఫాసిస్టు ఆధిపత్య భావజాలం ప్రతిఫలించింది. 1920 తొలి రోజుల్లో స్థాపించబడిన ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ లాంటివి విపరీతమైన ఆధిపత్య ధోరణిని కలిగి ఉన్నాయి. నాయకులతో ఎలాంటి విభేదానికీ అనుమతినివ్వవు. ఆర్ఎస్ఎస్‌లో సర్ సంఘ్‌చాలక్ మాట అంతిమం, ప్రశ్నించకుండా ఒప్పుకోవలసిందే. ఆర్ఎస్ఎస్ నిర్మాణ రూపంలోనే ఈ ఫాసిస్టు లక్షణాలున్నాయి. సంస్థాగతంగా ఏనాడు ఎన్నికలు జరుపుకోని ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్. సంస్థకు సుప్రీమ్ బాస్‌గా వ్యవహరించే 'సర్ సంఘ్‌చాలక్'ను కూడా పదవి నుండి దిగిపోయే వ్యక్తి నామినేట్ చేసేస్తుంటాడు. ఇప్పటిదాకా సర్ సంఘ్‌చాలక్‌లుగా పనిచేసినవారంతా బ్రాహ్మణులే. అందువల్ల హిందుత్వ ఫాసిజం సహజంగానే పెట్టుబడిదారీ దేశాల్లోని ఫాసిజంతో పోలిస్తే బలహీనంగానూ, అస్థిరంగానూ ఉంటుంది. ఎందువల్లనంటే హిందూ మతానికి సహజ సంస్కృతి లక్షణాలు లేవు. హిందూ సంస్కృతికి ఉమ్మడి లక్షణాలు లేవు. అందులో కులాలు, వృత్తులు, శ్రమల సంస్కృతులు భిన్నంగా ఉన్నాయి. అవన్నీ కలగలసిన ఉమ్మడి సంస్కృతి ఎక్కడా, ఏనాడు లేదు.

హిందుత్వ సిద్ధాంతకర్త ఎం.ఎస్ గోల్వాల్కర్ 1939లో రాసిన 'మనం-మన జాతీయత నిర్వచనం' అనే పుస్తకంలో హిందూ రాష్ట్ర భావనకు రూపకల్పన చేశారు. "హిందుస్తాన్‌లో ఉండే హిందూయేతర ప్రజలు హిందూ మతాన్ని గౌరవించి, పూజనీయంగా భావించడం నేర్చుకోవాలి. హిందూ జాతిని, సంస్కృతిని కీర్తించే ఆలోచనలు తప్ప మరే భావాలను కలిగి ఉండరాదు. విదేశీయులు హిందూ జాతికి సంపూర్ణంగా అణిగిమణిగి ఉంటే ఈ దేశంలో ఉండవచ్చు. ఎలాంటి ప్రత్యేక అవకాశాలని గాని, ఎలాంటి హక్కులు గాని కోరరాదు. అందుకు వారు అర్హులు కారు. చివరకు పౌరసత్వ హక్కులు కూడా కోరరాదు"

అని స్పష్టంగానే రాశారు. మరో మితవాద రాజకీయ వేత్త వి.డి. సావర్కర్ 'హిందూ మహాసభ వ్యవస్థాపకులు' హిందుత్వను ఒక రాజకీయ నినాదంగా మార్చాడు. సావర్కర్ దృష్టిలో ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, చివరికి కమ్యూనిస్టులు కూడా విదేశీయులే.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురు గోల్వాల్కర్ ప్రవచించిన, కాలానుగుణ్యతలేని "హిందూ రాష్ట్ర" (హిందూ దేశం) భావనను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అధిపతి మోహన్ భగవత్ మళ్లీ బయటకు తీశారు."హిందూస్థాన్"లో నివసించే భారతీయులందరి సాంస్కృతిక గుర్తింపు హిందుత్వ అని, దేశంలో ప్రస్తుతం నివసిస్తున్న వారంతా ఆ మహత్తర సంస్కృతికి వారసులేనని కటక్‌లో 2014 ఆగస్టు 12న ఒక సభలో మాట్లాడుతూ సెలవిచ్చారు. "భారత రాజ్యాంగంలో ఎక్కడా 'హిందూస్థాన్' ప్రస్తావనలేదు. ఇండియా లేక భారత్ అని మాత్రమే ఉందని" ఆయన ఆక్రోశం వెలిబుచ్చారు. అంటే, భారత్‌ను మత రాజ్యంగా మార్చాలన్నది ఆయన ఉద్దేశం. భారతదేశంలోని మైనారిటీలు హిందువుల సౌజన్యంపై ఆధారపడి ఉంటుందని ఆర్ఎస్ఎస్ అంటున్నది.

భారతదేశం భిన్న సంస్కృతులకూ, భిన్న మతాలకూ, భిన్న జాతులకూ నిలయంగా ఉంది. పరమత సహనం, సహజీవనం మన సంస్కృతిలో భాగం. అందువల్లనే బహుళజాతులు, మతాలు, భాషలు, సంస్కృతులకు నిలయమైన భారతదేశ ఐక్యత, సమగ్రతల పరిరక్షణను గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు "భారత్‌ను రాష్ట్రాల కలయికతో కూడిన యూనియన్'గా నిర్దేశించారు. అయితే, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ విరుద్ధంగా భారతదేశం హిందువులదని, అన్యమతస్థులను రెండవ తరగతి పౌరులుగా పరిగణించాలంటుంది. నిజానికి హిందూస్థాన్‌లోని హిందూ పదం హిందూ మతానికి ప్రస్తావన కాదని, సింధు నాగరికత నుంచి సింధు పదం కాలక్రమంలో హిందూగా మారిందని చరిత్రకారులు చెబుతున్నారు. హిందూస్థాన్, హిందీ మాట్లాడే రాష్ట్రాల ఆధిక్య భావజాలంగా ఉంది. ఆర్ఎస్ఎస్ హిందుత్వవాదం మూలాలు అందులోనే ఉన్నాయి. భారత రాజ్యాంగం మతాన్ని రాజ్యం నుండి వేరు చేస్తూ, అదే సమయంలో నచ్చిన మతాన్ని అవలంబించేందుకు, ప్రచారం చేసుకునేందుకు స్వేచ్ఛ కల్పించింది. ఆర్ఎస్ఎస్ దీన్ని వ్యతిరేకిస్తుంది. రాజ్యాంగం నిర్దేశించిన 'లౌకికత'ను అది అంగీకరించడం లేదు. హిందూ మత ఆధిపత్యాన్ని నెలకొల్పాలన్న ఆలోచనా ధార నుండి ఉద్భవించినవే "హిందూస్థాన్", "హిందూ రాష్ట్ర" భావనలు.

కుల వ్యవస్థ కారణంగా భారత సమాజంలోని బలహీన వర్గాలు శతాబ్దాలుగా మానవ హోదాకు సైతం నోచుకోలేకపోయారు. సామాజిక వివక్ష ఇప్పటికీ కొనసాగుతుంది. ఫలితంగా ప్రజానీకంలో నెలకొన్న అమాయకత్వం, వెనుకబాటుతనం, అజ్ఞానాలతో పాటు దేశంలో ఉన్న అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య వ్యవస్థలో ప్రజల సంస్కృతి, సామాజిక విలువల్లో వేళ్లూనికొని ఉన్న అభివృద్ధి నిరోధక అంశాల్ని ఆర్ఎస్ఎస్ పూర్తిగా తమకనుకూలంగా మలచుకుంటుంది. ప్రజాభిప్రాయాన్ని తమకనుకూలంగా వాడుకోవడానికి, ప్రజలను మాయపుచ్చడానికి, దారి తప్పించడానికి, విభజించడానికి నిరంతరం అబద్ధాలు, వంచన, కపటము, సాకులను వాడుతుంటారు. తాము చెప్పేదానికి పూర్తిగా విరుద్ధంగా చేస్తారు, లేదా చేసినదానికి పూర్తిగా విరుద్ధంగా చెప్తారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక జ్ఞానాన్ని ప్రజలను బానిసలుగా తయారుచేయడానికి ఉపయోగించి తమ అభివృద్ధి నిరోధక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక లక్ష్యాలను సాధిస్తారు.

హిందుత్వ శక్తుల ప్రతీఘాత భావజాలం, ఆధిపత్య సంస్థల నిర్మాణం, బడా భూస్వాముల, దళారీ బడా బూర్జువాజీల ఆర్థిక రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడే పరికరం కాబట్టి ప్రారంభం నుండే అది వారి మద్దతుని, సంరక్షణను పొందింది. వలసవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, దేశభక్త శక్తులన్నీ స్వాతంత్ర్య పోరాటంలో నిమగ్నమై ఉన్నప్పుడు, 'జాతీయ పునరుత్పాదన' కోసం పోరాడాలని ప్రజలకు పిలుపు నిచ్చిన వీరు బ్రిటిష్ వలస పాలకులకు కూడా లోబడి ఉన్నారు. ('బ్రిటిష్ సామ్రాజ్య ఖ్యాతి గొప్పది' అని రాసి వి.డి. సావర్కర్ వలసవాదాన్ని కీర్తించాడు-'హిందూత్వ'), జాతీయ స్వాతంత్ర్యం పట్ల తనకున్న ఏహ్యభావాన్ని ఎంఎస్ గోల్వాల్కర్ వెలిబుచ్చాడు. 1940లో ఆర్య ధర్మసేవక్ సంఘ్ (హిందు మహాసభ స్థాపించిన సంస్థ) ఉదారవిద్యకు ప్రత్యామ్నాయంగా జాతీయ స్థాయిలో సరస్వతి శిశు మందిరాలను, ఉన్నత విద్యా సంస్థలను స్థాపించి బ్రాహ్మణీయ హిందుత్వ విద్యకు శ్రీకారం చుట్టింది. పరివార్ నడిపే విద్యాసంస్థలు 40 వేల పైనే ఉన్నాయి. వారి దళారీ లక్షణానికి తగినట్లుగా హిందూ ఫాసిస్టు సావర్కర్ లాంటి కుమ్మక్కు దారులను, ద్రోహులను వీరులుగా కీర్తిస్తూ, టిప్పుసుల్తాన్ లాంటి నిజాయితీ కలిగిన జాతీయవాదులను, దేశభక్తులను నిందిస్తున్నారు.

పెచ్చరిల్లుతున్న ఆర్ఎస్ఎస్ మూకల వికృత చేష్టలు

ఆర్ఎస్ఎస్ ప్రకటిత హిందూ రాష్ట్ర లక్ష్యసాధనకు కార్మిక, విద్యార్థి, మహిళ, సాంస్కృతిక, రాజకీయ విభాగాలను ఏర్పాటు చేసింది. 1951లో రాజకీయ విభాగంగా భారతీయ జనసంఘ్ ఏర్పడింది. తర్వాత 1980లలో బిజెపిగా పేరు మార్చుకుంది. కేంద్రంలో 1997లో మొదటి బిజెపి ప్రభుత్వం ఏర్పడేనాటికి రాజకీయాల ముసుగులో పనిచేసిన హిందూ ఫాసిజం దేశంలోని విశాల ప్రాంతాల్లో వేళ్లూనుకుంది. కానీ, వారు పార్లమెంటేతర, హింసాత్మక టెర్రరిస్టు పద్ధతులను ఉపయోగించారు. రామజన్మ భూమి ఆందోళన, అద్వానీ రథయాత్ర, 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత హిందూ మతోన్మాద రాజకీయ ప్రేరేపితమైనవే. ఆ తరువాత దేశంలోని అనేక ప్రాంతాలలో జరిగిన ముస్లింల రక్తపాతం, గుజరాత్‌లో 2002లో గోద్రా మారణకాండ దానికి పరాకాష్ట. వీటికి తోడు చిన్నా, పెద్దా ఘోర దుశ్చర్యలు వందల సంఖ్యలో జరిగాయి. 1990వ దశకం ఆరంభం నుంచి హిందూ మతతత్వం ఫాసిస్టు దశలోకి ప్రవేశించింది.

దురాక్రమణ పూరితమైన సామాజిక-రాజకీయ కార్యాచరణపై ఆధారపడిన ప్రణాళికబద్ధమైన ఎజెండా ఆర్ఎస్ఎస్‌కు ఉంది. సామాజిక బృందాల మధ్య విరోధాలను, ఘర్షణలను పెంచడం వల్ల మతతత్వం ప్రబలింది. కాగా మోడీ అధికారానికి రావడంతో ఇప్పుడది విస్తృతమైంది. ఫాసిజం వలనే ఇది కూడా ఒక రాజకీయ పథకం, పునరుత్థానం, జాత్యాధిక్యత ప్రాతిపదికపై జాతి నిర్మాణం గావిస్తానని అది హామీ ఇస్తుంది. ఇది మధ్యతరగతి ప్రజలను ఉత్తేజపరిచి సంతృప్తినిస్తుంది. మధ్యతరగతిలో సాంస్కృతిక సంక్షోభాన్ని, పేద ప్రజల్లో ఆర్థిక అణచివేతను ప్రగాఢం చేసిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రభావం

ఈ ఆహేతుక భావాజాల వ్యాప్తికి తొద్పడింది. ఫాసిజం ప్రభావాన్ని బాబ్రీ మసీద్ కూల్చివేతలో సూచన ప్రాయంగా కనిపించింది. ఫాసిజం ప్రభావం గుజరాత్ మారణకాండతో విస్తృతి చెందింది. 1992–2002 దశాబ్ద కాలం హిందూ మతోన్మాదానికి సాక్షీ భూతంగా నిలిచింది.

ఆర్ఎస్ఎస్ మాటల్లో స్వదేశీ, విధానాల్లో విదేశీ. వీరికి మతావేశం, పెట్టుబడికి సేవలు, హింసారాధన, భిన్నాభిప్రాయం పట్ల అసహనం, ప్రజాస్వామ్యాన్ని తిరస్కరించడం, రాజ్యాంగ వ్యవస్థలను తిరస్కరించడం. మత విద్వేషాలను రెచ్చగొట్టి హింసా దౌర్జన్యాలతో మైనారిటీ మతస్తులను భయభీతావహంలో ముంచడం, మెజారిటీ మతానికి తామే సరైన నాయకుడినని ప్రకటించుకోవడం లాంటివి చూస్తున్నాం. ఒకవైపు దేశభక్తి, జాతీయత అని నినాదాలు ఇవ్వడం, మరోవైపు దేశ వనరులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు హక్కు భుక్తం చేసే దళారీతనానికి పాల్పడుతున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడి అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా సంఘటిత పడకుండా కుల, మతాల పేరు మీద ప్రజలను చీల్చడం సంఘపరివార్ విధానంగా కొనసాగుతున్నది. తాను ప్రకటించే దేశభక్తి, జాతీయతలో దేశ ప్రజలు, సంఘీభావం, స్వావలంబన, స్వేచ్ఛ మచ్చుకైనా కానరావు. సంఘ పరివార్ సిద్ధాంత రీత్యానే ప్రజలంతా ఒకటికాదు, సమానులు అంతకంటే కాదు. అధికారం, సంపద అత్యల్ప వర్గాల, వర్ణాల చేతుల్లో గుత్తాధిపత్యంగా ఉంచడమే దాని పురుష సూక్తం, మనుధర్మం.

సంఘ్ పరివార్ తమ రాజకీయ లక్ష్యం అయిన హిందూ రాష్ట్రం సాధనకు ఆదివాసులను హిందువులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. 'స్వగృహానికి' (ఘర్ వాపసీ) కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మత మార్పిడులను ప్రోత్సహించడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అంతేగాక గిరిజనులుండే కొండ ప్రాంతాలన్నీ ఖనిజాలతో నిండి ఉన్న ప్రాంతాలు కార్పొరేట్‌లకు ప్రత్యేకంగా కావలసిన ప్రాంతాలు. ప్రభుత్వ విధానాలకు నిత్యం అనుగుణంగా ఉండే సంఘ్ పరివార్ ఈ ప్రాంతాలలోని వనరులను, భూమిని గిరిజనుల అధీనం నుండి తీసుకునేందుకు ఆదివాసులలో పనిచేయడం ప్రారంభించింది. గిరిజనులను హిందు సంస్కృతిలో మమేకం చేయడానికి 1970లో 'వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్' వంటి వేదికలు ఆవిర్భవించి వేగం పుంజుకున్నాయి. నేటికీ మన దేశంలో 8955 వనవాసి కళ్యాణ్ ఆశ్రమాలు వెలిశాయి. ఇవి 312 జిల్లాల్లో ఉన్నాయి. వీటిలో 1200లకు పైగా పూర్తికాలపు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పనిచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ ఆదివాసులకు 20 వేల పైగా ఏకలవ్య పేరుతో పాఠశాలలు నిర్వహిస్తుంది.

హిందుత్వం, వైదిక సంస్కృతి పేరిట దేశంలో సాగుతున్న దాడులు, హత్యలపై నిరసన వెల్లువెత్తుతోంది. 'నలుపు–తెలుపు' అంటూ దేశంలో వర్ణ వివక్షను తెరపైకి తీసుకురావడం, విమానంలో సిబ్బందిని చెప్పుతో కొట్టి దాన్నే ఘనకార్యంగా వర్ణించడం, ముఖ్యమంత్రుల తలలకు వెల కట్టడం, గోవును చంపితే ఉరితీస్తామని ఉత్తర్వులు జారీ చేయడం వంటి వికృత చర్యలకు దిగుతున్నారు. గత మూడేళ్లుగా దేశంలో జరుగుతున్న విద్వేషపూరిత, మతోన్మాద ప్రేరేపిత హింసాకాండ భావజాల రంగంలో ఊపందుకొంది. ఈ ఆర్ఎస్ఎస్ విభాగాలైన విశ్వహిందూ పరిషత్, ఎబివిపి, హెచ్ఎంఎస్, భజరంగ్‌దళ్, దుర్గా వాహిణి వంటి సంస్థలు మనదేశ సాంస్కృతిక సాంఘిక జీవితాన్ని శాసించే పనిని ముమ్మరం చేశాయి. తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వీలుగా కీలకమైన సాంస్కృతిక, మేధో సంస్థలను కరుడుగట్టిన కాషాయ దళంతో నింపుతున్నారు. తమ భావజాలానికి, సిద్ధాంతాలకు, కార్యాచరణకు కట్టుబడిన పూర్తికాలపు కార్యకర్త, ఒక ప్రచారక్ దేశ ప్రధాని కావడంతో వారికి సంపూర్ణ స్వేచ్ఛ లభించినట్లయింది.

మతతత్త్వ మితవాద బిజెపి అధికారంలోకొస్తే ఫాసిస్టు ధోరణిని పాదుకొల్పుతుందని మొదటి నుంచీ ప్రజాస్వామిక, లౌకిక, అభ్యుదయవాదులు ఆందోళన చెందుతున్నారు. అనుకున్నట్లుగానే కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్‌డిఎ అధికార పీఠం ఎక్కాక ఈ పోకడలు పెచ్చుమీరుతున్నాయి. ప్లాస్టిక్ సర్జరీలు, టెస్ట్‌ట్యూబ్ బేబీలు, విమానాలు, సర్వం వేదాల్లో ఉన్నాయని చెబుతూ ప్రధాని అంతటి వ్యక్తి శాస్త్రీయ ఆలోచనలకు గండి కొడుతున్నారు. పేదల ఆహారమైన బీఫ్‌పై కాషాయ మూక నానాయాగీ చేస్తోంది. జెఎన్‌యు, హెచ్‌సియు, ఢిల్లీ సహా అన్ని యూనివర్సిటీల్లో పాగా వేసేందుకు మతతత్త్వ శక్తులు నిరంతరం ప్రయత్నిస్తున్నాయి. చరిత్ర వక్రీకరణ మొదలుకొని విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్యం, సంస్కృతం, వేదాలను చొప్పించడం వరకు ఏ అవకాశాన్నీ మతోన్మాదులు వదలట్లేదు. రాజ్యాంగాన్నీ మార్చాలంటున్నారు. మానవ వనరుల శాఖ ఆర్ఎస్ఎస్ శాఖగా మారిపోయింది.

మోడీ మాటల్లో జాతీయం చేతల్లో విదేశీయం

సార్వత్రిక ఎన్నికల సందర్భంలో నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తానని, నిరుద్యోగాన్ని పారదోలుతానని, ధరలను తగ్గిస్తానని, స్వచ్ఛమైన పాలన అందిస్తానని, అభివృద్ధిని రెండంకెల దిశగా పరిగెత్తిస్తానని హామీలు ఇచ్చారు. అధికారం దక్కగానే తన సహజ లక్షణమైన హిందుత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా భిన్నాభిప్రాయాలను అణిచివేసే దిశగా పాలన సాగిస్తున్నాడు. ఇక ఆర్థిక విధానాలతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కార్పొరేట్ అనుకూల విధానాలను యుపిఏ కంటే మరింత దూకుడుగా అమలు చేస్తున్నాడు. బ్యాంకింగ్, భీమా, రక్షణ, చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాడు. ద్రవ్య పెట్టుబడులకు రెడ్‌కార్పెట్ పరుస్తూ కార్మిక హక్కులను కాలరాస్తూ దేశీయ సహజ వనరులను లూటీ చేయడానికి అనుమతిస్తున్నాడు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. ద్రవ్యోల్బణం రెండంకెలకు చేరింది. ఉపాధి అవకాశాలు మెరుగవ్వలేదు. వ్యవసాయానికి ఆసరా దొరకలేదు. రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. ఆయన తేదలుచుకున్న భూసేకరణ చట్టం దేశవ్యాప్త ఆందోళనకు కారణమయ్యింది.

బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఏ కూటమి ఢిల్లీలో కొలువుదీరి మూడున్నర సంవత్సరాలు పూర్తయ్యింది. అధికారంలోకి ఎలాగైనా రావాలనే యోచనతో ఎన్నికల ముందు గుప్పించిన హామీలను మోడీ సర్కారు పూర్తిగా విస్మరించింది. సంఘటిత, అసంఘటిత రంగాల్లో సాధించిన పురోగతి అంత గొప్పగా ఏమీ లేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మోడీ సర్కారు అనుసరిస్తున్న ధోరణులు అశాంతి అలముకునేలా చేశాయి. అనిశ్చితి రోజు రోజుకూ పెరిగిపోతోంది. రోగమొకటైతే వేసిన మందు ఒకటి అన్న చందంగా మోడీ విధానాల

అమలు జరుగుతోంది. రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక హక్కులను క్రమంగా నీరుగారుస్తూ అధికార కేంద్రీకరణకు పూనుకుంటూ, దేశ ఫెడరల్ స్వభావానికి విఘాతం కల్గిస్తున్నాడు. మోడీ పాలనలో బ్యాంకుల పారు బకాయిలు 2.3 లక్షల కోట్ల నుండి 6.8 లక్షల కోట్లకు పెరిగాయి. 3.5 లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ రుణాలు రీ-షెడ్యూల్ చేశారు. అదే సమయంలో వివిధ రూపాల్లో హిందుత్వ అజెండా అమలును వేగిరం చేసే పనిలో ఆర్ఎస్ఎస్ యంత్రాంగం నిమగ్నమైంది.

ఒకవైపు దేశభక్తి, జాతీయత అని నినాదాలు ఇవ్వడం, మరొకవైపు దేశ వనరులను సామ్రాజ్యవాదుల హక్కు భుక్తం చేసే దళారీ విధానాలకు పాల్పడడం, దేశ ఆర్థిక వ్యవస్థ మాంద్యం, సంక్షోభాల్లోకి కూరుకుపోయేకొద్దీ మోడీ నాయకత్వంలోని హిందుత్వ ఫాసిస్టులు సామ్రాజ్యవాదులను తృప్తిపరిచేందుకు ఎన్నో ప్రజావ్యతిరేక చర్యలు చేపడుతున్నారు. కార్పొరేట్లకు అనుకూలమైన కొత్త చట్టాలు చేయడం, ఉన్న చట్టాలను మార్పు చేయడం, సంపద పన్ను రద్దు, కార్పొరేట్లకు పన్ను రాయితీలు, పన్నులకు విరామం ఇవ్వడం (టాక్స్ హాలీడేస్), రుణ మాఫీలు, అప్పుల పునర్వ్యవస్థీకరణ, పబ్లిక్‌రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం, ప్రభుత్వ ఆస్తులను కారుచవకగా కట్టబెట్టేయడం వంటి ఎన్నో చట్టబద్ధమైన, చట్ట బాహ్యమైన పద్ధతుల ద్వారా బడా పెట్టుబడిదారులకు, బడా భూస్వాములకు పెద్ద ఎత్తున ఆర్థిక లాభాలు సమకూరుస్తున్నారు. అందువల్లనే స్వేచ్ఛా మార్కెట్‌ను, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని కీర్తించే వందిమాగధులంతా మోడీ ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. మరోవైపు ప్రజలు దారిద్ర్యంలో మగ్గినా, ఆకలి, అనారోగ్యంతో మరణిస్తున్నా, నిరుద్యోగంతో కృషిస్తున్నా, హక్కుల హననం జరుగుతున్నా, అణిచివేతకు గురవుతున్నా దేశమంటే భక్తి ఉండాలని, ప్రశ్నించడానికి వీలు లేదని దేశభక్తిని, జాతీయతను ఆర్ఎస్ఎస్ మూకలు నిరంకుశంగా ప్రజలపై రుద్దుతున్నారు.

మోడీ ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని ఎత్తివేసింది. దీని స్థానంలో నీతి ఆయోగ్‌ను నియమించింది. ఏయే ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మాలో, వేటి వాటాలు వదిలించుకోవాలో గుర్తించి జాబితాను తయారు చేయాల్సిన బాధ్యతను నీతి ఆయోగ్‌కి అప్పజెప్పడం జరిగింది. నీతి ఆయోగ్ ఇప్పటికే ఆ పని పూర్తిచేసింది. 74 ప్రభుత్వ రంగ సంస్థలను, అందులో 26 మూసేయాల్సినవి, 10 కీలక పెట్టుబడుల ఉపసంహరణ చేయాల్సినవి ఉన్నాయని గుర్తించింది. మన ఆర్థిక వ్యవస్థ కీలక ప్రభుత్వ రంగ సంస్థలయిన పది పరిశ్రమలు ఓఎన్‌జిసి, గైల్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, కోల్ ఇండియా లిమిటెడ్, బిహెచ్ఇఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మొదలైన సంస్థలను అమ్మకంలో సలహాలను ఇచ్చేందుకు, త్వరగా అమ్మిపెట్టేందుకు రిలయన్స్ మ్యూచ్యువల్ ఫండ్ మేనేజర్స్‌కి అనుమతి ఇచ్చింది. ఈ అమ్మకం ఎక్స్ఛేంజ్ ఫండ్ ద్వారా జరగనుంది.

సామాజిక రంగాన్ని పరిశీలిస్తే భావ ప్రకటన స్వేచ్ఛను, జీవించే హక్కును బిజెపి సర్కారు హరించి వేస్తోంది. ముస్లింలు, దళితులు లక్ష్యంగా దాడులు పెరిగిపోయాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలం కదిలించే పాత్రికేయులను, వివిధ రూపాల్లో జన చైతన్యానికి పాటు పడే కళాకారుల మీద దేశ ద్రోహ ముద్ర వేసేందుకూ మోడీ సర్కారు వెనుకాడడం లేదు. ఆర్థిక రంగానికి వస్తే 2016 నవంబర్ 8 అర్ధరాత్రి ఆకస్మికంగా ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు, రద్దు లక్ష్యాలుగా ప్రకటించిన అవినీతి కట్టడి, నల్లధనం నిర్మూలన, ఉగ్రవాద నియంత్రణ తదితరాల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదు. కాని, నోట్ల రద్దు కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ నవనాడులూ కుంగిపోయాయి. సంఘటిత రంగంలోని ప్రధాన మౌలిక రంగాలు మొదలు కొని అసంఘటిత రంగాలన్నిటినీ ఏకకాలంలో సంక్షుభితం చేసిన చర్యగా పెద్ద నోట్ల రద్దు చరిత్రలో నిలిచిపోతుంది. పర్యావసానంగా ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, పేదరికం, ప్రజల మధ్య అంతరాలు తీవ్రమవుతున్నాయి. మరోవైపు జాతి దురాభిమానం, జాత్యహంకారం, ఛాందసవాదం, పరమత విద్వేషం పెచ్చరిల్లుతున్నాయి.

నోట్ల రద్దు దెబ్బ నుంచి తేరుకోక మునుపే 2017 జూలై 1న అమల్లోకి తెచ్చిన పరోక్ష పన్ను వ్యవస్థ - వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) జౌళి, వస్త్ర, తయారీ, ఎగుమతి-దిగుమతి, పారిశ్రామిక రంగాలతో పాటుగా వ్యవసాయ రంగాన్నీ అస్తవ్యస్థం చేసిందని చెప్పవచ్చు. అన్ని స్థాయిల్లోని ప్రజలూ జిఎస్‌టి భారమని ఆందోళన చేపట్టడం గమనార్హం. పన్ను ఎగవేతల నిరోధానికంటూ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ చర్యను పూర్తిగా సమర్థించుకున్నారు. పన్నుల రాబడి పెరిగిందని గొప్పలు చెప్పాడు. గుజరాత్‌లో వస్త్ర వ్యాపారులు సుమారు 75 వేల మంది సంఘటితమై మోడీ సర్కారుకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో, నిరసనలు, ఆందోళనలు జరిపారు. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల ఎన్నికలు ప్రకటించడంతో, ఎన్నికల ప్రయోజనం కోసం వివిధ రకాల వస్తువులను తక్కువ పన్ను శ్లాబుల్లోకి తేవడమో లేదా నామమాత్రపు పన్ను విధించడమో చేశారు.

ప్రజా సంక్షేమానికి సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలకు కోతలు విధిస్తున్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తెస్తున్నారు. రైతులకు సబ్సిడీలు, పరిహారాలు ఇవ్వడానికి సంబంధించిన చట్టాలను, వేతన కార్మికులకు పెన్షన్, పదవీ విరమణ తరువాత లభించే సదుపాయాలు, బీమా పథకాలు, సామాజిక భద్రత, అనారోగ్యం, విద్య వంటి విషయాలకు సంబంధించిన చట్టాలను సరిగా అమలు చేయడం లేదు. ప్రజలను అణచివేసేందుకు సంబంధించిన వలసకాలం నాటి చట్టాలను అట్లాగే కొనసాగించడంతోపాటు, సవరణల ద్వారా వాటిని మరింత క్రూరంగా మారుస్తున్నారు. కొన్ని కోట్ల మంది నిరుద్యోగులను ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అవసరాలనూ, భారత బడా పెట్టుబడిదారుల అవసరాలనూ తీర్చడానికి చవకగా లభించే అర్ధ నిపుణ శ్రామికులను తయారుచేయడం కోసం 'నైపుణ్య అభివృద్ధి' వంటి పథకాలను ప్రవేశపెట్టారు.

ఇవాళ మన రాజకీయార్థిక వ్యవస్థ సామ్రాజ్యవాద గుత్త పెట్టుబడితో బలంగా మిళితమై, దానిపై ఆధారపడి ఉంది. దానికి లోబడి కూడా ఉంది. కార్పొరేట్ దోపిడీ పీడక విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఏకం కాకుండా చూసేందుకు కుల, మతాల పేరుమీద చీలదీయడం సంఘ్ పరివార్ విధానం. సంఘ్ పరివార్ సిద్ధాంతరీత్యానే ఈ దేశ ప్రజలను ఎన్నడూ ఒకటిగా చూడలేదు. సమానంగా అంతకంటే చూడదు. బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలం అటు మతం రీత్యానూ, ఇటు కులం రీత్యానూ ఈ సమాజాన్ని నిలువుగా అడ్డంగా చీల్చింది. మనుధర్మం ఆధారంగా పురుషాధిక్యత, కులాధిక్యతను కాపాడుతుంది. మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య, లౌకిక విలువలకూ, రాజ్యాంగ హామీ

ఇచ్చిన పౌర హక్కులకూ, సమానత్వ భావనలకూ గొడ్డలిపెట్టుగా మారింది. హిందుత్వ రాజ్య లక్ష్యంతో దేశవ్యాప్తంగా ముస్లిం మైనారిటీలపై, దళితులపై, అటవీ ఖనిజ సంపదను కార్పొరేటు సంస్థలకు దోచిపెట్టడానికి ఆదివాసులపై, ప్రజాస్వామిక వాదులపై, ప్రజా సంఘాల నాయకులపై, దాడులకూ, హత్యాకాండకూ పాల్పడుతుంది.

దళితులు– ముస్లింలపై ఆర్ఎస్ఎస్ దాడులు

రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో 2017 ఏప్రిల్ 2న ఆవులను వాహనంలో తరలిస్తున్న పెహ్లూఖాన్ అనే వ్యక్తిని గోసంరక్షకులు నడిరోడ్డుపై దారుణంగా కొట్టి చంపిన ఘటన అత్యంత అమానుషమైనది. రాజస్థాన్ నుంచి దాని సరిహద్దు రాష్ట్రం హర్యానాకు వాటిని తీసుకుపోవడానికి ఇతడితో పాటు మరో పదిహేను మందికి జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ లైసెన్సులు ఇచ్చింది. అవి వధశాలలకు తరలుతున్నవి కావనీ, రైతులు కొనుక్కున్నవనీ వివరిస్తూ, జైపూర్ పశుమేళాలో ఆవులను కొనుగోలు చేసిన పత్రాలు, మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన అనుమతులు, టోల్‌గేట్ల రసీదులు ఇత్యాదివన్నీ ఖాన్ కుటుంబీకులు వారికి చూపించారు. కానీ, గోవధ నిషేధం అమలులో ఉన్న రాజస్థాన్‌లో గోసంరక్షకుల కళ్లకూ, చెవులకూ నిజంతో నిమిత్తం లేకుండా పోయింది. వారి దెబ్బలకు పెహ్లూఖాన్ మరణిస్తే, మిగతా వారు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల పాలైనారు. ఉత్తరప్రదేశ్‌లోని షాహరాన్‌పూర్ జిల్లా షబ్బీర్‌పూర్ గ్రామంలోని బాధితుల మాటల్లో "మేం ఎన్నికల వరకు హిందువులమే. ఆ తరువాత అంటరానివారం" అయ్యామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. షబ్బీర్‌పూర్‌లో దళితులు గనుక తమ గౌరవాన్ని నిలుపుకునే ప్రయత్నం చేశారో వారిపై దాడులు చేస్తామంటూ ఠాకూర్‌లు హెచ్చరికలు చేశారు.

షబ్బీర్‌పూర్‌లో ఏప్రిల్ 14న అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టుకుంటామంటే ఠాకూర్లు తిరస్కరించారు. దీనిని పరిపాలనా విభాగం అనుమతించలేదు. 2017 మే 5న షాహరాన్‌పూర్‌లోని ఠాకూర్‌లు మహారాణా ప్రతాప్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రదర్శనకు అనుమతి కోరగా పాలనా విభాగం అందుకు తిరస్కరించింది. వీరిలో కొందరు షబ్బీర్‌పూర్ దళిత బస్తీ గుండా పెద్దపెద్ద నినాదాలు చేస్తూ దళితులను రెచ్చగొడుతూ సభాస్థలిని చేరేందుకు ప్రదర్శనగా బయలుదేరారు. ఇందుకు దళితులు అభ్యంతరం చెప్పారు. అగ్ర కులస్థుల అహంభావాన్ని, గడసరితనాన్ని దళితులు వ్యతిరేకించారు. పోలీసులు జోక్యం చేసుకోగానే ఠాకూర్లు, ఇంకొంత మంది అగ్ర కులస్థులు దళితులపై దారుణంగా దాడి చేశారు. ఈ దాడిలో 65 ఇళ్లు, వ్యవసాయ పనిముట్లు, పశుగ్రాసం, మోటార్ సైకిళ్లు బూడిదయి పోయాయి. ఎంతోమంది జనాలను ముఖ్యంగా ముసలీ ముతకా, పిల్లలూ, మహిళలను చావబాదారు. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ హింసాత్మక దాడిలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు.

గుజరాత్‌లోని ఉనాలో ఏడాది క్రితం చనిపోయిన ఆవు చర్మం ఒలిచినందుకు నలుగురు దళిత యువకులను దారుణంగా కొట్టిన ఉదంతాన్ని గుర్తుకు తెచ్చే తాజా ఘటన మరొకటి ఆ రాష్ట్రంలోనే మరో గ్రామంలో జరిగింది. ఆనంద్ జిల్లాలోని సోజిత్ర తాలుకా కాసోర్ గ్రామంలో ఒక దళిత యువకుని, అతని తల్లిని అగ్రకులాలకు చెందిన 100 మంది బృందం 2017 ఆగస్టు 12న తీవ్రంగా కొట్టింది. శైలేష్ భాయ్ మణి బెన్ రోహిత్ అనే యువకుడిని, అతని తల్లి మణి బెన్ రోహిత్‌ను వారి ఇంట్లోనే దాడిచేసి కొట్టారు. ఉనా ఘటన తర్వాత దళితులు పశు కళేబరాల అంతిమ విధులు నిర్వర్తించ బోమని 'ఉనా దళిత అస్మిత యాత్ర'లో ప్రతినబూనారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ పని ఏదీ లేకపోవడంతో అదే వృత్తిలో కొందరు కొనసాగుతున్నారు. అయితే చుట్టుపక్కల కొన్ని గ్రామాల దళితులు ఆ పని మానివేసి ప్రత్యామ్నాయం వెదుక్కోగలిగారు. ఈ సంఘటనకు కొద్ది రోజుల క్రితమే బులాండ్ షహర్ జిల్లాలోని సోహి అనే గ్రామానికి చెందిన 54 ఏళ్ల గులామ్ అహమ్మద్‌ను ఒక హిందూ మహిళ ముస్లీం పురుషునితో పారిపోయిందన్న నెపం చూపుతూ హిందూ యువవాహిని కార్యకర్తలు కొట్టి చంపారు.

యోగీ ఆధిత్యనాథ్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పీఠం ఎక్కగానే ముస్లీంలు ఎక్కువగా ఆధారపడిన వధ్యశాలలను మూసివేశారు. మాంస విక్రయాలను నిషేధించారు. అందువలన దీనిపై ఆధారపడ్డ 25 లక్షల ప్రజలు తమ జీవనోపాధిని కోల్పోయారు. కోట్లాది ప్రజలు తమ జీవనాధారమయిన ఆహారాన్ని కోల్పోయారు. సహజంగానే ఈ విధానాలు కాషాయ మూకలకు కొత్త ఉత్సాహాన్నిచ్చి మరింత దూకుడుగా ముందుకెళ్లేందుకు ప్రోత్సహించింది. ఫలితంగా వారి విజృంభణతో పలు రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగింది. దాడి చేస్తున్న కాషాయ మూకలను కాక వారిని నిలవరిస్తున్న ప్రదర్శకులపై చాలా చోట్ల పోలీసులు దాడి చేయడం ఇక్కడ కొత్త కోణం. ఇంకా ముఖ్యమయిన విషయం ఏమిటంటే ఆగ్రా, షహరాన్‌పూర్‌లలో దారుణమైన సంఘటనల తరువాత బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల ఆగ్రహానికి గురయిన సీనియర్ పోలీసు ఆఫీసర్లను ఆధిత్యనాథ్ బదిలీ చేయడం జరిగింది.

కశ్మీర్ సమస్య పట్ల సాచివేత వైఖరి

కశ్మీర్ ప్రజల న్యాయమైన స్వయం నిర్ణయాధికార ఆకాంక్షను అత్యంత పాశవికంగా మోడీ ప్రభుత్వం అణచివేస్తుంది. అక్కడ పత్రిక స్వేచ్ఛ, సోషల్ మీడియా మీద క్రూరమైన హింసాకాండను ప్రయోగిస్తున్నారు. నిజాలు వెలుగులోకి రాకుండా చేసి అబద్ధాలతో దేశంలో కశ్మీరీ ఆకాంక్షల పట్ల, ముస్లింల పట్ల వ్యతిరేకతను, ద్వేషాన్ని రెచ్చగొడుతున్నది. కశ్మీర్‌లో ఏడు లక్షల సైన్యాన్ని మోహరించింది. ఇప్పటి వరకు సైన్యం చేతిలో 80 వేల మంది చనిపోయారు. 8 వేల పైగా కనిపించడం లేదు. స్త్రీలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు అంతే లేదు. ఏ నేరం చేసినా, ఎంత ఘోరం చేసినా శిక్షపడదన్న ధీమాతో సైన్యం అకృత్యాలు పెచ్చరిల్లిపోతున్నాయి. రాజకీయంగా పరిష్కరించాల్సిన సమస్యను అణచివేయడం ద్వారా పరిష్కరించాలని అనుకుంటున్నది ప్రభుత్వం. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పట్ల విశ్రాంత సైనికోద్యోగులు సహితం తమ అసంతృప్తిని వ్యక్తపరిచారు.

కశ్మీరీ ప్రజలు భారత్‌కు దూరమవుతున్నారు. కశ్మీర్ పరిస్థితి చాల ఆందోళనకరంగా ఉంది. సాధారణ ప్రజలు, విద్యార్థులు తిరుగుబాటు చేసే స్థాయికి వెళ్లింది. ఇటీవల జరిగిన శ్రీనగర్ ఉప ఎన్నికల్లో 7 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అయినా సమస్య తీవ్రతను అర్థం

చేసుకోకుండా మూర్ఖంగా 370 అధికరణ రద్దు చేస్తామంటూ, 35ఎ ను రద్దూ చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు. కశ్మీర్ సమస్యను సైనికంగా పరిష్కరించగల మనుకుంటుంది. ఇవి విఫలంకాక తప్పదు. అయితే ఈ వైఫల్యం కూడా హిందుత్వ శక్తులకు సాఫల్యమే. ఎందుకంటే కశ్మీర్‌లో ఈ కల్లోల పరిస్థితులలో కూడా దేశంలో, ముఖ్యంగా జమ్మూలో మతతత్వాన్ని పెంచేందుకు ఉపయోగించుకుంటున్నదీ ప్రభుత్వం. ఈ మతతత్వ వాదులకు పాకిస్థాన్ బయటి దేశం అయితే కశ్మీర్ దేశంలో ఉన్న ఇతర దేశం. బోడో, నాగా జాతుల ఉద్యమంపై కూడా ఇలాంటి అణచివేత కొనసాగుతున్నది.

హిందుత్వ సాంస్కృతిక ఫాసిజం

రాజ్యాంగ వ్యవస్థలను ధిక్కరించడం, భావోద్వేగాలను రెచ్చగొట్టడం, ఈ హిందుత్వ శక్తులకు కొత్తేమీ కాదు. ప్రత్యేకించి వెండితెర సృజనలపై మండిపడుతున్నాయి. అదిప్పుడు సినిమా రంగంపై కూడా సాగుతోంది. ఇందుకు ఈ ప్రభుత్వ హయాంలోనే 'ఉడ్తా పంజాబ్' మొదలు మొన్నటి 'మెర్సల్', నిన్నటి 'పద్మావతి', నేటి 'గేమ్ ఆఫ్ అయోధ్య' వరకూ అనేక ఉదాహరణలున్నాయి. 'పద్మావతి' సినిమాపై వివాదాలు ముగియక ముందే "గేమ్ ఆఫ్ అయోధ్య" సినిమాపై మొదలైన దాడులు 'భావస్వేచ్ఛ'ను మరింత ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మొన్న విహెచ్‌పి, నిన్న కర్ణిసేన, నేడు ఎబివిపి... పేరేదయితేనేమి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ఏ చిన్న అవకాశాన్నీ వదిలిపెట్టకుండా సమస్త హిందుత్వ పరివారాలన్నీ వీరంగమాడుతున్నాయి. నిద్రలేస్తే స్వచ్ఛ భారత్ అని పలవరిస్తున్న ప్రధాని స్వచ్ఛత అంటే కేవలం బాహ్య విషయమే కాదు. ప్రత్యేకించి విభిన్న భావధారలు ప్రవహించే భారతదేశంలో అది అంతరంగానికి సంబంధించిందని గుర్తించాలి. భారతీయ తత్వచింతన ప్రత్యేకతే అది. కానీ నేడు కేవలం కొద్దిమంది ఆధిపత్య వర్గాల తత్వం అత్యధికుల తత్వంగా మారిపోతుండడం విషాదకరం.

"గేమ్ ఆఫ్ ఆయోధ్య" సినిమా దర్శకుడు సునీల్ సింగ్‌ను ఉద్దేశించి ఎబివిపి నాయకుడు అమిత్ గోస్వామి చేసిన ప్రకటన. "ఆయన నాకు ఎక్కడైనా కనిపిస్తే నేనే చంపేస్తా... ఎవరైనా ఆయన చేతులు నరికి ఇస్తే లక్ష రూపాయల బహుమానమిస్తాం". సునీల్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన గేమ్ ఆఫ్ అయోధ్య డిసెంబర్ 8న విడుదల కావల్సి ఉండే. ఈ సినిమా విడుదలకు ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎఫ్‌సిఎటి) క్లియరెన్స్ కూడా ఇచ్చింది. కానీ మా అనుమతి లేకుండా సినిమా విడుదల కాదు అంటూ బెదిరిస్తున్నాయి హిందుత్వ శక్తులు. ఒకవేళ విడుదలయితే ఆ తరువాత జరిగే పరిణామాలకు మేం బాధ్యులం కాదు అంటూ హెచ్చరిస్తున్నాయి. బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో హిందూ ముస్లిం ప్రేమ కథాంశంగా తెరకెక్కించిన ఈ సినిమాలో... రాముడి విగ్రహాన్ని మోసపూరితంగా ఆలయంలో ప్రతిష్టించినట్టుగా చూపించారని వీరి అభ్యంతరం. ఇటువంటి అంశాలన్నీ చూసుకోవడానికి ఎఫ్‌సిఎటి, సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఇండియా లాంటి సంస్థలుండగా వీరికెందుకింత ఆసక్తి...!?

ఏదైనా ఒక సినిమాను ప్రదర్శించాలా.. వద్దా.. అని నిర్ణయించాల్సింది సెన్సార్ బోర్డు. దానికి అతీతంగా వ్యవహరించడం వ్యవస్థను నిర్వీర్యం చేయడమే కదా...? కానీ ఇంత జరుగుతున్నా మన ఏలికలెవరూ ఈ చర్యలను కనీసం ఖండించకపోగా సమర్థిస్తూ నిర్ణయాలు తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. సినిమాల్లో ఏమున్నదో తెలుసుకోకుండానే, చూడకుండానే తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలం అనుకుంటే చాలు వివాదాలు సృష్టించడం, వాటిని సమర్థించడం కాషాయనేతలకే చెల్లింది. "పద్మావతి" విషయంలోనే ఇది రుజువయింది. సినిమా ఇంకా సెన్సార్ ముందుకు వెళ్లకముందే ఈ సినిమాను ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, హర్యానా మొదలైన బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిషేధించారు...! అంతేకాదు ఒకవేళ కేంద్ర సెన్సార్ బోర్డు అనుమతించినా, తాము మాత్రం తమ రాష్ట్రాల్లో ఈ సినిమా ప్రదర్శనను అనుమతించబోమని ఆ రాష్ట్రాల ముఖ్య మంత్రులు ప్రకటించారు.

మేధావులపై కాషాయ మూకల దాడులు

"నూరు పూలు వికసించనీ... వేయి భావాలు సంఘర్షించనీ" అంటారు మావో. ఎందుకంటే భావ సంఘర్షణ వైవిధ్యానికే కాదు భవిష్యత్తుకూ వెలుగులు పంచుతుంది. కానీ నేడు ఈ దేశంలో భావాలకు 'స్వేచ్ఛ' కరువయ్యింది. భావస్వేచ్ఛను చిదిమేయడానికి త్రిశూలాలు బుసలు కొడుతున్నాయి. భిన్న భావాలపై కన్నెర్ర జేస్తున్నాయి. అవయవాలకు ధరలు నిర్ణయిస్తున్నాయి. కండ్లముందు సాక్షాత్కరిస్తున్న విధ్వంసక దృశ్యాలన్నీ రాజ్యాంగాన్నీ, రాజ్యాంగ వ్యవస్థలను అవమానిస్తున్నాయి. కళాకారులను, సృజనకారులను ఇలా బెదిరించడం ఏ దేశంలోనైనా చూశారా? అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యత గల పదవుల్లో ఉండి ఇలా చేయొచ్చా...? అని మందలించింది. అయినా, ముక్కూ చెవులూ కోయడాలు, కాళ్లూ చేతులూ నరకడాలు, తలలకు వెలలు నిర్ణయించడాలు ఆగకపోగా మరింత పెచ్చరిల్లుతున్నాయి. చట్టం ఉనికే ప్రశ్నార్థకమవుతోంది. ఏ సంఘటనలోనూ కనీస చర్యలు తీసుకున్న అనవాళ్లే లేవంటే ప్రభుత్వం భిన్నాభిప్రాయం పట్ల ఎంత కర్కశంగా ఉందో అర్థమవుతుంది. మోడీ పాలనలో కల్బుర్గీ, దభోల్కర్, పన్సారే, గౌరీ లంకేశ్ వంటి అభ్యుదయ రచయితల హత్యలు సరేసరి. గడచిన మూడేళ్ల కాలంలో 15 మందికి పైగా ప్రజావేగులు హత్యకు గురయ్యారు. పెరుమాళ్ మురుగన్‌పై దాడి చేశారు.

గోవింద్ పన్సారే, కల్బుర్గీ వంటి వారి హత్యలతో మొదలై గోరక్షణ పేరిట హత్యల వరకూ సాగి.. ఇటీవల జరిగిన గౌరీ లంకేశ్ దారుణ హత్య వరకూ అన్నీ భావ స్వాతంత్ర్యంపై, జీవించే హక్కుపై సాగిన దాడులే. తలలకు వెలలు ప్రకటిస్తూ... విశ్వవిద్యాలయాల్లో కుల, మత వైషమ్యాలను పెంచి పోషిస్తూ.. ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగిస్తోన్న ఘటనల వెనుక ఒక రాజకీయ సైద్ధాంతిక సంస్థాగత వ్యవస్థ వేళ్లూనుకొని ఉంది. పార్టీ ఆఫీసులు, దళితులు, మైనారిటీలపైన దాడులు, చారిత్రక ఆధారాల విధ్వంసం, మహిళల కట్టూ బొట్టు, మత స్వేచ్ఛ, వాక్ స్వాతంత్రంపై ఆంక్షలు దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. మహిళలూ, విద్యార్థినులను సైతం ఈ వివక్ష వదలలేదు. 'కళాశాల ఆవరణలో విద్యార్థినులు జీన్స్, మొబైల్స్ వాడకూడదు' అంటూ పాట్నా మగధ్ మహిళా కళాశాల ఉత్తర్వులు జారీ చేయడం వరకూ దేశంలో హక్కుల హననం తీవ్రస్థాయిలో జరుగుతుంది.

ఉన్నత విద్యా సంస్థల్లో ఆర్‌ఎస్‌ఎస్ చొరబాటు – ఆగడాలు

ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో 2016లో విద్యార్థులపై దురుద్దేశపూరిత దేశద్రోహ ఆరోపణ, పాటియాల కోర్టు ప్రాంగణంలో లాయర్ల ముసుగులో బిజెపి గూండాలు సాగించిన బీభత్సం, దేశంలో పెచ్చుమీరిన అసహనం, హేతువాదులు, ప్రగతిశీల శక్తులపై జరుగుతున్న దాడులు, జాతీయవాదం పేరిట నాడు జర్మనీ నియంత ఫాసిస్టు హిట్లర్ సాగించిన అకృత్యాలు, దారుణ మారణకాండలకు అద్దం పడుతున్నాయి. 2017లో జెఎన్‌యులో దళిత రీసెర్చ్ స్కాలర్ ముత్తు కృష్ణన్ బలవన్మరణం, కర్నాటకకు చెందిన అభ్యుదయ రచయిత యోగేష్ మాస్టర్‌పై సిరా దాడి సంఘ్ పరివార్ దాష్టీకాలకు పరాకాష్ట. ఏడాది క్రితం హెచ్‌సియులో రోహిత్ వేములను పొట్టన బెట్టుకున్న శక్తులే నేడు జెఎన్‌యుకు చెందిన దళిత స్కాలర్ ముత్తుకృష్ణన్ (25) ప్రాణాలు తీశాయి.

తమిళనాడుకు చెందిన ముత్తు కృష్ణన్ చనిపోవడానికి ముందు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన ప్రకటనను బట్టి ఆయనది ఆత్మహత్య కాదని, వ్యవస్థాగత హత్యేనని స్పష్టమవుతోంది. విశ్వవిద్యాలయాల అడ్మిషన్లలో దళితులకు సమాన అవకాశాలు కల్పించడం లేదని, అడుగడుగునా వివక్ష చూపుతున్నారని ముత్తు చేసిన వ్యాఖ్యలు వర్సిటీల్లో నేడు నెలకొన్న భయానక పరిస్థితికి దర్పణం పడుతున్నాయి. జెఎన్‌యు విద్యార్థి నజీబ్ అహ్మద్ అదృశ్యం వెనక ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం హస్తం ఉందనేది జగద్విదితం. నజీబ్ అదృశ్యానికి ముందు ఎబివిపి గూండాలు ఆయనపై హాస్టల్ వార్డెన్ సమక్షంలోనే దాడి చేసి రక్తం కారేట్టు కొట్టారు. అంతకుముందు కన్నయ్య, ఉమర్ ఖలీద్ తదితర విద్యార్థి నాయకులపై దేశద్రోహం కేసులు పెట్టి నానా రకాలుగా హింసించారు.

యూనివర్సిటీల్లో ఆధిపత్య వర్గాల క్రూర దాడులకు ప్రతిరోజూ 20 మంది దాకా చనిపోతున్నారని, వారిలో అత్యధికులు అణగారిన వర్గాలకు చెందినవారేనని జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదిక తేల్చి చెప్పింది. వర్సిటీ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులకు షోకాజ్ నోటీసులివ్వడం, విద్యార్థులకు సంఘీభావంగా నిలిచిన అధ్యాపకులపై, ప్రొఫెసర్లపై తప్పుడు కేసులు బనాయించి సస్పెన్షన్ వేటు వేయడం వంటి అప్రజాస్వామిక పద్ధతుల్లో వేధింపులకు గురి చేస్తున్నది. ఇంకోవైపు క్యాంపస్‌లో యథేచ్ఛగా దాడులకు దిగుతున్న ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపి మూకలకు ప్రభుత్వం, పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలోని రాంజాస్ కాలేజీలో ఎబివిపి గూండాగిరికి వ్యతిరేకంగా కార్గిల్ అమర జవాన్ కుమార్తె గుల్మెహర్ కౌర్ లాంటి వారు ఫేస్‌బుక్‌లో తమ అభిప్రాయాన్ని పోస్ట్ చేస్తే, ఆమెను రేప్ చేస్తామని సంఘ్‌పరివార్ మూకలు బెదిరించాయి.

యూనివర్సిటీల్లో ఎబివిపి దాడులను కేంబ్రిడ్జి, హార్వర్డ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన యూనివర్సిటీలకు చెందిన 400 మంది విద్యావేత్తలు ముక్తకంఠంతో ఖండించారు. అయినా, ఉన్మాదం బాగా తలకెక్కించుకున్న కాషాయ మూకల దాడులు ఆగలేదు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వర్సిటీల్లో అట్టడుగు వర్గాల విద్యార్థులపై ఈ దాడులు మరింత పెరిగిపోయాయి. అణగారిన వర్గాలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు స్కాలర్‌షిప్పుల్లో కోత పెట్టారు. ఎంఫిల్, పిహెచ్‌డి సీట్ల సంఖ్యను కుదిస్తూ యుజిసి చేత తాజాగా ఉత్తర్వులు జారీ చేయించారు. క్యాంపస్‌లలో హిందుత్వ అజెండాను బలవంతంగా రుద్దేందుకు అవి నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నాయి. అసమ్మతిని సహించలేకపోతున్నాయి. సత్యాన్వేషణకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు కేంద్రాలుగా భాసిల్లాల్సిన వర్సిటీలను బందీఖానాలుగా, మతాలయాలుగా మార్చేందుకు చేస్తున్న యత్నాలు భయానకంగా ఉన్నాయి.

ఉన్నత విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తికి ముప్పు

మనదేశంలోని ఉన్నత విద్యాసంస్థలు ప్రపంచంలో అధమస్థాయిలో ఉండడమేకాక, వాటి స్వయం ప్రతిపత్తిని (అటానమీ) ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రమాదం ఎదుర్కొంటున్నాయి. 'ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిఐఐ)' కావచ్చు, లేక నలందా విశ్వవిద్యాలయం, మరేదైనా విద్యాసంస్థ కావచ్చు, ఏదో ఒక రూపంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నది. అపాయింట్‌మెంట్లను ప్రతిభ ప్రాతిపదికగా కాకుండా రాజకీయ పరిగణనలతో చేయడం పెరుగుతుండడం విచారకరం. ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్) బిల్లు 2015 ముసాయిదాను తీసుకుంటే, డైరెక్టర్లు, అకడమిక్ కౌన్సిళ్ల అధికారాలను తన నియంత్రణలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం తల పెట్టింది. ఈ బిల్లు ఆ సంస్థలను కేవలం 'ఆపరేటింగ్ సెంటర్స్'గా మార్చుతుందని, కేంద్రానికి అపరిమిత అధికారాలిస్తుందని విద్యార్థుల్లో, అధ్యాపకుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ బిల్లు శాసనసభ చట్టాల కింద నెలకొల్పే యూనివర్సిటీలు, ఐఐటిల వంటి చట్టబద్ధ సంస్థలవలె దేశంలోని 19 ఐఐఎంలను కేంద్ర ప్రభుత్వం అదుపులోకి తెచ్చుకోవాలని కోరుకుంటోంది. ముసాయిదా బిల్లు ప్రకారం, ఒక కొత్త కోర్సు ప్రారంభించాలన్నా, చివరకు ఒక హాస్టల్ నెలకొల్పాలన్నా ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలి! విద్యా సంస్థలు డిమాండ్ చేస్తున్న మరింత అటానమీకిది పూర్తి విరుద్ధం. రాజకీయ జోక్యం, ఆర్థిక వనరుల కొరత కారణంగా ఈ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు జపాన్, చైనా వంటి ఇతర ఆసియా దేశాలతో పోల్చినా నాసిగా ఉండడం నిరాకరించలేనిది. వ్యవస్థాగత దగాకోరుతనంతో దేశ రాజధానిలో ఇప్పుడు వ్యక్తమవుతున్న ధోరణులు ఢిల్లీ విశ్వవిద్యాలయ విధ్వంసానికి దారితీస్తున్నాయి. యూనివర్శిటీ కానీయండి, మరే ఇతర ఉన్నత విద్యాసంస్థ కానీయండి, అది తమ నియంత్రణ పరిధిలో ఉండాలని చేస్తున్న నిరంతర ప్రయత్నం ప్రస్తుత స్థితిగతులకు, ముఖ్యంగా వైస్-ఛాన్సలర్‌కు స్వేచ్ఛ కొరవడడానికి కారణమవుతోంది.

విలక్షణమైన, దురహంకారపూరిత చారిత్రక దృక్పథాన్ని ప్రచారం చేయటానికీ, అలానే మతతత్వ రాజకీయ ప్రయోజనాలను ముందుకు కొనిపోయే విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడానికి గాను, ఐ.సి.హెచ్.ఆర్., ఎన్.సి.ఇ.ఆర్.టి.లపై సైద్ధాంతిక అదుపు సాధించేటందుకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనేది యథార్థం. విద్యా సంస్థల్లో తమ మనుషులను చొప్పించాలని రాజకీయ వ్యవస్థ కోరుకుంటే అది పాలక పార్టీ సంస్కృతిలో భాగమవుతుంది, అకాడమిక్ స్వేచ్ఛకు భంగం

కలుగుతుంది. సృజన, పరిశోధన, వికాసం కుంటుపడుతుంది. ఇప్పటికే దిగజారిన ప్రమాణాలు మరింత దిగజారడం ఖాయం. 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సర్వే'లో ప్రపంచ యూనివర్శిటీ ర్యాంకింగ్‌లలో భారత దేశ యూనివర్శిటీలకు అతి తక్కువ ర్యాంక్ ఇచ్చాయి. రాజకీయ జోక్యం తక్కువగా ఉంటే యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల పనితీరు మెరుగవుతుంది, సిలబస్‌కు రూపకల్పన, కొత్త కోర్సులు ఆరంభించడం, యాజమాన్యం మెరుగుదల, అడ్మిషన్‌లో పారదర్శకత వంటి విషయాలను మెరుగుపరచుకోవడానికి ఉన్నత విద్యాసంస్థలకు స్వేచ్ఛ ఉండాలి. మరింత అటానమీతో పాటు కోర్సుల పాఠ్యాంశాలను ఆధునికీకరించాలని, వివిధ రంగాల్లో కాలానుగుణ మార్పులు చేపట్టాలని అత్యధిక అకడమీషియన్లు కోరుతున్నారు.

పశ్చిమదేశాల యూనివర్సిటీల్లో, సామాజిక పాత్రను మినహాయించి, ప్రజా ఉద్యమాలకు సమర్థనలేకుండా, సామాజిక పరివర్తనకు పాత్రలేకుండా పాఠ్యాంశాల్లో ప్రతిభను పెంపొందించే మార్గం అనుసరిస్తున్నారు. భారతదేశ యూనివర్శిటీల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇక్కడ ప్రొఫెసర్లు సహా మేధావులు వలసానంతరం కూడా దేశ సామాజిక, రాజకీయ జీవనంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఫలితంగా విశ్వవిద్యాలయాలు సృజనతో పాటు సామాజిక చైతన్యాన్ని కూడా విద్యార్థులకు అందిస్తున్నాయి. సమాజ మార్పుకు దోహదపడుతున్నాయి. యాంత్రికంగా బోధన జరగాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. మరోవైపున, కాలేజీలు, యూనివర్శిటీలు నిధులకొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉన్నాయి. బోధకులకు తీవ్రమైన కొరత ఉంది. పరిశోధనలకు నిధులు లేవు. నాణ్యత ముఖ్యమైనదే అయినప్పటికీ మనదేశ విశ్వవిద్యాలయాలు సామాజిక వాతావరణంలో పనిచేయాలి. భిన్నమైన ప్రాంతాలు సంస్కృతుల మధ్య, కులాలు కమ్యూనిటీల మధ్య, పురుషులు స్త్రీల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. కాబట్టి మన విశ్వవిద్యాలయం సమాజం లాగ కనిపించాలన్నది స్పష్టం.

ముగింపు

ఆశ్చర్యకరమైన విషయమేమంటే మత వ్యవహారాల విషయంలో అంతగా ఆసక్తి చూపని వారు కూడా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చాకా మతోన్మాద భావాలకు లొంగిపోతున్నారు. గత 25 సంవత్సరాల కాలంలో మత ప్రాతిపదికన జనాన్ని విడగొట్టే ప్రయత్నాలు పెచ్చరిల్లి పోయాయి. పాతికేళ్ల కాలంలో బిజెపి రాజకీయాల్లో బాగా బలపడడవే గాక ముస్లింలు భయకంపితులయ్యారు. సాంస్కృతిక జ్ఞాపకాలు, సంప్రదాయం, చారిత్రక సత్యాలు మొదలైన వాటిని తుడిచిపెట్టే దురాగతం నిరాఘాటంగా కొనసాగుతోంది. హేతుబద్ధమైన ఆలోచన మృగ్యం అవుతోంది. బాబ్రీ మసీదు ఉన్న చోటే రామ జన్మస్థలం అని వాదించడం సంప్రదాయానికి, చారిత్రక సత్యానికి మధ్య ఉన్న గీతను చెరిపి వేయడమే అవుతుంది. 1992 డిసెంబర్ 6 నాటి సంఘటన 'హిందువుల మనోభావాలను రెచ్చగొట్టడానికి', 'మైనారిటీలను అణచివేయడానికి ఉపకరించింది.

హిట్లర్ యూదుల పట్ల వ్యవహరించినట్లుగానే... దేశంలో అల్పసంఖ్యాకుల పట్ల వ్యవహరించాలన్నది బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు సిద్ధాంతం. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చాక.. నేరాలు.. ఘోరాలు పెరిగాయని నేషనల్ క్రైం బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) రిపోర్టులు ధ్రువీకరిస్తూంటే.. తాజాగా ఆమ్నెస్టీ ఇంటర్నేషన్ సంస్థ కూడా మానవహక్కుల కార్యకర్తలకు భారత్ అత్యంత ప్రమాదకరమైన దేశమంటూ హెచ్చరిక చేసింది. తాము చెప్పిందే వేదం.. హద్దుదాటితే ప్రాణాలుండవు జాగ్రత్త అనేలా కేంద్రంలోని బిజెపి పాలన కొనసాగుతోందనటానికి ఈ నివేదికలు అద్దం పడుతున్నాయి. ప్రజాస్వామ్య మౌలిక లక్షణం భావప్రకటన స్వేచ్ఛ. హిందూ మతోన్మాదం కేవలం మైనారిటీ మతస్థులకే ప్రమాదం కాదు. అణచివేతకు గురయ్యే ప్రజలందరికి శత్రువు. ఈ నేపథ్యంలో సంఘ పరివార్ భావజాలంలోనూ, ఆచరణలోనూ ఉన్న ఈ అమానుషత్వం గురించి, అసమానతను ఆదర్శీకరించే ఆధిపత్య సంస్కృతి గురించి మరింత ఎక్కువగా ప్రచారం చేయడం, అడ్డుకోవడం, ఈ దుర్మార్గాలకు గురి అవుతున్న శక్తులతో సంపూర్ణంగా మమేకమై పోరాడడం నిజమైన ప్రజా ప్రగతిశీల శక్తులందరి కనీస బాధ్యత.

సామ్రాజ్యవాదం జాతీయవాదానికి శత్రువు. హింసాయుత దురహంకార, అభివృద్ధి నిరోధక శక్తులకు ప్రాపు. హిందుత్వ ఫాసిస్టులు సామ్రాజ్యవాదం సహకారం పొందుతూ దానితో స్నేహంగా ఉన్నారు. అందువలన మనదేశంలో హిందుత్వ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా సాగే పోరాటం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంతో మిళితమై ఉంటుంది. కాబట్టి అభివృద్ధి నిరోధక బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజంతోనూ, కార్మికోద్యమంలో పాలక వర్గ తొత్తులుగా, ద్రోహులుగా పనిచేసే సోషల్ ఫాసిజంతో సహా అన్ని రకాల మితవాద ఫాసిజాలతో సంఘటితంగా శ్రామిక వర్గం పోరాడాలి. దోపిడీ పీడనల నుంచి సమాజాన్ని విముక్తి చేయడానికి, ప్రజలందరు గౌరవప్రదంగా జీవితాన్ని గడపడానికి కావల్సిన సమాజ స్థాపనకు ప్రాంతం, కులం, మతం, జెండర్ బేధం లేకుండా వర్గ ప్రాతిపదికన బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడడం ఎంతైనా అవసరం.

భారత ప్రజాతంత్ర విప్లవ ప్రతీఘాతుక పాలకవర్గాలూ, వారి సామ్రాజ్యవాద ప్రభువులూ, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులూ, విశాల ప్రజారాశులను, ప్రత్యేకించి కటిక పేదలైన దళితులు, మహిళలు, ఆదివాసులు, తదితర పీడిత సెక్షన్లతో కూడుకొని ఉండే పేదరైతులు, భూమిలేని రైతులను తమ దోపిడీ, పీడక సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యవస్థ ఉక్కు పాదాల కింద అణచివేస్తున్నారు. ఈ ధ్యేయంతోనే కుల, మత, భావోద్వేగాలను ప్రత్యేకించి హిందూ ఫాసిజాన్ని పెంచి పోషించి, రెచ్చగొట్టి ఎగదోయడానికి కూడా కృషి చేస్తున్నారు. సుసంపన్నమైన, వైవిధ్య భరితమైన సామాజిక పునాదులను బలహీనపరిచే, విచ్ఛిన్నం చేసే శక్తి సామర్థ్యాలు గల ఇటువంటి మతోన్మాద పోకడలు మరింతగా పెచ్చరిల్లకుండా నివారించేందుకు ప్రజాతంత్ర విప్లవ శక్తులు హిందూత్వ ఛాందసవాద శక్తుల్ని రాజకీయపరంగా, సిద్ధాంతపరంగా ఎదిరించి, ఎండగట్టి పోరాడడానికి ప్రజారాసులను జాగృతం చేయాలి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు దాడులను తిప్పికొట్టేందుకు సిద్ధమైన అన్నీ నిజమైన ప్రజాస్వామిక శక్తులతో విశాల ఐక్యసంఘటన నిర్మాణం నేటి తక్షణ అవసరంగా గుర్తించాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ట్రంప్ మానవ జాతిని మంటగలుపుతాడు!

చేగువేరా 50వ వర్ధంతి సందర్భంగా ఆయన కూతురు డా. అలీదా గువేరాను అంతర్జాతీయ విషయాల గురించి **లుకొసె మాథ్యూ** *ఇంటర్వ్యూ చేశారు*

హవానా అక్టోబర్ 15 2017 సంచిక నుండి చేగువేరా కూతురు డా. అలీదా గువేరా మార్చ్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ.

హవానా నగరంలో ప్రశాంతమైన ఓ వీధి. ఆ వీధిలో చేగువేరా అధ్యయన కేంద్రం. ఆ అధ్యయన కేంద్రం కార్యాలయంలోకి చాలా హడావిడిగా ఉన్న డా. అలైడా గువేరా మార్చ్ సుడిగాలిలా ప్రవేశించి నాకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని నన్ను చూస్తూ 'ఏం తీసుకుంటారు?' అనడిగింది. నాకు నీళ్లు చాలు అని చెప్పాను. తాను ఎక్స్‌ప్రెసో కాఫి తాగుతానంది. ఆమెకు సహాయకుడిగా ఉన్న ఆయన నీళ్లు, కాఫి రెండూ తెచ్చాడు. అప్పుడు సమయం ఉదయం పదిన్నర గంటలు. బయట చాలా వేడిగా ఉంది. అలైడాకు 57 ఏళ్ల వయస్సు ఉంటుంది. మెల్లగా కాఫి చప్పరిస్తూ ఆమె, 1997లో తన భారతదేశ పర్యటనను నెమరు వేసుకుంటూ అక్కడ తాను పొందిన ఆప్యాయత, సాదర ఆహ్వానాన్ని గురించి చాలా ఉత్సాహంగా చెప్పింది. 'కలకత్తా, హైదరాబాద్, కాలికట్ వెళ్లడం నాకు బాగా గుర్తుంది. అక్కడి ప్రజలు స్నేహశీలురు.' అంది ఆమె. 'నేను హవానా నుండి బయల్దేరక ముందు, నా కూతుళ్లు (ఎస్టెఫేనియా, సీలియా) అక్కడి నుంచి ఏనుగుల బొమ్మలు తీసుకురమ్మని చెప్పారు. నాకు బాగా గుర్తు. ఒక నగరంలో... అది కాలికట్... అవును... కాలికట్ నగరంలో నేనొక ఏనుగుపై ఎక్కి కూర్చున్నాను. అదొక కష్టంతో కూడుకున్న వ్యాయామంలా అనిపించింది. అక్కడ ఒక బల్లను ఉంచారు. ఆ బల్లపై ఒక స్టూల్. కింద నుండి ఏనుగుపైకి ఎగిరి పడ్డట్లే అనిపించింది. అయితే, కత్తిమీద సాములాంటి ఈ ప్రక్రియ తర్వాత నడిచివెళ్లడానికి చాలానే ఇబ్బంది పడ్డాను.'

'చే'కు నలుగురు సంతానం. అందరిలోకి బాగా ప్రచారంలో ఉన్న వ్యక్తి, అందరికంటే పెద్దది అలైడా మార్చ్. ఆమె హవానాలోని విలియమ్ సోలెర్ పిల్లల ఆసుపత్రిలో శిశు వైద్య నిపుణురాలు. చేగువేరా కుటుంబం వైపు నుండి ప్రతినిధిగా మాట్లాడుతూ ఉంటుంది. అంతేగాదు చేగువేరా అధ్యయన కేంద్రాన్ని నడపడంలో ప్రధాన పాత్ర వహిస్తూ ఉంటుంది. చాలా సామాజిక కార్యక్రమాలలో, తన ప్రజలకు సంబంధించిన సేవా కార్యక్రమాలలో ఎప్పుడూ నిమగ్నమై ఉండే ఆమె క్యూబాలో ఉన్నా, విదేశాలలో ఉన్నా వీటితోనే ఎప్పుడూ బిజీగా ఉంటుంది. ఒక గంటకు పైగా జరిగిన మా భేటీ ముగుస్తుండగా ఆమె తన వాచీ చూసుకుని హడావిడిపడుతూ 'ఓహ్! నేనిక బయల్దేరాలి. ఇప్పటికే ఆలశ్యమైంది' అంటూనే బయటకు పరుగెత్తింది. నేను లేచి బయటకు వస్తూనే ఉన్నాను, ఆమె అప్పటికే తన కారులో కూర్చుని డ్రైవ్ చేసుకుంటూ వేగంగా వెళ్లిపోయారు. చాలా మంది క్యూబా దేశస్థులకు కారు అందుబాటులో లేని విలాసవంతమైన వాహనమే! ఆమెతో నేను తీసుకున్న ఇంటర్వ్యూ లోంచి కొన్ని భాగాలు:

> - *ఈ భూ మండలం పైనే అత్యంత శక్తివంతమైన రాజ్యానికి కేవలం 90 మైళ్ల దూరంలోనే మేము నివసిస్తుంటాము. కాని మమ్మల్ని జయించడం ఆ దేశానికి సాధ్యం కాని పని.*
> - *గెరిల్లా యుద్ధ తంత్రంపై మా తండ్రి గారు ఒక పుస్తకం రాశారు. గెరిల్లాలపై యుద్ధం చేయడానికి అమెరికా అదే పుస్తకంలో పేర్కొన్న విషయాలను ప్రయోగిస్తున్నది.*
> - *మా నాన్నకు మనుషులను ప్రేమించడం ఎలాగో తెలుసు. అందుకే ఆయన గొప్ప కమ్యూనిస్టుగా బతికాడు.*

ప్ర : మీ తండ్రిగారు లేని సమయాల్లో మీ తల్లిగారు ఒక్కరే నలుగురు పిల్లలను పెంచడం ఎంతో ఇబ్బందిగా ఉండి ఉంటుంది. దాన్ని గురించి వివరించండి.

జ : *నాన్న నుంచి దూరంగా ఉండడమే అమ్మకు చాలా కష్టంగా తోచేది. మా నాన్నగారితో పాటు బొలీవియాలో ఉండడానికి చాలా ఇష్టపడింది మా అమ్మ. కాని తనను హవానాలోనే ఉండమన్నాడు నాన్న. కనీసం రెండు సంవత్సరాలైనా అక్కడే ఉండమన్నాడు. అది ఆయన నిబద్ధత. యుద్ధం రెండేళ్లలో ముగియకపోతే ఎవరినైనా పంపి తన దగ్గరికి పిలిపించుకుంటానన్నాడు.*

అయితే క్యూబా సమాజం నుండి ఆమెకు గొప్ప మద్దతు లభించింది. మా యోగ క్షేమాల్ని విచారించేందుకు మా నాన్నగారి మిత్రులు చాలా మంది చాలా తరచుగా ఇంటికి వస్తుండేవారు. మా అమ్మకు ఏదైనా సమస్య ఎదురయిందంటే ఫిడల్ (క్యాస్ట్రో) తో గాని రామిరో వాల్డెజ్‌తో నేరుగా మాట్లేదేది. (రామిరో వాల్డెజ్ క్యూబా విప్లవ పోరాటానికి ముందుండి నాయకత్వం వహించినవాడు. ఒకవేళ చేగువేరా పోరాటంలో అమరుడైతే, ఆయన పిల్లలను పెంచి పోషించే బాధ్యత రామిరోకు అప్పగించబడింది) వారు వెంటనే స్పందించి మా అమ్మను కలిసేవారు. ముఖ్యంగా రామిరో.

ప్ర : ఒక తండ్రిగా చేగువేరా ఎలా ఉండేవాడు, చెప్పండి.

జ : *నిజానికి మా నాన్న గురించి నాకు జ్ఞాపకం ఉన్న సంగతులు చాలా తక్కువే అని చెప్పాలి. ఆయనతో గడిపిన సందర్భాలు చాలా తక్కువ. కాబట్టి నాన్నగారంటే కొంత భయం కూడా ఉండేది. ఆయన ఇంటికి రావడమే తక్కువ. చిన్నప్పుడు మా అమ్మ దగ్గరే పడుకునేదాన్ని. ఎప్పుడో ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చినప్పుడు నన్ను ఎత్తుకుని గట్టిగా*

నా బుగ్గలు ముద్దు పెట్టుకునేవాడు. దాంతో నాకు మెలుకువ వచ్చేది. ఎలా ఉంటుందో ఊహించండి... చాలా అరుదుగా కనిపించే మనిషి... హఠాత్తుగా చీకట్లో కనిపిస్తే... కొన్నిసార్లు మా నాన్న మమ్మల్ని స్వచ్ఛంద సేవా కార్యక్రమానికి తీసుకెళ్లేవాడు. (విప్లవం విజయవంతం అయిన తర్వాత వారంలో ఒకరోజు ప్రజలందరూ ఉచితంగా సమాజం కోసం స్వచ్ఛందంగా పని చేయాలన్న పద్ధతిని అవలంబించేవారు) ఆ సమయంలో మాత్రమే మా నాన్న మాతో పిచ్చపాటి మాట్లాడేవాడు. మాతో కలిసి ఉండేవాడు. ఓసారి స్వచ్ఛంద సేవ నుండి తిరిగి వచ్చి తన గదిలో బట్టలు మార్చుకుంటున్నాడు. నేను, నా తమ్ముడు కామిలో మెల్లగా వెనకనుండి వెళ్లి ఆయన వీపు మీద ఎక్కి కూర్చుని ఛల్ ఛల్ గుర్రం... అంటూ ఆ హాలంతా నడిపించాము. అయితే ఇలాంటివి కొన్ని జ్ఞాపకాలు మాత్రమే. క్రమశిక్షణకు సంబంధించి మా నాన్న చాలా స్ట్రిక్ట్. కఠినంగా ఉన్నప్పటికి, చాలా ప్రేమగా కూడా ఉండేవాడు. ముఖ్యంగా మాకు చాలా విలువలు నేర్పాడు. ఉదాహరణకు పుస్తకాలంటే వల్ల మాలిన అభిమానం మాలో నెలకొనేటట్లు చేశాడు. ఎప్పుడూ చదవాలని, కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాల్సిన అవసరాన్ని గురించి, మనుషులను, జంతువులను గౌరవంగా, ప్రేమగా చూడాలని మాకు చెప్పేవాడు. అయితే ఈ విషయాల అమలు గురించి కృషి చేసే సమయం ఆయనకు జీవితంలో లభించలేదు.

ప్ర : చేగువేరా రాసిన 'రెమినిసెన్స్ ఆఫ్ ది క్యూబన్ రివల్యూషనరీ వార్' పుస్తకానికి మీరు రాసిన ముందు మాటలో ఒక చిన్న కుక్కపిల్లను చంపిన సంఘటనను వర్ణించిన అధ్యాయాన్ని గురించి ప్రస్తావించారు. ఆ కుక్కను చంపమని ఆదేశించడం పట్ల చేగువేరా చాలా ఆవేదన చేందారని రాశారు.

జ : అవును. శత్రువులు వాళ్ల చుట్టూ ఉన్నారు. ఆ కుక్కపిల్ల ఒకటే మొరుగుతూ ఉంది. వాళ్ల ఆనవాలు తెలిసిపోయే ప్రమాదం దాపురించింది. ఆ సమయంలో మా నాన్న విధిలేక ఆ కుక్కను చంపమని ఆదేశించారు. ఆ రకంగా తన మనుషులను కాపాడుకునే ప్రయత్నం చేశారు. కాని ఆ చిన్న జీవి కోసం ఆయన చాలా బాధపడ్డాడు. ఆ సంఘటన ఆయన మనస్సు మీద బలమైన ముద్ర వేసింది. అయితే తన మనుషుల కోసమే ఆయన ఆపని చేయాల్సి వచ్చింది.

ప్ర : కాంగోలో ఆయన కార్యకలాపాల గురించి, ఆ తర్వాత బొలీవియాలో ఆయన చేసిన పనుల గురించి మీకు సమాచారం ఉండేదా?

జ : లేదు. అప్పుడు మేం చిన్నవాళ్లం. కాబట్టి మా నాన్న ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో మాకు తెలిసేది కాదు. బహుశా మా అమ్మగారికి సమాచారం ఉండేదనుకుంటాను.

ప్ర : మీ నాన్నగారి మనస్సులో మీకో ప్రత్యేక స్థానం ఉండేది. ఆయన రాసుకున్న బొలీవియన్ డైరీలో 'అల్యూచా' జన్మదినాన్ని గురించి ప్రస్తావన ఉంది.

జ : నవంబర్ (1966) తొలి రోజులలో ఆయన బొలీవియా వచ్చారు. అదే నెల చివరి వారంలో నా పుట్టిన రోజు ఉండేది. ఆ రకంగా నా పేరు ప్రస్తావనకు వచ్చింది.

ప్ర : చేగువేరా చాలా విస్తారంగా రాసిన రచయిత. ఆయన రాసిన వాటిల్లో మీరు మొదట ఏ పుస్తకాన్ని చదివారు?

జ : నేను చదివిన మా నాన్నగారి మొదటి పుస్తకం 'ట్రావెల్ నోట్స్'. ఆ తర్వాత ఆ పుస్తకం ఆధారంగా 'మోటార్ సైకిల్ డైరీస్' అన్న పేరుతో సినిమా కూడా తీశారు. ఆ పుస్తకానికి నేను ముందుమాట రాశాను. నిజానికి, మా అమ్మ ఆ పుస్తకాన్ని చదవమని నాకిచ్చినప్పుడు నాకప్పుడప్పుడే 16 ఏళ్లు నిండుతున్నాయి. అది అప్పటికి రాతప్రతి మాత్రమే. పుస్తక రూపంలో కూడా రాలేదు. మా అమ్మ ఆ పుస్తకం నాకిస్తూ అది ఎవరు రాశారో చెప్పలేదు. నేను పుస్తకం చదవడం ప్రారంభించి ఆ రచయితను ఎంతో ఇష్టపడ్డాను. ఆ తర్వాత తెలిసింది ఆ పుస్తకం రాసింది మా నాన్నేనని. అంత సాహసికుడైన ఆ పుస్తకంలోని పిల్లవాడు, పూర్తి ఉత్సాహంతో ఉన్నవాడు మా నన్నే అన్న విషయం తెలిసి నేనెంతో గర్వపడ్డాను. సంతోషపడ్డాను. అప్పట్నుంటే మా నాన్నకు దగ్గరగా ఫీలవడం ప్రారంభమైంది.

ప్ర : రచయితగా ఆయన గురించి మీరేమనుకుంటున్నారు?

జ : ఆయన మంచి వచనం రాసేవారు. దేన్ని గురించయినా ఆయన రాసిన వర్ణన చదువుతూ ఉంటే, నిజంగా దానిని ప్రత్యక్షంగా చూస్తున్నట్లే ఉంటుంది. 'ది మోటార్ సైకిల్ డైరీస్' సినిమాకు దర్శకత్వం వహించిన వాల్టర్ సాలెస్ ఆ పుస్తకంలో ప్రస్తావించిన ప్రదేశాలు చూడడానికి వెళ్లినప్పుడు, మా నాన్న వర్ణించిన ప్రదేశాలన్నీ సరిగ్గా అలాగే ఉండడం వారికి చాలా ఆశ్చర్యం కలిగించింది.

ప్ర : మీ నాన్నగారు రాసిన పుస్తకాల్లో అన్నింటికంటే దేన్ని మీరు ఎక్కువగా ఇష్టపడతారు?

జ : ఆ పుస్తకాలన్నీ వివిధ విషయాలకు సంబంధించినవి. మా నాన్న మొదటి పుస్తకం రాసిన తర్వాత ఆయన దాన్ని ప్రచురించాలనుకోలేదు. చాలా రోజుల తర్వాత 'చేగువేరా అధ్యయన కేంద్రం' దాన్ని ప్రచురించింది. మా కేంద్రమే ఆయన రచనల సంకలనాన్ని, ఆయనే స్వయంగా తీసిన ఎన్నో ఫోటోలతో సహా ప్రచురించింది.

ప్ర : ఆయన మంచి ఫోటోగ్రాఫర్ కూడా...

జ : చాలా మంచి ఛాయా చిత్రకారుడు. ఆయన తీసిన ఫోటోలను చాలా బాగా తీయబడిన చిత్రాలతో పోల్చవచ్చు. ఉదాహరణకు ఒక ఫ్యాక్టరీ కడుతున్నప్పుడు, పూర్తిగా తయారు కాని ఆ కార్మాగారాన్ని ఫోటో తీశాడు మా నాన్న. అందులో ఎన్నో గోట్టాలు, ఇనుప ముక్కలు కనిపిస్తాయి. వాటితో పాటు నిర్లక్ష్యంగా విసిరివేయబడ్డ ఓ చేయి తొడుగు. చెత్తకింద పారవేయబడ్డ చేయి తొడుగు ఏమాత్రం అందంగా కనిపించదని మనం అనుకోవచ్చు. కాని ఆయన ఫోటో తీసిన విధానం, దాన్ని ఎంతో అందంగా కనిపించేలా చేసింది.

ప్ర : కాంగోలో ఆయన తలపెట్టిన కార్యక్రమంలో ఎక్కడ పొరపాటు దొర్లింది?

జ : విభిన్న సంస్కృతులకు సంబంధించిన సమస్య అది. మా నాన్న అక్కడ కాంగోలో ఉన్నది వారికి సహాయపడడానికి వారిపై ఆధిపత్యం చెలాయించడానికి కాదు. మా సంస్కృతిలో సైన్యాధ్యక్షుడు ముందుండి నడిపిస్తాడు. అది 'జోస్ మార్టి' కానివ్వండి, 'ఆంటోనియో మేసియా గ్రజాలస్' కానివ్వండి, 'మాక్జియో గోమేజ్' లేదా 'ఫీడల్, రేల్కాస్ట్రో' ఎవరైనా కానివ్వండి వారు ముందుండే నడిపిస్తారు. మా నాన్న ఆ పద్ధతికే అలవాటు పడ్డారు. అయితే ఆయన అక్కడ ముందు

భాగానికి వెళ్లలేకపోయారు. ఎందుకంటే నాయకులెవ్వరు అక్కడ ముందు భాగాన కనిపించరు. అక్కడి పరిస్థితిని మెరుగుపరచలేకపోవడానికి ముఖ్య కారణం పోరాట పంథా అగ్ర భాగంలో ఏం జరుగుతుందో ఊహించి వారికి శిక్షణ ఇచ్చేందుకు ప్రయత్నం చేయడం. మైదానంలో గొయ్యి తవ్వడం కేవలం చనిపోయిన వారిని పూడ్చిపెట్టడానికే అని ఆఫ్రికన్ల నమ్మకం. అలా కాకుండా గొయ్యిని తవ్వి, అందులో దాక్కొని కూడా యుద్ధం చేయవచ్చని వాళ్లకెప్పటికి అర్థం కాదు.

వారికి యుద్ధం చేయడం ఎలాగో నేర్పడానికి ఎక్కువ సమయం కావాల్సి వచ్చింది. ఆయనకు ఆ సమయం ఇవ్వడానికి వారు సిద్ధంగా లేరు. క్యూబాకు చెందిన వాళ్లందరూ కాంగో విడిచి వెళ్లిపోవాలని వారు నిశ్చయించారు. మా నాన్నకు తెలుసు అక్కడ తన కర్తవ్యం పూర్తికాలేదని, అయినా తననిష్టపడని వాళ్లమీద ఆధిపత్యం చెలాయించడం తగదని ఇతర క్యూబన్‌లతో కలిసి ఆయన వచ్చేశారు.

ప్ర : తర్వాత, బొలీవియాలో ఏమైంది?

జ : బొలీవియాలో సమన్వయ లోపం కనిపించింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి – నాయకత్వమే, పార్టీకాదు – గెరిల్లా నాయకుని మధ్య విభేదాలు ఉండేవి. కమ్యూనిస్టు పార్టీ నాయకులు యుద్ధాన్ని వారే నడుపుతామన్నారు. వారే నాయకత్వ బాధ్యత వహించడంలో తనకేమీ ఇబ్బంది లేదని మా నాన్న చెప్పారు. అయితే వాళ్లు యుద్ధ రంగం మీదే ఉండాలి. నగరాలలో నివసిస్తూ సైన్యాన్ని నడపడం సాధ్యం కాదన్నారు. వారకది అర్థం కాలేదు. వారు హుందాగా కూడా ప్రవర్తించలేదు. ఉదాహరణకు గెరిల్లా యుద్ధంలో చేరకుండా గని కార్మికులను అడ్డుకున్నారు. దాంతో విప్లవోద్యం ఆగిపోయే పరిస్థితికి వచ్చింది.

ప్ర : మీ నాన్నగారు చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కాకపోవడానికి పార్టీలో సోవియట్ – అనుకూల, చైనా – అనుకూల వర్గాల భేదాభిప్రాయాలే కారణమా?

జ : కాదు. అవి స్వల్పమైన కారణాలే.

ప్ర : ఒకవేళ మంచి వనరులు, అన్ని వర్గాల నుండి మద్దతు ఉండి ఉంటే ఆ కార్యక్రమం విజయవంతం అయి ఉండేదా?

జ : ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం అంత సులభం కాదు. విజయం సాధించాలంటే గెరిల్లాలకు ప్రజల మద్దతు కావాలి. ప్రజల నుండి అనుకున్నంత మద్దతు రాలేదు. కారణం వాళ్లు భయపడ్డారు. సమాజం మారాలంటే మరణానికైనా సిద్ధం కావాలన్న విషయాన్ని సాంస్కృతికంగా చైతన్యం లేని ప్రజలకు అర్థం చేయించడం కష్టమైన పని.

ప్ర : ఆయన్ను చంపిన దేశమే ఇప్పుడు ఆయన్ను కొలుస్తున్నది. దీనికి మీరేమంటారు?

జ : ఈ పరిణామం ఆ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచేదైతే మాకేమీ సమస్య లేదు. ఈ పరిణామాలను మనం నివారించలేం కూడా. మేము కోరేదల్లా ఒకటే. ఒక అసాధారణమైన వ్యక్తికి తగిన గౌరవం, ప్రతిష్ట లభించాలన్నదే మా అభిమతం.

ప్ర : గెరిల్లా నాయకుడుగా 'చే' ఎంత సమర్థుడు?

జ : ఈ విషయం చెప్పడానికి యుద్ధ వ్యూహాలలో నేనంత నిపుణురాలిని కాను. ఆయన సహచరులు ఆయన్ను గురించి చాలా గౌరవంగా మాట్లాడుకోవడం నేను విన్నాను. గెరిల్లా యుద్ధ తంత్రం గురించి ఆయనొక పుస్తకం రాశాడు. అమెరికా వారు ఇప్పుడా పుస్తకాన్ని తీవ్రంగా పఠించి గెరిల్లా యుద్ధ వ్యూహాలు నేర్చుకుంటున్నారు. వాటినే గెరిల్లాలతో యుద్ధంలో వాడుతున్నారు. శక్తిమంతుడైన శత్రువు ఆయన పుస్తకం లోంచి పాఠాలు నేర్చుకుంటున్నారంటే ఆయన యుద్ధ తంత్ర నిపుణుడని పరోక్షంగా ఒప్పుకున్నట్లే కదా!

ప్ర : చేగువేరా ఆదర్శాలకు ఈనాడున్న ప్రాసంగిత ఏమిటి?

జ : ఈనాటికీ అవి అనుసరణీయమే. ఎందుకంటే వేటికి వ్యతిరేకంగా పోరాడాడో, ఆ పరిస్థితులు ఇంకా అలానే ఉన్నాయి. ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసం ఇంకా పెరిగిపోయింది. పేద దేశాలను దోపిడీ చేయడం దారుణంగా పెరిగింది.

ప్ర : చేగువేరా వారసత్వం ఏమిటి?

జ : 'చే' వారసత్వం చాలా విస్తారమైనది. దానిలో అన్నింటికంటే ముఖ్యమైనది ఒక సరికొత్త సమాజాన్ని సృష్టించే నూతన మానవ ఆవిష్కరణ.

ప్ర : ఇప్పుడు టి-షర్ట్‌ల మీద కనిపించే ప్రతిమ అయిపోయారు 'చే'. ఈ పరిస్థితి ఇట్లా అయిందని మీరు విచారిస్తున్నారా?

జ : క్యాపిటలిస్టు సమాజంలో మార్కెట్ పెంచుకోవడానికి అమలు పరిచే వ్యూహం ఇది. అయితే ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉంటే మేం తప్పకుండా దానిని ఎదుర్కొంటాం. ఉదాహరణకు బీర్ బాటిల్లపైనో, సిగరెట్ పెట్టలపైనో ఆయన బొమ్మ వేస్తే మేం సరేమిరా అంగీకరించం. ఆయన బొమ్మను విచ్చల విడిగా, ఆనాలోచితంగా ఉపయోగించుకుంటే మేం అంగీకరించం. అయితే ఆయన ప్రతిమను పెట్టుబడిదారి మార్కెటింగ్ వ్యూహాలతో వ్యాపారపరం చేయాలనుకుంటే, అది బెడిసికొట్టింది. అది తిరుగుబాటు తత్వంతో ఉన్న యువతను ఒకే జెండా కింద ఐక్యం చేయడానికి తోడ్పడింది.

ప్ర : మీ నాన్నగారిని ప్రపంచం ఎట్లా గుర్తుంచుకోవాలని మీ అభిలాష

జ : మా నాన్న మనుషులను, ప్రపంచాన్ని ఎలా ప్రేమించాలో తెలిసినవాడు. ఆయన గొప్ప కమ్యూనిస్టు.

ప్ర : క్యూబా ప్రజలు మీ నాన్నగారి మరణ వార్తను ఎలా తట్టుకోగలిగారు?

జ : క్యూబా ప్రజలకు ఆ వార్త చాలా విషాదాన్ని మిగిల్చింది. మా నాన్న ఈ దేశంలో అడుగు పెట్టినప్పట్నుంచి వారు ఆయన్ను ప్రేమించారు. చాలా సంవత్సరాల తర్వాత కూడా, మా ప్రమేయం ఏమీ లేకుండానే ఇప్పటికీ మా నాన్న వలన వారి ప్రేమను పొందుతూనే ఉన్నాం. నేను శిశు వైద్యురాలిని. పిల్లలతో కలిసి పని చేయడాన్ని నేను ఇష్టపడతాను. కొన్ని కొన్ని సార్లు వారు నన్ను ఎంతో ఆశ్చర్యంలో ముంచెత్తుతారు. నేను రాసే మందుల చీటీ మీద వంశనామాలు రెండు (గువేరా, మార్చ్) చూసి, నేను 'చేగువేరా' కూతురునని తెలుసుకొని, ఆశ్చర్యంతో అడుగుతుంటారు – 'మీరు 'చే' కూతురట! నిజమా!' అని. నేను అవునని చెప్పగానే, చాలా సీరియస్‌గా నన్ను చూసి 'ఆ! అందుకే నీవంత మంచి దానివి' అంటుంటారు. (నవ్వుతూ) 'ఇది విచిత్రం. చాలా సంవత్సరాలు వైద్య విద్యనభ్యసించి పని ఫ్లిలల వైద్య నిపుణురాలిగా పనిచేస్తూ కూడా 'చేగువేరా' కూతురును కాబట్టే నేను మంచిదాన్ని... దీన్ని మరో కోణంలో కూడా చూడవచ్చు. ఒక ఐదేళ్ల కుర్రవాడు, 'చే' చాలా మంచివాడు

కాబట్టే.. ఆయన కూడా మంచిదే అయి ఉండాలని అనుకోవడం... ఈ ఆలోచన మనసుకు హత్తుకునేలా ఉంది.'

ఒకసారి నేను భయపడ్డాను కూడా. నేనొక స్కూలుకు వెళ్లాను. స్కూలు పిల్లలంతా నన్ను చుట్టుముట్టారు. ఆ జన సముద్రంలో పడి కొట్టుకుపోతానేమో అనిపించింది. ఆ రోజు కనీసం 600 మంది పిల్లలను నేను ముద్దు పెట్టుకొని ఉంటాను.

విప్లవం విజయవంతం అయినప్పటి నుండి క్యూబా దేశం ఆర్థిక దిగ్బంధం ఎదుర్కుంటుంది. యూరప్ ఖండంలో ఉన్న సోషలిస్టు శిబిరం సహాయంతో నెగ్గుకు వస్తున్నాం. అది కూడా మృగ్యమైనపుడు, ఆర్థికంగా అధమ స్థాయికి దిగజారిపోయాం. ఆ సమయంలో 'గువాంటనామో'లో ఒక పాఠశాలకు వెళ్లాను. ఒక చిన్న బాలిక నా దగ్గరకు వచ్చి రెండు పెన్సిళ్లు బహుకరించింది. నేను ఆ అమ్మాయితో అన్నాను. 'స్వీటీ, ఈ పెన్సిళ్లతో నాకంటే నీకే ఎక్కువ అవసరం ఉంటుంది. నీవే ఉంచుకో వీటిని.' ఆ అమ్మాయి కొంచెం బాధపడి నాతో అన్నది – 'దయచేసి వద్దనకండి. నేనివ్వగలిగింది మీకిదే.' వాళ్లకు 'చే' అన్న మనిషి తెలుసు. ఆయన ఇప్పుడు లేడు. కాబట్టి ఆయనపై ఉన్న ప్రేమను ఆయన పిల్లల వైపు మరల్చుకున్నారు. ఎంత మంచి విషయం!

ప్ర : ఒక వీరుని కూతురుగా పెరగడం మీకు ఎలా ఉండింది?

జ : మా అమ్మ నాకు పెట్టని కోటలా ఉండింది. మేము ప్రత్యేకమైన పిల్లలం అన్న భావన రానివ్వలేదు మా అమ్మ. అందరి పిల్లల లాగా మా బాల్యమూ మామూలుగానే గడిచింది.

ప్ర : మీరు 'చే' కూతురు అని తెలిసిన తర్వాత స్కూల్‌లో మీ సహ విద్యార్థుల ప్రతిస్పందన ఎలా ఉండింది?

జ : సమయంలో అదొక ప్రత్యేకమైన విషయంగా ఎవరూ పరిగణించ లేదు. మమ్మల్ని స్కూల్లో కార్లో ఎవరూ దింపేవాళ్లు కాదు. మా వెంట అంగరక్షకులు ఎవరూ ఉండేవారు కాదు. మేము సాధారణ పిల్లల లాగే స్కూలు జీవితం గడిపాము. మేము వయస్సులో పెద్దవాళ్లుగా పెరిగిన తర్వాత కొంత మార్పు వచ్చింది. ఎందుచేతనంటే క్యూబాలోని టెలివిజన్‌లో మమ్మల్ని చూపించే వాళ్లు. నిన్న నేనొక దుకాణానికి వెళితే అక్కడ వాళ్లు నన్ను చూసి అడిగారు 'మిమ్మల్ని టివిలో చూస్తుంటాం' అని. నేను అవునని నవ్వాను. ఇంకోసారి నేను బ్యాంకుకు వెళితే అక్కడ పొడుగాటి క్యూ ఉంది. క్యూలో నిలబడ్డ పెద్ద మనిషి ఒకాయన నన్ను గుర్తుపట్టి 'మీరు ముందుకెళ్లడానికి మాకెవరికీ అభ్యంతరం లేదు' అన్నాడు. నేను వినయపూర్వకంగా ఆ ప్రతిపాదనను తిరస్కరించాను.

ప్ర : మీపై మీ నాన్నగారి ప్రభావం ఏ మేరకు ఉంది?

జ : నా చుట్టూ ఉండే ప్రజలకు ప్రయోజనకారిగా ఉండే విధంగా జీవించాలనుకుంటాను. మేము ఆ విధంగా జీవించాలని మా నాన్నగారు భావించేవారు. తన పిల్లలు ప్రత్యేకంగా ఉండాలని ఆయనెప్పుడూ అనుకునేవారు కాదు. వారు ఎక్కడ జీవించినా ప్రజలకు ఉపయోగపడేలా విలక్షణంగా జీవించాలని కోరకునేవారు. ఒక డాక్టరుగా, రెండు అంతర్జాతీయ సేవా కార్యక్రమాలు చేపట్టాను. ఒకటి నికరాగ్వాలో, మరొకటి 'అంగోలా'లో. నేను 'ఈక్వడార్'లో స్థానికులతో కలిసి పని చేశాను. 'అర్జెంటీనా'లో వైద్య బృందంతో పని చేశాను. 'బ్రెజిల్' దేశంలో భూమిలేని ప్రజల పోరాటంలో పాల్గొన్నాను. నేను ప్రజలకు ఉపయోగపడేలా జీవించాలనుకుంటున్నాను.

జాత్యహంకారానికి, వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్న నిబద్ధతతో 'అంగోలా' దేశం నుండి వచ్చేశాను. ఒక రష్యన్ రచయిత మాటల్లో చెప్పాలంటే నీ జీవితం ఎలా గడపాలంటే చనిపోయేటప్పుడు నేనిన్నాళ్లు వృథాగా కాలం గడిపానే అన్న బాధ లేని విధంగా నీవు జీవించాలి. ఆ రకంగా జీవించేలాగా ప్రయత్నం చేస్తున్నాను.

ప్ర : మీ నాన్నగారు ఒక వైద్యుడు. మీ జీవనోపాధి ఎన్నుకొనే విషయంలో అది ఏమైనా ప్రభావం కలగజేసిందా?

జ : కొంతవరకు అది వాస్తవమే. కాని అంతిమంగా అది నా నిర్ణయమే. నేను నా ప్రజలకు చాలా రుణపడి ఉన్నాను. కొంతలో కొంతైనా వారికి సేవా రూపంలో తిరిగి ఇవ్వాలి. వారికి కావలసిన అతి అవసరం తీర్చే విషయంలోనే వారికి దగ్గరవుతాను. ఒక శిశువు మోముపై చిరునవ్వు చూడడంలోనే నేను ఆనందాన్ని అనుభవిస్తాను.

ప్ర : నిర్బంధం వైద్య రంగాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది?

జ : నిర్బంధం ప్రభావం వైద్యరంగం మీద ఎక్కువగానే ఉంది. అయితే క్యూబాలో వైద్యులు సంసిద్ధంగానే ఉన్నారు. మా రోగులకు ఎలా సహాయకారిగా ఉండాలో మాకు బాగా తెలుసు. కాని, కొన్నిసార్లు మాకు సహాయం చేసే మార్గాలు మూసుకుపోతాయి. ఉదాహరణకు నా పెద్ద కూతురు ఒక సర్జన్. తాను కృత్రిమ అవయవాల లభ్యత విషయంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఇక్కడ ఎవరూ కృత్రిమ అవయవాలను అమ్మరు. ఎందుకంటే అవి అమెరికాలో తయారవుతాయి. తలలో నీరు చేరే (హైడ్రో సిఫాలస్) వ్యాధితో ఓ అమ్మాయి మా దగ్గరికొచ్చింది ఓసారి. నీటిని బయటకు తీసే గొట్టం (ట్యూబ్) ఒకటి కావలసి వచ్చింది (క్యాథటిర్). మా వద్ద నాణ్యమైన క్యాథటిర్ లభించక ఆ అమ్మాయికి మెదడులో నీరును పూర్తిగా తీసివేయడానికి 11 సార్లు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. రోగ నిర్ణయానికి సంబంధించిన విషయాలలోను ఈ ఆర్థిక నిర్బంధం చాలా ప్రభావం చూపిస్తున్నది. ప్రత్యామ్నాయాల కోసం చూడాల్సి వస్తున్నది. సహజ వైద్యం వాటిల్లో ఒకటి. రోగ నివారణ అన్న అంశాన్ని బాగా ప్రచారంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాము. రోగాన్ని నయం చేయడం కన్నా అది రాకుండా నివారించడం సులభం. క్యూబాలో వైద్య రంగం ప్రాథమికంగా ఈ అభిప్రాయంలో ఉంది.

ప్ర : 'రెమినిసెన్సస్' (జ్ఞాపకాలు) అన్న పుస్తకానికి ముందు మాటలో మరింత మంచి సమాజం కోసం మన పోరాటాన్ని కొనసాగించాలని మీరు రాశారు. ఆ కోరిక ఎంత వరకు వాస్తవిక రూపం దాల్చే పరిస్థితులున్నాయి? ముఖ్యంగా, మనం నివశిస్తున్న ఈ ప్రపంచంలో ద్వేషభావం పెచ్చరిల్లిపోతున్న ఈ రోజుల్లో!

జ : ముఖ్యమైన విషయమేమిటంటే, మనం యుద్ధానికి భయపడకూడదు. అమెరికా దేశం ప్రజల సామూహిక శక్తిని నామరూపాలు లేకుండా చేయడానికి యుద్ధాన్ని ఉపయోగించుకుంటుంది. కాని, క్యూబా ఒక ప్రముఖమైన విషయాన్ని ప్రపంచానికి తెలిపింది. మేము ఈ భూ మండలం మీదనే అత్యంత శక్తివంతమైన దేశానికి 90 మైళ్ల దూరంలో నివసిస్తుంటాం. అయితే అది మమ్మల్ని నాశనం చేయలేకపోయింది. ఎందుచేత? మొదటిది, మా ఐకమత్యం. రెండవది, మేము సంస్కృతి పరంగా నాగరికులం. మా నాగరికత వల్ల మేం స్వేచ్ఛగా జీవిస్తాం. మేము స్వేచ్ఛా ప్రియులం.

అంపశయ్యపై ఆర్‌టిసి

***తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ నష్టాల ఊబిలోకి వెళ్లడానికి యాజమాన్య విధానాలే కారణమనీ, ఆ నెపాన్ని కార్మికులపై నెట్టి పాలకులు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని అంటున్నారు* కృష్ణతేజ**

ప్రజా రవాణా సంస్థల్లో అరుదైన రికార్డుల సృష్టికర్త ఉమ్మడి ఆర్‌టిసి. అద్భుతమైన మానవ వనరులు, అనితరసాధ్యమైన మౌలిక వసతులు, స్థిర, చరాస్తులు ప్రయాణికుల అపూర్వ ఆదరణ ఆర్‌టిసి స్వంతంగా ఉండేది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఎపిఎస్ ఆర్‌టిసి చీలిక అనివార్యమై 'తెలంగాణ స్టేట్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ'గా 2014 సంవత్సరంలో ఆవిర్భవించింది. ఆనాటి నుండి ఉమ్మడి ఆర్‌టిసి గతంలో సాధించిన ఘనమైన ప్రపంచ రికార్డులన్నీ టిఎస్ ఆర్‌టిసి వారసత్వంగా కొనసాగిస్తుంది. 58 వేల మంది కార్మికుల అంకిత భావం, నిబద్ధతకు ఇదే నిదర్శనం. రవాణా బస్సులను ఉత్తమంగా నిర్వహిస్తూ, ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నందుకు, జాతీయ స్థాయిలో 'ఉత్తమ రవాణా సంస్థ'గా అవార్డు అందుకోవడం, 2017 సంవత్సరంలో ఎఎన్‌ఆర్‌టియు అవార్డులలో రెండు జాతీయ స్థాయి అవార్డులు టిఎస్ ఆర్‌టిసి దక్కించుకోవడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా చెప్పవచ్చు. మన డ్రైవర్ ఒక లీటర్ డీజిల్‌తో ఆరు కిలోమీటర్ల దూరం బస్సు నడపడం భారతదేశంలోనే అరుదైన రికార్డు.

ఎంతో సమర్థవంతంగా, నాణ్యమైన రవాణా సేవలందించిన ఉమ్మడి ఆర్‌టిసి గత పాలకుల విధానాల వల్ల పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయింది. విభజన అనంతరం సంపన్న రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రంలో టిఎస్ ఆర్‌టిసి మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధిచెందుతుందని, రాష్ట్ర ప్రజలు, ఆర్‌టిసి కార్మికులు ఆశపడ్డారు. అందరి ఊహలకు భిన్నంగా ఉద్యమ నాయకుల పాలనలోను టిఎస్ ఆర్‌టిసి నష్టాల్లో కునారిల్లుతుంది. అసలు ఆర్‌టిసి నష్టాలకు కారణాలేంటి? బంగారు తెలంగాణ కోసం కలలు కంటున్న మన ముఖ్యమంత్రి స్వయంగా ఆర్‌టిసిని మూసేస్తానని ఎందుకు ప్రకటిస్తున్నారు?

ఆర్‌టిసి నష్టాలకు కారణాలు

తెలంగాణ ఆర్‌టిసివి సహజ నష్టాలు కావు. సీమాంధ్ర పాలకుల విధానాలనే మన ఏలికలు ఆర్‌టిసిపై రుద్దడం వల్లనే సంస్థ నష్టాల పాలైంది. ఆర్‌టిసి సముపార్జించే ఆధాయంలోనే వాటా పొందే విధంగా మోటారు వాహనాల పన్నును ఆనాడు చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టారు. అదే విధానాన్ని కెసిఆర్ ప్రభుత్వం కొనసాగిస్తుంది. అదే పశ్చిమ బెంగాల్, కర్ణాటక ప్రభుత్వాలు గత పది సంవత్సరాలుగా ఆ రాష్ట్ర ఆర్‌టిసిలపై మోటారు వాహనాల పన్ను రద్దు చేసింది. ప్రైవేట్ ఆపరేటర్ల యజమానుల కంటే టిఎస్ ఆర్‌టిసి నేటికీ అధిక మొత్తంలో ఎంవి ట్యాక్స్ చెల్లిస్తుంది. సామాజిక బాధ్యతగా ఆర్‌టిసి నడిపిస్తున్న పల్లె వెలుగు, పూర్తి నష్టాల్లో ఉన్న సిటీ సర్వీసులకు కూడా కెసిఆర్ ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇవ్వడం లేదు. అంతేగాక సమాజంలోని వివిధ వర్గాలకు ఆర్‌టిసి ఇస్తున్న బస్సు పాసుల 'రాయితీలు' కూడా ప్రభుత్వం సకాలంలో తిరిగి చెల్లించడం లేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో అక్రమంగా ప్రజలను రవాణా చేసే వాహనాల సంఖ్య పెరిగినట్లు ఒక సర్వేలో వెల్లడైంది. అక్రమ

మూడవది, మాకొక సామాజిక భావజాలం ఉంది. మా జీవన శైలి ప్రత్యేకమైనది. దాన్ని మేం మార్చుకోదలచుకోలేదు. దానిని ఇంకా అభివృద్ధి పరచుకోవాలి. దాన్ని మేం మార్చుకో దలచుకోలేదు.

ప్ర : ఇంకొక పది సంవత్సరాల తర్వాత 'క్యూబా' ఏ స్థితిలో ఉంటుంది చెప్పగలరా?

జ : *ఈ ప్రశ్నకు సమాధానం ప్రస్తుత అమెరికా అధ్యక్షుని (డొనాల్డ్ ట్రంప్) తిక్కదనంపై ఆధారపడి ఉంటుంది. మానవ జాతిని నాశనం చేసేంత శక్తిమంతుడాయన, ఆ మానవ జాతిలో మేమూ భాగమే. ఇదీ సమస్య, ఆయనకు ఆ శక్తి ఉంది. కాని వివేకం లేదు. ఆయనకున్న శక్తిని తలచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇంత బలవంతుడా అని. అతడు ఆ శక్తిని సక్రమంగా వినియోగిస్తాడా? అయితే మనకున్న రక్షణాంశాలు ఏమిటి? వాస్తవ పరిస్థితిని గమనించకుండా మనం సరైన పద్ధతిలో జీవించలేం.*

ఒక ప్రముఖ ఆర్థిక వేత్త ఒక మంచి మాట చెప్పాడు. అది నన్ను ఎంతో ప్రభావితం చేసింది. నైతిక విలువలు కోల్పోయిన మానవజాతి ఉనికిలో ఉండే అర్హతను కోల్పోతుంది అన్నది ఆ ఆర్థికవేత్త చెప్పిన మాట. ఈ అర్హతను మనం కోల్పోతున్నాం. ప్రపంచమే ఆ అర్హతను కోల్పోతున్నది. మనం మన భూ భాగాన్ని సర్వనాశనం చేసుకునే పనిలో ఉన్నామన్న విషయం మనకు అర్థం కావడం లేదు. లేదా మనం అర్థం చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. మనం వీటిమీద పోరాటం చెయ్యము. ఈ సోమరితనం వల్ల గొప్ప వినాశనం జరిగే పరిస్థితి నెలకొంది. తిక్కగా ఆలోచించే ఇలాంటి మనుషులు అధికారంలో ఉండడం వల్ల పరిస్థితి ఇంకా సంక్లిష్టంగా తయారవుతున్నది.

కాబట్టి మేల్కొనే తరుణం ఆసన్నమైంది. మనం త్వరితగతిన మేల్కొనాలి. సమయం లేదు!

(అనువాదం : రాజేంద్రబాబు అర్విణి) వీ

రవాణాను అరికడతానని, ఆర్‌టిసి అప్పులు, నష్టాల బారం ప్రభుత్వమే భరిస్తుందని, రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్‌టిసికి నిధులు కేటాయిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్‌టిసి కార్మికులకు కూడా వేతనాలు ఇస్తామని తెలంగాణ రాష్ట్ర సమితి చేసిన ఎన్నికల వాగ్దానాలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. కనీసం కాంట్రాక్టు క్యారేజీల్లాగా పర్మిట్లు తీసుకుని, తెలంగాణ ప్రాంతంలో స్టేజి క్యారేజీలుగా తిప్పుతూ కోట్ల రూపాయలు అర్జిస్తున్న సీమాంధ్ర పెట్టుబడి దారులను కూడా నేటి పాలకులు కట్టడి చేయడం లేదు. ఒరిస్సా రాష్ట్రంలో తక్కువ రేట్లతో పర్మిట్లు తీసుకుని, తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా దోపిడి చేస్తున్న ప్రైవేట్ ఆపరేటర్లను ఆపే ధైర్యం మన అధికారులకు లేదు.

రాష్ట్ర ప్రభుత్వమే కాదు, కేంద్ర ప్రభుత్వం కూడా టిఎస్ ఆర్‌టిసి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రతిరోజు ఒక కోటి పది లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న ఆర్‌టిసి, నెలకు 58 లక్షల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తోంది. దీనిపై 23 శాతం అమ్మకపు పన్నును కేంద్ర పెట్రోలియం శాఖ ఆర్‌టిసి ముక్కు పిండి మరీ వసూళ్లు చేస్తుంది. ఇక టోల్‌ప్లాజా, స్పేర్ పార్ట్స్‌లపై సేల్ ట్యాక్సు, సెంటర్ సర్వీస్ టాక్సు, వ్యాట్, జిఎస్‌టి ద్వారా పాలకులు చట్టబద్ధంగా చేస్తున్న దోపిడీ షరా మామూలుగానే కొనసాగుతుంది. ఇక మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మెట్రో రైలు ప్రవేశంతో ప్రతిరోజు రెండు లక్షల మంది ప్రయాణికులు ఆర్‌టిసికి దూరమయ్యారు. వీటికి తోడు తీర్చలేని అప్పులు, భరించలేని వడ్డీల వలన ఆర్‌టిసి బస్సులు నడపలేని దుస్థితికి నెట్టబడింది. ఏతావాతా ఆర్‌టిసి ఒక కిలోమీటరు బస్సు నడిపితే వచ్చే ఆదాయం కన్నా, ఖర్చు రెండు రూపాయల కంటే అధికమైంది.

ఎంవి ట్యాక్సును, డీజిల్‌పై అమ్మకపు పన్నును రద్దు చేయాలి. ఆర్‌టిసి జిఎస్‌టి, టోల్‌ప్లాజా నుండి మినహాయించాలి. ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణిచివేయాలి. ఇప్పటివరకు ఉన్న ఆర్‌టిసి అప్పులను ప్రభుత్వం భరించాలి. రాయితీల మొత్తాన్ని ప్రభుత్వం అదే నెలలో తిరిగి ఆర్‌టిసికి చెల్లించాలి. ఈ చర్యల వల్లనే ఆర్‌టిసి లాభాల బాట పడుతుంది. కెసిఆర్ బంగారు తెలంగాణ స్వప్నం సాకారమౌతుంది.

అటవిక యాజమాన్యం

ఇసుక నుండి తైలం తీయడానికే ఏ యాజమాన్యమైనా ప్రయత్నిస్తుంది. కాని ఆర్‌టిసి కార్మికులు ఇసుక నుండి పసిడి ఉత్పత్తి చేస్తున్నా, ఈ అటవిక యాజమాన్యానికి కాని, పాలకులకు కాని సంతృప్తి లేదు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆర్‌టిసి కార్మికులు ఉత్పాదకత, నైపుణ్యం, అంకితభావం, నిబద్ధత తారా స్థాయిలో ఉంది. కార్మికుడి ఉత్పాదకత ఏ ఆర్‌టిసిలో లేనంత అత్యధికంగా 310 కి.మీ. చేరింది. బస్సు వినియోగం 99 శాతం వృద్ధి అయింది. ప్రమాధాల రేటు అత్యల్పంగా తగ్గింది. టైరు జీవిత కాలం పెరిగింది. ఇవన్నీ భారతదేశంలోనే టిఎస్ ఆర్‌టిసి కార్మికులు సాధించిన అత్యున్నతమైన రికార్డులు.

ఆర్‌టిసి అత్యున్నత వైభవానికి డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లే మూల స్థంబాలు. సంస్థలో బాగా అశ్రద్ధకు గురైన వీరు 80 శాతం మించి ఉన్నారు. కేటగిరి సమస్యలతో సతమతమౌతున్న వీరిని పేదరికం, అనారోగ్యం, ఆధిపత్య అధికారం పోరాటాలకు దూరం చేశాయి. అత్యధిక శ్రమ, అత్యల్ప వేతనంతో వీరు అట్టుడుకుతున్నారు. ఆర్‌టిసి మహా ప్రస్థానంలో ఈ త్రయం పని పరిస్థితులు మెరుగు పర్చడానికి యాజమాన్యం ఎన్నడూ ప్రయత్నించలేదు. ఇపికె, కెఎంపిఎల్, మెకానిక్ ఫెయిల్యూర్ నెపంతో వీరికి శిక్షలు అధికమయ్యాయి. ఈ త్రయం పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరితో వీరు శారీరకంగా, మానసికంగా, సామాజికంగా ఎంతో నష్టపోయారు. ఒక ఉద్యోగి తన జీవిత కాలంలో 30 సంవత్సరాలు సంతృప్తి లేని జీవితం గడిపామనే భావన వీరిలో గూడుకట్టుకుంది. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడి వలన డ్రైవర్, కండక్టర్ గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, బిపి, షుగర్, పక్షవాతం, ఫైల్స్ లాంటి వ్యాదులు వృత్తి రుగ్మతలుగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసిలో గుండెపోటుతో మరణిస్తున్నవారి సంఖ్య రోజు రోజుకు అధికమౌతుంది.

వాస్తవం ఇలా ఉంటే, కార్మికుల వల్లనే ఆర్‌టిసికి నష్టాలు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. విధి విధానాలతో సంబంధం లేని, ప్రతిరోజు 10 నుండి 15 గంటలు కష్టపడుతున్న కార్మికులను నష్టాలకు బాధ్యులను చేసి అధికారులు చేతులు దులుపుకోవడం సభ్య సమాజం హర్షించదు.

ప్రయాణానికి పునర్‌నిర్వచనం పేరుతో ప్రవేశపెట్టిన వజ్ర, గరుడ, రాజధాని ఎపి సర్వీసులు ఎందుకు నష్టాలు చవి చూస్తున్నాయో ప్రయాణికులకు బాగా తెలుసు. ఇందులో అధికారుల అసమర్ధత, అవగాహన లోపం తప్ప, కార్మికుల పాత్ర ఆవగింజంత కూడా లేదు.

కార్మికుల ప్రమేయం లేకుండా జరిగిన సంఘటనలోనూ యాజమాన్యం కార్మికులను బలిపశువులను చేస్తుంది. సస్పెన్షన్లు, రిమూవర్స్, ఇంక్రిమెంట్లలో కోతలు, డెబిట్లు నిత్యకృత్యమయ్యాయి. పెండ్లి, చావు లాంటి సందర్భాలలోనూ సెలవులు మంజూరు కావడం లేదని కార్మికులు వాపోతున్నారు. పెండ్లి పందిల్లో, స్మశానాలలో సెల్ఫీ దిగి పంపిస్తే తప్ప సెలవు మంజూరు కావడం లేదు. చిన్న చిన్న కేసులను కూడా సానుభూతితో, మానవతా దృక్పథంతో పరిష్కరించవద్దని కింది స్థాయి అధికారులకు యాజమాన్యం 1/17 ద్వారా సూచనలు ఇచ్చింది. అసలే మొరటుగా వ్యవహరించే అధికారులు ఈ సూచనతో రెచ్చిపోతున్నారు. నిజామాబాద్ డిపోలో సమస్యలపై సోషల్ మీడియాలో స్పందిస్తున్నందుకు సంజీవ్ అనే వామపక్ష ట్రేడ్ యూనియన్ నాయకుడ్ని ఆర్‌టిసి అధికారులు విధుల నుండి తొలగించారు. హైదరాబాద్‌లోను ఒక కండక్టర్‌పై విచారణ కొనసాగుతుంది. నారాయణపేట డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు రేవంత్‌రెడ్డితో కలిసి దిగిన ఫోటో పత్రికల్లో వచ్చినందుకు విచారణ జరుగుతుంది. ఆర్‌టిసిలోని గుర్తింపు సంఘానికి టిఆర్ఎస్ నాయకుడు గౌరవాధ్యక్షుడుగా ఉన్న సంగతి ఆర్‌టిసి యాజమాన్యం మర్చిపోయినట్లుంది. యాజమాన్యం వేదింపులు అధికమవ్వడంతో కార్మికులు డిపోల్లోను, బస్సుల్లోను ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్‌టిసి కార్మికులు నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో మెరుపు సమ్మెలు చేశారు. ఓర్పుగా ఉండే మనిషి ఆగ్రహించవచ్చు జాగ్రత్త అని హెచ్చరించిన కవి వాక్కు ఆర్‌టిసి యాజమాన్యం చెవికెక్కపోవడం దురదృష్టకరం.

మూసివేతలు – తీసివేతలు

ప్రగతి రథం – ప్రజల నేస్తం అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ, ఆచరణలో ప్రజల శత్రువుగా మారింది. 2014 నుండి నేటి వరకు సుమారు 500 రూట్లలో బస్సు సర్వీసులను రద్దు చేసుకుంది. ఆక్యుపెన్సీ రేసియో తగ్గిందనే పేరుతో ఆర్‌టిసి పల్లె వెలుగు దూరమైంది. దీంతో గ్రామీణ ప్రజలు, విద్యార్థులు అధిక వ్యయంతో ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఏ సంస్థ అయినా వ్యాపారాన్ని విస్తరంచుకోవడానికి, మౌలిక వసతులు సమకూర్చుకోవడానికి అర్రులు చాస్తోంది. కాని ఆర్‌టిసి అందుకు భిన్నంగా 'మూసివేతలు – తీసివేతలు' సూత్రాన్ని అమలు చేస్తోంది. సంస్థ ఆవిర్భవించిననాడు ఆర్‌టిసిలో 58 వేల మంది కార్మికులు ఉంటే నేటికి 53 వేలకు కుదించబడింది. ఈ మూడు సంవత్సరాలలో ఉద్యోగాల నుండి తీసివేసినవారు, రిటైర్డ్ అయినవారు మూడు వేలకు పైబడే ఉంటారు. రాష్ట్ర విభజన అనంతరం ఆర్‌టిసిలో ఒక్క ఉద్యోగి కూడా భర్తీ కాకపోవడం గమనార్హం. గ్యారేజీలో బస్సుల మరమ్మత్తుల నుండి సెక్యూరిటీ సిబ్బంది వరకు 'అవుట్ సోర్సింగ్' మయం అయింది.

ఆర్‌టిసి నష్టాలకు కల్లాకపటం లేని, లోకం పోకడ తెలియని కార్మికులను బాధ్యుల్ని చేస్తూ, అధికారులు ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి విశ్వసించడం, సంస్థను మూసేస్తానని బెదిరించడం విడ్డూరంగా ఉంది. ముఖ్యమంత్రికి చెందిన ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం గత సంవత్సరం పసుపు, అల్లంకు గిట్టుబాటు ధర లేనందున నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరం పంట మార్పిడి చేసి బొప్పాయి వేసి లాభాలు గడించారు. నష్టాలొచ్చిన ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రాన్ని అమ్మాలనే ఆలోచన చేయని ముఖ్యమంత్రికి ఆర్‌టిసి మూసి వేయాలనే ఆలోచన రావడం యాదృచ్ఛికం కాదు. ఆయన కడుపులో ఉన్నది ఆరోజు క్కకడం జరిగింది. ఉమ్మడి ఆర్‌టిసికి రవాణా మంత్రిగా పనిచేసిన కాలం నుండే మన ముఖ్యమంత్రికి ఆర్‌టిసి పట్ల సదాభిప్రాయం లేదు.

ఈ నేపథ్యంలోనే ఆర్‌టిసిలో హైర్ బస్సులు కాంగ్రెస్ పాలనలో 18 శాతం ఉండేవి. దాన్ని 30 శాతం ఉండే విధంగా తెలంగాణ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. సిటీ సర్వీసుల్లో తప్ప మిగతా అన్ని సర్వీస్సుల్లో టిక్కెట్లు ఇచ్చే పనిని డ్రైవర్లకు అప్పజెప్పే ప్రయత్నం చేయడం, హైర్ బస్సు డ్రైవర్లకే టిక్కెట్ ఇష్యూంగ్ మెషిన్లు ఇచ్చి, అద్దె బస్సులపై ఆర్‌టిసి పర్యవేక్షణ కుదించడం లాంటి చర్యలకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్న చందంగా చంద్రబాబు కంటే స్పీడుగా కెసిఆర్ ఆర్‌టిసిని ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు.

నష్టజాతక ఆర్‌టిసిని ప్రభుత్వం వదిలించుకోవడానికి ఆరాట పడుతుంది. ఇందులో భాగంగానే వరంగల్ టైర్ రీ ట్రెడింగ్ షాప్‌ను మూసివేసింది. మియాపూర్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేయాలని నిర్ణయించారు. దీంతో టిక్కెట్ల కొరత ఏర్పడింది. టిమ్ మిషన్ల ఫెయిల్యూర్ వలన ఆర్‌టిసిలో నాన్ రెవెన్యూ కిలోమీటర్ల శాతం పెరిగింది. బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్ దింపుడు కళ్లెం స్థితికి చేరింది. తార్నాక ఆసుపత్రి పార్మసీ విభాగం, ఆర్‌టిసి కళాభవన్ నిర్వహణ ప్రైవేట్ పరమైంది. ఆర్‌టిసిలో ప్రైవేట్‌కు కానిదేది అనర్హం అన్న రీతిలో తాజా పరిస్థితి ఉంది.

ఆర్‌టిసి కార్మికుల గత వేతన ఒప్పందం మార్చ్‌లోనే ముగిసింది. 2017 ఏప్రిల్ నుండి నూతన వేతన సవరణ జరగవల్సి ఉంది. 2015 మే 13న మీడియా సమక్షంలో ఆర్‌పిఎస్ 2017 మార్చ్‌లోనే అమలు చేస్తామని మన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ 'దళితులకు మూడు ఎకరాల భూమి' లాగే మిగిలిపోయింది. ఆర్‌టిసిలో పేరుకుపోయిన సమస్య లన్నింటినీ టోకుగా పరిష్కరించాలంటే ఆర్‌టిసి కార్మికులకు 'ఐక్య పోరాటాలు' తప్ప మరో దగ్గర దారి లేదు.

ప్రమాదపు అంచున ప్రగతి చక్రాలు

ప్రజా రవాణా వ్యవస్థను ప్రభుత్వ పరిధిలోనే నిర్వహించాలనే సదుద్దేశంతో స్వాతంత్ర్యానంతరం ఆనాటి పాలకులు ఆర్‌టిసి యాక్టు 1950కి రూపకల్పన చేశారు. ఈ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1:2 నిష్పత్తిలో రాష్ట్ర ఆర్‌టిసీలకు మూలధన పెట్టుబడి సమకూర్చాలి. మోటారు వెహికల్ యాక్టుకు 1956, 1969, 1977లలో కేంద్ర ప్రభుత్వం పలు సవరణలు చేసి పరిపుష్టం చేసింది. ఆ చట్టంలోని 6 ఎ చాప్టర్‌ను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చారు. దీని ఫలితంగా ఆర్‌టిసిల జాతీయికరణ తేలికై, దేశ వ్యాప్తంగా 60 ఆర్‌టిసిలు ఏర్పడ్డాయి. ఆర్‌టిసిలు ప్రయాణికుల రవాణాను ఒక సవాలుగా స్వీకరించి, అద్భుత విజయాలు సాధించాయి. 1990 సంవత్సరం తర్వాత దేశంలో నూతన ఆర్థిక విధానాల ప్రవేశంతో పాలకులు ఆర్‌టిసిలకు ఇచ్చే క్యాపిటల్ కాంట్రిభూషన్ నిలిపి వేశారు. పాలకులే ఆర్‌టిసిల మోనోపలీని ప్రశ్నించడం మొదలు పెట్టారు. దీంతో ప్రజా రవాణా వ్యవస్థలో ప్రైవేట్ ఆపరేటర్ల ప్రవేశం సులువైంది. వీరు కాంట్రాక్టు క్యారేజీల పర్మిట్లతో స్టేజి క్యారేజీలుగా బస్సులు నడిపి ఆర్‌టిసీల ఆదాయాన్ని లూటీ చేశారు. ప్రైవేట్ ఆపరేటర్లకు ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక ప్రోత్సాహం, అధికారగణం అనైతిక చర్యల వల్ల ప్రజా రవాణాలో ఆర్‌టిసీల వాటా 20 శాతానికి కుదించబడింది. దేశ వ్యాప్తంగా ఉన్న 55 ఆర్‌టిసీలలో కేవలం మూడు ఆర్‌టిసిలు మాత్రమే ప్రస్తుతం లాభాల్లో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మధ్యప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్ ఆర్‌టిసిలను ప్రభుత్వాలు మూసివేశాయి. మరికొన్ని ఆర్‌టిసిలు ప్రమాదపు అంచుకు చేరాయి.

దేశంలో ఆర్‌టిసిల ఆత్మహత్యలకు ఇది చాలదన్నట్లు 2014 సెప్టెంబర్‌లో మోడీ నాయకత్వాన ఎన్‌డిఏ ప్రభుత్వం 'రోడ్డు భద్రతా బిల్లు 2014'ను తెరపైకి తెచ్చింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా రవాణా రంగ కార్మికులు దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన తెలియచేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు వెనక్కివేసి 'చివరి మైలు కనక్టివిటీ' పేరుతో మరో రూపంలో ఎంవి ట్యాక్స్ సవరణ బిల్లు తీసుకొచ్చింది. మందబలం తో దీన్ని లోక్‌సభ ఆమోదించింది. రాజ్యసభలో తీవ్ర నిరసన వల్ల బిల్లు సెలక్టు కమిటీకి పంపారు. ఈ బిల్లు చట్టమైతే ఆర్‌టిసిలకు నేదున్న రక్షణలన్నీ గాలిలో కలిసిపోతాయి. ఇక ఆర్‌టిసీల మనుగడ కష్టసాధ్యమవు తుంది. రోడ్డు రవాణా వ్యవస్థ మొత్తం కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పోతుంది. లక్షలాది మంది రవాణా రంగ కార్మికులు రోడ్డున పడతారు. ప్రయాణం పేద ప్రజలకు మోయలేని భారం అవుతుంది. దేశంలోని ఆర్‌టిసీల పరిరక్షణ కేవలం ఆర్‌టిసి కార్మికుల బాధ్యత మాత్రమే కాదు. ఆర్‌టిసీల పరిరక్షణ కోసం దేశ ప్రజలందరూ కదలాలి, పోరాడాలి.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్) వీ

సాంఘిక సంక్షేమ గురుకుల విద్య-ప్రగతి

సాంఘిక సంక్షేమ గురుకులాలకు ప్రభుత్వం చేయూతనందిస్తే అద్భుత ఫలితాలు వస్తాయనీ, అవకాశాలు కల్పించిన చోట విద్యార్థులు ఆశించిన దానికన్నా మంచి ఫలితాలు సాధించారనీ అంటున్నారు **రుద్రవరం సునీల్**

ప్రతి ఉద్యమానికి ఒక ప్రాతిపదిక ఉంటుంది. న్యాయమైన డిమాండ్ ఉంటుంది. ఆ ఉద్యమం తలెత్తడానికి ఒక చారిత్రక నేపథ్యం కూడా ఉంటుంది. అలాంటి అంశాలతో మొదలైన ఉద్యమాలు ప్రజల ఆమోదం, భాగస్వామ్యం వల్ల విజయవంతం అవుతూ ఉంటాయి. అలాంటిదే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం. తెలంగాణ ప్రాంతానికి ఒక చారిత్రక నేపథ్యం ఉంది.

శాతవాహనుల కాలం నుంచి మొదలు నిజాం పాలనా కాలం వరకు స్వతంత్రమైన వ్యక్తిత్వంతో తెలంగాణ ప్రాంతం విలసిల్లింది. ఆధునిక లక్షణమైన విద్యాభివృద్ధికి చివరి నిజాం కృషి చేశాడు. తెలంగాణలోని భూస్వామ్య వ్యవస్థ వల్ల గ్రామీణ విద్యాభివృద్ధి కలగా మిగిలిపోయింది.

గ్రామీణ ప్రాంతం మీద భూస్వాముల అజమాయిషీ వల్ల పాఠశాల విద్య ప్రజలకు చేరువ కాలేదు. కానీ, హైదరాబాదు విశ్వనగరంగా అప్పటికే అన్ని దేశాలను, ప్రాంతాలను ఆకర్షించింది. ముఖ్యంగా నిజాం కాలేజీ దక్షిణాదిలోనే పెద్ద విద్యాకేంద్రంగా భాసిల్లింది.

ఉర్దూ, ఇంగ్లీషు, పర్షియన్, తెలుగు భాషల్లో పాఠశాలలను నిజాం ఏర్పాటు చేశాడు. ముఖ్యంగా భాగ్యరెడ్డి వర్మ (మేదరి భాగయ్య), అరిగె రామస్వామి, బియెస్ వెంకట్రావు లాంటి వ్యక్తులు అస్పృశ్యుల విద్యావ్యాప్తికి కృషి చేశారు. అప్పటి నిజాం ప్రభుత్వం కూడా కింది వర్గాల విద్యా వికాసానికి చేయూతనిచ్చింది.

అయితే, బలవంతంగా ఉర్దూను ప్రజల మీద రుద్దుతున్న విధానాన్ని ఆంధ్ర మహాసభ లాంటి సంస్థలు ఆ రోజుల్లోనే విమర్శించాయి. నిజాం రాచరిక వ్యవస్థ రద్దయి, ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ రాజ్యం విలీనమైన తర్వాత భారత రాజ్యాంగ పరిధిలోకి తెలంగాణ ప్రాంత ప్రజలు వచ్చారు. హైదరాబాదు 'రాజ్యం' స్థానంలో 'రాష్ట్రం' ఏర్పడింది. హైదరాబాదు రాష్ట్రం ప్రత్యేక సంస్కృతీ సంప్రదయాలు, పాలనా పద్ధతులున్నప్పటికీ అది ఎక్కువ కాలం ఒక రాష్ట్రంగా నిలబడలేక పోయింది.

భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో హైదరాబాదు రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేశారు. హైదరాబాదు ఆంధ్రప్రదేశ్ రాజధానిగా మారింది. తెలంగాణ ప్రాంతం తన గుర్తింపును కోల్పోయింది. ఆంధ్ర గుర్తింపును సంతరించుకుంది.

అనేక దశాబ్దాల పాటు తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధి కుంటుపడ్డది. ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యారంగం వెనకబడ్డదని ప్రొ. జయశంకర్ అభిప్రాయ పడ్డారు.

ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ – తొలి దశ (1983–2012)

తెలంగాణ ప్రాంతంలోని షెడ్యూల్డు కులాల విద్యావికాసానికి చాలా మంది ముఖ్యమంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఏర్పాటు చేశారు. పాఠశాల, వసతిగృహం వేర్వేరు చోట్ల ఉండడం వల్ల ఆశించినంత ప్రగతి కనిపించ లేదు. బలహీన వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ప్రవేశించాడు. ప్రజలు ఆయనకు స్పందించారు. తెలుగుదేశం పార్టీ పెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత బలహీనవర్గాల అభివృద్ధి నినాదం ఆచరణాత్మక రూపం తీసుకుందని చెప్పొచ్చు.

ఈ క్రమంలోనే ఆయన షెడ్యూల్డు కులాలను విద్యారంగంలో ముందుకు తీసుకెళ్లడానికి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్.ఆర్.శంకరన్ సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీగా వున్నారు. ఎన్‌టిఆర్ సూచన మేరకు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతిపాదనను ఎస్.ఆర్.శంకరన్ పెట్టారు. ఎన్‌టిఆర్ ఆ ప్రతిపాదనను ఆమోదించారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 1983లో ఏర్పడింది. ఈ సొసైటీ ఏర్పడిన తొలిరోజుల్లో హైదరాబాదులోని అడ్డగుట్ట దగ్గరున్న మహేంద్ర హిల్స్‌లో ఒక స్కూలు ఏర్పాటు చేయడం జరిగింది.

ఆ తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో సొసైటీ అభివృద్ధికి ప్రయత్నాలు జరిగాయి. ముఖ్యంగా విద్యాశాఖా మాత్యులుగా కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన హయంలోనే ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 200 స్కూళ్లు ఒకే సంవత్సరం ఏర్పాటు చేశారు. స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకున్న వాళ్ల కోసం కాలేజీ ఎడ్యుకేషన్ కూడా సొసైటీ ద్వారా అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తత్ఫలితంగా అనేక ఇంటర్మీడియెట్ కాలేజీలు సొసైటీ పరిధిలో ఏర్పడడం జరిగింది.

2014 వరకు ఒక ఈ సొసైటీ ఆధ్వర్యంలోని స్కూళ్లు ఒక దశను పూర్తి చేసుకున్నాయి. అనేక దశాబ్దాల పాటు ఈ స్కూళ్లు లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దాయి.

అయితే, 1991 తర్వాత పరిస్థితులు మారిపోయాయి. నూతన ఆర్థిక విధానాల వల్ల ప్రయివేటు విద్యావ్యవస్థ తయారైంది. ప్రయివేటు స్కూళ్లు, కాలేజీలు పుట్టుకొచ్చాయి. అవి బాగా ఎదిగి కార్పొరేట్ విద్యా వ్యవస్థలుగా మారాయి. ప్రభుత్వ విద్యావ్యవస్థలకు సమాంతరంగా ప్రయివేటు సంస్థలు తయారయ్యాయి. మార్కెట్ అవసరాలకు సరిపడే రీతిలో స్కూలు, కాలేజీ ఎడ్యుకేషన్ మారిపోయింది.

వేగంగా మారిపోతున్న పరిస్థితులను సొసైటీ స్కూళ్లు, కాలేజీలు అందుకొనే ప్రయత్నం చేశాయి. పదో తరగతి ర్యాంకులు, అత్యధిక మార్కులు సాధించే పోటీలోకి దిగక తప్పలేదు. ముఖ్యంగా ఎంసెట్‌లో పోటీ పడ్డాయి. అయితే, ఆశించిన ఫలితాలు రాక పోవటం వల్ల సొసైటీ స్కూళ్ల, కాలేజీల మీద అనేక విమర్శలు రావటం మొదలయ్యాయి. కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగిపోయింది. డ్రాపవుట్ రేటు కూడా ఎక్కువైంది. ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమం బలంగా ముందుకు వచ్చింది.

1995 తర్వాత తెలంగాణ ఉద్యమం నెమ్మదిగా పుంజుకుంది. 2000 సంవత్సరం వచ్చేసరికి తెలంగాణ ఉద్యమం నిర్దిష్టమైన రాజకీయ రూపం తీసుకుంది. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో విద్యా వికాసం కుంటుపడడానికి రాజకీయ కారణాలను ఎత్తి చూపటం మొదలైంది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలోనే ఒక కీలకమైన మార్పు జరిగింది. ఇక్కడి నుంచి సొసైటీ చరిత్రలో రెండో దశ మొదలైంది.

టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ – మలి దశ (2012–2018)

2012 నుండి ప్రస్తుత విద్యా సంవత్సర కాలం వరకు గురుకుల విద్యాలయాలలో అనేక గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అందులో ముఖ్యంగా ఇంగ్లీషు మీడియం తప్పని సరి అయ్యింది. నాణ్యమైన విద్యను అందించడానికి ప్రయత్నం మొదలయ్యింది. సొసైటీ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు, టీచింగ్ స్టాఫ్ అనుసరించిన నూతన బోధనా పద్ధతుల ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాలు మెరుగు పడ్డాయి. దీనివల్ల విద్యార్థుల హాజరు శాతం పెరిగింది, పర్మినెంట్ ఫ్యాకల్టీ లేనప్పటికీ, సొసైటీ ఉద్యోగులంతా టీం స్పిరిట్‌తో అద్భుతమైన ఫలితాలు తీసుకొచ్చారు.

తెలంగాణ ఉద్యమం కీలక దశకు చేరుకున్న సమయంలోనే సొసైటీ విద్యార్థులు హిమాలయా ల్లోని ఎవరెస్టు పర్వతం ఎక్కి చరిత్ర సృష్టించారు. మాలవతు పూర్ణ 13 సంవత్సరాల వయస్సులో ఎవరెస్టు శిఖరం ఎక్కి ప్రపంచ రికార్డు నమోదు చేసింది. అలాగే, ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల్లో అంచనాలను మించి విద్యార్థులు ఫలితాలను సాధించారు. దీంతో ఈ స్కూళ్ల పట్ల ప్రజల్లో గౌరవ భావం పెరగటం మొదలైంది.

మరో వైపు, తెలంగాణ ఏర్పడితేనే బలహీన వర్గాలకు, అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య సాధ్యమని, తెలంగాణ ఏర్పడ్డాక కేజీ నుంచి పిజీ వరకు ఉచిత విద్యను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని కె.చంద్రశేఖర్ రావు అనేక సభల్లో వాగ్దానం చేశారు. తెలంగాణ రాష్ట్రం 2014లో ఏర్పడ్డాక ఎన్నికల మానిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని పొందుపర్చారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సంస్థ పేరు కూడా మారింది. టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ గా మారిపోయింది. తెలంగాణ స్టేట్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీగా మారింది.

కొత్త రాష్ట్ర ముఖ్యమంత్రి కెజీ టు పిజీ ఉచిత విద్యను గురుకులాల ద్వారా అందివ్వాలని నిర్ణయించారు. సొసైటీ పరిధిలో కొత్తగా 30 డిగ్రీ కాలేజీ లను, 103 స్కూళ్లను బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రకటించారు. వెంటనే అవి మొదలయ్యాయి కూడా. సొసైటీ నివేదికల ప్రకారం ఐదవ తరగతి నుంచి డిగ్రీ వరకు, స్కూళ్లు, కాలేజీలు మొత్తం 268 రెసిడెన్షియల్ విద్యాసంస్థలున్నాయి. అన్నీ ఇంగ్లీషు మీడియంలోనే బోధిస్తాయి. 1,12,088 మంది విద్యార్థులు ఈ సంస్థలో చదువుకుంటు న్నారు. 268 మొత్తం ఇనిస్టిట్యూషన్స్‌లో 175 (65శాతం) అమ్మాయిలవి.

ఇవే కాకుండా ఐఐటి, ఎన్ఐటి, ఐఐఐటి, మెడికల్ కాలేజీల్లో ప్రతిభావంతులైన పిల్లలను సొసైటీ కాలేజీల నుంచి చేర్పించడానికి రెండు కాలేజీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయటం జరిగింది. హైదరాబాదులోని గౌలిదొడ్డిలో ఐఐటి అకాడమీ, కరీంనగర్‌లోని అలుగునూర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నడుస్తున్నాయి. అలాగే, మల్కాజిగిరిలో ఫైన్ కోర్సులను బోధించే స్కూలు కూడా నడుస్తుంది.

మొత్తం 1245 మంది పర్మినెంట్ టీచర్లు, 737 మంది కాంట్రాక్టు టీచర్లు సొసైటీ సంస్థల్లో పనిచేస్తున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ 558 మంది. మొత్తం పర్మినెంటు స్టాఫ్ 1803, కాంట్రాక్టు స్టాఫ్ 737. విద్యార్థి, టీచరు నిష్పత్తి 1:29. ఇది చాలా మంచి నిష్పత్తి. ఒక టీచరు 29మంది విద్యార్థుల మీద ప్రత్యేక శ్రద్ధను చూపగలడు. వ్యక్తిగత పరిశీలనకూ, బోధనకూ ఈ సంఖ్య చాలా దోహదపడుతుంది.

విద్యార్థులకు ప్రోత్సాహం

సొసైటీ ఆధ్వర్యంలోని అన్ని విద్యా సంస్థల్లో ఉచితంగా వసతులు కల్పిస్తుంది. విద్యార్థుల భోజన ఖర్చుల కోసం ఐదవ తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఒక్క విద్యార్థికి 950 రూపాయలు ఖర్చు చేస్తుంది. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్క విద్యార్థికి 1100 రూపాయలు, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు 1500 వరకు ఖర్చు చేస్తుంది.

మూడు జతల బట్టలు, ఒక ట్రాక్ సూట్, ఒక బెల్టు, ఒక ఐడి కార్డుతో పాటు అన్ని రకాల టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ ఉచితంగా ఇస్తున్నారు. ఎనిమిదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఆక్స్‌ఫర్ ఇంగ్లీష్ మినీ డిక్షనరీ, ఒక జత షూస్, సాక్సులు, ఒక తువ్వాల, ఒక బెడ్‌షీట్, కార్పెట్, ఇతర క్రాకరీ ఐటమ్స్ అన్నీ ఉచితంగా ఇస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులకు ఇవన్నీ ఖర్చుతో కూడుకున్నవి. కానీ, ప్రభుత్వమే వీటిని ఉచితంగా ఇవ్వటం వల్ల తల్లిదండ్రుల మీద ఆర్థిక భారం పడడం లేదు.

స్కూలు/ కాలేజీ	అబ్బాయిలు	అమ్మాయిలు	కొ–ఎడ్యుకేషన్	మొత్తం
స్వతంత్ర జూనియర్ కాలేజీలు	1	1	0	2
అప్‌గ్రేడేడ్ స్కూల్స్ అప్‌టు ఇంటర్మీడియెట్	38	79	0	117
ఐదు/ఆరు తరగతుల నుంచి పది వరకున్న స్కూళ్లు	54	6	0	118
సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్	0	0	1	1
మహిళా డిగ్రీ కాలేజీలు	0	30	0	30
మొత్తం	**93**	**174**	**1**	**268**

ఐదు అంశాల ప్రణాళిక

అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించడానికి సొసైటీ అయిదు అంశాల ప్రణాళికను తయారు చేసింది. అనేక సృజనాత్మక కార్యక్రమాలను ఈ ప్రణాళికలో భాగంగా తీసుకోవటం జరుగుతుంది. ఐదు అంశాలు యివి. 1) విద్యార్థుల, టీచర్ల, ప్రిన్సిపాళ్ల నిరంతర వికాసం. 2) పాఠశాలలో టీచింగ్, లర్నింగ్‌లో నాణ్యత పెంచడానికి పరిసరాలను గుణాత్మకంగా మెరుగుపర్చటం 3) విద్యార్థులు, టీచర్లు, స్కూళ్లు, జోన్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని ప్రోత్సహించడం 4) అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ కార్యకలాపాల్లో టెక్నాలజీ వినియోగాన్ని పెంచటం. 5) తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, మెంటర్స్, వాలెంటీర్ల సహకారంతో కమ్యూనిటీ పార్టిసిపేషన్ పెంచటం.

ఈ లక్ష్యాలకు అనుగుణంగా అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. విద్యార్థులను ప్రోత్సహించటం కోసం అనేక ప్రణాళికలు అమలు చేయటం జరిగింది. చదువుతూ సంపాదించు అనే సూత్రంతో 'ఎస్ఆర్. శంకరన్ సూపర్ లెక్చర్ ట్రోఫీ' అమలు చేశారు. మనటీవీలో విద్యార్థులు పాఠాలు చెప్పి పారితోషికం పొందవచ్చు. అలాగే, గ్రీన్ గురూస్ ద్వారా నెలకు 3500 రూపాయలు ఆర్జిస్తారు. గ్రీన్ గురూస్ అంటే ప్రతిభావంతులైన పిల్లలు టీచర్ల కొరతున్న స్కూళ్లకు వెళ్లి పాఠాలు చెప్తారు. ఇదొక అద్భుతమైన ప్రయోగం. చాలా విజయవంతంగా అమలవుతున్న కార్యక్రమం ఇది. అలాగే, భవిష్యత్తులో టెక్నాలజీని తట్టుకొని నిలబడడానికి విద్యార్థులను సిద్ధం చేసే కార్యక్రమాలు కూడా సొసైటీ చేపట్టింది. మోషన్ రోబొటిక్స్, స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ కియోస్క్, టాబ్‌లాబ్స్, లైఫ్ స్కిల్స్ కూడా నేర్పిస్తున్నారు. మాథమెటిక్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్‌లలో నైపుణ్యాలను పెంచడానికి రోబొక్స్ స్టెమ్ ల్యాబులు ఏర్పాటు చేయటం చూస్తాం. విదార్థుల అటెండెన్స్, స్టాఫ్ అటెండెన్స్, ఫైనాన్షియల్ ట్రాన్జాక్షన్స్ అన్నీ ఆన్‌లైన్ పద్ధతుల్లోనే జరుగుతాయి. దీన్నే స్టూడెంట్ అకడమిక్ మానిటరింగ్ సిస్టమ్ (సామ్స్) అంటారు.

విద్యార్థుల ఫలితాలు

సొసైటీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. 2016-17 ఫస్ట్ సెమిస్టర్‌లో 87.12శాతం ఇంటర్మీడియెట్‌లో, 89.10లో ఎసెస్సీలో సాధించారు. ఇది గతంలో కన్నా మెరుగు. డిగ్రీలో అన్ని యూనివర్శిటీల పరిధిలో గుర్తించ దగిన ఫలితాలు సాధించారు. ఉస్మానియా పరిధిలో 70శాతం, మహాత్మాగాంధీ పరిధిలో 68 శాతం, పాలమూరు 84 శాతం, శాతవాహన పరిధిలో 85శాతం, కాకతీయ పరిధిలో 81శాతం, తెలంగాణ పరిధిలో 48.17 శాతం సాధించారు. రెండో సెమిస్టర్‌లో ఉస్మానియా పరిధిలో 75.4 శాతం, మహాత్మ గాంధీ పరిధిలో 75.7 శాతం, పాలమూరు పరిధిలో 78 శాతం, శాతవాహన పరిధిలో 77 శాతం, తెలంగాణ పరిధిలో 72శాతం ఫలితాలు సాధించారు. మొదటి సెమిస్టర్ కన్న రెండో సెమిస్టర్లో విద్యార్థులు ఎక్కువ ఫలితాలు సాధించారు.

2013-17లో ఎన్నో అద్భుతాలను సొసైటీ సాధించింది. 48 మంది ఐఐటి సీట్లను, 133మంది విద్యార్థులు ప్రముఖ ఎన్ఐటిల్లో సీట్లు సాధించారు. 81 మంది మెడిసిన్ సాధించారు. 62 మంది అజీం ప్రేమ్‌జీ యూనివర్శిటీకి సెలెక్టయ్యారు. 5గురు విద్యార్థులు కమ్యూనిటీ కాలేజీ ఇనిషియేటివ్ ప్రోగ్రాం కింద అమెరికాకి ఎన్నికయ్యారు. 30మంది సెంట్రల్ యూనివర్శిటీల్లాంటి ఉన్నత విద్యా సంస్థలకు సెలక్టయ్యారు. నలుగురు ప్రముఖ లా కాలేజీలకు, నలుగురు ఇండియన్ నేవీ స్కూల్ గోవాకు సెలక్టయ్యారు. నలుగురు విద్యార్థినిలు కెనెడీ లూగర్ స్టూడెంట్ యూత్ ఎక్స్‌చేంజ్ ఫెలోషిప్ (యెస్), యుఎస్ఏ (2017)కు సెలెక్టయ్యారు. 12 మంది ఢిల్లీ యూనివర్శిటీ(2017)కీ, 11మంది టిఐఎస్ఎస్ (2017)కు ఎన్నికయ్యారు. అంతేకాదు, హార్వర్డ్ యూనివర్శిటీ సమ్మర్ క్రాస్‌రోడ్స్ ప్రోగ్రామ్‌కు ఆనంద్ మసగళ్ల 2017 సంవత్సరానికి ఎన్నికయ్యాడు. ఇలా ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఎన్నో పతకాలు గెలుచు కున్నారు. మాలావత్ పూర్ణ, ఎస్. ఆనంద్‌లిద్దరూ ఎవరెస్టు శిఖరం ఎక్కి చరిత్ర సృష్టిస్తే, అదే స్ఫూర్తితో 47 మంది 17000 అడుగుల ఎత్తైన రెనాక్ శిఖరం అధిరోహించారు.

మాలావత్ పూర్ణ నేతృత్వంలో ఐదుగురు విద్యార్థులు ఆఫ్రికా ఖండంలోనే ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి రికార్డు నమోదు చేశారు. యూరపులోని ఎత్తైన పర్వత శిఖరం ఎల్‌బ్రూస్‌ను మాలావత్ పూర్ణ, శ్రీవిద్య 2017లో అధిరోహించి, మన జాతీయ జెండాను ఎగరేశారు. క్రీడలు మాత్రమే కాకుండా డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌లో కూడా జాతీయ స్థాయి గుర్తింపును సొసైటీ విద్యార్థులు సంపాదించారు. ఎందుకిలా, మేల్కో, చైతన్యం లాంటి తెలుగు షార్ట్ ఫిల్మ్‌ను వాళ్లే రచించి, దర్శకత్వం వహించి, నిర్మించారు.

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ అతి తక్కువ కాలంలోనే చాలా గొప్ప ఫలితాలు సాధించాయి. గతంలో వాటి గురించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలు తొలిగిపోయాయి. ప్రభుత్వం ఆశించిన దానికన్న ఎక్కువే సాధించాయని చెప్పొచ్చు. షెడ్యూల్డు కులాల్లో గొప్ప ఆశను కలిగించాయి. అవకాశం కల్పిస్తే, మంచి ఫలితాలు అణగారిన వర్గాలు చూపిస్తారని ఈ ఫలితాలు తెలియచేస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, విద్యానుకూల వైఖరి కూడా అణగారిన వర్గాల విద్యా వికాసానికి కీలకమని అవగతమవుతుంది.

(రచయిత ఎం.ఎస్. డబ్ల్యు. విద్యార్థి ఉస్మానియా యూనివర్సిటీ) వీ

వచ్చే సంచికలలో...

- జూట్ మిల్లు కార్మికుల స్థితిగతులు - ప్రకాశ్
- పద్మావతి సినిమాపై దుమారం - ఎం.కె. కుమార్
- నోట్ల రద్దు ఓ బీభత్స ప్రహసనం - షేక్ కరిముల్లా

పశ్చిమాసియాలో ప్రమాద ఘంటికలు

***సౌదీ అరేబియాను ముందుపెట్టి తెరవెనుక ఉండి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిలువరించాలంటే సోషలిస్టు విప్లవమే ఏకైక ప్రత్యామ్నాయం అంటున్నారు* సంతోష్**

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక రక్షణ బడ్జెట్ పెంచాడు. ఎక్కడెక్కడ యుద్ధాలు చేయాలి, ఆయా దేశాలను ఆయుధ బలంతో ఎలా లొంగదీసుకోవాలని ఆలోచిస్తున్నాడు. అందులో భాగంగానే పశ్చిమాసియాలో నిప్పురాజేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోంది. ఇరాన్ మీద దాడికి రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు సౌదీ అరేబియాను ఉసిగొల్పుతోంది. దీంతో అమెరికా నేతృత్వంలోని సౌదీ అరేబియా – ఇజ్రాయిల్ కూటమి కయ్యానికి కాలు దువ్వుతున్న తీరు ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజాలను కలవరపరిచాయి. సౌదీ అరేబియాలోని అంతరంగిక పరిణామాలు, సౌదీ కేంద్రంగా పశ్చిమాసియాలో చెలరేగుతున్న ఉద్రిక్తతలు రెండూ అవాంఛనీయమైనవే. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమాలు చెలరేగుతున్న కాలంలో కూడా చమురు వనరులు పుష్కలంగా ఉన్న అరబ్బు దేశాలలో రాచరికాలను అమెరికా కాపాడుతూ వస్తోంది. సౌదీ అరేబియాలో అదే రాచరిక ప్రభుత్వం మరింత నిరంకుశంగా మారింది.

సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబిఎస్)కు అమెరికా మద్దతు ప్రత్యేకించి ట్రంప్ తోడ్పాటు పూర్తిగా ఉన్నది. దేశంలో చెప్పుకోదగిన అధికార కేంద్రాలు అంటూ ఏమీ మిగలకుండా తీవ్ర అణచివేతను ఎంబిఎస్ అమలు చేస్తున్నాడు. అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో 200 మందికి పైగా ప్రముఖులను, రాజ కుటుంబాల సభ్యులను, మంత్రులు, ఉన్నతాధికారులు, కోటీశ్వరులను నిర్బంధించాడు. ఇటీవలి కాలంలోనే పదకొండు మంది రాజ కుమారులను అరెస్టు చేయించారు. సౌదీ సమాజాన్ని ఆర్థికంగా, సామాజికంగా నియంత్రిస్తున్న పలువురిపై తీవ్ర చర్యలకు ఆదేశిస్తూ 32 ఏళ్ల యువరాజు ప్రిన్స్ సల్మాన్ పలు కీలక ప్రకటనలు కూడ చేశారు. ఆ ప్రకటనల పర్యవసానాలు సౌదీనే కాక ప్రపంచవ్యాప్తంగా ముస్లిం, ముస్లిమేతర దేశాలను సైతం బహుముఖంగా ప్రభావితం చేశాయి.

సౌదీ అరేబియాలోని అంతర్గత పరిణామాలనూ, ఇరుగు పొరుగుతో దాని ఘర్షణలనూ వేర్వేరుగా చూడలేం. అక్కడ ప్రజాస్వామ్యం మచ్చుకైనా లేదు. ఉన్నది దాయాది కుటుంబ స్వామ్యమే. అయితే పాలనలో పాలుపంచుకుంటున్న కుటుంబసభ్యుల మధ్య సమన్వయాన్ని సాధించి, వారికి మత నాయకుల అభిప్రాయాలను కూడా జోడించి ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకునే విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా అదే సాగుతోంది. ఇరాన్‌తో ఘర్షణలు తలెత్తకుండా, పశ్చిమాసియాలో అశాంతి చెలరేగకుండా ఇది తోడ్పడింది. కానీ 2015లో అధికారాన్ని చేజిక్కించుకున్న రాజు సల్మాన్ అబ్దుల్ అజీజ్ దీన్నంతటినీ తారుమారు చేసే ప్రయత్నాలు మొదలెట్టారు. తన కుమారుడు యువరాజు సల్మాన్‌ను ఆర్నెల్ల క్రితం వారసుడిగా ప్రకటించి అప్పటికే అతని దగ్గరున్న రక్షణ శాఖకు తోడు ఆర్థిక శాఖ కూడా కట్టబెట్టారు. అంతరంగిక భద్రతా వ్యవహారాలను చూస్తున్న సీనియర్ ఉప ప్రధాని మహమ్మద్ బిన్ నయీఫ్ అల్ సౌద్‌ను పదవి నుంచి తప్పించారు. ఆయన ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్నారు. ఖతర్‌తో గత జూన్‌లో తెగదెంపులు చేసుకోవడాన్ని నయీఫ్ తీవ్రంగా వ్యతిరేకించడం వల్లే ఆయనకు ఉద్వాసన చెప్పారు.

పశ్చిమాసియాలో ఇరాన్ కాక తామే తిరుగులేని శక్తిగా ఎదగాలన్నది రాజు అజీజ్, యువరాజ్ సల్మాన్‌ల స్వప్నం. అయితే ఇరాన్‌తో కయ్యానికి దిగితే ఫలితం దక్కకపోగా తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని రాజ కుంటుంబంలోని ఇతరులు హెచ్చరిస్తున్నారు. ఏకాభిప్రాయ సాధనతోనే ముందడుగేయాల్సి ఉండడంతో అజీజ్, సల్మాన్‌లకు ఎటూ పాలుబోవడం లేదు. అవినీతి ఆరోపణల సాకుతో నవంబర్ 4న పలువురిని అరెస్టు చేశారు. ఆధునిక సౌదీ అరేబియా చరిత్రలో ఇంతదాకా ఇలాంటి రాజకీయ పోకడలు కనపడలేదు. దీనికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం.... అంతా క్రౌన్ ప్రిన్స్ (కిరీటధారి) మహ్మద్ బిన్ సల్మాన్. రాజప్రాసాదంలో అరెస్టుల వెనుకున్న అసలు మర్మం ఏంటి? అంటే తన రాజకీయ, ఆర్థిక, మత విధానాల్ని అమలు జేయడానికి ఉన్న అడ్డంకుల్ని తొలగించుకోవడమే. పేరుకు సౌదీ ప్రభుత్వమున్నా, నడిపేదంతా రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్‌సౌద్ కుటుంబం, ఆయన అన్నదమ్ముల పిల్లలు. ఇందులో రాజు మూడో భార్య కుమారుడు... ప్రస్తుత క్రౌన్ ప్రిన్స్ (కిరీటధారి, రాకుమారుడు) మహ్మద్ బిన్ సల్మాన్ శక్తివంతమైన స్థానంలో ఉన్నారు.

శతాబ్దాలుగా అమలవుతూ వస్తున్న రాయల్ బ్యాలెన్సింగ్ యాక్ట్ (రాచకుటుంబంలో అందరికీ అధికారాల పంపిణీ చేస్తూ సమతుల్యత పాటించడం)ను సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ తుంగలో తొక్కారు. ఏకచత్రాధిపత్యం కోసం పాకులాడుతున్నాడు. అబ్దుల్ అజీజ్ అల్‌సౌద్ రాజుగా ఉన్నా, అధికారమంతా కిరీటధారిదేనన్న మాటలు కొన్నేళ్ల నుంచీ వినపడుతున్నాయి. ఇప్పుడు అదే నిజమైంది. ఈ పరిణామాల నుంచి ప్రపంచం దృష్టి మళ్లించడం కోసం దేశంలో సంస్కరణలు తీసుకొస్తున్నట్టు, మహిళలకు కారు నడపడం, క్రీడలు చూడడం వంటి హక్కులు కల్పిస్తున్నట్టు చూపుతున్నారు. దేశాన్ని ఆధునిక మార్గంలో నడిపిస్తున్నట్లు ప్రచారం సాగిస్తున్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టడంలో భాగంగా ఆహారం, విద్య, వైద్యం మొదలైన రంగాలలో ఉన్న సబ్సిడీలను రద్దు చేయడం వల్ల ప్రజలలో వ్యతిరేకత పెరుగుతుందనే కారణంగానే భారీ ఎత్తున నిర్బంధకాండ

అమలు చేస్తున్నారు. సౌదీ యువరాజు రాచరిక పాలన కన్న ఘోరమైన నిరంకుశత్వాన్ని అమలు చేస్తున్నారు.

సౌదీలో అణచివేత చర్యలు చేపట్టడానికి, ఆ ప్రాంతమంతటా సైనిక హింసను ప్రేరేపించడానికి అమెరికా పూర్తి స్వేచ్ఛనిచ్చింది. అయినా, అజీజ్, సల్మాన్‌ల ఎత్తులు, జిత్తులన్నీ చిత్తవుతున్నాయి. జిహాదీలను ఉపయోగించి సిరియాలో అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌ను పదవీ నుంచి తొలగించాలని చూస్తే ఆయన కాస్తా మరింత బలపడ్డారు. యెమెన్‌ను లొంగదీసుకోవాలనుకుంటే అది తారుమారైంది. ఇరాన్ అండదండలు పుష్కలంగా ఉన్న హౌతీ తిరుగుబాటుదార్లు కొరకరాని కొయ్యలుగా మారారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక సౌదీ రాజ కుటుంబంలో పొరపొచ్చాలు మరింత పెరిగాయి. అరెస్టయిన యువరాజుల్లో ఒకరైన తలాల్ అల్ వలీద్ ఒకప్పుడు డోనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితుడు. 1,700 కోట్ల డాలర్ల వ్యాపార సామ్రాజ్యానికి అధినేత. ట్రంప్ వ్యాపారాలకు ఆర్థికంగా సాయపడిన తలాల్... ఆయన అధ్యక్ష పదవికి పోటీపడడాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. సౌదీ వ్యవహారాల్లో జోక్యాన్ని ఖండించాడు. అందుకే ట్రంప్ వెనకుండి ఈ అవినీతి వ్యతిరేక పోరాటాన్ని మొదలెట్టించారు. ఈ పరిణామాలన్నిటి వెనకున్న ఆంతర్యం తేటతెల్లమే. ఇరాన్‌ను చక్రబంధంలో బిగించి ఇజ్రాయిల్ సాయంతో పశ్చిమాసియాలో సౌదీ ఆధిపత్యాన్ని నెలకొల్పడం... దాని ద్వారా తాను లాభపడడం అమెరికా ఉద్దేశం.

2017 మార్చిలో బిన్ సల్మాన్ సౌదీ తరపున అమెరికాకు వెళ్లి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసివచ్చాడు. తన తొలి విదేశీ పర్యటన సౌదీకేనని ట్రంప్ దగ్గర మాట తీసుకున్నాడు. ట్రంప్ ఇతనికి స్టేట్ డైనింగ్ రూములో ప్రత్యేక విందు ఇచ్చాడు. అతని కూతురు ఇవాంకా, అల్లుడు జార్డ్ కుష్నర్ వాళ్లింట్లో మర్యాదలు పొందాడు. ట్రంప్ మేలో సౌదీ వచ్చినప్పుడు ఆయన కూతురు, అల్లుడికి తన ప్యాలస్‌లో బిన్ సల్మాన్ విందు ఇచ్చాడు. అమెరికాలోని కొత్త ప్రభుత్వాన్ని సౌదీకి అనుకూలంగా మా అబ్బాయి మార్చాడని రాజు మురిసిపోతున్నాడు. సల్మాన్ యుద్ధోన్మాది, ఇరాన్, యెమెన్, ఖతార్‌లపై చేస్తున్న యుద్ధాలు కొనసాగి తీరాలంటాడు. వాటికీ డబ్బు కావాలి. అది దొరకడం లేదు. కారణం ముడిచమురు ధరలు పడిపోవడం, అంతర్గతంగా మరికొన్ని సమస్యలున్నాయి. ట్రంప్ పర్యటన తర్వాతి నెలలోనే సౌదీరాజు వారసుడిని మార్చివేశారు. మహమ్మద్ బిన్ నయీఫ్ స్థానంలో పాలకుడిగా ఇరాన్ ద్వేషి అయిన సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబిఎస్) వచ్చారు. ఆయన ఒక పథకం ప్రకారమే అనేక పదవుల్లో ఇరాన్ వ్యతిరేకులను నియమించారు. యెమెన్‌లో సాగుతున్న యుద్ధాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ అక్కడ ఇరాన్ మద్దతుదారులను ఊచకోత కోసే పనిలో ఉన్నాడు.

ప్రిన్స్ సల్మాన్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడ్డ అవినీతి నిరోధక కమిటీ తీసుకున్న నిర్ణయం ప్రకారమే, యువరాజులను, మంత్రులను, మాజీ మంత్రులను, ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారుల్ని 'అవినీతి ఆరోపణ'ల కింద అరెస్టు చేశారు. 'అవినీతిపై పోరాటం' పేరుతో కిరీటధారి బిన్ సల్మాన్ ఇంతటి సాహసోపేత నిర్ణయాన్ని ఎందుకు తీసుకున్నారు? అంటే, సమాధానం 'సౌదీ సింహాసనం' అందుకునే క్రమంలో అడ్డంకుల్ని తొలగించుకోవడమేనన్నది సుస్పష్టం. అందుకోసం రాజ కుటుంబంలో తనకు అడ్డుగా ముఖ్య స్థానాల్లో ఉన్నవారిని మొదట తప్పించాలి. మళ్లీ తిరిగి వారు ఉన్నత పదవుల్లోకి రానంత పెద్ద మచ్చ వారిపై మోపాలన్నదే సల్మాన్ వ్యూహం. కొద్ది గంటల్లోనే ఈ వ్యూహం అమలైంది. అటు ప్రభుత్వంలో, ఇటు రాజ కుటుంబంలో కిరీటధారి బిన్ సల్మాన్ పట్టు పెరిగింది.

రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ వయస్సు 81 సంవత్సరాలు. ఆల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకున్న వయస్సు, ఆరోగ్య సమస్యల రీత్యా ప్రభుత్వ వ్యవహారాలపై పట్టు జారిపోతున్నది. అటు ప్రభుత్వంలో నిజమైన అధికారాల్ని కిరీటధారి బిన్ సల్మాన్ కలిగి ఉన్నారు. దీంతోనే బిన్ సల్మాన్ తృప్తిపడడం లేదు. ముందు ముందు తను సింహాసనం ఎక్కే అవకాశాల్ని అడ్డుకునే వ్యక్తులున్నారని తెలిసి, వారిని ఒక పథకం ప్రకారం పక్కకు తప్పించారు. యువరాజు ఆల్వాలీద్ బిన్ తలాల్ అల్లాటప్పా స్థాయి వ్యక్తి కాదు. బిలియనీర్‌గా ఆయనకున్న పేరు అంతా ఇంతా కాదు. తన ఇమేజ్‌తో బిన్‌సల్మాన్‌కు పోటీదారు అయ్యాడు. ఆపిల్, సిటీగ్రూప్ మొదలైన బడా కార్పొరేట్ సంస్థల్లో పెట్టుబడులున్నాయి. అవినీతి ఆరోపణలతో ఇతన్ని కొన్ని గంటల వ్యవధిలో అరెస్టు చేశారు.

సౌదీ ప్రభుత్వంలోని కీలకమైన శాఖలు ఆర్మీ, అంతర్గత భద్రతా సేవలు, నేషనల్ గార్డ్స్... మొదలైన వాటికి అధిపతులను ప్రస్తుత రాజు, గత రాజు పిల్లలకు అప్పజెప్పి, పంపకాలు జరిపారు. సౌదీ ప్రభుత్వంలో శక్తివంతమైన పదవుల్లో ఒకటి 'నేషనల్ గార్డ్ చీఫ్'. ప్రస్తుత యువరాజు ముతాబీ బిన్ అబ్దుల్లా చీఫ్‌గా ఉన్నారు. ఈయన దివంగత రాజు అబ్దుల్లా కుమారుడు నవంబర్ 4న రాత్రి పొద్దుపోయాక కిరీటధారి బిన్ సల్మాన్‌తో అత్యవసర సమావేశం ఉందని ముతాబీ బిన్ అబ్దుల్లాకు ఫోన్ ద్వారా ఆదేశాలు వెళ్లాయి. తన ఫాం హౌస్ నుంచి ముతాబీ ఉన్నపళంగా రియాద్‌కు బయల్దేరి వెళ్లాడు. అక్కడికి వెళ్లీ... వెళ్లగానే అరెస్టుచేసి, గృహ నిర్బంధంలో పెట్టేశారు. సౌదీని శతాబ్దాలపాటు ఏలిన దివంగత రాజు అబ్దుల్లా కుమారుడు, ప్రస్తుత యువరాజు తుర్కీ బిన్ అబ్దుల్లాను ఇలాగే అరెస్టు చేశారు. నవంబరు 4 నాటి అరెస్టులతో మొత్తం అధికారమంతా కిరీటధారి (క్రౌన్‌ప్రిన్స్) బిన్ సల్మాన్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆధునిక సౌదీ అరేబియా చరిత్రలో అధికారమంతా ఒక్కరిచేతికి వెళ్లడం ఇదే మొదటిసారి. కిరీటధారి బిన్ సల్మాన్.. యువరాజు ముతాబీ బిన్ అబ్దుల్లా, యువరాజు ఆల్వాలీద్... వీరందరికీ స్వంత ఆస్తులు వేలకోట్లలో ఉన్నాయి. వీరంతా బిలియనీర్లే. ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకుండానే వీరంతా బిలియనీర్లు అయ్యారా? అంటే సౌదీలోనే నమ్మేవారు లేరు.

2017 మే నెలలో ట్రంప్ సౌదీ అరేబియాను సందర్శించిన సమయంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా సౌదీ నేతృత్వంలో ప్రగతి నిరోధక సున్నీ రాజ్యాల కూటమి ఏర్పాటుకు మంత్రాంగం నడిచింది. అయితే తాము ఆ పనిచేస్తూ ఇరాన్‌పై నిందలు మోపుతూ ప్రకటనలు ఇస్తున్నారు. అమెరికా దన్నుతో సౌదీ పాలకుడు చేస్తున్న ఆగడాలకు అంతూపొంతు లేకుండా పోయింది. లెబనాన్ ప్రధానమంత్రి హరీరిని సౌదీకి పిలిపించి తమ నిర్బంధంలో ఉంచుకున్నాడు. బలవంతంగా నవంబర్ 4న రాజీనామా చేయించాడు. తన ప్రాణాలకు ముప్పు ఉందని హరీరి ఈ సందర్భంగా చెప్పారు. "లెబనాన్‌పై మరోదేశం ప్రభావం ఎక్కువగా

ఉంది. నా తండ్రి, మాజీ ప్రధాని రఫీక్ అల్ హరీరి హత్యకు ముందు దేశంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో... ప్రస్తుతం కూడా అలాంటి పరిస్థితులే చోటుచేసుకున్నాయి. నన్ను చంపేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని నాకు అనిపిస్తోంది" అని సాద్ అల్ హరీరి ప్రకటించారు. ఏడాది కాలంగా లెబనాన్‌లో హరీరి నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్నది. ఈయన పార్టీకి సౌదీ అండదండలున్నా, సంకీర్ణంలో మాత్రం ఇరాన్ మద్దతున్న హిజ్బొల్లా సహా అనేక పక్షాలున్నాయి. ఇరాన్‌ను, లెబనాన్ షియా ఉద్యమం హిజ్బొల్లాతో తెగతెంపులు చేసుకోనందునే హరీరిని పదవి నుంచి తొలగించాలని సౌదీ అరేబియా రాచరికం నిర్ణయించింది. షియా వ్యతిరేక వ్యూహంలో ఇదొక పరిణామం.

సౌదీ అరేబియాను మళ్లీ 'మితవాద' (వహాబీ ఇస్లాం) ఇస్లాంను అనుసరించే దేశంగా రూపొందించడం తన ధ్యేయమని సౌదీ యువరాజు ప్రిన్స్ సల్మాన్ ప్రకటించారు. సల్మాన్‌కు 'ఆవేశపూరితంగా వ్యవహరించే సంస్కర్త'గా పలువురు పరిగణిస్తున్నారు. అయితే తండ్రి బతికుండగానే తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ఆరాటపడుతున్నాడు. నిజానికి ఆయన చేపడుతున్న చర్యలన్నీ అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆదేశాలేనన్న విమర్శలున్నాయి. సౌదీ పాలనా వ్యవస్థలో ఇప్పటివరకు మతాధికారులకు ఒక ప్రత్యేక పాత్రను కల్పించింది. మత, సామాజిక రంగాలపై మతాధికారులకు గుత్తాధిపత్యం ఉంది. ఇవాళ అత్యధిక ఇస్లామిక్ తీవ్రవాదులు వహాబీ ఇస్లాం ప్రభావితులే. సౌది మొదటి నుంచి తీవ్రవాద ధోరణులను అనుసరించే మత రాజ్యవ్యవస్థగా ఉంటూ వస్తున్నది. అందువల్ల మతపెద్దలను కాదని సల్మాన్ రాజకీయం నడుపగలడా అన్నది సందేహమే.

అక్టోబర్ 17న రియాద్‌లో సల్మాన్ ప్రపంచంలోనే ప్రఖ్యాత పెట్టుబడిదారులతో అంతర్జాతీయ ఆర్థిక సదస్సును నిర్వహించారు. చమురు ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం కాకుండా సౌదీ ఆర్థిక వ్యవస్థను బహుముఖంగా విస్తరింపచేసేందుకు తాను రూపొందించిన ప్రణాళికలను అంతర్జాతీయ సమాజానికి వెల్లడించే లక్ష్యంతోనే ఆ సదస్సును నిర్వహించడం జరిగిందన్నది స్పష్టం. ఒక ఇంటర్వ్యూలో ప్రిన్స్ సల్మాన్ మాట్లాడుతూ "సౌదీని తిరిగి మితవాద ఇస్లాంను అనుసరించే దేశంగా రూపొందించడం తన ధ్యేయంగా" ప్రకటించారు. సౌదీ అరేబియా చరిత్రలో 1979 ఒక మైలురాయి అని ఆయన అన్నారు. ఆ సంవత్సరమే సౌదీ 'మితవాద' ఇస్లాంను విడనాడి 'తీవ్రవాద' ఇస్లాంను అనుసరించే దేశంగా తనను తాను మార్చుకున్నదని యువరాజు సల్మాన్ అన్నారు. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే 1979కి ముందు సౌదీ అరేబియా తీవ్రవాద దేశం కాదా? సౌదీ అరేబియా మొదటి నుంచీ తీవ్రవాద ధోరణులను అనుసరించే మత రాజ్య వ్యవస్థగా ఉంటూ వస్తోంది. సౌదీ రాజకుటుంబం, వహాబీ ఉలేమా (ఇస్లామిక్ మత నాయకుల సంఘం) మధ్య దృఢ సంబంధాలు ఉన్నాయి. ఈ సన్నిహిత సంబంధాలకు సౌదీ అరేబియా ఆవిర్భావానికి పూర్వం దాదాపు వంద సంవత్సరాల చరిత్ర ఉన్నది. వహాబీ ఇస్లాంతో ముడిపడి ఉన్న సౌదీ అరేబియా మితవాద ఇస్లామిక్ దేశంగా రూపొందడం సాధ్యమవుతుందా?

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి ఇరాన్‌కు వ్యతిరేకంగా మధ్య ఆసియాలో సరికొత్త సమీకరణలకు తెరదీశాడు. ఇరాన్, లెబనాన్‌లు తనపై యుద్ధప్రకటన చేశాయని సౌదీ ప్రకటించడం, ఆ దేశ దిన పత్రికలో ఇజ్రాయిల్ సైన్యాధ్యక్షుడి ఇంటర్వ్యూ ప్రచురితం కావడం తదితర పరిణామాలు ఇందుకు సంకేతాలే. ఇరాన్‌తో బరాక్ ఒబామా కుదుర్చుకున్న శాంతి ఒప్పందాన్ని ట్రంప్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఆ క్రమంలోనే ఒకనాడు బద్ధశత్రువులుగా ఉన్న ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలు స్నేహితులుగా మారి ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకొన్నాయి. ఇరాన్‌కు సంబంధించిన సమస్త రహస్యాలను సౌదీతో పంచుకుంటామని ఇజ్రాయిల్ సైన్యాధ్యక్షుడు ప్రకటించారు. మధ్య ఆసియా మొత్తాన్ని షియా సామ్రాజ్యంగా మార్చివేసి తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని ఇరాన్ ప్రయత్నిస్తున్నదనీ, దాన్ని సౌదీతో కలిసి ఇజ్రాయిల్ గండికొడుతుందనీ ఆ సైన్యాధ్యక్షుడు పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలేం నగరాన్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించాడు. 1948 నుంచి జెరూసలేం నగరం పశ్చిమభాగం ఇజ్రాయిల్ ఆధీనంలో ఉంది. 1967 యుద్ధం తరువాత ఇజ్రాయిల్ జెరూసలేం తూర్పు ప్రాంతాన్ని జోర్డాన్ నుంచి ఆక్రమించుకుంది. ఇజ్రాయిల్ జెరూసలేంను తమ రాజధానిగా ప్రకటించుకోవడాన్ని అరబ్ దేశాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. మధ్య ప్రాశ్చ్యంలో ట్రంప్ చర్య మరింత ఉద్రిక్తతలను పెంచే అవకాశం ఉంది. ఇజ్రాయిల్ - పాలస్తీనా వివాదంపైన దీని ప్రభావంపడే అవకాశాలున్నాయి. స్వతంత్ర పాలస్తీనా కోసం పోరాడుతున్న ప్రజలు జెరూసలేంను తమ భవిష్యత్ రాజధానిగా భావిస్తున్నారు. అమెరికా మొదటి నుంచి ఇజ్రాయిల్ కు మిత్ర దేశంగా ఉంటూ వస్తోంది. పాలస్తీనా స్వతంత్ర దేశంగా అవతరించడానికి అమెరికా అడ్డుపడుతోంది. జెరూసలేం ముస్లింలు, క్రైస్తవులు, యూదులు కలిసి జీవించే మహానగరం.

అమెరికా ఎగేసే కొద్దీ అరేబియా యువరాజు సల్మాన్ పశ్చిమాసియాలో అనుసరిస్తున్న విధానాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. యువరాజు సల్మాన్ పెత్తనం మొదలైన తరువాత సౌదీ అరేబియా చేపట్టిన ప్రధాన చర్య యెమెన్‌లో తలదూర్చడం జరిగింది. అరబ్ ప్రపంచంలో అత్యంత పేద దేశమయిన యెమెన్‌ను సౌదీ అరేబియా నేలమట్టం చేసినప్పటికీ ఆ దేశం ఓటమిని అంగీకరించలేదు. యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారుల ప్రాబల్యం పెరగడంతో అధికారం కోల్పోయిన హదీకి సౌదీ అరేబియా ఆశ్రయం ఇచ్చింది. 2015 మార్చి నుంచి యెమెన్‌పై వైమానిక దాడులు సాగిస్తున్నది. అంతేకాదు రియాద్ విమానాశ్రయం దిశగా యెమెన్ ప్రయోగించిన రాకెట్ దూసుకువచ్చిందనీ, అది ఇరాన్ సరఫరా చేసిందంటూ సౌదీ ప్రకటించింది. దానికి ట్రంప్ మద్దతు పలికాడు. ఆ కారణంగా యెమెన్‌లో సౌదీ సైన్యం నరమేధానికి తెగబడింది. 12 వేల మంది యెమెన్ పౌరులను చంపేసింది. దాదాపు ఆ దేశాన్ని దిగ్బంధించింది. ఈ దాడి వల్ల అనేక మంది పౌరులు ఆకలితో మృత్యుముఖం పడుతున్నట్లు ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. అక్కడి ప్రజలకు ఆహారం, ఔషధాలు అందకుండా సౌదీ కట్టడి చేస్తున్నది. దీంతో ఇరాన్ మద్దతు గల హౌతీలకు, సౌదీ అరేబియాకు మధ్య పోరాటానికి యెమెన్ యుద్ధరంగంగా మారింది.

ఇరాన్‌తో సన్నిహితంగా ఉందన్న ఆరోపణలతో ఖతార్‌మీద సౌదీ అరేబియా ఆంక్షలు విధించడంలో సల్మాన్ కీలకపాత్ర పోషించాడు. ఎంబిఎస్ ఇంటా బయటా పాల్పడుతున్న దుస్సాహసాలను గమనించినప్పుడు ఆయనను నడిపిస్తున్న శక్తి అమెరికానే అని

అర్థమవుతోంది. ఖతార్‌తో కయ్యానికి దిగడం, ఖతార్ అమెరికా అనుకూల దేశమే అయినప్పటికీ, సొంత ఆలోచనలతో నిలదొక్కు కుంటున్నది. తనకంటూ టివి ఛానెల్ పెట్టుకున్నది. అరబ్బు దేశాలలో జరిగే ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతునిస్తున్నది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాల మాదిరిగా అమెరికాకు పూర్తి చెప్పు చేతుల్లో ఖతార్ ఉండడం లేదు. దీంతో అమెరికా సూచనల మేరకు సౌదీ అరేబియా ఖతార్‌పై ఆంక్షలు విధించింది.

యెమెన్, ఖతార్‌పై దాడులకు దిగిన సౌదీ ఇప్పుడు ఇరాన్‌పై కాలుదువ్వుతోంది. సౌదీ, ఇరాన్ మధ్య వందేళ్లుగా వైరం కొనసాగు తున్నది. అమెరికా వత్తాసుతో ఇప్పుడు ఇరాన్‌తో ప్రత్యక్ష ఘర్షణకు దిగుతున్నది. ఇది పశ్చిమాసియాలో అశాంతి రాజుకోవడానికి దారితీస్తుందనడంలో సందేహం లేదు. అమెరికాకు కావాల్సిందీ అదే. ఈ పరిణామాలన్నింటి వెనుకా అమెరికా ప్రయోజనాలు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను లొంగదీసుకోవడం చాలా కష్టమని అమెరికా రక్షణరంగ నిపుణులే తేల్చిచెప్పిన మీదట, దాన్ని చక్రబంధంలో ఇరికించేందుకే అమెరికా ఈ వ్యూహం పన్నింది. చమురు సమృద్ధిగా ఉన్న ఇజ్రాయిల్ సహాయంతో సౌదీ ఆధిపత్యాన్ని నెలకొల్పి తన మాట చెల్లుబాటు చేసుకొనేందుకు అమెరికా వెనకుండి ఇదంతా నడిపిస్తోంది. ఇది ప్రపంచ శాంతికి తీవ్ర విఘాతం కలిగించే పరిణామం.

ఎన్ని వ్యూహాలు పన్నినా ఇరాన్‌ను లొంగదీసుకోవడం కష్టమే. పశ్చిమాసియాలో మరో యుద్ధానికి అమెరికా సిద్ధపడుతున్నట్టు స్పష్టమవుతోంది. ఈ ప్రాంతంలో రెండున్నర దశాబ్దాల్లో అమెరికా వివిధ దేశాలపై జరిపిన దురాక్రమణలలో దాదాపు 20 లక్షల మంది చనిపోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇరాక్ నుంచి లిబియా, సిరియా, యెమెన్‌ల వరకు అన్ని దేశాలు రక్తసిక్తమయ్యాయి. ఇరాక్‌లో రెండు ట్రిలియన్ల అమెరికన్ డాలర్లు (120 లక్షల కోట్ల రూపాయలు) ఖర్చు చేసి 4400 మంది సైనికులను పోగొట్టుకొంది. అయినా తన లక్ష్యాన్ని నెరవేర్చుకోలేకపోయింది. మరోవైపు ఈ ప్రాంతంలోని మార్కెట్లపైనా, చమురు వనరులపైనా అమెరికా నియంత్రణను రష్యా, చైనా సవాలు చేస్తున్నాయి. కాబట్టి ఈ ప్రాంతంలో యుద్ధాలను విస్తృతం చేయడమే అమెరికా లక్ష్యంగా ఎంచుకొంది.

2017 నవంబర్ 4న సౌదీ పత్రిక 'అరబ్ న్యూస్'లో మేరియా దు బొవికోవా 'యుద్ధ ఢంకా మోగిస్తున్న ఇజ్రాయిల్' అంటూ ఒక వ్యాసం రాశారు. 2013 నుంచి ఇజ్రాయిల్ సిరియా, లెబనాన్‌లపై వంద క్షిపణులు కురిపించిందని, సిరియాలో యుద్ధం ఇరాన్-హెజ్బొల్లాకు అనుకూలంగా మారడమే ఇందుకు కారణమని ఆమె వివరించారు. ఉత్తరాన సిరియా, లెబనాన్‌లపై దాడి చేయడమనే లక్ష్యం పెట్టుకున్నప్పటికీ, దక్షిణాన గాజాపై దాడి ఆలోచన కూడా ఉన్నట్టు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి అవిగ్డార్ లైబర్మాన్‌ను ఉటంకిస్తూ మేరియా వివరించారు. సౌదీ రాకుమారుడు మహమ్మద్ బిన్ సల్మాన్ తన దేశంలో ఏ ఎదురూ లేకుండా అమెరికా, ఇజ్రాయిల్ సాంగత్యంలో చక్కగా ఒదిగిపోయారు. ఈ మూడు దుందుడుకు దేశాలు కలిసికట్టుగా యుద్ధానికి సమాయత్తమవుతున్నాయి.

అరబ్బు ప్రాంతంలో ఐఎస్ఐఎస్ ప్రభావం లేకుండా చేసిన తరువాత పశ్చిమాసియా రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి తీవ్ర పోటీ అగ్రరాజ్యాల మధ్య మొదలైంది. లెబనాన్ ప్రధానమంత్రి హారీరి రాజీనామా ఇందులో భాగమే. సిరియా, లెబనాన్‌లలో ఇరాన్ ప్రాబల్యం పూర్తిగా నిర్మూలించలేక పోయినా, బాగా తగ్గించాలని అమెరికా- ఇజ్రాయిల్- సౌదీ కూటమి భావిస్తున్నది. హెజ్బొల్లా ఒక శక్తిగా నిలిచి ఉండకుండా దెబ్బతీయాలనేది ఇజ్రాయిల్ లక్ష్యం. ఈ ప్రాంతంలో రష్యా ప్రాబల్యాన్ని కట్టడి చేయాలనేది అమెరికా లక్ష్యం. ఈ సవాలును ఎదుర్కోవడానికి ఇరాన్-హెజ్బొల్లా సమాయత్త మవుతున్నాయి. మరోవైపు ఇరాన్ ప్రాబల్యాన్ని నిర్వీర్యం చేసేందుకు ఇజ్రాయిల్ ముందుకు వస్తున్న నేపథ్యంలో యుద్ధం ముంచుకు వస్తున్నదనే సూచనలు కనబడుతున్నాయి.

అంతర్జాతీయ చదరంగంలో ప్రాబల్య శక్తులు పావులు కదుపడం సహజం. అమెరికా కూడా ఇందుకు మినహాయింపు కాదు. అయితే అమెరికా సౌదీ అరేబియాను ముందుపెట్టి ఇప్పటివరకు అనుసరించిన విధానాలన్నీ బెడిసి కొట్టడమే కాకుండా ప్రపంచ శాంతికి భంగకరంగా మారాయి. అఫ్ఘనిస్థాన్‌లో సోవియెట్ అనుకూల ప్రభుత్వాన్ని కూలదోయడానికి పాకిస్థాన్‌ను వేదికగా చేసుకొని సౌదీ అరేబియా ద్వారా తాలిబన్లకు డబ్బు, ఆయుధాలు అందిస్తే ఇవ్వాళ ఆ తాలిబన్లే అమెరికాకు పక్కలో బల్లెం మాదిరిగా తయారయ్యారు. సిరియా ప్రభుత్వాన్ని కూలదోయడానికి తిరుగుబాటుదారులను ప్రోత్సహిస్తే చివరికి ఇస్లామిక్ తీవ్రవాద శక్తులు పుట్టుకొచ్చి ప్రమాదకరంగా మారారు. రష్యా అండతో అసద్ బలపడ్డారు. అమెరికా సద్దాం ప్రభుత్వాన్ని కూలదోసిందే కానీ, అక్కడ పట్టు సాధించలేకపోయింది. ఐసిస్‌కు ప్రధాన స్థావరంగా ఉంది.

లండన్‌లోని ప్రముఖ అరబ్బు రచయిత అబ్దెల్ అత్వాన్ చెబుతున్న ప్రకారం - అరబ్బు ప్రాంతంలో ఘర్షణ జరిగే అవకాశాలను నాలుగు పరిణామాలు సూచిస్తున్నాయి. ఒకటి ఇరాన్‌కు, బిన్ లాడెన్‌కు సంబంధం ఉన్నట్టు చూపే డాక్యుమెంట్లను అమెరికా బయట పెట్టడం. రెండవది హెజ్బొల్లాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడం. మూడవది ఖాన్ షాయ్ ఖున్‌లో సిరియా ప్రభుత్వం రసాయన వాయువు ఉపయోగించినట్టు నివేదిక రావడం. ఈ నివేదికను రష్యా తిరస్కరించింది. నాలుగవది లెబనాన్‌లో సంక్షోభం సృష్టించి యుద్ధ పరిస్థితులు కల్పించడం. హారీరి రాజీనామాకు ముందే ఆయన ఈ అంచనా వేశారు. మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న రాజకీయ సంఘటనలు ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్నాయి. సౌదీ అరేబియా అమెరికా దన్నుతో ఒక దేశ ప్రధానిని అపహరించడం, వివిధ దేశాలపై యుద్ధాలకు కాలుదువ్వడమంటే మానవాళిని మూడవ ప్రపంచ యుద్ధంవైపు నడిపించడమే అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలోనే ఆధిపత్యం, యుద్ధం, అసమానతలు, దోపిడీల మూలాలు ఉన్నాయన్న చారిత్రక సత్యం మరోమారు ఇలా రుజువవుతోంది. అఫ్ఘనిస్తాన్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాల్లో యుద్ధాన్ని కొనసాగించాలన్న దిశగా ట్రంప్ ముందుకెలుతున్నాడు. యుద్ధం నివారించాలంటే సామ్రాజ్యవాద అంతంతోనే ప్రపంచ శాంతి ముడిపడి ఉందన్న సత్యాన్ని అందరూ గ్రహించాలి. ప్రపంచ శాంతికి సోషలిస్టు విప్లవమే ప్రత్యామ్నాయం.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

బస్తర్‌లో భూసంబంధాలు - 2

***జనతన సర్కార్ ఆధ్వర్యంలో సాగుతున్న బస్తర్‌లో భూసంబంధాలు ఎలా ఉన్నాయో తన పరిశోధన ద్వారా తెలియజేస్తున్నారు* విశ్వం**

బస్తర్ ఆదివాసి ప్రజానీకం వ్యవసాయాన్ని పుణికిపుచ్చుకున్నప్పటికీ, అటవి ఉత్పత్తుల సేకరణ నుండి ఇంకనూ పూర్తిగా దూరం కాలేదు. నేటికి వారి ఆదాయంలో 50-60 శాతానికి పైగా అటవి ఉత్పత్తుల ద్వారానే సమకూరుతున్నది. కొంత ఎక్కువ తక్కువగా దండకారణ్యం మొత్తంగానే వ్యవసాయోత్పత్తి - అటవి ఉత్పత్తుల సేకరణ జమిలిగా కొనసాగుతున్నది.

బస్తర్‌లో వ్యవసాయమనేది చాలా ప్రాథమిక స్థాయిలో కొనసాగుతున్నది. నారాయణపూర్, బీజాపూర్, దంతెవాడ జిల్లాలలో సర్వే చేసిన 20 గ్రామాలలోని మొత్తం 490 కుటుంబాలకున్న మొత్తం 2143 ఎకరాల భూమిలో, 2013-14 ఆర్థిక సంవత్సరంలో 9963 కండీల (2989 క్వింటల్ల) ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగింది. అంటే ఎకరాకు 4.65 కండీలు (1.39 క్వింటాల్=139 కెజిలు). అందులో వరి ధాన్యం 9037 కండీలు కాగా, చిరు ధాన్యాలయిన కోహలా, తైదలు, మొక్కజొన్నలు 505 కండీలు, పప్పులు 342.85 కండీలు, నూనె గింజలు 6.85 కండీలు, సామగడ్డలు 75.5 కండీలున్నాయి. ఆహార ధాన్యాల లభ్యతా ఒక్కో కుటుంబానికి సగటున 20.36 కండీలు (6.4 క్వింటల్స్). ఈ గ్రామాలలో ఎకరాకు గరిష్ట స్థాయిలో 20 కండీలు (6 క్వింటల్స్) పండించే కుటుంబాలు పది వరకున్నాయి. ఎకరాకు 3 నుండి 5 కండీలు కనిష్ట స్థాయిలో పండించే కుటుంబాలు 80 శాతం వరకున్నాయి. ఆదివాసేతరులలోని దాకడ్, తెలుంగ వారిలో ఎకరాకు 20 నుండి 30 కండీలు పండించే కుటుంబాలు మూడే ఉన్నాయి. అయితే వీరికి భూమి ఎక్కువకెక్కువగా మూడెకరాలకు మించి లేదు.

వ్యవసాయికంగా వెనుకబడి ఉన్న ఈ గ్రామాలలో సాగుచేసే పద్ధతులలో కూడా గ్రామ గ్రామానికి తీవ్ర వ్యత్యాసాలున్నాయి. సరిహద్దు (ఇంద్రావది నది) గ్రామాలైన పిచ్‌కొడ్డెర్‌లో ఎకరాకు సగటున 6.33 కండీలు పండిస్తుండగా, లోతట్టు గ్రామాలైన ఆదేవేడలో 5.02 కండీలు, దాని పక్క గ్రామమైన ఇర్పనారులో 4.15 కండీలు, తొండవేడలో 3.52 కండీల చొప్పున (సుమారు క్వింటల్) పండిస్తున్నారు. ఆదివాసేతరులున్న హర్రెకొడ్డెర్‌లోని పటేల్‌పారలోని దాకడ్ వాల్లు మాత్రం ఎకరాకు సగటున 11.5 కండీల ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. పటేల్‌పారలో భూములున్న 25 కుటుంబాలు తమ 62.7 ఎకరాల భూమిలో మొత్తంగా 687.5 కండీల ధాన్యాన్ని పండించగా, (ఎకరాకు సగటున 11.5 కండీలు=3.5 క్వింటల్), దీనికి పది పదిహేను కిలోమీటర్ల దూరాన గల ఇర్పనారులోని 24 కుటుంబాలు తమకున్న రెండింతలైన 125 ఎకరాలలో 430 కండీలు మాత్రమే (ఎకరాకు 4.15 కండీలు=1.2 క్వింటల్) పండించారు. ఆదివాసులతో పోలిస్తే బస్తర్‌లోని ఆదివాసేతరుల (దాకడ్, తెలుంగ) వ్యవసాయం కొంత మెరుగే అయినా చత్తీస్‌గడ్‌లోని మైదాన ప్రాంతాల రైతాంగంతో ఏమాత్రం పోల్చలేం.

పై వివరాలను పరిశీలించినపుడు ఫలసాయం చాలా తక్కువగా ఉండడానికి, భూములు నాసి రకానికి చెందినవనేదే గాక, సాగుచేసే పద్ధతులలో కూడా బాగా వెనుకబడి ఉండడం కారణంగా భావించాలి. ఆదివాసులు ఆదివాసేతరులకైనా తాము పండించిన ఆహార ధాన్యాలు మిగతా అవసరాలకు గాక, తాము తినడం కోసమే అయితే మూడు, నాలుగు నెలలకు మించి రావడం లేదు. మొత్తం 490 కుటుంబాలలో 31 కుటుంబాలకు భూములు లేని కారణంగా పంటనే లేదు. తాము పండించిన పంటతో నెల నుండి మూడు నెలల వరకే జీవనం గడిపే కుటుంబాలు 265 వరకు ఉండగా, 5 నుండి 6 నెలలకు మించిరాని కుటుంబాలు మరో 131 ఉన్నాయి. మొత్తంలో వీరిది 80 శాతం. ఏడాదిలో 2-3 నెలలకు మాత్రమే సరిపోని 50 ఉండగా, 17 కుటుంబాలకు సంవత్సరానికి సరిపోతుండగా, మరో ఎనిమిది కుటుంబాలకు మాత్రం స్వల్పంగా మిగులు ఉంటున్నది. వీరి వ్యవసాయమంతా కేవలం వారి ఆకలిని తీర్చుకోవడానికి మాత్రమే ననేది స్పష్టం.

గ్రామస్థులు ఇచ్చిన రిపోర్టు ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 463 గ్రాముల బియ్యం అవసరం పడుతున్నది. (పిల్లలకు కూడా అంతే మొత్తాన్ని లెక్కించాలంటున్నారు. పిల్లలేడ్చినప్పుడల్లా చాక్లెట్లో, బిస్కట్లో కొనిచ్చే పద్ధతి లేదిక్కడ. అసలు గ్రామాల్లో దుకాణాలే లేవు. పిల్లలేడిస్తే పొద్దస్తమానం దొప్పల్లో ఇంత అన్నం పెట్టి ఇస్తారు) ఆ లెక్కన 490 కుటుంబాలలోని మొత్తం 2450 మందికి సంవత్సరానికి గానూ 8,280 క్వింటల్ల ధాన్యం అవసరం పడుతుంది. అందులో వారు ఉత్పత్తి చేసిన ధాన్యం (తృన ధాన్యాలను కూడా కలిపి) 34.5 శాతాన్ని (2862 క్వింటల్స్) పూరిస్తుండగా, మిగతా 50 శాతం 580 కార్డులపై (490 కుటుంబాలు) 2088 క్వింటల్ల బియ్యాన్ని (కిలో బియ్యం=రెండు కిలోల ధాన్యం) ఆహార సబ్సిడీల కింద పొందుతున్నారు. అయినా కూడా 10-15 శాతం వరకు లోటు ఉంటున్నది. పై గణాంకాలను గమనంలోకి తీసుకున్నప్పుడు, వ్యవసాయ రంగంలో ఆదివాసులు పడుతున్న తిప్పలతో పాటు రెండు పూటల తిండి కోసం వారుపడే అవస్థలు అర్థమవుతాయి.

భౌగోళికంగా భూములు మైదాన సమతల భూములు గాక, గుట్టలు, వాగులు ఒర్రెలతో కూడిన ఎగుడు దిగుడులు గల అటవీ భూములు, ఎత్తులొంపులతో, రాళ్లురప్పలతో కూడిన భూములు కావడంతో

వ్యవసాయోత్పత్తులు - వివరాలు

క్ర.సం.	గ్రామాలు యూనిట్	మొత్తం కుటుంబాలు	భూమి (ఎకరాలలో)	ధాన్యం (క్వింటాల్స్)	తృణధాన్యాలు (క్వింటాల్స్)	పప్పులు-నూనె గింజలు (క్వింటాలు)	దుంపలు (క్వింటాల్స్)	ఎకరాకు సగటున దిగుబడి
1.	ఆదేవేడ	44	226	253	29.0	17.0	5.0	1.3 క్వింటాల్స్
2.	పిచ్‌కోడ్డేర్	59	226	380	7.5	33.3	5.0	1.9 ॥
3.	హడ్డేర్	84	439	563	3.3	18.0	5.0	1.3 ॥
4.	మంగనారు	95	411	373	0.6	7.0	1.5	0.9 ॥
5.	ఇతమెట్ట	60	249	342	11.2	22.7	0.7	1.5 ॥
6.	తొండవేడ	74	422	344	100.0	–	–	1.05 ॥
7.	హడ్డేర్ (గిరాధివాసి)	75	168	454	0.3	7.0	5.3	2.77 ॥
	మొత్తం (20 గ్రామాలు)	**490**	**2143**	**2710**	**151**	**105**	**22.6**	**1.53 ॥**

భూములన్నీ ఒకే తీరుగా వ్యవసాయానికి ఉపయోగపడేలా లేవు. ఆదివాసేతరుల భూములు తప్ప దాదాపు మిగతా భూములన్నీ పట్టాలు లేని జబరన్ భూములే. ఆదివాసుల దగ్గరున్న భూములన్నీ ఎగుడు దిగుడులతో, రాళ్లు రప్పలతో కూడి ఉండడం వలన వాటిని సాగుకి యోగ్యంగా మలచడంలో సంవత్సరాల కొద్ది శ్రమ ఖర్చవుతున్నది. ఆ భూములను చదును చేయడానికి ఆదివాసుల దగ్గర తమ సొంత రెక్కలు (వారి శ్రమ) తప్ప ఇతర సాధనాలేమీ లేవు. ఒకవేళ ఆ భూములపైనే ఆధారపడి జీవించాలనుకుంటే మాత్రం కనీసం 5-10 సంవత్సరాల పాటు నిరంతరం ఆ భూములపైనే శ్రమించాల్సి ఉంటుంది. కానీ అంతకాలం ఏమితిని బతకాలనేదే ప్రశ్న. తక్షణ తిండి సమస్య ముందుకు రావడంతో భూములు సాగులోకి తేవడం పెద్ద సమస్యగానే ఉంది. వెనుకబడిన ప్రాంతాల వ్యవసాయాభివృద్ధిలో భాగమైన భూ సమతలీకరణ, నీటి వసతి లాంటి మౌలిక సౌకర్యాల కల్పనకు పెట్టుబడి ఎంతో అవసరం. దానికి పై (ప్రభుత్వం) నుండి తగిన మద్దతు లేకుండా వారే వాటిని సమకూర్చుకునే ప్రసక్తేలేదు. తనకు, తన కుటుంబానికి సరిపడ తిండిగింజల దిగుబడిని సాధించలేని ఆదివాసి రైతులు, వ్యవసాయంలో మిగులుకు సంబంధించిన మాటేలేదు. ఒకవేళ ఎక్కడైనా కూలీకి వెళ్లి తెచ్చిన డబ్బులతో కడుపు చంపుకుని ఎలాగో ఓలాగా పెట్టుబడిని సమకూర్చినా తిరిగి అది తమకు ఆదాయాన్ని సమకూర్చి పెడుతుందన్న నమ్మకం కూడా లేదు.

స్థానికంగా కొద్ది మంది గత నాలుగయిదేళ్లుగా నేల సమతలీకరణ కోసం తమ భూముల్లో ఎంతగానో కష్టపడి శ్రమించినా శ్రమకు తగ్గ ఫలితంగా పంట దిగుబడి లేకపోవడంతో నేలకు చతికిల పడుతున్నారు. ఇర్పనారులోని ఓ రైతు తన తండ్రి నరికిన అటవీ భూమిని సంవత్సరానికి రెండేసి నెలల చొప్పున మూడు సంవత్సరాల పాటు ఏకధాటిగా భార్య భర్తలిద్దరూ దఫదఫాలుగా ఎకరం భూమిని సమతలం చేయడానికి ఎంతో కష్టపడ్డారు. వారు చెప్పిన రిపోర్టు ప్రకారమే ఆ ఎకరం భూమిపై మొత్తంగా 360 పనిదినాలు ఖర్చయ్యాయి. తత్ఫలితంగా ఆ ఎకరం భూమిలో పంట దిగుబడి గతంలోని 5 కండీల స్థానంలో 8 కండీలకు పెరిగింది. గుట్టను తవ్వి ఎలుకని పట్టినట్లుంది వారి పరిస్థితి. పెరిగిన మూడు కండీల ధాన్యపు విలువ 600 రూపాయలు (స్థానికంగా కండీకి 200 రూపాయలు). కనీసం రోజుకు వంద రూపాయలిచ్చే కూలీ పనులకు వెళ్లినా ఇద్దరికి కలిపి ఇరవై ముప్పై వేలైనా వచ్చేవి అంటున్నారు. పరిస్థితిని గమనించిన ఆ ఆదివాసి రైతు మిగతా పనిని పక్కనపెటి, ఎంత చేసినా ఇంతేనంటూ తీవ్ర నిరాశ చెంది 'ఆయార్' (సరిపోతది) అంటున్నాడు. ఈ స్థితి ఒక్క రైతుదే కాదు, ఈ ప్రాంతంలోని మెజారిటీ ఆదివాసి రైతాంగపు పరిస్థితి ఇదే. కొంతమందైతే ఇలాంటి భూములను సాగుకి తేవడం కంటే కూలీకి పోవడమే మెరుగంటున్నారు. ఇందులో కొంత వాస్తవం కూడా ఉంది.

వ్యావసాయానికి భూములుండగానే సరిపోదు. ఆపై నీటి వసతికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇక్కడి వ్యవసాయం మొత్తానికి మొత్తంగా నూటికి నూరుపాల్లు వర్షాధారమే. ఒక్క బావి లేదు, బోరు బావులు అసలే లేవు. ఇక చెరువుల మాటేలేదు. స్థానికంగా కనీసం ఆదివాసి రైతాంగంలో వాగుల నుండి, తొగుల నుండి పంట భూములకు నీటిని మళ్లించే పరిస్థితి కూడా లేదు. చిన్న చిన్న ఒర్రెల్లో నేలను సమంచేసి, అడ్డకట్టలు పోసి పంటలు పండించే పద్ధతి అమలులో ఉంది. ఇక్కడ పొలాలంటే ఎక్కువ శాతం ఇలాంటివే ఉన్నాయి. మొత్తంగా ఉన్న పంట భూముల్లో ఇలాంటి పొలాలనబడేవి కూడా 17.5 శాతానికి మించి లేవు. ఇలాంటి భూముల్లోనే గరిష్ట స్థాయిలో ఎకరాకు 10-15 కండీల (3-5 క్వింటల్లు) పంట దిగుబడి ఉంటుంది. హడ్డేర్, మంగనారు, కొసల్‌నారు లాంటి గ్రామాల పక్కనుండే ఇంద్రావతి నది పారుతున్నా, ఆదేవేడ, ఇర్పనారు, తొండవేడ లాంటి గ్రామాల్లో ఏడాది పొడుగుతా పారే వాగులెన్ని ఉన్నా, వారి పంట భూముల కోసం నీటి వసతికై వర్షం పైనే ఆధారపడక తప్పడం లేదు. వర్షాభావం కారణంగా ఏయేటి కాయేడు పంట దిగుబడిలో చాలా హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిందని చెపుతూ ఏళ్లకు ఏళ్లు గడిచినా ఏ గ్రామానికి కూడా నీటి వసతి మాటే లేదు. బస్తర్‌లోని చిన్న, మధ్యతరగతి ఆదివాసి రైతాంగం తమకు తాముగా తమ భూములకు నీటి వసతిని సమకూర్చుకోవడం నిజంగా వారి తాహత్తుకు మించిన పనే. మావోయిస్టు ఉద్యమ ప్రభావం నుండి ఆదివాసి రైతాంగాన్ని పక్కదారి పట్టించేందుకు గాను, ఈ మధ్య కాలంలో రమన్ సింగ్ ప్రభుత్వం తన సంస్కరణలని ప్రవేశపెట్టి, మన్‌రేగా పనులతో సమన్వయపరుస్తూ, వ్యక్తిగత చెరువులు,

కుంటలు పోసుకునేందుకు 30 వేల రూపాయల చొప్పున, 7 కుటుంబాలకు నిధులను మంజూరు చేసింది. ఇది సముద్రంలో కాకి రెట్ట లాంటిది. బస్తర్ సంబాగ్‌లోని పంట భూములకు నీటి వసతి కేవలం 2.9 శాతం మాత్రమే. అలాగే బస్తర్‌లో చిన్నవి, పెద్దవి కలిపి మొత్తంగా 35 నదులు పారుతున్నా రెండో పంట కేవలం ఒకే ఒక్క శాతంగా ఉంది.

సాగు పద్ధతులలో అనిపుణత కారణంగా కూడా పంట దిగుబడి చాలా తక్కువగా ఉంది. ఆదివాసి రైతాంగంలో భూమిని దున్నిన తరువాత నారుపోసి నాట్లేయడం కాకుండా విత్తనాలను వెదజల్లే పద్ధతి అమలులో ఉన్నది. విత్తనాలు కూడా ఎకరాకు కండీ (30 కెజి) చొప్పున వాడుతున్నారు. ఇది చాలా ఎక్కువ.

భూమి విత్తనాలు – పంట దిగుబడి – తొండవేడు గ్రామం

	రైతు పేరు	భూమి ఎకరాలు	విత్తనాలు ధాన్యం (కండీలు)	వరిధాన్యం దిగుబడి కండీలు	విత్తనాలు కోహల్ కండీలు	కోహల్ దిగుబడి కండీలు
1.	రాంసింగ్	4	3	10	0.25	1
2.	పంగుడ్	4	4	25	0.5	8
3.	మంగుతూ	4	2	21	0.35	1
4.	రాజు	3	2	16	0.5	5
5.	లచ్‌మన్	3	2	20	0	0
6.	లైకెన్	11.5	7	35	0.75	4
7.	సోముడు	5	3	25	1	12
8	నాసిక్	1	1	8	0.5	10
9.	మసాల్	5	3.	15	0.15	1.5
10.	అయితు	5	3	10	0.5	5
	మొత్తం	**45.5**	**30**	**185**	**4.5**	**47.5**

కండీ – 30 కిలోలు; పైలీ 1.5 కిలోలు

మైదాన ప్రాంతాల్లో ఎకరాకు 5–10 కిలోలకు మించి వాడడం లేదు. ఆదివాసేతరులైనా దాకడ్, తెలుంగ వారిలో కూడా నాట్లు వేసే పద్ధతి ఇంకా అలవడలేదు. భూములకు నీటి వసతి లేకుండా నాట్లు వేయడం లాభదాయకం కాదు. నాట్లు వేయడం ద్వారా పంట దిగుబడి పెరుగుతుందనేది అందరికి తెలిసిన విషయమే.

దశాబ్ద కాలంగా కలుపు తీయడం మొదలైనా ఇంకా సగానికి పైగా మిగిలే ఉంటున్నది. ఎరువుల వాడకం మొత్తంగానే లేదు. ఆవు పేడ లాంటి సేంద్రీయ ఎరువుల వాడకం కూడా లేదు. పశువులను ఇంటి చుట్టూ కట్టివేసే భూమిలో ఇన్ని మొక్కజొన్నలు అలకడం మినహా పేడను పొలాల్లోకి మళ్లించడం అనేది లేదు. కొందరైతే భూముల్లో కొన్ని సంవత్సరాల పాటు పంట తీసిన తరువాత నేలలో సత్తువ తగ్గిందనే దాంతో ఏడాది నుండి రెండు మూడేండ్ల వరకు పంటను తీయక భూమిని అలాగే పడావుపెట్టి ఉంచుతున్నారు. అందుకే చాలా మంది ఒర్రెల్లో భూమిని చదును చేసి సేద్యం చేయడానికి మొదటి ప్రాధాన్యత నిస్తారు. దీంతో నీటి సమస్య కొంత తీరడమే గాక, గుట్టలపైనున్న అడవిలోని కుళ్లిపోయిన ఆకులలములు వరదలో కొట్టుకవచ్చి భూమికి ఎరువుని సమకూర్చి పెడుతుందంటారు.

ఆదివాసి రైతాంగంలో కూడా ఇంజన్ల, ట్రాక్టర్ల వాడకం మొదలయింది. అయినా వాటి సగటు వినియోగం చాలా తక్కువ. కూలీ డబ్బులు, అటవి ఉత్పత్తులు అమ్మడం ద్వారా కూడబెట్టిన కొన్ని డబ్బులతో కొంత మంది తమ భూములను ప్రొక్లేన్‌లతో చదును చేయించుకుంటున్నారు. హద్దేర్, పిచ్‌కొద్దేర్ గ్రామాల్లో చాలా తక్కువ మందే అయినా ట్రాక్టర్లతో దున్నించడం అనేది ఉంది. ట్రాక్టర్లతో దున్నించడమనేది ఒకే ఒక శాతానికి మించదు. మొత్తంగా 20 గ్రామాలలోని 490 కుటుంబాలలో కేవలం 5–10 కుటుంబాలు మాత్రమే ట్రాక్టర్లతో దున్నించడం చేస్తున్నాయి. మిగతా 98 శాతం వారి భూములను నాగళ్లతోనే దున్నడం జరుగుతున్నది. పశువుల కోసం వేల రూపాయలు ఖర్చుపెట్టలేనివారు ట్రాక్టర్లతో దున్నించడమే మెరుగైనదిగా భావిస్తున్నారు. ఇలా దున్నించే వారంతా కూడా పశువులు లేని పేద, మధ్యతరగతికి చెందినవారే. లోతట్టు గ్రామాలైన ఆదేవేడ, ఇర్పనారు, పావుల్, తొండవేడ లాంటి గ్రామాల్లో ట్రాక్టర్ల మాటే లేదు.

గ్రామాల్లో నాగళ్లకు బదులు ట్రాక్టర్లతో దున్నడం మొదలైందంటే, ఆధునిక వ్యవసాయం మొదలైంది అనేదేమీ లేదిక్కడ. ట్రాక్టర్లతో దున్నినంత మాత్రాన ధాన్యపు ఉత్పాదకత పది కిలోలైనా పెరగలేదు. హద్దేర్, మంగనారులలో కలిపి మొత్తంగా నాలుగు ట్రాక్టర్లున్నాయి. వాస్తవానికి ఆ నాలుగు ట్రాక్టర్లకు వేలాది ఎకరాలను దున్నే క్షమత ఉన్నా కూడా వ్యవసాయంలో (దున్నడం) వాటి వినియోగం 5 శాతానికి మించి లేదు. ఈ ట్రాక్టర్లన్నీ కూడా వ్యవసాయం పేరు మీద బ్యాంకుల నుండి రుణాలతో తీసుకున్నప్పటికీ, తిరిగి వాటి బ్యాంకు రుణాలను తీర్చేందుకు ఇసుక, ఇటుకలు, మట్టిని చేరవేసే పనుల్లో పెట్టాల్సి వస్తున్నది. అయినా దేశంలోని వ్యవసాయ కూలీల మాదిరిగానే వీటికి కూడా ఎక్కువ కెక్కువగా ఆరు నెలలకు మించి పనులు దొరకడం లేదు. ఉన్న రెండు మూడు ఇంజన్ల పరిస్థితి కూడా అంతే.

అన్నింటికంటే ముఖ్యంగా అటవీ భూములను సాగు భూములుగా మార్చే క్రమంలో చెట్లనన్నింటినీ నరికినా కూడా ఇప్ప చెట్లను మాత్రం పొలాల మధ్యన నరకకుండా అలానే విడిచిపెడతారు. మొలిచిన ధాన్యపు మొక్కలపై తగినంత సూర్యరష్మి పడకపోవడంతో మొక్కలు ఎదగపోవడమే గాక, పంట దిగుబడి కూడా సరిగా రాదని అందరికి తెలిసిన విషయమే అయినా, పంట తగ్గినా పర్వాలేదు గానీ, ఇప్ప చెట్లను నరకడానికి ససేమిరా ఒప్పుకోరు.

గ్రామాలలో వ్యవసాయ పనులు జూన్, జూలై మాసాలలో మొదలై జనవరి ఆఖరికి ముగుస్తాయి. ఎనిమిది నెలలు కష్టపడిన ఫలితంగా వచ్చిన పంట దిగుబడి 80 శాతం కుటుంబాలకు సగటున నలుగైదు నెలలకు మించి సరిపోవడం లేదు. స్థానిక ఆదివాసి రైతాంగం నేడు తమ తిండిని తామే ఉత్పత్తి చేసుకోలేని స్థితిలో వారి వ్యవసాయం చాలా ప్రాథమిక స్థాయిలో కొనసాగుతున్నది. వరికోతలు అయిపోగానే పనులు లేక మిగతా నాలుగు నెలలు ఖాళీయే. గ్రామాలలో మిగులనేది కూడా లేకపోవడంతో ఇతరేతర పనులు కూడా లేకపోవడంతో, ఉపాధి అవకాశాలు ఏమాత్రం లేకుండా పోయాయి. భూములు పెద్ద మొత్తంలో సాగులో లేకపోవడంతో, వ్యవసాయ పనులు లేకపోవడంతో గ్రామాలలో కూలీ దొరికే మాటే లేకుండా పోయింది. వ్యవసాయంలో మిగులనేది

గ్రామాలలో కొంత మేరకైనా ఉపాధిని కల్పిస్తుంది. అలా లేకపోవడంతో శ్రమచేసే శక్తిగల వారందరూ ఊర్లో ఊరకనే గాలికి తిరగాల్సి వస్తున్నది. దీంతో ఎంతో విలువైన మానవ వనరులన్నీ వృథా అయిపోతున్నాయి. కండగల యువతకు గ్రామాల్లో పనులు లేక గోర్గా (జిలుగు కల్లు) కి అలవాటుపడుతున్నారు. కొంతమంది గత్యంతరం లేకనే పట్టణాలకు కూలీ కోసం వలసలు పోతున్నారు.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయమేమంటే, భౌగోళికంగా అంతగా అనుకూలంగా లేని ఆదివాసి (అడవి) ప్రాంతాల్లో వరి పంటను ముఖ్యమైన పంటగా ఎంచుకోవడం నిజంగా వారికొక చాలెంజ్ లాంటిదే. ఇతరేతర ప్రభావాలకు లోనై, ఆదివాసి రైతాంగం కూడా గత రెండు దశాబ్దాలుగా వరి ధాన్యాన్ని పండించడం పట్ల క్రేజీ పెరిగింది. వరి పంటకు సమతల భూములతో పాటు నీటి వసతి చాలా అవసరం పడుతుంది. ఒకవైపు మౌలిక సదుపాయాలన్నీ ఉండి కూడా వరి పండించే మైదాన ప్రాంతాల రైతాంగమే శ్రమకు తగ్గ ఫలితంగా అనేక కారణాలుగా పంట చేతికి రాక తీవ్రంగా నష్టపోతూ, ధాన్యానికి గిట్టుబాటు ధరలకై ఉద్యమిస్తుంటే, ఎలాంటి మౌలిక వసతులు లేక, నిపుణత లేమితో ఆదివాసులు నేల సమతలీకరణ చేసి, మల్లు నిర్మించి పంటలు పండించడం నిజంగా ఒక చాలెంజీయే. అంత చేసినా వరి ధాన్యానికి ఈ ప్రాంతంలో పైలీకి పది రూపాయల ధర పలుకుతున్నది.

నేల సమతలీకరణ, నీటి వసతి, నాట్లు లాంటి ప్రత్యేకమైన స్కిల్స్ అవసరం లేకుండానే సాంప్రదాయక పంటలైన కోహలా, రాగులు, ఆర్క్ లాంటి తృణ ధాన్యాలను, ఉలవలు, మినుములు లాంటి పప్పు దినుసులను పండించవచ్చు. ఒక ఏడాది చేసిన పోడు వ్యవసాయం ద్వారా రెండు మూడేండ్లు తినేందుకు సరిపడా కోహలా పండించిన దాఖలాలున్నాయి.

ఆదివాసులు ధాన్యం పండిస్తేనే వారి కడుపు నిండుతుందనేదేమీ లేదు. భూములకు సరిపడా పంటనెంచుకొని పండించి దాన్ని మారకం చేసుకోవడం ద్వారా వచ్చే ఆదాయంతో కూడా కడుపు నింపుకోవచ్చు. అవగాహనా లోపంతో కొంత మంది ఆదివాసి రైతాంగాన్ని వరి ధాన్యాన్నే పండించాలని ఒత్తిడి చేయడం విచారకర విషయం. ఒక కండీ 'కోహలా' ధాన్యాన్ని మార్చుకోవడం ద్వారా మూడు కండీల వరి ధాన్యం వస్తున్నది. నిరుడైతే కోహలా ధాన్యం పైలీకి 30 రూపాయల ధర పలికింది. భౌగోళిక వాతావరణానికి అనువైన పంటనెంచుకోవడమనేది అన్నింటికి శ్రేయస్కరమైనది.

ఆదివాసులలో వ్యవసాయ ఖర్చుల కోసమని అప్పులు చేసే మాటేలేదు. వాస్తవానికి వ్యవసాయంలో నగదు ఖర్చులు లేవనే చెప్పుకోవాల్సి ఉంటుంది. చావు కర్మ లాంటి వాటికి లేదా ఇంటి అవసరాలకు కొంత అప్పు చేసినా అది మినహాయింపే. ఎక్కువ కెక్కువగా చేబదుల్లే ఉంటాయి. బస్తర్ ఆదివాసి రైతాంగం దొరికిన మేరకే సంతృప్తి పడడం తప్ప అప్పుల బాధల్లో కూరుకుపోలేదనే చెప్పుకోవాలి. కొండగావ్, కాంకేర్, బస్తర్ జిల్లాలో నామమాత్రపు వడ్డీతో (పావలా) అప్పులు ఇవ్వడం, తీసుకోవడం కొంత ఉంది.

వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి పరిష్కారంగా సామ్రాజ్యవాదులు ప్రవేశపెట్టిన హరిత విప్లవం రైతాంగం సమస్యను పరిష్కరించలేదు సరికదా, సమాజంలో ఇంతకు ముందెన్నడూ లేని అనేక సామాజిక రుగ్మతలను ముందుకు తీసుకువచ్చింది. ఎరువులు, పురుగు మందుల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు అనివార్యంగానే అప్పులు చేయక తప్పడం లేదు. ఎంతలేసి ఖర్చులు చేసినప్పటికీ రకరకాల కారణాలతో పంట చేతికి రాకపోవడంతో, చేసిన అప్పులు తీర్చలేక వేల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడాల్సి వస్తున్నది. అలాంటి అప్పుల బాధలు పడలేక ఆత్మహత్యలకు పాల్పడాల్సిన దుస్థితి ఆదివాసులకింకా ఏర్పడలేదు.

మానవ సమాజం ఆహార సేకరణ నుండి వ్యవసాయిక (ఆహారోత్పత్తి) సమాజాలుగా మారే ప్రక్రియ వేల సంవత్సరాల కాలమే తీసుకుంది. వ్యవసాయిక భూములన్నీ కూలీల శ్రమతో, దాసుల రక్తంలో తడవడం ద్వారానే వ్యవసాయిక సమాజాలు ఆవిర్భవించాయి అనేది వాస్తవం. నేడు ఎకరాకు లక్షల కొద్దీ రూపాయల ధర పలికే ఆ పంట భూముల్లో ఎంతో మంది కూలీల శ్రమ నిక్షిప్తమైంది. వ్యవసాయం అనేది పురోగమన దశలో ఉన్న కాలంలోనే వ్యవసాయిక సమాజాలుగా పరివర్తన చెందడానికి అంత సమయం తీసుకుంటే, ఏ మౌలిక సౌకర్యాల కల్పనలేక ఏ సాధన సంపత్తి మద్దతు లేకుండా ఉన్న పలంగా వెంటనే స్థిర వ్యవసాయంతో వ్యవసాయిక సమాజంగా పరివర్తన చెందేందుకు ఆదివాసి సమూహాలు పడుతున్న ఇబ్బందులను ఏ విధంగానూ వర్ణింపజాలం. అడవికి అలవాటు పడి, దానితో ముడివేయబడిన వారి (ఆదివాసి) జీవన విధానం, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులకు అలవడకపోవడం, అనుభవరాహిత్యం (అనిపుణత), నేటికి అడవిని, వేటను విడిచి ఉండలేక పోవడమే గాక, నేటి ఆధునిక వ్యవసాయోత్పత్తులకు పోటీగా నిలబడి వ్యవసాయం చేయడమనేది నిజంగానే ఆదివాసి రైతాంగానికి తలకుమించిన పనే.

వ్యవసాయ రంగంలో కొనసాగుతున్న సగటు సాగు పద్ధతులను అనుసరించకుండా ఇంకనూ అతి పురాతన పద్ధతుల ద్వారానే వ్యవసాయం చేయడమంటే, తాము ఉత్పత్తిగావించిన వాటి నిజ విలువలను మారకంలో తగ్గించి ఇవ్వాల్సి ఉంటుంది. తమ ఉత్పత్తి విలువలు తగ్గడంతో వాటి ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగానూ వారి జీవన ప్రమాణాలపై పడకతప్పదు. ఆదివాసి ప్రజానీకం వ్యవసాయాన్ని ఉపాధిగా స్వీకరించినంత మాత్రాన బస్తర్‌ను (షెడ్యూల్డ్ ప్రాంతాలను) అర్ధ భూస్వామ్య ప్రభావిత ప్రాంతంగా నిర్ధారించలేం. అలాగే గతంలో జరిగిన మాదిరిగా ప్రతి సమాజం ఆహార సేకరణ (సహజోత్పత్తి) దశ వ్యవసాయిక సమాజాలుగా పరివర్తన చెందడం ద్వారానే ముందుకు పయనించినట్లుగా ఆదివాసి సమాజాలన్నీ కూడా అనివార్యంగానే వ్యవసాయిక సమాజంగా పరివర్తనను పూర్తి చేయడం ద్వారానే ముందుకెళ్లాల్సి ఉంటుందనే నియమమేమీ లేదు. ఇతరేతర ప్రత్యామ్నాయ మార్గాలేవి ముందులేకపోవడంతోనే వారు వ్యవసాయం ప్రధాన వృత్తిగా తప్పడం లేదు. నిజానికి ఆదివాసులకు వ్యవసాయం రెండో ప్రాధాన్యత గల అంశం. అడవిపై ఆధారపడిన వారి జీవన విధానం, వారి ఉత్పత్తి విధానాన్ని నియంత్రిస్తున్నది.

(ఇంకా ఉంది)

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

కుల వృత్తుల ప్రోత్సాహం

పాలకులు ప్రజలను కులాలవారీగా విభజిస్తూ, కులవృత్తులలోనే కొనసాగే ఓట్ల రాజకీయాలు చేస్తున్నారనీ, ప్రజలు తమ జీవితాలు బాగుచేసుకోవడానికి ఈ దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలనీ అంటున్నారు **కె.జి. రాంచందర్**

'కుల వృత్తి మానకురా గువ్వల చెన్న' ఇది పాత సామెత. దీన్ని మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆయా వృత్తులు చేస్తున్న వారిని, 'వృత్తులు మానకండిరా బాబు' అని ఆయా వృత్తులు చేస్తున్న సమూహాలకు, కుటుంబాల పరంగా వారి వృత్తికి కావాల్సిన సాధనాలు సమకూరుస్తున్నాడు. తాను మాత్రం తన వృత్తిని మార్చుకున్నాడు. శూద్రుడై ఉండి క్షత్రియ వృత్తిని తన వృత్తిగా మార్చుకున్నాడు. ఇలా మార్చుకోవడం సరియైనది కాదని కాదు. ఆయన వృత్తిని మార్చుకోవడం సరియైనదే. ఎందుకంటే బ్రాహ్మణుడే గురువు కావాలనీ, క్షత్రియుడే పాలకుడు కావాలనీ, వైశ్యుడు వ్యాపారం చేయాలనీ, శూద్రుడు శారీరక శ్రమ చేయాలనే పాత చింతకాయ పచ్చడి అవసరం లేదు. అందరూ అన్ని వృత్తులు స్వీకరించ వచ్చనే ప్రజాస్వామ్య విలువల ప్రకారం, ఎవరైనా ఏ వృత్తినైనా చేయవచ్చు. దానిలో భాగంగా శూద్రుడైన చంద్రశేఖర్ రావు పాలకుడు కావడము సరియైనదే. అందరు కూడా తమ తమ వృత్తులే చేయాలనీ, అందులోనే తరతరాలు కొనసాగాలనే చాతుర్వర్ణ వ్యవస్థ దృష్టి సరియైనది కాదు.

చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా వృత్తిని చేపట్టింది తన శూద్రత్వాన్ని (తరతరాల) తిరస్కరించి కాదనపిస్తుంది. ఎందుకంటే ఆయన ఈ ముఖ్యమంత్రి వృత్తిని శూద్రత్వాన్ని తిరస్కరించి చేపట్టినట్లుగా లేదు. నిజంగా ఆయన అలా శూద్రత్వాన్ని తిరస్కరించి చేపట్టి ఉంటే అది చైతన్యవంతమైన ప్రజాస్వామ్య విలువ అయ్యేది. ఆయన పాత వ్యవస్థను చైతన్యవంతంగా ధిక్కరించి తన వృత్తిని మార్చుకోలేదు. అందుకనే ఆయన అనేక వృత్తి సమూహాలకు మీ, మీ వృత్తులను కొనసాగించండి, మీకు కావాల్సిన సాధనాలను సమకూరుస్తానని చెబుతున్నాడు, చేస్తున్నాడు. ఇలా చేయడమొక ఘనకార్యంగా భావిస్తున్నాడు. ఆయన వంధిమాగధులు ఆయనను గొప్ప అవతార పురుషుడుగా పొగుడుతున్నారు.

కుల ప్రాతిపదికగా వృత్తుల ప్రోత్సాహం లేదా సహకారం. జనరల్‌గా వృత్తులకు సహకారం అనేది కాదు. కుల ప్రాతిపదికగా వృత్తుల సహకారం అనేది జరుగుతున్నది. దానిలో భాగంగా గొల్ల కురుమ (కుర్వ)లకు కుటుంబానికి 20 గొర్రె పిల్లలు, ఒక గొర్రె పోతు పిల్లతో 21 జీవాలను గొల్ల, కుర్వ కులస్తులకు ఇవ్వడం జరుగుతున్నది. అంతకుముందు మత్స్యకారులకూ, బెస్తలకూ సహాయం అందించారు. వీళ్ల కూడా చేపలు పట్టుకొని బతికేవారు అని కాదు, జన్మతః వంశపార పర్యంగా ఆ వృత్తి చేసినవారికి కుల ప్రాతిపదిక మీద చేపల గుడ్లు సప్లయ్ చేయడం, గ్రామ చెరువుల్లో చేపలు పెంచే ఏర్పాటు చేయడం. దీని కోసం ఆర్థిక సహాయం అందించడం. అలాగే కల్లు గీత కార్మికులకు, వీరు కూడా జన్మతః ఈడిగ, గౌడ కులస్తులకు వనాలు పెంచడమనే కార్యక్రమం, కల్లు అమ్ముకునే లైసెన్స్‌లు ఇవ్వడమనేది. అదే విధంగా నాయీ బ్రాహ్మణులకు సెలూన్ పెట్టుకోవడానికి, రజకులకు వాషింగ్ మెషిన్లు, ఇస్త్రీ పెట్టెలు వగైరాలు కూడా బట్టలు ఉతికేపని చేసేవాళ్లకు అని గాదు. ఆ రజక కులస్తులకే ఈ విధంగా కుల ప్రాతిపదిక మీద వంశపారంపర్య వృత్తులను కొనసాగించమనే ప్రోత్సాహం, ఆర్థిక సహాయం అనేది చంద్రశేఖర్ రావు ప్రభుత్వం ఘనమైన కార్యక్రమంగా చేస్తున్నది.

బ్రాహ్మణులకు కూడా కుల ప్రాతిపదిక మీదనే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేసింది. బ్రాహ్మణులు కూడా కుల సర్టిఫికేట్ పొంది దాని ఆధారం మీద ఆర్థిక సహాయం పొందాలి అంటే బ్రాహ్మణులు కూడా తమ కులాన్ని అలాగే నిలబెట్టుకోవాలి. నిలబెట్టుకోవడానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయం చేస్తాడు. మాల, మాదిగలకు భూమి ఇస్తామంటున్నాడు. సరిపోయిందా, లేకపోతే వారికి కూడా వారి పూర్వులు చేసిన వంశపారంపర్య వృత్తులు చేసుకొండని మాదిగలకు తోలును కోసే ఆరెను, మాలలకు చితిని అంటించే కాగడాలనూ, శవాలు పూడ్చడానికి కావాల్సిన గడ్డపార, సలికె (పార)లు కూడా సప్లై చేస్తానని చెప్పలేదు. ఆ మేరకు సంతోషించాలి మనం.

ఇలా కుల ప్రాతిపదికన వృత్తులను ప్రోత్సాహించడాన్ని ఏమనాలి? చాతుర్వర్ణ వ్యవస్థ కొనసాగింపుగా అనాలా? మనం అందరం ఆలోచించాలి. గీతకారుడు (శ్రీకృష్ణుడు భగవద్గీతలో) కూడా స్వధర్మాన్ని ఆచరించమన్నాడు. స్వధర్మమంటే స్వంత వర్ణ ధర్మమన్న మాట. ఏ వర్ణం వాడు ఆ వర్ణ ధర్మాన్ని నిర్వర్తించమన్నాడు. ఈ ధర్మ సూత్రాన్నే మన ముఖ్యమంత్రి పాటించమంటున్నాడు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. అదేమిటంటే సాంప్రదాయక వృత్తులకు ఆదరణ కరువై పోతున్న పరిస్థితులలో వాటి మీద ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భద్రత లేకుండా పోతున్నది. కాబట్టి వారి ఆర్థిక భద్రతను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. వారికి తాము కొనసాగిస్తున్న వృత్తులను నిలబెట్టిన ఉపాధి కల్పించాలి లేదా ప్రత్యామ్నాయ ఉపాధులైన చూయించాలనే సమస్య వస్తుంది. ఈ ఉపాధి నిలబెట్టే లేదా కల్పించే ప్రభుత్వాల విధి నిర్వహణలో భాగంగానే నేను ముఖ్యమంత్రిగా, వారి వృత్తులను సంరక్షించే బాధ్యత చేపట్టడంలో భాగంగానే, కుల వృత్తులకు సహాయం చేస్తున్నానని ఆయన అనవచ్చును.

ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే వృత్తులను కుల ప్రాతిపదికగా గుర్తించడం జరుగుతున్నది. దీని వలన రెండు నష్టాలు జరుగుతాయి. ఒకటి ఫలానా కులం వాళ్లు ఫలానా వృత్తిని వంశపారపర్యంగా చేస్తున్నారు. కాబట్టి వారిని అదే వృత్తి చేస్తున్నవారుగా గుర్తించడం. కాని వారిలో కొందరు ఇతర వృత్తులు లేదా పనులు చేస్తూ ఉంటారు. అలా ఇతర పనులు చేస్తూ ఉండే వారిని కూడా పాత వృత్తి (కుల వృత్తి) చేస్తూ ఉన్నవారిగా గుర్తించి సభ్యత్వం నమోదు చేసుకొని ఆర్థిక సహాయం చేయడం. ఇది ఏ కులం వారు అదే కులం వృత్తిని కొనసాగించాలనే పాత వర్ణ వ్యవస్థ నియమాలకు అనుగుణ్యమైనదే అవుతుంది. ఇది సరియైనది కాదు. అంతకంటే ఇది ప్రగతి వ్యతిరేక భావాలను ప్రోత్సహించడం అవుతుంది.

ఇక రెండోది కొందరు తమ వంశపారంపర్య వృత్తులను వదిలిపెట్టి వేరే వృత్తులు చేస్తుంటారు. ఇలా చేసేవారు కూడా తగినంత నిష్పత్తిలో ఉంటారు. అయితే అలాంటి వారికి మీరు మీ వంశపారంపర్య వృత్తి సంఘాల్లోనే ఉండాలని లేకపోతే మీకు వేరే వృత్తులు మార్చుకొని చేస్తున్నప్పటికీ మీకు వేరే కులవృత్తుల సభ్యత్వం ఇవ్వబడదని తిరస్కరించ బడుతుంది. ఆ విధంగా వాస్తవంగా వృత్తి చేస్తున్నప్పటికి

ఉదాహరణకు, కొందరు ముస్లింలు లేదా ఇతర వెనుకబడిన తరగతుల వారు లేదా షెడ్యూల్ కులస్తులు తమ తమ పాత వృత్తులు కాకుండా వేరే వృత్తులు చేస్తున్నప్పటికీ, వారి సభ్యత్వాలు నమోదు చేసుకోరు. వారికి, వారు వాస్తవంగా, కొనసాగిస్తున్న వృత్తులకు, ఆర్థిక సహాయం లభించదు. ఇది కూడా స్వేచ్ఛగా వృత్తి మార్చుకోవడానికి అవకాశం లేకుండా చేస్తుంది. ఇది కూడా ఏ వర్ణం ఆ వర్ణం వృత్తే చేసుకోవాలనే మను సిద్ధాంతమే అవుతుంది. ఇది కూడా ప్రగతి వ్యతిరేకమే. పాత భావాలనూ, నియమాలనూ పాలక వర్గాల వారు రక్షిస్తారు, ప్రోత్సహిస్తారనేది నిజమే కదా.

ఒకప్పుడు సమాజంలో కులం ఒకే వర్గంగా ఉండేది. అంటే కులస్తులందరు ఒకే వృత్తి అవలంభించేవారు. కాలం గడిచే కొద్ది ఒకే కులంలో ఉండేవాళ్లు వేరే వృత్తులు, పనులు చేసుకోవడం ప్రారంభించారు. చేపలుపట్టే వాళ్లు, ఈత కల్లు తీసేవాళ్లు, గొర్రెల కాపరులు, క్షురక వృత్తి చేసేవాళ్లు, బట్టలు ఉతికే వాళ్లు, కొద్దిలో కొంతమందైన వ్యాపారస్తులయ్యారు. ఉద్యోగస్తులయ్యారు. రైతులయ్యారు. కాబట్టి రోజు, నూటికి నూరు మంది ఏ కులం వారు ఆ కుల వృత్తే చేస్తున్నారని చెప్పడానికి లేదు. అందుకని కులంతో సంబంధం లేకుండా ఎవరు ఏ వృత్తి చేస్తున్నారో పరిశీలించి ఆ వృత్తి చేసే వారిని వారి, వారి వృత్తి సంఘాల్లో సభ్యత్వాలిచ్చి ఆర్థిక సహాయాలు చేస్తే హేతుబద్ధంగా ఉంటుంది.

ఏదైతేనేమి ముఖ్యమంత్రి కుల ప్రాతిపదిక మీద వృత్తులను గుర్తించి సంఘాలు ఏర్పాటు చేసుకొమ్మని చెబుతున్నాడు. వాటికి ఆర్థిక సహాయం చేస్తానంటున్నాడు. ఈ విధమైన ఆర్థిక సహాయం వలన ఆ వృత్తులు నిలబడుతాయా, ఆ వృత్తి చేసుకొనే వాళ్లు ఆర్థికంగా నిలదొక్కొని జీవించగలరా. ఇది మనం పరిశీలించాల్సింది. ఈ రోజు ప్రపంచీకరణ కాలంలో, ఈ ప్రపంచీకరణను అన్ని ప్రభుత్వాలు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) నూరు శాతం ఆహ్వానిస్తూ, దానికి రెడ్ కార్పెట్ పరుస్తూ, మరొకవైపు వృత్తులు నిలబెట్టుతామని ప్రకటిస్తూ వాటికి అరకొర నిధులు కేటాయిస్తూ ఉండడం. ఇవి పరస్పర విరుద్ధ చర్యలు.

80 వేల రూపాయల సహాయంతో నడిచే సెలూన్లు, వాషింగ్ మిషన్ల దోబి షాపులు లక్షల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసే బ్యూటి పార్లర్లు, డ్రై క్లీనర్ల ముందు నిలబడుతాయా? తప్పనిసరిగా దివాళా తీస్తాయి. లేదా తక్కువ ఆదాయాలతో చాలీ, చాలని జీవనాన్ని కొనసాగిస్తాయి. మన ముఖ్యమంత్రి గారేమో. నాయీ బ్రాహ్మణులకూ, రజకులకూ వారి వృత్తులనూ నిలబెట్టానని గొప్పలు ప్రచారం చేసుకుంటాడు. ఈ ప్రచారంలో నాయీ బ్రాహ్మణుల, రజకుల ఓట్లన్ని తన పార్టీకే వెయ్యమంటాడు. ఇది ఓట్ల కోసం చేస్తున్న నాటకమేగాని ఆయా వృత్తులు చేస్తున్న వారి ఆర్థిక జీవితాలను బాగు చేద్దామని కాదు. ఒకవేళ మినహాయింపుగా మన రాష్ట్ర ముఖ్యమంత్రికి వీరి జీవితాలను బాగు చేద్దామని ఉన్నా, ప్రపంచీకరణను వ్యతిరేకించకుండా, పెట్టుబడిదారుల స్వేచ్ఛను అరికట్టకుండా ఆ పని ఆయన చేయలేడు. ఆయన నిజంగా వారిని వృద్ధిలోకి తీసుకొని రావాలని ఉంటే తప్పనిసరిగా, ప్రథమంగా ప్రపంచీకరణను వ్యతిరేకించాలి. లక్షల రూపాయల పెట్టుబడితో బ్యూటీపార్లర్లు, డ్రై క్లీనర్స్ పెట్టే పెట్టుబడిదారులను నియంత్రించి సమాజానికి అవసరమైన బ్యూటి పార్లర్లు, డ్రై క్లీనర్స్ సంస్థలను ప్రభుత్వ సహాయంతో ఏర్పాటు చేయాలి. మామూలు సెలూన్లలో, దోబీ షాపులలో పని దొరకని వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి పై వాటిలో పని కల్పించాలి. ఇది చిత్తశుద్ధిగల వారు చేయవలసింది. మన ముఖ్యమంత్రి నుండి గాని అలాంటి ప్రపంచీకరణ మద్దతుదార్ల నుండి అలాంటి చిత్తశుద్ధిని ఆశించడం నేతి బీరకాయలో నేయిని ఆశించినట్లే.

గౌడ కులస్తులకూ, కల్లు గీత వృత్తిదారులకూ కూడా ఈత వనాలు పెంచి, నీరాను సప్లై చేసి వారి జీవితాలను ఉద్ధరిస్తానంటున్నాడు. నీరా అంటే మద్యం కాదనీ, అది శరీర ఆరోగ్యాలకు మంచిదనీ, ముఖ్యమంత్రి ప్రచారం చేసుకుంటున్నాడు. అయితే ఇది జరిగే పనేనా? ఎందుకంటే, జనాన్ని మత్తుకు బానిసలు చేస్తూ వారిని మత్తు లేని నీరా తాగమంటే తాగుతారా? గత కల్లు దుకాణాల అమ్మకాల అనుభవాలు ఏమి తెలియజేస్తున్నాయి. మత్తుకు అలవాటుపడిన జనాలు కల్లు మత్తు ఇవ్వడం లేదని కల్లు దుకాణాల సీసాలు పగలగొట్టిన సందర్భాలు అనేకం. అంతేగాదు విచ్చల విడి మద్యం దుకాణాల లైసెన్స్‌ల మూలంగా జనాలు మత్తులేని కల్లు తాగడం లేదనీ, కల్లు దుకాణాల వారే మత్తును (గుల్ఫాం) కలపడం ప్రారంభించారు. ఒక్కొక్కసారి డోస్ సరిపోవడం లేదనీ మత్తు బాబుల ఫిర్యాదుల వలన ఎక్కువ డోసులు కలిపి వారి మరణాలకు కారణమవుతున్నారు. ఆ సందర్భాలలో ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడులను తట్టుకోలేక, అధికారులను మచ్చిక చేసుకొనే శక్తి గల బడాబాబులకు (రాజకీయ అండగల) కల్లు దుకాణాలనే గంపగుత్తగా కాంట్రాక్టుకు ఇస్తున్నారు. ఆ దుకాణాల్లో, ఈత వనాల్లో పనిచేసే కూలీలుగా, కల్లు గీత వృత్తిదారులు మారిపోవడం తప్ప ఇంకెక్కడ వాళ్ల జీవితాలు బాగుపడుతాయి. ఇప్పుడు జరుగుతున్న తతంగం కూడా ఈత వనాల పెంపు వలన ఆ కాంట్రాక్టు తీసుకున్న బడాబాబులే బాగుపడుతారు. ఇంతకు మించి ఏమి జరగదు. పోతే ఆ గీత వృత్తిదారుల్లోని వారి కుల పెద్దలు కొంతమంది బడాబాబులకు దళారీలుగా మారి కొంత ఆర్థికంగా బలపడవచ్చు. మన ముఖ్యమంత్రిగారికైతే గౌడ కులస్తుల ఓట్లైతే పోలయ్యే అవకాశముంటుంది.

ఇదే పరిస్థితి బెస్తవాళ్లకు వస్తుంది. వీరి కోసం కూడా చేపల విత్తును సరఫరా చేయడం, చెరువులను చేపలు పెంచడానికి ఏర్పాటు చేయడం లాంటిది చేస్తూ వారి జీవితాలను మెరుగుపరుస్తామని పెద్ద ఆర్భాటమే చేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. వ్యాపార స్వేచ్ఛ పేరుతో చేపల రంగంలోకి చట్టబద్ధంగానూ, చట్ట వ్యతిరేకంగానూ పెట్టుబడిదారులు ప్రవేశించి సముద్రాలలో స్టీమ్ బోట్లతో చేపల వేట కొనసాగించడం, వారు చేసిన అధికోత్పత్తితో చేపల మార్కెట్టును ఆక్రమించే పరిస్థితి కొనసాగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక వైపు అనుమతులిస్తూ, మరోవైపు బెస్త, ముదిరాజ్ కులస్తులకు ఓట్ల కోసం చేప విత్తును, సరఫరా చేస్తామని చెరువులు మీరే వాడుకోవచ్చని చెబుతున్నది.

అయితే వాస్తవంగా ఏమి జరుగుతుందంటే, ఇప్పటికే జరుగుతున్నది కూడా. పేరుకు బేస్త కులస్తులు చేపల వృత్తిదారుల సరఫరా సంఘాలు ఏర్పాటు చేసుకోవడం, కాని ఆచరణలో ఈ ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కల్పించిన వ్యాపార స్వేచ్ఛను తట్టుకోవడం కోసం అంటే చేపలు పెంచడం కోసం, వాటిని పట్టడం కోసం, వాటిని మార్కెటు చేసుకోవడం కోసం ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటించడం కోసం లక్షల పెట్టుబడులు అవసరమైతాయి. వాటినీ, ఆ లక్షల పెట్టుబడులనూ వారు ఏర్పాటు చేసుకున్న సహకార సంఘాల ద్వారా సమకూర్చలేక ఆ సంఘాల కార్యకలాపాలన్నింటినీ, గంపగుత్తగా కల్లు దుకాణాల మాదిరిగానే

రాజకీయ అండదండలు గల పెట్టుబడిదారులకు కాంట్రాక్టుకు ఇవ్వడం జరుగుతుంది. ఆ కాంట్రాక్టర్ల దగ్గర బెస్త కులస్తులు కూలీలుగా పనిచేస్తారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సహాయం వలన చేపల పెంపకం మూడు పూవులు ఆరుకాయలుగా విలసిల్లినా కూడా ఆ లాభాలన్ని కాంట్రాక్టర్లకే దక్కుతాయి. ఆ కాంట్రాక్టర్లందరు ఎక్కువ శాతం తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులై ఉంటారు లేదా వారి భాగస్వాములైన ధనవంతులైనా ఉంటారు. ఇంతకు మించి ఏమి జరగదు. బెస్త కులస్తులు కొందరు దళారీలు మినహా మిగతా వారందరు కూలీలుగానే మిగులుతారు.

వీరికి నిజంగా మేలు చేయదలిస్తే పెట్టుబడిదార్ల ప్రవేశాన్ని నియంత్రించి, ప్రభుత్వమే పూనుకొని చేపల వృత్తిదారుల సహకార సంఘానికి అన్ని రకాల ఉత్పత్తి రవాణా, ఖర్చులను సమకూర్చి మార్కెట్టు చేయించగలిగితే ఫలితం దక్కుతుంది. ప్రపంచీకరణ మద్దతుదారైన రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయలేదు గాక చేయదు. చివరగా గొల్ల కురుమలకు గొర్రెలిచ్చే పథకం గురించి వీరికీ, ప్రతి కుటుంబానికీ 20 ఆడ గొర్రెలు, ఒక పోతు గొర్రె మొత్తం 21 గొర్రె పిల్లలు. వీటికి లక్ష రూపాయలు ఇస్తానని ఈ లక్ష రూపాయల్లో 80శాతం సబ్సిడీగాను మిగతా 20శాతం లోనుగాను ఇచ్చి వారి జీవితాలు బాగు చేస్తానంటుంది రాష్ట్ర ప్రభుత్వం.

మొదటిది 21 గొర్రెలను ఒక కుటుంబం అంటే ఇద్దరు భార్యాభర్తలు కాయడానికి అంటే పెంచడానికి పూర్తిగా ఆ ఇద్దరికి పనికల్పించినట్లు కాదు. కనీసం ఒక వంద గొర్రెలైతే పెంచడానికి ఇద్దరికీ పూర్తి పని దొరికినట్లతుంది. కాబట్టి ఆ కుటుంబం ఏం చేస్తుందంటే ఇంకో 80 గొర్రెలు వేరే వాళ్లవి కలుపుకొని కాయాలి లేదా వారి 21 గొర్రెలు వేరే వాళ్ల మందలో కలపాలి. దీనర్థం ఏమిటంటే ప్రభుత్వం వారు 5 కుటుంబాలకిచ్చే గొర్రెలుతోన ఒక కుటుంబానికే పని దొరుకుతుంది. మిగతా నాలుగు కుటుంబాలు వేరే పని చేసుకోవల్సి వస్తుంది. ఒక లక్ష రూపాయల పెట్టుబడితో ఈ రోజుల్లో ఒక కుటుంబానికి ఏ వృత్తిలోనైన పని కల్పించలేరు. కనీసం ఒక కుటుంబానికి ఇద్దరి మనుషులకు పని కల్పించాలంటే కనీసం 5 లక్షల పెట్టుబడి అయినా కావాలి. అప్పుడు ఆ ఇద్దరికి కనీసం ఒక రోజు పనికి ఒకరికి 300 రూపాయల చొప్పున 600 రూపాయలు వచ్చే అవకాశముంటుంది.

ఇంతటితో ఈ కథ ముగియలేదు. ఎందుకంటే ఆ గొర్రెలు మేపుకోవడానికి భూములు కావాలి. ఆ భూములు ప్రభుత్వమే చూయించాలి. భూములు ఎక్కడో ఫారెస్టులో ఉన్నాయంటే సరిపోదు. అనుకూలమైన చోట కావాలి. అంతేకాదు గొర్రెల పెంపకమంటే మరీ పాతకాలం మాదిరిగా పెంచితే సరిపోదు. ఆ గొర్రెలకు ఇన్ని గొర్రెలకు ఒక డాక్టరు చొప్పున తగినంత మంది పశువుల డాక్టర్లను నియమించాలి. అవన్నీ సమకూరితే గొర్రెలు ఈని, ఈనిన తరువాత ఆ పిల్లలు బతికి బట్టకడితే, ఈ విషయంలో కూడా మన ముఖ్యమంత్రిగారు గొర్రెలు ఎన్ని పిల్లలు ఈనుతాయి అని కాకి లెక్కలు కట్టి గొర్రెల కాపరులు ధనవంతులై పోతారని అన్ని రాష్ట్రాల వారు ఈర్ష చెందాలనీ, చెందుతారనీ మాట్లాడుతున్నాడు. ఆయన, ఒక గొర్రె సంవత్సరానికి 3 పిల్లలు ఈనుతాయని నూటికి నూరు శాతం బతుకుతాయనీ, తాను 1 కోటి 50 లక్షలు ఇస్తాననీ, ఇంతవరకే గొర్రెల కాపరుల దగ్గర 1 కోటి గొర్రెలున్నాయని మొత్తం రెండున్నర కోట్ల గొర్రెలు 3 చొప్పున సంవత్సరానికి ఈనితే ఏడున్నర కోట్లు అవుతాయనీ, రెండున్నర కోట్లు తమ దగ్గర ఉంచుకొని, మిగతా 5 కోట్ల గొర్రెల అదాయం 5 వేల చొప్పున అమ్ముడవుతాయని సుమారు 25 వేల కోట్ల ఆదాయం, ఏడున్నర లక్షల కుటుంబాలకు వస్తుందని చెబుతున్నాడు.

మరీ ఇంత ఆశపోతుతనం పనికి రాదు. ఎందుకంటే గొర్రెలు మంచి తిండితిని, పుష్టికరంగా ఉన్న పరిస్థితులలో సంవత్సరానికి రెండు పిల్లలను ఈనటం గొప్ప విషయమట. ఈ పుట్టిన పిల్లలో కనీసం 20 శాతం పిల్లలు రకరకాల కారణాలతో చనిపోతాయట. అంటే ఆయన ఇప్పిస్తున్నట్లు కుటుంబానికి 20 అంటే 2 చొప్పున 40. చనిపోగా మిగిలేవి 30. దానిలో 15 మిగుల్చుకొని అమ్మితే 5 వేల చొప్పున 75 వేలు వస్తాయి. పెంచడం కోసం, రోగాలు వస్తే మందు ఖర్చుల కోసం, డాక్టర్ వగైరా వైద్య సిబ్బంది సేవ ఉచితంగా ప్రభుత్వం కల్పిస్తే కూడా అయ్యే మందుల ఖర్చులు ఇతరేతర అమ్మకానికయ్యే రవాణా ఖర్చులు సుమారు 25 వేలు పోతే మిగిలేవి సంవత్సరానికి 50 వేలు. ఇవి కూడా ఆశావహమైన అంచనాతో వేసినవి. ఈ 50 వేల ఆదాయం వచ్చిన కుటుంబాలు ధనవంతులు ఎలా అవుతారు. కనీసం బతకడం కూడా వీలుకాదు.

అందుకని ఆయన చెప్పినట్లు 20 గొర్రెలు కాకుండా కుటుంబానికి 100 గొర్రెలు ఇవ్వాలి. అప్పుడైన సంవత్సరానికి 2 లక్షల రూపాయలు వచ్చే అవకాశముంటుంది. సంవత్సరానికి 2 లక్షల కంటే కనీసం బతకడానికి వాళ్లు పిల్లలను మామూలు చదువులు చదివించుకోవడానికి సరిపోతాయనవచ్చు. ప్రతి కుటుంబానికి 100 గొర్రెలిచ్చి వాటిని మేపుకోవడానికి భూములు చూపించి, గొర్రెల ఆరోగ్యం కోసం తగినంత మంది పశువుల డాక్టర్లను వైద్య సిబ్బందిని ప్రభుత్వం తరపున పెడితే ఆ పథకం కనీసం బతికి బట్టకడుతుంది.

అలాగాకుండా 20 గొర్రెలే ఇస్తాను. భూములు చూయిస్తానంటాడు. ఆచరణలో భూములు చూపించకపోతే, వైద్య సిబ్బందిని తగినంత మందిని కల్పించకపోతే, ముఖ్యంగా గొర్రెల అమ్మకానికి మార్కెటు కల్పించకపోతే, ఆ ఇచ్చిన 20 గొర్రెలు కుటుంబ పోషణకు సరిపోవని ప్రతి ఐదుగురిలో నలుగురు అమ్ముకుంటారు. పథకం నిష్ఫలమవుతుంది.

ప్రతి కుటుంబానికి 100 గొర్రెలు ఇవ్వడం, ఏడున్నర లక్షల కుటుంబాలు గల కురమ గొల్లలకు ఈ ప్రభుత్వ బడ్జెట్‌లో సాధ్యమవుతుందా? అంతకంటే ఏడున్నర కోట్ల గొర్రెలు సంవత్సరానికి రెండైన వాటి పిల్లలు 15 కోట్లు అవుతాయి. వీటికంత మార్కెటు చూపించగలమా అనే శంక రావచ్చు. మొత్తం ఏడున్నర లక్షల కురుమ గొల్లల కుటుంబాలు ఉన్నాయనీ, వారికందరికీ 100 గొర్రెలు పెంచమని చెప్పాల్సిన అవసరం ఏముంది? ఎంత మార్కెటు చూయించగలమో అంచనావేసి, (కుటుంబానికి 100 గొర్రెలు ఉంటేగాని బతకడం సాధ్యం కాదు కాబట్టి) మార్కెట్టుకు సరిపోయినంతమందికే గొర్రెలు ఇచ్చి మిగతా వారికి, వేరే ఉపాధిని చూయించాలి. అంతేగాని మీరు కురమ గొల్లలు కాబట్టి గొర్రెలే పెంచాలి అంటే ఎలా? ఇవన్నీ వారు బతకడానికి చేసే చర్యలు కావు. వారికి సగం సగం బతికేటట్లు కొంత సహాయం చేసి వారి వోట్లు కొల్లగొట్టుకోవడం కోసం చేసే పని గాని వేరు కాదు.

ఇదంతా 2019లో జరిగే ఓట్ల కోసమేగాని వృత్తిదారుల అభివృద్ధి కోసం ఎంత మాత్రం కాదని ఘంటాపథంగా చెప్పవచ్చు. పాలక వర్గ సంస్కరణలన్నీ ఇలాగే ఉంటాయి. తస్మాత్తు జాగ్రత్తగా ఉండి, వారి నైజాన్ని ఈ సందర్భంగా ప్రజలందరూ అర్థం చేసుకోవాలి.

ప్రజలు తమ జీవితాలను బాగు చేసుకోవడానికి పాలక వర్గాలకూ, తమను దోపిడీ చేస్తున్న వర్గాలకూ వ్యతిరేకంగా పోరాటాలు మినహా మార్గం లేదని భావించి, వాటికి సిద్ధం కావాలి.

(రచయిత ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు) వీ

కె.ఎస్.తో నా అనుభవాలు

విప్లవోద్యమ నాయకుడు కొండపల్లి సీతారామయ్యతో తనకు ఎదురైన అనుభవాలు, ఆయనతో పాటు పాల్గొన్న కార్యక్రమాలను పంచుకుంటున్నారు బి.వి. సుబ్బారావు

విప్లవోద్యమాల్లో నేనెప్పుడూ ప్రత్యక్షంగా పాల్గొన లేదు. అందువల్ల ఉద్యమాలకు సంబంధించి కె.ఎస్.తో నా అనుభవాలేమీ లేవు.

జూన్ 1965లో వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. చేరిన నాలుగు రోజుల తర్వాత కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్య గారిని కె.జి. సత్యమూర్తిగారి ఇంట్లో కలుసుకున్నాను. చాలా ఆప్యాయంగా పలకరించి పక్కన కూర్చోబెట్టుకున్నారు. కె.ఎస్.తో అదే నా మొదటి ముఖాముఖి. చూడ్డంతోనే 1955 సంవత్సరంలో ఘంటసాలపాలెం బహిరంగ సభలో ఆయన చేసిన ప్రసంగం సజీవంగా నా కళ్ల ముందు సాక్షాత్కరించింది. ఆ రోజుల్లో కమ్యూనిస్టు నాయకులు బహిరంగ సభల్లో ఆవేశంగా మాట్లాడి ప్రజల్ని ఉత్తేజపరిచేవారు. సీతారామయ్య గారి ప్రసంగం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. క్లిష్టమైన విషయాల్ని గ్రామీణ ప్రజలకు అర్థమయ్యేలా విడమర్చి చెప్పి వారిలో ఆలోచనల్ని రేకెత్తించాడు. అస్తవ్యస్తంగా ఉన్న దేశ ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ 'స్వాతంత్ర్యం రాకముందు నుంచి చెలామణిలో ఉన్న కానీ నాణాన్ని పూర్తిగా తయారు చేయలేని దుస్థితిలో ఉన్న ప్రభుత్వం మధ్యలో పెద్ద చిల్లు పెట్టింది. ఇటువంటి చిల్లు కానీల ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించండి' అని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని పటిష్టపరచడంలో కె.ఎస్. ప్రధాన పాత్ర పోషించాడు. పది సంవత్సరాల తరువాత కూడా ఆయన మాట్లాడే పద్ధతిలో పెద్ద మార్పేమీ కనబడలేదు నాకు. ఫాతిమానగర్‌లో ఉన్న సెయింట్ గేబ్రియల్ హై స్కూల్‌లో కె.ఎస్., సత్యమూర్తి ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేసేవారు. తరువాత వాళ్లిద్దర్నీ ఎన్నో సార్లు కలుసుకుని గంటల తరబడి గడిపేవాణ్ని. క్లాసులో పాఠాలు బోధించే నేను కె.ఎస్. దగ్గర ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. ప్రతి విషయాన్ని మార్క్సిస్ట్ దృక్కోణం నుంచి సోదాహరణంగా వివరించేవాడు.

1966లో కాలేజీ ప్లానింగ్ ఫోరం ఆధ్వర్యంలో ఓ సభ జరిగింది. కేంద్ర మంత్రి డా. మర్రిచెన్నారెడ్డి ముఖ్య అతిథిగా ఆ సభలో పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతినిధి నాగిరెడ్డి మాట్లాడుతూ, ప్లానింగ్ కమిషన్, కేంద్ర ప్రభుత్వాల్లో ఉన్న అవినీతిని తీవ్రంగా విమర్శించాడు. ఆ విమర్శలపై మంత్రి సమయస్ఫూర్తితో, సంయమనంతో స్పందించాడు. కాని ప్రిన్సిపల్ వివిఎల్ రావు మాత్రం ఆ సభలో చేసిన విమర్శల విషయంలో క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో సంజాయిషి ఇవ్వాల్సిందిగా నాగిరెడ్డికి నోటీసు జారీ చేశాడు. ఆ నోటీసుకి 60 పేజీల సుదీర్ఘ సమాధానం ఇచ్చాడు నాగిరెడ్డి. కొఠారి కమిషన్, జస్టిస్ చాగ్లా కమిటీ రిపోర్టుల్నుంచి, నెహ్రూ ప్రసంగాల్నుంచి అనేక విషయాల్ని ఉటంకిస్తూ తన విమర్శల్ని సమర్థించుకున్నాడు. నాగిరెడ్డి సమాధానం కాలేజీలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. ప్రిన్సిపల్ వివిఎల్ రావు పెద్ద నియంత. నాగిరెడ్డి ఇచ్చిన వివరణ తన అహాన్ని దెబ్బకొట్టడంతో నిప్పులు తొక్కిన కోతిలా తయారయ్యాడు. ఆ సమాధానాన్ని తయారు చేసింది కె.ఎస్. అనే విషయం ఆయనకు తెలియదు. కె.ఎస్.కున్న విషయ పరిజ్ఞానానికి ఆశ్చర్యపోయాను. ప్రిన్సిపల్ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సమ్మెకు దిగారు విద్యార్థులు. అంతర్గత పరీక్షలతో నిమిత్తం లేకుండా సెషనల్ మార్కుల్ని అడ్డగోలుగా కేటాయించి ప్రతిభావంతులైన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ పైశాచికానందాన్ని పొందే కామర్సు లెక్చరర్‌ని తొలగించాలనేది వారి ప్రధాన డిమాండ్. ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చిన ఆ లెక్చరర్‌ని సిగ్గులేకుండా సమర్థిస్తూ వెనకేసుకొచ్చాడు వివిఎల్ రావు. నాగిరెడ్డికిచ్చిన నోటీసును ఉపసంహరించుకోవాలనేది మరో డిమాండ్. విద్యార్థులెదుర్కుంటున్న సమస్యలకు సంబంధించిన కొన్ని న్యాయమైన డిమాండ్లను కూడా సమ్మె నోటీసులలో పొందుపరిచారు.

సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రిన్సిపల్ చేయని ప్రయత్నమంటూ లేదు. చెంచాగిరి చేసే కొంతమంది సీనియర్ అధ్యాపకుల్ని పావులుగా వాడుకున్నాడు. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాల్ని కళాశాల ప్రాంగణంలో దించాడు. అయినా విద్యార్థులు నిబ్బరంగా నిలబడి 40 రోజులకు పైగా సమ్మెను కొనసాగించారు. మొక్కవోని ధైర్యంతో వాడివేడి తగ్గకుండా అన్ని రోజులు సమ్మె చేయడం అబ్బురమనిపించింది అందరికీ. రోజుకో రీతిలో వినూత్న పద్ధతుల్లో సమ్మె కొనసాగింది. చివరకు వివిఎల్ రావు ప్రిన్సిపల్‌గా తప్పుకోవాలన్నది ప్రధాన డిమాండుగా ముందుకు వచ్చింది. ఈ చారిత్రాత్మక సమ్మె వెనుక కొండంత అండగా కొండపల్లి ఉన్నాడన్న విషయం చాలా మందికి తెలియదు. అప్పుడాయన రాజకీయాల్లో క్రియాశీలంగా లేడు. కాని సమ్మెకు ప్రణాళిక సిద్ధం చేసి, వ్యూహాల రూపకల్పన చేసింది మాత్రం ఆయనే.

చివరి అస్త్రంగా ప్రిన్సిపాల్ విద్యార్థుల తల్లి దండ్రులందరికీ ఓ లేఖ రాశాడు. మీ అబ్బాయి సమ్మెలో పాల్గొనడం క్రమశిక్షణా రాహిత్యమని, విరమించుకోకుంటే కాలేజీ నుంచి బహిష్కరించాల్సి వస్తుందని, తక్షణమే వచ్చి స్వయంగా తనకు హామీ పత్రం ఇవ్వాలని లేఖలో కోరాడు. ఆ లేఖ అందుకున్న తల్లిదండ్రులు చాలా ఆందోళన చెందారు. ప్రిన్సిపాల్ రాసిన లేఖకు ప్రతిగా విద్యార్థులు కూడా తల్లిదండ్రులందరికీ ఓ లేఖ రాశారు. ప్రిన్సిపాల్ నిరంకుశత్వాన్ని, వాస్తవ పరిస్థితుల్ని వివరిస్తూ, న్యాయబద్ధమైన తమ సమ్మెకు మద్దతివ్వాలని, ప్రిన్సిపాల్‌ని కలవొద్దని ఆ లేఖలో కోరారు. విద్యార్థుల లేఖను రూపొందించింది కూడా కె.ఎస్సే.

చివరకు కె.ఎస్. నాయకత్వంలో ఆరుగురు తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌ని కలిశారు. సివిల్ ఇంజనీరింగ్ చదివే చందు తండ్రిగా ఆయన ఆ సమావేశంలో పాల్గొన్నాడు. అందరి తరఫున కె.ఎస్. దాదాపు ఓ గంట సేపు విద్యార్థుల డిమాండ్లు ఏ విధంగా న్యాయమైనవో, హేతుబద్ధమైనవో వివరించి, వాటిని అంగీకరించాల్సిందిగా ప్రిన్సిపాల్‌ని కోరాడు. అఖండ మేధావిని, గొప్ప పాలనా దక్షుడినని విర్రవీగే ప్రిన్సిపాల్ ఈ అనూహ్య పరిణామానికి బిత్తరపోయి అవాక్కయ్యాడు. చివరకు సమ్మె జయప్రద మైంది. ప్రిన్సిపాల్, కామర్స్ లెక్చరర్ ఇద్దరూ రాజీనామా చేశారు. ఒక రకంగా కె.ఎస్. మరో రాజకీయ ప్రస్థానం వరంగల్ రీజినల్ కాలేజీ నుంచే ప్రారంభమైంది.

కె.ఎస్. కొడుకు చందు ఉన్న క్లాసుకి నేనో సబ్జెక్టు బోధించాను. అతడు క్లాసులకి సరిగ్గా హాజరయ్యేవాడు కాదు. ఎప్పుడూ అన్యమనస్కం గా ఉండేవాడు. ఈ విషయం కె.ఎస్. దృష్టికి తీసుకెళ్లినప్పుడు, ఏదో విధంగా నచ్చజెప్పి దారిలో పెట్టాల్సిందిగా ఎంతో ఆవేదనతో అడిగాడు నన్ను. ఆయన అభ్యర్థనలో ఓ తండ్రి ఆర్ద్రత, ఆతురత కనిపించాయి నాకు. చందుకి ఏ లోటు రాకుండా జాగ్రత్తలు తీసుకునేవాడు ఆయన. చాలాసార్లు చందుని నా రూముకి పిలిపించి నచ్చజెప్పడానికి ప్రయత్నించాను. చివరకు తనకు చదువంటే ఆసక్తి లేదని తేల్చాడు. ఢిల్లీలో ఉన్న తన బాల్య మిత్రుడు జగన్నాథరెడ్డికి చెందిన కంపెనీ నవ భారత్‌లో ఉద్యోగం చేస్తాడేమో కనుక్కోమన్నాడు కె.ఎస్. దానిక్కూడా విముఖత కనబర్చాడు చందు. చదువంటే అసలు ఆసక్తి లేదు. ఉద్యోగమంటే ఇష్టం లేదు. ఈ రకమైన చందూ మనస్తత్వాన్ని అంచనా వేయలేకపోయాను. బహుశా, సమాజంలో ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఏదైనా చేయాలని తపన పడుతున్నాడనిపించింది. ఎవ్వరికీ చెప్పాపెట్టకుండా కాలేజీ విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఆదిలాబాద్ విప్లవోద్యమంలో చందూ చురుగ్గా పాల్గొంటున్నాడని తెలిసి చాలా సంతోషించాను. తరువాత మద్రాస్ ఐఐటిలో నేను పిఎచ్‌డి చేస్తున్నప్పుడు విజయవాడ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చందూ మరణించాడని తెలిసి చాలా బాధపడ్డాను.

1966లో 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అంటూ భారీ సంఖ్యలో వరంగల్ విద్యార్థులు ఊరేగింపులు, నినాదాలతో రోడ్లమీదకొచ్చారు. ఈ మహోద్యమంలో ఆర్ఇసి విద్యార్థులు అగ్రభాగాన నిలబడ్డారు. కాజీపేట జాగీరు గ్రామం దగ్గర రైలు ఆపడానికి వందలాది మంది విద్యార్థులు రైలు పట్టాల మీదకొచ్చారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి విపరీతంగా బాదారు. విద్యార్థులు హాస్టల్స్ వైపు పరుగులు పెట్టి గోడదూకి కళాశాల ఆవరణలో ప్రవేశించి ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా రోడ్డు మీద నుంచి హాస్టల్స్ వైపు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు పోలీసులు. ఇంగువ మల్లికార్జున శర్మతో సహా నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలిసిన కె.ఎస్. విపరీతంగా చలించిపోయాడు. జనంలో ఉత్తేజాన్ని రగిలించి, ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి 'ఉక్కు' అనే పేరుతో ఓ నాటకానికి రూపకల్పన చేశాడు. ఆ నాటకంలో సన్నివేశాలు, పాత్రలు అన్నీ ఆయన సృష్టించినవే. సంభాషణలను సత్యమూర్తి రాశాడు. నాటకానికి తుది మెరుగులు దిద్దడానికి కరుణ, రమేష్ బాబుల ఇంటి దగ్గర సమావేశ మయ్యేవాళ్లం. విద్యార్థి నాయకుడిగా రమేష్‌బాబు, పోలీస్ ఆఫీసర్‌గా ఎస్ఎం, శాసనసభ్యుడిగా నేను ఆ పాత్రల సంభాషణలను వింటూ మార్పులు, చేర్పులు సూచించేవాడు కెఎస్. పతాక సన్నివేశంలో పోలీసు ఆఫీసరు భూపతిరావు విద్యార్థులపై కాల్పులు జరిపి ఆర్ట్స్ కాలేజీలో చదివే తన సొంత కొడుకునే చంపుకుంటాడు. కొడుకు శవాన్ని రెండు చేతుల్లో ఎత్తుకుని 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అంటూ నినదిస్తాడు. సన్నివేశాన్ని రక్తికట్టించడానికి సత్యమూర్తి రాసిన ఓ పాట నేపథ్యంలో వినిపిస్తుంది. నాటక రచన తుదిరూపం తీసుకున్న మర్నాడే విశాఖ ఉక్కు కర్మాగార స్థాపనకు అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆ నాటకం ప్రదర్శనకు నోచుకోలేదు. నాటక ప్రతి ఎక్కడుందో కూడా తెలియదు.

కావూరి రమేష్‌బాబుతో నాకు 1958 నుంచి పరిచయం ఉంది. ఆ సంవత్సరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేను ఇంజనీరింగ్‌లో, రమేష్‌బాబు బిఎస్సీ (ఆనర్స్)లో చేరాం. ఇద్దరం కృష్ణా జిల్లా దివి తాలుకాకు చెందినవాళ్లం కావడంతో మా మధ్య సాన్నిహిత్యం ఎక్కువగా ఉండేది. చండ్ర రాజేశ్వరరావు గారంటే విపరీతమైన అభిమానం రమేష్‌బాబుకి. చదువు మీద పెద్దగా శ్రద్ధ చూపేవాడు కాదు. సమాజం లోని అట్టడుగు వర్గాలకు అండగా నిలబడి వారి అభ్యున్నతికి ఏదైనా చేయాలని తపనపడేవాడు. చదువు మానేసి కమ్యూనిస్టు పార్టీకి పూర్తి కాలం కార్యకర్తగా పనిచేయాలనుందనేవాడు. ఓ రోజు పార్టీ సానుభూతి పరుడైన హాస్టల్ వర్కరుతో స్టూడెంట్ ఫెడరేషన్, కమ్యూనిస్టు పార్టీలకు సంబంధించిన రికార్డులన్నీ నాకు పంపి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. ఆంధ్రా యూనివర్సిటీ కమ్యూనిస్టు పార్టీ శాఖకు సెక్రటరీగా ఉండేవాడు రమేష్‌బాబు. ఆ రికార్డులన్నీ అప్పటి విశాఖపట్నం నగర కమ్యూనిస్టు పార్టీ సెక్రటరీ భద్రమూర్తి శర్మగారికి భద్రంగా అందజేశాను. రమేష్ వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో చేరాడని, అదే కాలేజీలో చదివే కెఎస్ కూతురు కరుణని వివాహం చేసుకున్నాడని కొన్ని రోజుల తరువాత తెలిసింది నాకు. ఆర్ఇసిలో చేరిన తరువాత వాళ్లింటికి చాలాసార్లు వెళ్లాను. అక్కడ కొన్నిసార్లు కెఎస్ కలిసేవాడు. ఇక ఆయనతో గంటల తరబడి చర్చోపచర్చలు. ఎంజిఎం సమీపాన వేణుగోపాలస్వామి గుడి దగ్గరుండేది వాళ్ల ఇల్లు. అప్పుడు రమేష్ వాళ్ల పెద్దమ్మాయి చిన్ని చిన్న పిల్ల. చిన్నమ్మాయి సుక్కు పసిపాప. ఇంట్లో పనులన్నీ కరుణ అమ్మమ్మ అంజమ్మగారు చూసుకునేది. ఆమె నాతో చాలా చనువుగా మాట్లాడేది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో కెఎస్, ఆయన భార్య కోటేశ్వరమ్మగారు అజ్ఞాతవాస జీవితం గడిపారు. ఆనాటి తన అనుభవా లను అంజమ్మగారు కళ్లకు కట్టినట్లు వివరిస్తుంటే గోర్కి నవలలోని అమ్మ ఆమెలో కనిపించేది నాకు. ఆమెకు కెఎస్ అంటే ఎంతో అభిమానం. అన్ని విషయాల్లోనూ కూతుర్ని కాదని అల్లుణ్ని సమర్థించేది. కరుణ, రమేష్‌లు కూడా కెఎస్ పక్షానే ఉండేవాళ్లు. వాళ్లిద్దరి అకాల మరణం నన్నెంతో కలచివేసింది. వరంగల్ గుర్తొచ్చినప్పుడల్లా కరుణ, రమేష్‌లు కళ్లల్లో మెదులుతారు.

సత్యమూర్తి పనిచేసే సెయింట్ గేబ్రియల్ హైస్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులకు చాలా తక్కువ వేతనాలిచ్చేది. తెలుగు మాస్టర్ పరిస్థితి మరీ దారుణం. ఎస్ఎం నాయకత్వంలో ఉపాధ్యాయులందరూ

సంఘటితమై, చట్ట ప్రకారం జీతాలను సవరించాల్సిందిగా ఎన్ని విజ్ఞప్తులు చేసినా యాజమాన్యం స్పందించకపోవడంతో సమ్మెకు దిగారు. అప్పటికే కెఎస్ ఆ స్కూలు నుంచి తప్పుకున్నాడు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యం సామదాన భేదదండోపాయాల్ని ప్రయోగించింది. అయినా లొంగిపోకుండా ఉపాధ్యాయులందరూ ఏకతాటిపై నిలబడ్డారు. పాఠశాల బయటున్న చెట్లకింద పాఠాలు బోధించారు. విద్యార్థులందరూ ఉపాధ్యాయులకు అండగా నిలబడ్డారు. సికింద్రాబాద్‌లో ఉన్న తమ పాఠశాలకు ప్రిన్సిపల్‌గా పంపుతామని ప్రలోభపెట్టి ఎస్ఎంని లొంగదీసుకోవాలని ప్రయత్నించింది యాజమాన్యం. కాని వాళ్ల పాచిక పారలేదు.

కొరకరాని కొయ్యలా ఉన్న ఎస్ఎంని అంతం చేయడమొక్కటే మార్గమనే నిర్ణయానికొచ్చింది యాజమాన్యం. తమ సంస్థల్ని, మతాన్ని కాపాడుకోవడానికి సత్యమూర్తిని భౌతికంగా తొలగించకతప్పదని క్రైస్తవుల్లో విష ప్రచారం చేసింది. తరువాత సుమారుగా 800 మందితో ఓ సభ నిర్వహించింది. చర్చి పెద్దలు తమ ఉద్రేక ప్రసంగాలతో సభలో పాల్గొన్న వారందరికి మతమనే మత్తుమందు ఎక్కించారు. మన మతాన్ని రక్షించుకోవడానికి సత్యమూర్తి ఇంటిమీద దాడి చేద్దాం పదండి అంటూ రెచ్చగొట్టారు. అప్పుడు ఎస్ఎంకి రక్షణగా ఉన్నది కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే. వారు కాకుండా నాతో పాటు నలుగురైదుగురు ఉపాధ్యాయులమున్నాం. ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో ఎవ్వరికీ పాలుపోలేదు. అటుచూస్తే ఆవేశంతో కదం తొక్కుతున్న 800 మంది మతోన్మాదులు, ఇటు చూస్తే కేవలం 30 మంది విద్యార్థులు. అప్పుడు కెఎస్ ఓ సూచన చేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎదురు దాడి చేయడమొక్కటే మన ముందున్న అత్యుత్తమ ఆత్మ రక్షణా విధానమని చెప్పారు. సభకు హాజరు కాకుండా ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న డ్రిల్లు మాస్టరు తండ్రిని బుర్ర పగలగొట్టి రమ్మన్నాడు. ప్రాణం మాత్రం తీయొద్దని హెచ్చరించాడు. కెఎస్ చెప్పినట్లే చేశారు విద్యార్థులు. ఇద్దరు ముగ్గురు చాటుగా సభలో ప్రవేశించి 'సత్యమూర్తికి సపోర్టుగా నక్సలైట్లు వచ్చారు. దొరికినవాళ్లందర్నీ నరికేస్తున్నారు. ఇద్దరి ముగ్గురి ప్రాణాలిప్పటికే తీశారు. పారిపోండి, ప్రాణాలు కాపాడుకోండి' అంటూ కేకలు పెట్టారు. సభలో ఉన్న జనమంతా కకావికలై ప్రాణ భయంతో ఉరుకులు పరుగులు తీశారు. సభా నిర్వాహకులు కూడా పారిపోయారు. తర్వాత తాపీగా పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎస్ఎంని అరెస్టు చేసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. దెబ్బలు తగిలి ఆసుపత్రిలో ఉన్న పెద్దాయన పోలీసులు, కొడుకు ఎంత బలవంతం చేసినా వినకుండా 'నా మీద దాడికి, సత్యమూర్తికి ఏ సంబంధం లేదు, ఆయన చాలా మంచివాడు' అని పదేపదే చెప్పడంతో ఎస్ఎంని విడిచిపెట్టక తప్పలేదు. అప్పుడనిపించింది నాకు ఆరోజు సమయస్ఫూర్తితో కెఎస్ సలహా ఇచ్చి ఉండకపోతే ఎస్ఎం దక్కేవాడు కాదని.

వ్యక్తిగతంగా కెఎస్ నాకో సలహా ఇచ్చాడు. మధ్యతరగతి ప్రజల అలవాట్లు అలవర్చుకుని, నీళ్లలో చేపలా అందరితో మమేకమై రోజూ సాయంత్రం కాలేజీ క్లబ్బుకెళ్లమని చెప్పాడు. నలుగురిలో ఒకడిగా ఉండాలి గాని, కొట్టొచ్చినట్లు విలక్షణంగా కనిపించడం మంచిది కాదన్నాడు. ఇవి పాటించితే, ఉద్యమానికి ఎక్కువ కాలం ఉపయోగపడే అవకాశముంటుందని చెప్పాడు. ఆయన సలహాని అక్షరాలా పాటించాను. అప్పటివరకు మద్యం ముట్టుకోని నేను క్లబ్బులో అప్పుడప్పుడు నలుగురితో కలిసి తీసుకోవడం మొదలు పెట్టాను. దానికి బానిసను మాత్రం కాలేదు. కాని పేకాట మాత్రం వ్యసనంగా మారింది. ఓ పోలీసాఫీసరు మా క్లబ్బుకి రోజూ వచ్చేవాడు. ఆయన్నుంచి రాబట్టిన సమాచారం ఉద్యమానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడింది. ఆయనతో పాటు ఇంకొందరు పోలీసు అధికారులతో నాకున్న సత్సంబంధాలు, సాన్నిహిత్యం కూడా ఉద్యమానికి ఎంతో ఉపయోగపడ్డాయి. కెఎస్ ఇచ్చిన సలహా రెండు దశాబ్దాలపాటు నాకు రక్షణకవచంలా పనిచేసింది. నన్ను గురించి ఎన్ని విచారణలు వచ్చినా, రాజకీయాలతో నాకేమీ సంబంధం లేదని పోలీస్ రిపోర్టులు వెళ్లేవి. చివరకు 1985లో పోలీసులు నన్ను అరెస్టు చేసి వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆ కేసుల నుంచి బయటపడడానికి మళ్లీ పోలీసు మిత్రులే నాకు సహాయపడ్డారు. ఇదంతా కెఎస్ నాకిచ్చిన సలహా ప్రభావమే.

మద్రాస్ ఐఐటిలో పిఎచ్‌డి చేసేటప్పుడు అడయార్‌లో కాపురముండేవాణ్ని. 1975లో ఓ ఆదివారం పురంధర్‌తో కలిసి మా ఇంటికొచ్చాడు కెఎస్. తమిళనాడులో సిపిఐ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) శాఖను ఏర్పాటు చేసే పనిమీద వచ్చానన్నాడు. దేశంలో ఉన్న విప్లవోద్యమాలన్నింటిని సంఘటితపరిచి, జాతీయ స్థాయిలో ఒక బలమైన విప్లవ పార్టీని స్థాపించాలనే తపన, దృఢసంకల్పం ఆయనలో కనిపించాయి. నెల రోజుల పాటు షెల్టరు కావాలని అడిగాడు. మా ఇంటి పరిసరాలు నిశితంగా పరిశీలించి ఆ ప్రాంతం అనువైనది కాదని తేల్చాడు. ఐఐటిలో ఉన్న కావేరి హాస్టల్‌లో పది రోజులు, పక్కనే ఉన్న వెళచ్చేరి గ్రామంలో ఆరు రోజులు ఉండడానికి ఏర్పాట్లు చేశాం. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పిఎచ్‌డి చేస్తున్న నక్సలైట్ సానుభూతిపరుడు అంబళగన్‌తో తమిళనాడు పార్టీ శాఖను గురించి సుదీర్ఘ చర్చలు జరిపాడు కెఎస్. కొన్ని రోజుల తర్వాత అంబళగన్ హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థలో మెకానికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఆర్ఇసి పూర్వ విద్యార్థి ఇంటి దగ్గర కరుణానిధి నగర్‌లో ఓ వారం రోజులపాటు ఉన్నాడు కెఎస్. అక్కడ కూడా అనేక మంది తమిళనాడు కామ్రేడ్స్‌తో చర్చలు జరిపాడు. తర్వాత ఆయన బాధ్యతని ప్రముఖ చలన చిత్ర దర్శకుడు కెబి తిలక్ తీసుకున్నాడు. ఓ రోజు కెఎస్‌ని కలవడానికి కామ్రేడ్ మహదేవ్ ఐఐటి హాస్టల్‌కి వస్తున్నాడన్న సమాచారమందుకున్న మేము ఆయన రాకకోసం రోజంతా ఎదురు చూశాం. రాకపోయే సరికి ఎంతో ఆందోళన చెందాం. మద్రాస్ నగర శివారులో ఆంధ్ర పోలీసులు ఆయన్ని ఎన్‌కౌంటర్ చేశారన్న పిడుగు లాంటి వార్త విని ఖంగుతిన్నాం. చివరకు మాకు ఏమీ కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నాం. పోలీసుల చిత్రహింసలు తట్టుకోలేక మహదేవ్ నోరుజారుంటే మా పరిస్థితి ఏమయ్యుండేదని కలవరపడ్డాం. ఆ అమర వీరునికి జోహార్లర్పించాం. ఆ సంఘటన తర్వాత కెఎస్ ఆచూకి మాకు తెలియలేదు.

ముషీరాబాద్ జైలులో ఉన్న కెఎస్‌ని 1978లో ములాఖత్‌లో కలుసుకున్నాను. ఎపి గార్డ్స్ దగ్గరున్న కోర్టుకి పోలీసులు తనను తీసుకెళ్లే వ్యానులో నన్ను కూడా ఎక్కించుకున్నాడు. పక్కన కూర్చోబెట్టుకుని అందరి యోగ క్షేమాలు అడిగాడు. కాలేజీలో జరిగే విద్యార్థి ఉద్యమాలు, హాస్టల్ వర్కర్స్ సమస్యలు, వరంగల్‌లో జరుగుతున్న ఇతర ఉద్యమాలు –

వీటన్నింటి వివరాలు, విశేషాలు అడిగి తెలుసుకున్నాడు. అభ్యుదయ భావజాలమున్న ప్రొ. కోటేశ్వరరావుగారు ఆర్ఇసి ప్రిన్సిపల్‌గా కొనసాగడం ఉద్యమానికి చాలా అవసరమని చెప్పాడు. ఈ విషయాన్ని రాడికల్ విద్యార్థి నాయకులకు తన మాటగా చెప్పి, కాలేజీలో జరిగే ఏ ఆందోళన కూడా ఆయన పదవి నుంచి తప్పుకునే పరిస్థితులకు దారి తీయకుండా జాగ్రత్త పడాలని చెప్పాడు.

1979లో కెఎస్ పెరోలు మీద వరంగల్ వచ్చి మొదటి రోజు మా ఇంట్లో ఉన్నాడు. జన్ను చిన్నాలు ఆయన్ను మా ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్లాడు. ఏడో తరగతి చదివే మా అమ్మాయి ప్రగతిని దగ్గరకు తీసుకుని చాలా సేపు ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. తరువాత మా అమ్మాయి 'సీతారామయ్యగార్ని గురించి మా స్కూల్లో నేను విన్నదాన్ని బట్టి ఆయన పెద్ద మీసాలతో భయంకరంగా ఉండి రంకెలు వేస్తాడనుకున్నా. కాని పెద్దమనిషిలా చాలా నెమ్మదిగా, ప్రేమగా మాట్లాడాడు' అంటూ ఆశ్చర్యపోయింది.

భోజనాలయ్యాక సిద్ధార్థనగర్‌లో ఉన్న అనసూయమ్మగారి స్థలం విషయం కెఎస్‌తో చర్చించాను. అంతకు ముందు ఆ స్థలం అమ్మిపెట్టే బాధ్యతని అనసూయమ్మగారు నాకప్పజెప్పినప్పుడు అది తనదేనంటూ అడ్డుపడ్డాడు ములుగు రాజేశ్వర్రావ్. నాతో పాటు ఆర్ఇసి రిజిస్ట్రార్ అప్పారావుగారు కూడా నచ్చజెప్పడానికి ఎంత ప్రయత్నించినా ససేమిరా అంటూ మొండికేసి కొరకరాని కొయ్యలా తయారయ్యాడు రాజేశ్వర్రావ్. ఈ విషయాలన్నీ కెఎస్‌కి వివరించి చెప్పినప్పుడు, ఆ స్థలం విషయం మాట్లాడ్డానికి ఎప్పుడు ఎక్కడకు రమ్మంటారని రాజేశ్వర్రావు గారికి కబురు పెట్టాడు. కబురందిన వెంటనే ఆగమేఘాల మీద రెక్కలు కట్టుకుని మా ఇంటి దగ్గర వాలాడు ఆయన. అనసూయమ్మగారు తన డబ్బుతో ఆ స్థలం కొనుక్కున్నప్పుడు జరిగిన లావాదేవీలన్నింటిని పూసగుచ్చినట్లు గుర్తుచేసి, అమ్ముకోవడానికి మీకున్న అభ్యంతరమేమిటని అడిగాడు కెఎస్. నిరభ్యంతరంగా అమ్ముకోవచ్చుని, తానే ఆ స్థలం అమ్మి పెడతానంటూ ముందుకొచ్చాడు రాజేశ్వర్రావ్. సంభ్రమాశ్చర్యాలకు లోనవ్వడం నా వంతైంది. తరువాత కొద్ది రోజుల్లోనే స్థలం అమ్మడం జరిగింది.

రెండో రోజు వరంగల్ వేణుగోపాలస్వామి గుడిలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో మాట్లాడాడు కెఎస్. సమావేశ నిర్వహణలో జన్ను చిన్నాలు ప్రధాన పాత్ర పోషించాడు. ఆ సమావేశానికి ఆర్ఇసి నుంచి హాజరైన వాళ్లలో నేను కూడా ఒకడ్ని. తన ఉపన్యాసంలో కెఎస్ 'మార్క్సిస్ట్ పార్టీ నాయకుడు ఓంకార్ మీద పీపుల్స్‌వార్ పార్టీ హత్యా ప్రయత్నం చేసిందనే ప్రచారం జరుగుతోంది, ఇది పచ్చి అబద్ధం. మేమా ప్రయత్నం చేసుంటే ఆయన ప్రాణాలతో బయటపడేవాడు కాదు. మా తుపాకి గుండు ఎప్పుడూ గురి తప్పదు. బతికేహక్కు కోల్పోయిన వాళ్లనే మేము హతమారుస్తాం' అన్న మాటలు నా చెవుల్లో ఇప్పటికీ గింగురుమంటున్నాయి. ఈ సభ జరిగిన రెండో రోజున పోలీసుల మద్దతుతో వైఎస్ మూర్తి హంతక ముఠా జన్ను చిన్నాలుని కిరాతకంగా హత్య చేసింది. కెఎస్ చిన్నాలు సంస్మరణ సభలో పాల్గొన్నాడు.

కెఎస్ మహామేధావి. గొప్ప దార్శనికుడు. అసమాన వ్యూహకర్త. నిస్వార్థ నిరాడంబర నాయకుడు. సాయుధ పోరాటం ద్వారానే భారతదేశంలో కార్మిక, కర్షక రాజ్యం సాధ్యమని ప్రగాఢంగా విశ్వసించి అంకితభావంతో, అకుంఠిత దీక్షతో నిర్విరామ కృషి చేసిన మార్క్సిస్టు యోధుడాయన. కన్నబిడ్డలిద్దరూ మరణించినా, ఆత్మ స్థైర్యాన్ని, మనోనిబ్బరాన్ని కోల్పోలేదాయన. జగమంత కుటుంబం ఆయనది. విప్లవోద్యమాల క్షేత్రం ఆయన స్వగృహం. విప్లవకారులందరూ ఆయన కుటుంబ సభ్యులే. యువ పోరాట వీరులు ఆయన బిడ్డలు. మానవత్వం నరనరాన జీర్ణించుకున్న ఆ మహోన్నత వ్యక్తి భారతదేశ విప్లవ పోరాటాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు.

(రచయిత వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్) వీ

చర్చ పేరుతో తిట్ల దండకానికి వీక్షణంలో చోటా?

- జె.యు.బి.వి.ప్రసాద్

వీక్షణం 2017 నవంబరు సంచికలో, 'చర్చ' శీర్షిక కింద ఎ. వీరస్వామి రాసిన వ్యాసానికి ఇది ప్రతిస్పందన. చోటు సమస్యని దృష్టిలో పెట్టుకుని కొన్ని పాయింట్లకే పరిమితమవుతున్నాను.

1) సోషలిజాన్ని సుసాధ్యమూ సుస్థిరమూ చేయడానికి, స్టాలిన్ అప్రతిహతంగా ముందుకు సాగాడనీ; ముప్పై సంవత్సరాలు సోషలిజాన్ని పరిరక్షించాడనీ; పెట్టుబడిదారీ పునరుద్ధరణకు అవకాశాలను మొగ్గలోనే తుంచేశాడనీ; వీరస్వామి వాదిస్తున్నారు. 30 ఏళ్లు అప్రతిహతంగా రక్షించి, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణను మొగ్గలోనే తుంచేస్తే, స్టాలిన్ మరణించిన మూడేళ్లకే కృశ్చేవ్ సోషలిజాన్ని భక్షించి, పెట్టుబడిదారీ విధానాన్ని ఎలా పునరుద్ధరించగలిగాడు? అలాంటి వాదనలు స్టాలిన్‌కి ఎంత అపకీర్తి తెచ్చిపెడతాయో స్టాలిన్ 'భక్తులు ఎప్పటికైనా గ్రహించగలిగితే బాగుండును.'

2) విజయాలెన్నిటికో స్టాలిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ కారణం అని చెప్పిన వీరస్వామి గారు, 'స్టాలిన్ చేసిన పొరపాట్లూ తప్పులూ లేవని కాదు' అని అంటూనే, పొరపాట్లన్నిటికీ స్టాలిన్ బాధ్యుడిని చేయడం తగదని వాదిస్తున్నారు. విజయాలకు కారణమైన వాళ్లు, పొరపాట్లకి కూడా బాధ్యులు అవ్వరా?

అయినా, స్టాలిన్ హయాంలో జరిగినవి 'పొరపాట్లా?' అక్టోబరు విప్లవ కాలం నాటి అనేక డజన్ల మంది నాయకులనూ; తనతో విభేదించిన కేంద్ర కమిటీ నాయకులనూ, మరణ శిక్షల పాలు చేయడం! వ్యవసాయ సమిష్టీకరణ పేరుతో చావు బళ్లలో దూర, దుర్భర ప్రాంతాలకు తరలించడం! - ఇటువంటి పనులు చేయించిన వ్యక్తిని 'ఊచకోత కోయించినవాడిగా, హంతకుడిగా, నేరస్తుడిగా' కాక ఏమనాలి? ఆ హత్యలు, 'ఏ స్థల కాల పరిమితుల వల్ల తలెత్తాయో' చూడాలట! స్థల కాల పరిమితుల తర్కం, స్టాలిన్‌కేనా వర్తించేది? ఆ మరణ శిక్షలకు గురైన వారికి వర్తించదా ఆ తర్కం?

3) స్టాలిన్‌ని 'మొరటు మార్క్సిస్టు' అన్నది ఎవరు? స్వయంగా లెనినే, అనారోగ్యం వల్ల మంచానికే పరిమితమై ఉండిన చివరి రోజుల్లో, జరగబోయే 12వ పార్టీ కాంగ్రెస్‌కి రాసిన లేఖలో స్టాలిన్‌ని ఉద్దేశించి 'మొరటు (రూడ్)' అనే మాటని లెనిన్ వాడాడు. 1927 అక్టోబరులో జరిగిన సి.సి. సమావేశంలో, స్టాలిన్, 'నేను మొరటే' అని, తను మొరటుగా ఉండడమే విప్లవం అయినట్టు చెప్పుకున్నాడు. కాబట్టి, స్టాలిన్ మీద ఈ విమర్శ, వీరస్వామి అనుకుంటున్నట్టు అర్థ సత్యమూ కాదు, విష ప్రచారమూ కాదు.

4) బెతల్‌హామ్ రష్యా మీద రాసిన మొదటి రెండు సంపుటాలూ రాగానే, క్లాడ్ వార్లె అనే ఫ్రెంచి రచయిత్రి వెంటనే పెద్ద పుస్తకం రాసి ఖండించిందని వీరస్వామి కథనం. క్లాడ్, ఫ్రెంచిలో రాసిన పుస్తకం, ఇంగ్లీషులోకి పూర్తిగా అనువాదం కాలేదు. కేవలం ఒకే ఒక్క చాప్టర్‌ని జార్జ్ గ్రుయెంతల్ అనే స్టాలినిస్టు అనువాదం చేశాడు. ఈ అనువాదం, 'రెవల్యూషనరీ డెమోక్రసీ' అనే ఆరు మాసాలకోసారి ఢిల్లీ నుంచీ వచ్చే స్టాలినిస్టు పత్రికలో 2001 సెప్టెంబరులో వచ్చింది. క్లాడ్ పుస్తకంలో మరిన్ని విషయాల్ని భవిష్యత్తులో అనువాదం చేయాలని ఆశిస్తున్నాం - అని 16 ఏళ్ల కింద జార్జ్ రాశాడు. కానీ, ఆ అనువాదం ఇంత వరకూ రాలేదు. అనువాదం అయిన చాప్టరులో ఉత్పత్తి శక్తుల అభివృద్ధి గురించి స్టాలిన్‌కి ఉన్న అవగాహనని తిరిగి వల్లించడమే చేసింది క్లాడ్! ఈ అంశం మీద 'వీక్షణం' సంపాదక వర్గం 'చర్చ' నిర్వహిస్తే, భిన్నాభిప్రాయాలకు అవకాశం ఉంటుంది.

5) నెహ్రూని, బెతల్‌హామ్ తన స్నేహితుడిగా చెప్పుకున్నాడనీ; నెహ్రూ ప్రభుత్వానికి బెతల్‌హామ్ వేతనం మీద ఆర్థిక సలహాదారుగా పని చేశాడనీ; వీరస్వామి ఆరోపణ. నెహ్రూ తన స్నేహితుడని బెతల్‌హామ్ ఎక్కడా, ఎన్నడూ చెప్పుకోలేదు. ఎక్కడ చెప్పుకున్నాడో చూపించాలి. ఆర్థిక సలహాదారుగా పని చేయలేదు. ప్లానింగ్ కమిషన్ ఏర్పాటు గురించి, నెహ్రూ ఆ బాధ్యతలను ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రశాంత చంద్ర మహలనోబిస్‌కీ, అదే ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన తన కార్యదర్శి పీతాంబర్ పంత్‌కీ అప్పగించాడు. ప్రపంచంలో ప్లానింగ్ రంగంలో నిపుణులను ఆహ్వానించి, పంచవర్ష ప్రణాళికలని రూపొందించడంలో వాళ్ల సలహాలు తీసుకోవచ్చునని నెహ్రూ చెప్పడం వల్ల, మహలనోబిస్ బెతల్‌హామ్‌నే కాక, పాల్ బరాన్, గున్నార్ మిర్డాల్ వంటి వామపక్ష మేధావుల్ని ఆహ్వానించాడు. (పంచవర్ష ప్రణాళిక అనే భావన స్టాలిన్ కాలం నాటిదే.)

బెతల్‌హామ్, ప్లానింగు గురించి చే-గువేరా, కాస్ట్రో, చౌ-ఎన్‌లై వంటి వారితో కూడా చర్చలు జరిపాడు. పైగా, తన 'ఇండియా ఇండిపెండెంట్' అనే పుస్తకంలో, భారత బూర్జువా వర్గం గురించీ, నెహ్రూ కాంగ్రెస్ పార్టీ గురించీ, ఎటువంటి భ్రమలూ ప్రదర్శించలేదు. భారతదేశంలో పెద్ద పెట్టుబడిదారులూ, బూర్జువాలలో ఇతర సెక్షన్లూ, కాంగ్రెసునూ; దాని ద్వారా ప్రభుత్వాన్నీ, కంట్రోల్ చేస్తారని బెతల్‌హామ్ స్పష్టంగా చెప్పాడు. కాంగ్రెస్ పార్టీ, తన ఆర్థిక విధానాల ద్వారా బూర్జువా వర్గంలోని మెజారిటీని, ప్రత్యేకించి బడా పెట్టుబడిని ('బిగ్ కాపిటల్'ని), సంతృప్తి పరిచిందని కూడా చాలా స్పష్టంగా చెప్పాడు. (మంత్లీ రివ్యూ వాళ్లు 1968లో ప్రచురించిన ప్రతి. పే.132-133; 342-361)

ఇటువంటి విమర్శ చేసినందుకు బెతల్ హాం పుస్తకాన్ని (ఇండియా ఇండిపెండెంట్ పుస్తకాన్ని) 1976లో కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించింది. (ది హిందూ, 7-8-2013).

6) వీరస్వామి వ్యాసానికి పెట్టిన పేరు గురించీ, దాంట్లో వాడిన పద ప్రయోగం గురించీ కొంచెం చెప్పాలి. 'దుర్మార్గమైన వ్యాసం', 'అశుద్ధ పదార్థం', 'రంగనాయకమ్మిజం', 'భజన బృందపు ప్రశంస', 'చెత్త పుస్తకం' వంటి మాటల వల్ల వీరస్వామికి స్వయంతృప్తి కలుగుతుందేమోగానీ, అది తర్కబద్ధమైన వాదన అవదు. వీరస్వామి వాడిన పదాలనే తిరిగి ఆయనకే అప్పగించడం పెద్ద కష్టమేమీ కాదు. పరిచయ వ్యాసం రాసిన నిర్మల్‌కుమార్ గానీ, ఆయన వ్యాసంతో ఏకీభవించిన వారు గానీ, వీరస్వామి వ్యాసం 'చెత్త వ్యాసం', 'స్టాలిన్ భజన బృందపు ప్రశంస వ్యాసం'- అని అంటే, తిట్ల దండకానికి వీక్షణంలో చోటా? - అని

అంటే? వీరస్వామి ఏమంటారు? రంగనాయకమ్మ మార్క్సిజంలోని మౌలికాంశాలను తిరస్కరిస్తుందనీ; ఆచరణను దుమ్మెత్తి పోస్తుందనీ; సిద్ధాంతం ముద్దు, ఆచరణ వద్దూ అంటుందనీ; మార్క్సిస్టుగా నటిస్తుందనీ; ఏ ఒక్క ఉదాహరణా చూపకుండా వీరస్వామి చేసిన వీరంగాన్ని వీక్షణం ప్రచురించడం చూస్తే, 'ఇది వీక్షణమేనా, ఏదైనా రంగనాయకమ్మ వ్యతిరేక పత్రికా అని అనుమానం' రావచ్చుగా?

వీరస్వామి దృక్పథంతో పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు సూచించే, వీక్షణం కలెక్టివ్ ప్రకటన, వీక్షణం 'స్ఫూర్తి'కి విరుద్ధంగా ఉంది. 'తెలుగులో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ లాగ, ఇంకా చెప్పాలంటే, అంత కన్నా మెరుగ్గా...' వీక్షణాన్ని తీర్చిదిద్దాలని 2013 జనవరి సంపాదకీయం లో ప్రకటించారు. గత 40 ఏళ్లుగా ఇ.పి.డబ్ల్యు పత్రికను గమనిస్తూ ఉన్న నాకు, ఆ పత్రికలో 'అశుద్ధ పదార్థం', 'భజన బృందపు ప్రశంస' వంటి పద ప్రయోగాలు ఎన్నడూ కనపడలేదు. 'వీక్షణం' కూడా ఇ.పి.డబ్ల్యు వలే ఉండాలనీ, ఉంటుందనీ భావించబట్టే, నేను, గతంలో రెండు దఫాలుగా విరాళాలు పంపడం, అనేక మంది పరిచయస్తుల్ని విరాళాలు పంపేలా ప్రోత్సహించడం, చేశాను.

బెతల్‌హేమ్ పుస్తక పరిచయం పైన వచ్చిన నిర్మల్ కుమార్ వ్యాసంలో, 'వీక్షణం కలెక్టివ్ దృక్పథానికి, పూర్తిగా వ్యతిరేకమైన అభిప్రాయాలు' ఏమున్నాయి? స్టాలినిజాన్ని విమర్శించరాదు – అన్నది వీక్షణం కలెక్టివ్ దృక్పథమా? ఇ.పి.డబ్ల్యులో లెనినిజాన్ని విమర్శించే వ్యాసం కూడా వచ్చింది ఇటీవల (4-11-17 సంచికలో). చర్చలు ఉండడం తప్పా?

మార్క్సిస్టులు ఎలాంటి విమర్శనైనా ఎదుర్కోవాలి గానీ; చెత్త వ్యాసానికి చోటెందుకు ఇచ్చారు – అనో; మా దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకమైనది – అనో, 'అసహనం'తో ఉంటే, సంఘ్ పరివార్ వారి అసహనానికీ, 'ప్రగతిశీల దృక్పథం' ఉన్నదని ప్రకటించుకున్న వీక్షణం కలెక్టివ్ వైఖరికీ, విభజన చెదిరిపోతుంది! వీ

చైనా - వాస్తవాలను విస్మరించిన సంపాదకీయం

- కృష్ణ ఆదిత్య

నవంబర్ 2017 వీక్షణం చైనాలో జిన్‌పింగ్ ఆలోచనా విధానం గురించి ప్రచురించిన సంపాదకీయ వ్యాఖ్యపై క్లుప్తమైన విశ్లేషణ ఇది. మావో తర్వాతి చైనా గురించి సిద్ధాంతపరమైన వివాదాలు ఉన్నమాట వాస్తవం. డెంగ్ నాయకత్వంలో పెట్టుబడి దారీ విధానాలు అనుసరిస్తున్నారని విమర్శ ఉంది. ఈ సంపాదకీయం ఆ కోవకు చెందినదే. అంగీకరించినా, అంగీకరించకపోయినా అదొక సైద్ధాంతిక దృష్టికోణం. మానవాళి చరిత్రలో అపూర్వమైన ప్రగతిని అతివేగంగా సాధించిన దేశంగా చైనా పేరుగాంచింది. సిద్ధాంత వివాదాలున్నా, ఈ వాస్తవాన్ని చూడ నిరాకరిండం సరికాదు. "వాస్తవాల ఆధారంగా సత్యాన్వేషణ చేయాలి. మార్క్సిజంలో అత్యంత కీలకాంశం ఇదే" అని మావో చెప్పారు. (సీకింగ్ ట్రూత్ ఫ్రమ్ ఫ్యాక్ట్స్ ఇస్ ది కర్నెల్ ఆఫ్ మార్క్సిసమ్ అన్నారు).

సంపాదకీయంలో కీలకాంశాన్ని విస్మరించారు. కాగా సత్యాతీత ధోరణి (పోస్ట్ ట్రూత్) ఉంది. ఇది సరికాదు. ఉదాహరణకి "కమ్యూన్లను రద్దు చేసి, సొంత ఆస్తిని పునరుద్ధరించిన జపాన్ సామ్రాజ్యవాదం రోజుల్లోకి, కొమింగ్‌టాంగ్ పాలన రోజుల్లో దేశాన్ని నడిపించడమే నవయుగ సోషలిజం అని రైతాంగం చెపుతుంది" అని రాశారు. చరిత్ర చక్రాన్ని అలా అంతగా వెనక్కి తిప్పడం అసాధ్యం అనే సోయిని కోల్పోయారు. శ్రమదోపిడీ, అసమానతలు, దారిద్ర్యం, అవినీతి మొదలగునవి ప్రస్తావించారు. చైనా నిరుద్యోగం గురించి కూడా భారత మీడియాలో తరచూ ప్రస్తావిస్తుంటారు. ఈ సమస్యలన్నీ చైనాలో ఉన్నాయి. అక్కడి నాయకత్వం అధికారికంగానే వాటన్నింటినీ వాస్తవికంగా విస్తారంగా ప్రస్తావించి, పరిష్కారాలకై కృషి చేస్తున్నది. వారు వాస్తవాలను కప్పిపుచ్చడం లేదు అని గమనించాలి. మన దేశంతో పోల్చినా, అనేక ఇతర దేశాలతో పోల్చినా, చైనా పరిస్థితి చాలా మెరుగ్గా ఉందన్న స్పృహ లేకుండా చైనా వ్యతిరేకంగా, పూర్వనిశ్చితాభిప్రాయాలతో రాశారు. నాలుగు మెతుకులను పట్టుకొని చూసినట్టు, కొద్ది ఉదాహరణల్ని మాత్రమే చూద్దాం.

1) అత్యంత అభివృద్ధి చెందిన యూరపు దేశాల్లో సోషలిజం వస్తుందని మార్క్స్ ఊహించారు. ఆ ఊహ తప్పని తేలింది. వాస్తవంలో బాగా వెనుకబడిన రష్యాలో లెనిన్ నాయకత్వంలో అక్టోబర్ విప్లవం జరిగి నూరేళ్లయింది. అలాగే, చాలా వెనుకబడిన, రైతాంగ దేశమైన చైనాలో మావో నేతృత్వంలో విప్లవం సాధించబడింది. ప్రపంచ మానవాళి చరిత్రలోనే తొలి సోషలిస్టు విప్లవ ప్రయోగాలు ఈ రెండూ అని గమనించినప్పుడు, అక్కడ అనేక ఒడిదుడుకులు సహజం. దాదాపు నూరేళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమం, 50 ఏళ్ల నక్సల్బరీ – అనంతర ఉద్యమాలు ఎక్కడ, ఏ స్థితిలో ఉన్నాయో, ఎంత తీవ్రమైన తప్పులను పదేపదే చేస్తున్నాయో చూసినప్పుడు, కాస్త నిగ్రహంతో, సమతుల దృష్టితో పరిశీలించాల్సిన అవసరం తెలుస్తుంది. భారతదేశం కన్నా ఎక్కువ జనాభా, తక్కువ వ్యవసాయ భూమి, దారుణమైన శీతోష్ణస్థితులు గల విశాలదేశం చైనా. అయినా వారు అపార ప్రగతిని మావో తర్వాతి కాలంలో మరింతగా సాధించిన మాట వాస్తవం. మనదేశంతో పోలిక లేదు. అభివృద్ధి చెందిన దేశాల వైపుగా చైనా సాగుతున్నది. వాస్తవాలను గుర్తించకుండా బ్రేకుల్లేని బండిలాగా సంపాదకీయం సాగింది.

2) కొద్ది అంశాలను అతి కొద్దిగా స్పృశించి చూసినా చాలు. ఐఎల్ఓ (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) కొద్ది సంవత్సరాల క్రితం ప్రచురించిన రిపోర్టులోని ఒక్క వాస్తవాన్ని చూడండి : 2007లో చైనాలో ఉపాధి పొందిన వికలాంగుల సంఖ్య 213 లక్షలకు చేరింది. వీరిలో 170 లక్షల మంది గ్రామీణ చైనాలో, 43 లక్షల మంది పట్టణాల్లో ఉన్నారు. 2001-2005 మధ్య కాలంలో 16.7 లక్షల మంది పట్టణవాసులకు ఉద్యోగాలు అదనంగా కల్పించబడ్డాయి; వీరిలో 16 శాతం మంది (మాత్రమే) స్వయం ఉపాధి పొందినవారు. పట్టణ వికలాంగ కుటుంబాల

సగటు తలసరి ఆదాయం 4864 యువాన్లు, గ్రామాల్లో అది 2260 యువాన్లు, (యువాన్ మన రు. 10 కి సమానం) వికీపీడియా ప్రకారం భారతదేశంలో మొత్తం పబ్లిక్ రంగంలో (కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు కలిపి) 2008లో ఉపాధి 173 లక్షలు మాత్రమే , ప్రైవేటు రంగాన్ని కలిపినా, మొత్తం నిర్మాణ ఇతర రంగ ఉపాధి 275 లక్షలు, చైనాలోని వికలాంగుల ఉద్యోగాలతో పోల్చదగిన స్థాయి. చైనా, జపాన్ వలస, కొమింగ్‌టాంగ్‌ల రోజుల్లోకి వెళ్తున్నదా? చైనా గురించి దోపిడీ పాలకవర్గాలు, చైనా వ్యతిరేకులు కూడా చేయని రీతిలో ఉన్న విమర్శ ఇది ! (ఆధారం: ఫ్యాక్ట్స్ ఆన్ పీపుల్ విత్ డిజబిలిటీస్ ఇన్ చైనా : ఐఎల్ఓ)

3) "కమ్యూన్లను రద్దు చేసి, సొంత ఆస్తిని పునరుద్ధరించి" అంటూ రైతాంగాన్ని ప్రస్తావించారు. ఇది అర్ధసత్యం కమ్యూన్ల రద్దు నిజమే; కానీ ఇప్పటికీ భూమి ప్రభుత్వ ఆస్తి మాత్రమే అని గమనించాలి. రైతు కుటుంబాలకు భూమిని అనుభవించే హక్కుని కల్పిస్తూ, "వ్యక్తిగత బాధ్యత విధానం" ప్రకారం ఆ కుటుంబాలు భూమిపై (ప్రభుత్వ సహకారంతో పరపతితో మొ.) పంటపండించి, కొంత నిర్దిష్ట భాగాన్ని ప్రభుత్వానికిచ్చి, మిగితాది (ఎంత అదనంగా పండించినా) తమ ఇష్టానుసారం మార్కెట్లో అమ్ముకోవచ్చును. ఈ విధానం "దున్నేవాడికి భూమి" వంటిది. దీని వలన చైనా 32 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమిలో సుమారు 50 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్నది. (భారత్‌లో 40 కోట్ల ఎకరాల్లో 20 కోట్ల టన్నులు పండిస్తున్నారు. చైనాలో లేని సమశీతోష్ణ స్థితి మనదేశంలో ఉన్నా, ఉత్పత్తి ఉత్పాదకత కూడా భారత్‌లో తక్కువే). ఈ విధానం ఫలితంగా రైతాంగం స్థితి త్వరితంగా మారింది. "నిజ ఆదాయాలు" రెట్టింపు అయినాయి. లాభాలు వచ్చాయి. ఆ లాభాలతో గ్రామీణ – టౌన్‌షిప్ పరిశ్రమలు స్థాపించుకున్నారు.

సిద్ధాంత వివాదాలనటుంచి చూస్తే డెంగ్ సంస్కరణలకు ముందు 1978లో గ్రామీణ పేదల సంఖ్య 25 కోట్ల మంది (తలసరి ఆదాయం ఏడాదికి 100 యువాన్లకు తక్కువగా ఉంటే దారిద్ర్యం) కాగా 2004లో 2.6 కోట్ల మంది (దారిద్ర్య రేఖ 668 యువాన్లకు పెంచినప్పటికీ), (చైనాలో దారిద్ర్యం తగ్గించిన తీరు గురించి ఒక అంతర్జాతీయ సదస్సులో సమర్పించిన పత్రం, 2005. రచయితలు గెరార్డ్ కె. హేలిగ్ మొ. ఆయన వియన్నా యూనివర్సిటీలో చైనా నిపుణుడు). గ్రామీణుల ఆదాయం 1978లో 100 అనుకుంటే, 2003లో 550కి పెరిగింది. (రియల్ ఇన్‌కం ఇండెక్స్). పట్టణ వాసుల ఆదాయం 1978లో 100 అయితే, 2003లో 514.6, 1978లో గ్రామీణుల ఆదాయం కన్నా పట్టణవాసుల ఆదాయం 2.57 రెట్లు ఉండేది. 2003లో 2.4 రెట్లు (రూరల్ అర్బన్ రేషియో ఆఫ్ రియల్ ఇన్‌కం), (ఆధారం : పై పత్రమే) "పేదరికాన్ని తగ్గించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు చైనా అనుభవం గుణపాఠమా? అన్న ప్రశ్నను సానుకూలంగా చర్చించారు). ఇప్పటికీ చైనాలో పేదరికం ఉంది. అంతరాలు పెరిగాయి. వాటిని తగ్గించాలి అన్న ప్రకటిత అవగాహనతో చైనా నాయకత్వం వ్యవహరిస్తున్నది. వాస్తవాలతో సంబంధం లేకుండా, చైనాను నిందించే వైఖరితో రాసిన సంపాదకీయం ఇది అని పాఠకులు గమనించాలి.

4) చైనాలో శ్రమదోపిడీ గురించి ప్రస్తావించారు. చైనాలో ఉద్యోగుల/ కార్మికుల వేతనాలు మనదేశంతో పోలిస్తే ఎక్కువే, హక్కులు, సౌకర్యాలు, ద్రవ్యోల్బణం – అన్నిటా చైనా స్థితి చాలా మెరుగ్గా ఉంది. చైనా కూడా మూడవ ప్రపంచదేశం అని గమనించాలి. అ) షాంఘైలో నెట్ పే గంటకు 5.4 డాలర్లు, ఢిల్లీలో 2.3 డాలర్లు. ఆ) ఏడాదికి షాంఘైలో 1967 గంటలు; ముంబైలో 2251. ఇ) నిపుణుడైన కార్మికుడి ఆదాయం ఏడాదికి – షాంఘైలో 9200 డాలర్లు, ముంబైలో 3100 డాలర్లు. ఈ) కార్ మెకానిక్ వార్షిక ఆదాయం 9300 డాలర్లు, ముంబైలో 2100 డా. షాంఘైలో వారానికి 40 గంటలు పనిచేయాలి. ముంబైలో 70 గంటలు (ఆధారం : ఏషియా బ్రీఫింగ్. కామ్, చైనా – ఇండియా వేజ్ కంపేరిజన్) ఇది రెండేళ్ల క్రితం సమాచారం. ఈ మధ్య చైనాలో వేతనాలు ఇంకా పెరిగాయని, అందువల్ల మనదేశానికి మార్కెట్లో అవకాశాలు మెరుగుపడతాయని మన పత్రికలు వివరాలు ప్రచురించాయి. వీ

(... 4వ పేజీ తరువాయి)

విధ్వంసం చేసి, వారి అస్తిత్వాన్ని దెబ్బతీసి కొంతమంది కోసం ఆదివాసుల మధ్య ఘర్షణ పెట్టడం తప్పవుతుంది. ఇరు వర్గాలు పాలకులను ప్రశ్నించాలే గాని, వారి ఉచ్చులో పడరాదు.

– ఎం. రాజేందర్ రెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

విమర్శనీ, ప్రశ్నించడాన్నీ, సహించలేరా? విమర్శని ప్రచురిస్తే వీక్షణం కమ్యూనిస్టు వ్యతిరేక పత్రిక అయిపోయిందా? కమ్యూనిజంలో ప్రజాస్వామ్యం ఉండాలా, వద్దా? వ్యక్తిపూజ చేస్తున్నది వీరస్వామి వంటి వారు (స్టాలిన్‌కి). బెతల్‌హామ్ విమర్శని ఇష్టపడితే భక్తులయిపోతారా? 'స్టాలిన్ చేసిన పొరపాట్లు, తప్పులూ లేవని కాదు' అని వ్యాస రచయిత అన్నారు, ఆ పొరపాట్లు, ఆ తప్పులూ ఏమిటో మీరే తెలియచేయండి. అసలైన తప్పులు ఏమిటో మేమూ తెలుసు కుంటాము. స్టాలిన్ మీద, సోవియట్ మీద దుష్ప్రచారం సాగిస్తే మాత్రం సోవియట్ ప్రజలు నమ్మాల్సిన అవసరం ఉందా? సోవియట్‌లో కమ్యూనిజం (?) ఎందుకు నామరూపాలు లేకుండా పోయిందో తెలియ చేయండి. అసలు చర్చించవల్సింది అదే! అమెరికా కారణంగానూ, పెట్టుబడి దార్ల కారణం గానూ సోవియట్‌లో కమ్యూనిజం పోయిందని నమ్మించు కుంటూ, వందేళ్ల, రెండు వందలేళ్ల సంబరాలు చేసుకుంటూనే ఉండాలా?. ఆత్మ విమర్శ మాత్రం వద్దు. వ్యక్తి పూజలు చేస్తూ, ఎప్పుడో వచ్చి, ఇప్పుడు నామరూపాలు లేకుండా పోయినా సంబరాలు చేసుకుంటూనే ఉండిపోవాలా?

– జి. హరిప్రసాద్
బళ్లారి

సోవియట్ యూనియన్‌లో జరిగిన వర్గ పోరాటాల గురించి బేతెల్‌హామ్ విశ్లేషణను ఎదుర్కోలేక, స్టాలిన్ మీద పొగడ్తలతో తన వ్యాసాన్ని నింపేశారు వీరస్వామి. అందుకోసం స్టాలిన్‌ని ప్రశంసిస్తూ, మావో చెప్పిన మాటల్ని ఉటంకించారు. స్టాలిన్ చేసిన 'తీవ్రమైన' తప్పిదాల గురించి మావో అన్న మాటల్ని పక్కన పెట్టేశారు. వీరస్వామి ప్రస్తావించిన ప్రశంసా వాక్యాలు 1956 ఆగస్టు 30న, నవంబర్ 15న జరిగిన పార్టీ సమావేశాల్లో, మావో అన్న మాటలు. దీని కంటే మూడు నెలల ముందు 1956 ఏప్రిల్ 5న, మావో 'చరిత్రలో స్టాలిన్ స్థానం 'గురించి చెప్పిన మాటల్లో కొన్ని విమర్శలున్నాయి చూడండి, (మావో రచనలు, 7వ సంపుటి, పేజీలు: 93–94. శ్రామిక వర్గ ప్రచురణలు.) 1) స్టాలిన్ తన పాత్రనీ, నాయకత్వాన్నీ, ఎక్కువగా చేసి చూసుకున్నాడు. 2) స్టాలిన్ చర్యలు కొన్ని మార్క్సిజం–లెనినిజంకు వ్యతిరేకం. 3) వ్యక్తి పూజ చేయించుకుని "మరింతగా, మరింతగా, సంతోషపడ్డాడు." 4) కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని 'అతిక్రమించాడు'. 5) 'అణచివేత పరిధిని అతిగా విస్తరింప జేశాడు.' 6) ఫాసిస్ట్ వ్యతిరేక యుద్ధంలో "అప్రమత్తంగా లేడు". 7) రైతు సంక్షేమం మీద 'శ్రద్ధను చూపడంలో విఫలుడయ్యాడు'. 8) అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమంలో తప్పుడు సలహానిచ్చాడు. 9) ప్రజారాశుల నుండి తన్ను తాను వేరు పర్చుకున్నాడు. స్టాలిన్ చేశాడని మావో ప్రస్తావించిన ఈ 'తీవ్ర పొరపాట్ల'నే గదా బేతెల్‌హామ్ ఉదాహరణలతో వివరించింది? మరి బేతెల్‌హామ్ పుస్తకం 'చెత్త పుస్తకం 'ఎలా అయింది?

ఇదే ఉపన్యాసంలో మావో ఇంకా ఇలా అన్నాడు మావో: "20వ కాంగ్రెస్ మొదలు పెట్టిన వ్యక్తి పూజ వ్యతిరేక పోరాటం, సోవియట్ కమ్యూనిస్టులూ, ప్రజలూ తమ పురోగతికి అడ్డంకిగా ఉన్న సిద్ధాంత అవరోధాలను తొలగించు కోడానికి చేపట్టిన గొప్ప సాహసిక పోరాటం" –అంటే, కృశ్చేవ్ నివేదికలో స్టాలిన్ వ్యక్తిపూజ మీద ఉన్న విమర్శను మావో అంగీకరించాడని అర్థం.

దీన్ని బట్టి తేలేది ఏమంటే, స్టాలిన్ మీద బేతెల్‌హామ్ చేసిన విమర్శ 'విష' ప్రచారం కాదు. వాస్తవాల మీద ఆధారపడ్డ విశ్లేషణ– అని.

– ఎన్. లెనిన్ బాబు
న్యూ ఢిల్లీ

వీక్షణం నవంబర్ 2017 సంచికలో వెలువడిన 'అక్టోబర్ విప్లవం, తర్వాత పరిణామాలు', 'రచయిత స్వీయనియంత్రణ పాటించాలి' వ్యాసాల మీద పాఠకుల నుంచి పెద్ద ఎత్తున ప్రతిస్పందన వచ్చిందనీ, ఆ రెండు వ్యాసాలు వీక్షణం కలెక్టివ్ దృక్పథానికి వ్యతిరేకంగా ఉన్నాయనీ, వాటిని వీక్షణంలో అచ్చువేసి ఉండవలసింది కాదని రాశారు. 'పెద్ద ఎత్తున ప్రతిస్పందన' అంటే వ్యతిరేక ప్రతిస్పందననేనా? వీక్షణం కలెక్టివ్ దృక్పథం అంటే పత్రిక ఎడిటోరియల్ సభ్యులందరి సమిషి దృక్పథం అనేనా?

ఒక రచనలో వ్యక్తమైన అభిప్రాయాల్ని, ఏ చర్చ లేకుండా ప్రగతిశీలం కాదని నిర్ధారించడానికి వీక్షణం కలెక్టివ్ దృక్పథం అనుసరించే నిర్దిష్ట ప్రమాణాలేమిటి? ప్రచురించబడిన ఒక రచన ప్రగతిశీలం కాదని ప్రచురించేముందు, అది ఎలా ప్రగతిశీలం కాదో పాఠకులకి వివరించాల్సిన బాధ్యత మీకు లేదా? వీక్షణం సమిష్టి దృక్పథం ఏమిటో, దాని ప్రగతిశీల ఆశయాలు, లక్ష్యాలు ఏమిటో 'స్థూలంగా' కాకుండా, వివరంగా తెలియ జేయండి. లేకపోతే వీక్షణం కలెక్టివ్ దృక్పథాన్ని, స్థూలంగా 'రంగనాయకమ్మ వ్యతిరేక దృక్పథం'గా భావించాల్సి వస్తుంది. పాఠకులకీ ఒక దృక్పథం ఉంటుంది. విస్సన్న చెప్పిందే వేదం కాదు కదా!

డిసెంబర్ 2017 సంచికలో ఎ. వీరస్వామి రాసిన 'మార్క్సిస్టు వ్యతిరేక చెత్త పుస్తకానికి వీక్షణంలో ప్రశంసలా?' అనే వ్యాసం చదివాను. అందులో – ఛార్లెస్ బెతెల్‌హామ్ రాసిన 'క్లాస్ స్ట్రగుల్స్ ఇన్ యుఎస్ఎస్ఆర్' రెండు భాగాలు వెలువడిన వెంటనే, 1978లో క్లాడ్ వార్లె అనే ఫ్రెంచి రచయిత్రి ఒక పెద్ద పుస్తకం రాసిందనీ, ఆమె తన పుస్తకంలో బెతెల్‌హామ్ వ్యక్తం చేసిన తప్పుడు భావనలనీ, మార్క్స్, లెనిన్‌ల భావాల్ని వక్రీకరించి, మార్క్సిజంగా చలామణి చేసి, అమాయకుల్ని తప్పుదారి పట్టించే బెతెల్‌హామ్ ప్రయత్నాలని ఖండించిందనీ ఒక ప్రస్తావన ఉంది. ఆ పుస్తకం పేరేమిటో?

బెతెల్‌హామ్ తప్పుడు సూత్రీకరణల్నీ, భావనలనీ ఆ రచయిత్రి మార్క్సిస్టు దృక్పథంతో ఎలా ఖండించిందో వివరంగా ఒక సమీక్ష రాసి, రంగనాయకమ్మిజాన్ని నమ్మేవారికి, ఆమె భజన బృందానికి కనువిప్పు కలిగించమని, 'రంగనాయకమ్మ వ్యతిరేక బృందం'లో క్రియాశీలక సభ్యుడైన వీరస్వామిని కోరుతున్నాను. సిద్ధాంతాన్ని ముద్దుపెట్టుకొని, అంతే గాఢంగా ఆచరణని కూడా ముద్దులాడే వీరస్వామి గారికి, రంగనాయకమ్మని మార్క్సిస్టుగా నమ్ముతున్న అమాయక పాఠకుల పట్ల ఆ మాత్రం నైతిక బాధ్యత లేదా?

– పి. వర్మ, పి. బాలాజీ వరప్రసాద్
బాపట్ల

వీక్షణం నవంబర్ సంచికలో – రంగనాయకమ్మ స్వేచ్ఛానువాదం చేసిన 'సోవియట్ రష్యాలో ఏం జరిగింది?' అనే పుస్తకంలోని సారాంశాన్నంతా ఎం. నిర్మల్ కుమార్ తన వ్యాసంలో చాలా చక్కగా వివరించారు. దీనికి కువిమర్శగా డిసెంబర్ సంచికలో ఎం. వీరస్వామి వ్యాసం వచ్చింది. నిర్మల్ కుమార్ తన వ్యాసంలో – 'ఇక్కడ బెతెల్‌హామా? స్టాలినా, రంగనాయకమ్మా? అనే వ్యక్తుల చర్చ ముఖ్యం కాదు. 1917 – 91ల మధ్య రష్యాలో ఏం జరిగింది? అక్టోబర్ విప్లవం ఎందుకు నిలవలేదు? అనే అంశాలకు సమాధానాలు కనుగొనడమే ముఖ్యం అని ఒక చోట రాశారు. ఎంత గొప్ప మార్క్సిస్టు విమర్శణాత్మకత ఇది! మార్క్సిస్టులకు విషయమే (సత్యమే) ప్రధానం. కాని వీరస్వామికి 'విషయం'తో పనిలేదు. తన ఫాసిస్ట్ విమర్శ అంతా వ్యక్తుల మీదే. బెతెల్‌హామ్ అవగాహన మార్క్సిజంకి వ్యతిరేకమని రుజువు చేశారా? వీరస్వామి. అది వదిలేసి 'వీక్షణం'లో వ్యాసం రావడమే తప్పన్నట్లుగా తన ఫాసిస్ట్ ధోరణిని వెలుబుచ్చుకున్నారు. 'నూరు పూలు వికసించనివ్వండి, వెయ్యి ఆలోచనలు సంఘర్షించనివ్వండి' అన్నాడు కదా మావో! అలా సంఘర్షించే మార్క్సిస్టు ధోరణిలో లేరు వీరస్వామి. స్టాలిన్‌కి మార్క్సిజంలో ఓనమాలు కూడా తెలియవని రుజువైనట్లుగా, ఆ స్టాలిన్‌కి భజన చేసే వీరస్వామి, ఒక మార్క్సిస్టు వ్యతిరేకని రుజువయ్యింది.

– యు.ఎచ్. ప్రీతమ్
ఖమ్మం

జర్నలిస్టు వి.ఎల్. నర్సింహారావు మృతి

సీనియర్ పాత్రికేయుడు వద్దిరాజు లక్ష్మీ నర్సింహారావు(75) నవంబర్ 29న మృతిచెందారు. నర్సింహారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హన్మకొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన వరంగల్ జిల్లాలోని కడిపికొండలో పుట్టారు. పి.వి. నర్సింహారావు సంపాదకత్వంలో వెలువడిన కాకతీయ పత్రికలో కూడా ఆయన పనిచేశారు. 1973 నుంచి పూర్తిస్థాయి జర్నలిస్టుగా మారారు. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికల్లో పనిచేశారు. ఆయన వరంగల్ ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా, జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు.

కొలువుల కొట్లాట సభ

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ టిజెఏసి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ క్రీడా మైదానంలో డిసెంబర్ 4న కొలువుల కొట్లాట సభ నిర్వహించింది. ఈ సభలో కోదండరాం మాట్లాడుతూ ఉద్యోగ ఖాళీల భర్తీపై ప్రభుత్వం అన్నీ తప్పుడు లెక్కలే చెబుతోందన్నారు. తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని అడగాల్సి రావడమే సిగ్గుచేటన్నారు. కాంట్రాక్టులు, ఇసుక దందాలు, కమీషన్లపైనే ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, విద్యార్థుల ఉద్యోగాల కోసం సభకు అనుమతివ్వని ప్రభుత్వం మద్యం అమ్మకాల ప్రమేయం ఉన్న సన్‌బర్న్ షోకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఎన్నికల్లో గెలువడమే ప్రజాస్వామ్యం కాదని, రైతులను, యువతను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు నిలువలేవన్నారు.

ఎస్.టి. జాబితా నుంచి లంబాడాలను తొలగించాలి

లంబాడాలను ఎస్.టి. జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి హక్కుల సభ డిసెంబర్ 9న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించింది. జనాభా గణన ప్రకారం తెలంగాణలో 1981లో 60 వేల నుంచి 80 వేలుగా ఉన్న లంబాడాలు 2011 జనాభా గణన నాటికి 24 లక్షలు ఎలా అయ్యారని వక్తలు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్‌టి కోటా కింద లంబాడాలు మాత్రమే లబ్ధి పొందుతున్నారన్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో గుడ్డిగా లంబాడాలను ఎస్‌టి జాబితాలో కలిపారని దీంతో ఆదివాసులు నష్టపోతున్నారన్నారు. లంబాడాలను ఎస్‌టి జాబితానుండి తొలగించాలని, లేనిపక్షంలో మిలిటెంట్ పోరాటాలు చేస్తామని అన్నారు.

డంపింగ్‌యార్డ్, పవర్‌ప్లాంట్ ఎత్తివేయాలని ధర్నా

హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో నిత్యం కాలుష్యం వెదజల్లుతున్న డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని, అక్కడే చేపట్టనున్న పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ 'జవహర్‌నగర్ ప్రజా హక్కుల పరిరక్షణ పోరాట కమిటీ' ఆధ్వర్యంలో డిసెంబర్ 12న డంపింగ్‌యార్డ్ ప్రధాన గేటు వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతుగా అన్ని ప్రతిపక్ష పార్టీలు, జెఏసి చైర్మన్ కోదండరాం, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ నాయకురాలు విమలక్క హాజరై మద్దతుపలికారు. ప్రజాభిప్రాయం లేకుండా డంపింగ్ యార్డును నిర్మించడం సరికాదని, ప్రజలకు ఇబ్బందికలిగే రీతిలో డంపింగ్ యార్డును నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును వక్తలు గుర్తుచేశారు.

లంబాడాల శంఖారావం

లంబాడాలు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో డిసెంబర్ 13న 'లంబాడీల శంఖారావం' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మమ్మల్ని ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలనడం అన్యాయమన్నారు. మాకు అన్యాయం చేయాలనుకుంటే ఊరుకోం అని లంబాడి ఐక్య వేదిక నేతలు హెచ్చరించారు. మహబూబాబాద్ ఎంపి సీతారం నాయక్ మాట్లాడుతూ కొంత మంది స్వార్థపరులు వారి స్వలాభం కోసం లంబాడీల, ఆదివాసుల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. 25 లక్షల జనాభా ఉన్న లంబాడీలు తమ హక్కుల కోసం పోరాడితే వారిపై దాడులు చేయడం మంచిది కాదన్నారు. ఆత్మగౌరవ నినాదం పేరుతో నిర్వహించిన ఈ సభకు దాదాపు లక్ష మంది లంబాడాలు హాజరయ్యారు.

చంద్ర పుల్లారెడ్డి బాట దళం ఎన్‌కౌంటర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గంగారం పరిధిలోని కోడెవాగు అటవీ ప్రాంతంలో డిసెంబర్ 14న ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో చంద్రపుల్లారెడ్డి బాట దళంకు చెందిన ఎనిమిది మంది చనిపోయారు. ఇది బూటకపు ఎన్‌కౌంటరని, పోలీసులు పట్టుకొని చంపారని ఘటనపై న్యాయ విచారణ జరపాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.

ప్రపంచ తెలుగు మహాసభలు

ప్రపంచ తెలుగు మహాసభలను తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో డిసెంబర్ 15 నుంచి 19 వరకు నిర్వహించింది. ఐదు రోజులు పాటు జరిగిన మహాసభల్లో 15 వేలకు పైగా హాజరైనట్లు తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి తెలిపారు. మరోపక్క ఈ ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరిస్తూ విరసం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా విరసం నాయకులను, సభ్యులు పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు.

ఎస్‌సి వర్గీకరణ కోసం ట్యాంక్‌బండ్ ముట్టడి

ఎస్‌సి వర్గీకరణ కోరుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వాన ఎంఆర్‌పిఎస్ డిసెంబర్ 17న ట్యాంక్‌బండ్ ముట్టడికి పిలుపునిచ్చింది. సికింద్రాబాద్ నుండి ట్యాంక్‌బండ్‌కు వందలాది కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గీకరణకు ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇవ్వాలని కార్యకర్తలు నినదించారు. ముట్టండి సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాల్లో పోలీస్ పెట్రోలింగ్ బైక్‌లకు నిప్పు పెట్టారు. పోలీసులకు ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు కొంతమంది ఆందోళనకారులను అరెస్టు చేశారు.

టివివి 5వ రాష్ట్ర మహాసభలు

తెలంగాణ విద్యార్థి వేదిక (టివివి) 5వ రాష్ట్ర మహాసభలు కరీంనగర్‌లోని టి.ఎన్.జి.ఓ హాల్‌లో డిసెంబర్ 21,22న జరిగాయి. ఈ సభలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ. హరగోపాల్ ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్ష నెరవేరేదాకా పోరాటాలు ఉంటాయని, ఆ పోరాట ఆకాంక్షల సారాంశం తీసుకొని విధానాలు రూపకల్పన జరగాలన్నారు. మెజార్టీ ప్రజలు పేదరికంలో మగ్గుతుంటే కొద్ది మంది గుప్పిట్లో మొత్తం సంపదను పోగుచేసుకున్న అసమ సమాజంలో టి.వి.వి సమానత్వం కోసం పోరాడుతోందన్నారు. అలాంటి సంస్థపై నిర్బంధాలను ప్రయోగించడం వల్ల శాంతి నెలకొనదన్నారు. గురుకులాల పేరిట మాయ చేస్తున్న ప్రభుత్వం తెలంగాణలో 4వేల స్కూళ్లను మూసివేసేందుకు సిద్ధమైందని, మరోవైపు కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తోందన్నారు. అందరికి సమాన విద్య అందే వరకూ పోరాడుతామన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం తమ పోరాటం సాగుతోందని అన్నారు.

మనుస్మృతిని తగులబెట్టిన విద్యార్థుల అరెస్ట్

శాతవాహన యూనివర్సిటీలో ప్రగతిశీల విద్యార్థి సంఘాలు మనుస్మృతి పత్రాలను డిసెంబర్ 25న తగులబెట్టారు. ఈ విషయంపై విశ్వవిద్యాలయంలో ఎబివిపి కార్యకర్తలకు ప్రగతిశీల విద్యార్థి సంఘ సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు లాఠీచార్జిచేసి 40 మందిని అదుపులోకి తీసుకున్నారు.

మావోయిస్టు నాయకుల లొంగుబాటు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జినుగు నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న, ఆయన సహచరి, డివిజన్ కమిటీ సభ్యురాలు హింగె అనిత అలియాస్ రజిత డిసెంబర్ 25న లొంగిపోయారు. రాష్ట్ర డిజిపి ఎం. మహేందర్‌రెడ్డి తన కార్యాలయంలో వారి లొంగుబాటును అధికారికంగా ప్రకటించారు. సైద్ధాంతిక విభేదాల వల్లే మావోయిస్టు పార్టీని వీడానని నర్సింహారెడ్డి అన్నారు. భూస్వామ్య వ్యవస్థపై పోరాటం కోసమే విప్లవోద్యమం పుట్టిందని, ప్రస్తుతం దేశంలో ఆ పరిస్థితులు లేవన్నారు. 10-15 ఏళ్లుగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ లైన్ మారడం లేదనే కారణంతోనే తాను లొంగిపోయానని తెలిపారు. వీ

మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని కల్లెడ గ్రామ సమీపంలోని అడవుల్లో డిసెంబర్ 6న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మహిళలతో సహా ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతోనే మహారాష్ట్ర నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్స్లో పాల్గొనే పోలీసులను పంపినట్లు స్పెషల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శరద్ షేలార్ తెలిపారు. పీపుల్స్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాలు జరుపుకుంటున్న సమాచారంతో వెళ్లినట్లుగా ఆ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయని అందులో ఏడుగురు నక్సల్స్ మృతి చెందినట్లుగా, ఈ ఎన్‌కౌంటర్ ఎస్‌పి మోతీరాం ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు.

హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ ఎన్నికల ఫలితాలు

హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌లకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కేంద్ర ఎన్నికల కమిషన్ డిసెంబర్ 18న ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మొత్తం 68 స్థానాలకు గాను కాంగ్రెస్ 21 స్థానాలు గెలుచుకోగా, బిజెపి 44 స్థానాల్లో గెలుపొందింది. సిపిఎం ఒక స్థానంలో గెలుపొందగా రెండు స్థానాల్లో స్వతంత్రులు గెలుపొందారు. గుజరాత్‌లో అధికారంలో ఉన్న బిజెపి మొత్తం 182 స్థానాలకు గాను 99 స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ 80 స్థానాల్లో గెలిచింది. ఇతరులు 3 స్థానాల్లో గెలిచారు. రెండు రాష్ట్రాల్లోను బిజెపి అధికారానికి కావాల్సిన పూర్తి మెజారిటీ సాధించింది. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో ఎన్నికల సంఘం ప్రకారం గుజరాత్ 'నోటా'కు దాదాపు 5.2 లక్షల ఓట్లు, హిమాచల్ ప్రదేశ్‌లో 33 వేల ఓట్లు పోలయ్యాయి.

నలుగురు సిఆర్‌పిఎఫ్ జవాన్లను చంపిన జవాను

ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న బీజాపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో డిసెంబర్ 9న 168వ బెటాలియన్‌లో పనిచేస్తున్న సనత్‌కుమార్ తోటి జవాన్లపై కాల్పులు జరపడంతో నలుగురు చనిపోయారు. ఈ కాల్పుల్లో ఎస్ఐలు వి.కె. శర్మ, మేఘ్ సింగ్, ఏఎస్ఐ రజ్వీరి సింగ్, కానిస్టేబుల్ శంకర్‌రావులు అక్కడికక్కడే మరణించగా మరో ఏఎస్ఐ గజానంద్ తీవ్రంగా గాయపడ్డారు. సనత్‌కుమార్‌తో వాగ్వివాదం కాల్పులకు దారితీసినట్లు దంతెవాడ రేంజ్ డిఐజి సుందర్‌రాజ్ తెలిపారు.

వాహనాలకు నిప్పంటించిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని కిస్టారం గ్రామ సమీపాన కాసారం వద్ద రహదారి పనుల్లో వినియోగిస్తున్న 30 వాహనాలకు నిప్పుపెట్టారన్నారు. కాసారంలో నక్సలైట్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధులతో రహదారి నిర్మిస్తున్నారన్నారు. డిసెంబర్ 22న సాయంత్రం వందమంది సాయుధ మావోయిస్టులు వాహనాల డీజిల్ ట్యాంకులు పగులగొట్టి అందులోని డీజిల్ వాహనాలపై పోసి నిప్పంటించారన్నారు. దీంతో 21 ట్రాక్టర్లు, 3 టిప్పర్లు, 2 కాంక్రీట్ మిల్లర్లు, ఒక రోలర్, 3 ఆటోలు కాలిపోయాయి.

బొగ్గు స్కాంలో మధుకోడాకు జైలు శిక్ష

బొగ్గు కేటాయింపుల కుంభకోణం కేసులో ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడాకు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ, రు. 25 లక్షల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి భరత్ పరాశర్ డిసెంబర్ 16న తీర్పు వెలువరించారు. ఝార్ఖండ్‌లోని రజారా నార్త్ కోల్ బ్లాక్‌ను కోల్‌కత్తా కంపెనీ వినీ ఐరన్ స్టీల్ ఉద్యోగ్ లిమిటెడ్ (విసుల్)కు అప్పగించేందుకు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని, అవినీతి మార్గాలు అనుసరించారని సిబిఐ మోపిన అభియోగాలు రుజువయ్యాయి. కోడాతో పాటు కేంద్ర బొగ్గు శాఖ మాజీ కార్యదర్శి ఎచ్.సి. గుప్తా, ఝార్ఖండ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఏ.కె. బసు, కోడా సన్నిహితుడు విజయ్ జోషీలను కోర్టు దోషులుగా నిర్ధారించి మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

2జి స్పెక్ట్రం కుంభకోణం దోషుల విడుదల

2జి స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపుల్లో లక్షా 76 వేల కోట్ల కుంభకోణం జరిగిందని దీనిపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మొత్తం మూడు కేసులను నమోదు చేసింది. సిబిఐ 2జి స్పెక్ట్రం కేసులో 10 మంది వ్యక్తులపైన 7 కంపెనీలపైన అభియోగాలు మోపింది. ఈ కేసు అభూత కల్పనల ఆధారంగా విచారణ సంస్థ చార్జిషీటు రూపొందించిందని, అందులో నిందితులను దోషులుగా చూపే ఎలాంటి ఆధారాలు లేవని జడ్జి వ్యాఖ్యానించారు. 2జి స్పెక్ట్రం కేసును ప్రతి ఒక్కరూ ఓ భారీ కుంభకోణంగా చూశారని, వాస్తవానికి అందులో ఏమీ లేదన్నారు. ఈ కుంభకోణంలో సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్(ఇడి) నమోదు చేసిన మూడు కేసుల్లో ఉన్నవారందరినీ ప్రత్యేక కోర్టు డిసెంబర్ 21న నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పుతో సిబిఐ పై తీవ్ర సందేహాలు కలుగుతున్నాయని సీనియర్ న్యాయవాదులు తెలిపారు. ఈ తీర్పు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో డిఎంకె, బిజెపిలు ఇచ్చిపుచ్చుకోబుతున్నట్లు తెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు చెపుతున్నారు.

దాణా స్కాంలో లాలూ దోషి

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దాణా కుంభకోణంలో ఆర్‌జెడి అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని సిబిఐ ప్రత్యేక కోర్టు దోషులుగా తేల్చింది. మరో మాజీ ముఖ్యమంత్రి జెడి(యు) నేత జగన్నాథ్ మిశ్రాతో పాటు ఆరుగురిని నిర్దోషులుగా విడుదల చేసింది. డిసెంబర్ 23న రాంచీలోని సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివపాల్ సింగ్ ఈ తీర్పు వెల్లడించారు. లాలూతో పాటు మిగితా దోషులకు విధించనున్న జైలు శిక్షను జనవరి 3న ప్రకటించనున్నట్లు తెలిపారు. దేవగఢ్ ఖజానా నుంచి 1991-94 మధ్య రు. 89.72 లక్షలను అక్రమంగా విత్‌డ్రా చేశారన్న కేసులో ఈ తీర్పు వెలువడింది.

వేలానికి ప్రభుత్వ చమురు క్షేత్రాలు

కేంద్ర ప్రభుత్వం ఓఎన్‌జిసికి చెందిన 15 చమురు క్షేత్రాలను వేలం వేయాలని నిర్ణయించింది. పరిమిత వేలం పేరుతో చమురు క్షేత్రాలను ప్రైవేట్‌కు అప్పజెప్పనున్నది. దీనికి సంబంధించిన విధాన నిర్ణయం 2015, సెప్టెంబర్ 2న జరిగింది. నూతన లైసెన్సింగ్ విస్తరణలో భాగంగా 67 చమురు క్షేత్రాలను వేలానికి ఎంపిక చేసింది. గ్యాస్ ఉత్పత్తి చేయడంలో ఈ చమురు క్షేత్రాలు విఫలమయ్యాయని, మనుగడలేని స్థితిలో ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. ఈ 67 క్షేత్రాల్లో రు. 70,000 కోట్ల విలువైన 86 ఎంఎంటి క్రూడ్ ఆయిల్ నిల్వలు ఉన్నట్లు వేలం ప్రకటనలో కేంద్రం పేర్కొంది. 67 చమురు క్షేత్రాలు వేలం తర్వాత చమురు రంగం పూర్తిగా ప్రైవేట్ రంగం చేతుల్లోకి పోనున్నది. వీ

కెన్యా అధ్యక్ష ఎన్నికలు

కెన్యా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు ఉహురూ కెన్యట్టా విజయం సాధించారు. కెన్యట్టా తన ప్రత్యర్థి రైలా ఒడింగాపై 54 శాతం ఓట్లతో గెలుపొందారు. ఎన్నికల్లో అవినీతి జరిగిందంటూ రైలా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆందోళనల్లో యాభై మంది ఆందోళనకారులు మరణించారు. ఎన్నికల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయనీ, ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయగా సుప్రీంకోర్టు మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రైలా ఓటమిని అంగీకరిస్తూ వైదొలిగారు. ఈ నిర్ణయంతో కెన్యట్టా మరో ఐదేండ్ల పాటు కెన్యా దేశ్యాధ్యక్షుడిగా నవంబర్ 28న మరోసారి బాధ్యతలు చేపట్టారు. కెన్యాలో 19.6 మిలియన్ల మంది ఓటర్లు ఉండగా ఎన్నికల్లో కేవలం 7.6 మిలియన్ల మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

యెమెన్ మాజీ నియంత సలేహ్ కాల్చివేత

యెమెన్‌లో అంతర్యుద్ధం కారణంగా పౌరసమాజం అతలాకుతలమై పోయింది. డిసెంబర్ 4న యెమెన్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా సలేహ్‌ను హౌతీ తిరుగుబాటుదారులు కాల్చి చంపారు. 1990 నుంచి రెండు దశాబ్దాల పాటు యెమెన్ అధ్యక్షుడిగా నియంత పాలన సాగించాడు. 2011లో వచ్చిన అరబ్ విప్లవంతో ఆయన పాలన ముగిసింది. దీంతో ఆయన హౌతీ తిరుగుబాటుదారులతో చేతులు కలిపి యెమెన్‌లో అంతర్యుద్ధానికి ఆజ్యం పోశాడు. దీంతో యెమెన్‌లో అంతర్యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. అధ్యక్షుడు అబ్దుల్ మన్సూర్ హదీ దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. డిసెంబర్ మొదటి వారంలో సలేహ్ హౌతీతో వేరుపడి మరోసారి మన్సూర్‌తో చేతులు కలిపాడు. ఈ పరిణామాల నేపథ్యంలో హౌతీ తిరుగుబాటుదారులు సలేహ్‌ను కాల్చి చంపారు. సలేహ్ ఆజ్యం పోసిన అంతర్యుద్ధం వల్ల యెమెన్‌లో పౌరసమాజం ఛిద్రమైపోయింది. ఆకలి, నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రజావైద్యం దెబ్బతిని కలరా ప్రబలింది. రెండున్నర కోట్లమంది యెమెన్లకు తీవ్ర ఆహార కొరత ఏర్పడింది. అటు అమెరికా సంకీర్ణ దళాలు, ఇటు హౌతీ దాడులతో వేలాది మంది సామాన్యపౌరులు మృతిచెందారు.

నైజీరియాలో దాడులు

నైజీరియాలోని బియూ నగరంలో డిసెంబర్ 3న ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో పదిహేడు మంది మరణించగా, నలభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. బోకోహరామ్ మిలిటెంట్లు ఈ ప్రాంతంపై పట్టు కోసం తీవ్ర విధ్వంసానికి పాల్పడుతున్నారు. మార్కెట్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని ఆత్మాహుతి దాడులకు పాల్పడుతున్నారు. బోకోహరామ్ మిలిటెంట్లు 2009 నుంచి జరిపిన దాడుల్లో 20 వేల మందికి పైగా పౌరులు మరణించారు. 17 లక్షల మంది ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు.

2018 వింటర్ ఒలింపిక్స్‌లో రష్యాపై నిషేధం

ఫిబ్రవరి 9–25 మధ్య దక్షిణ కొరియాలో జరిగే 2018 పియాంగ్ చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో రష్యాపై నిషేధాన్ని ప్రకటిస్తూ అంతర్జాతీయ ఒలింపిక్ కౌన్సిల్ (ఐఒసి) డిసెంబర్ 6న నిర్ణయం తీసుకుంది. 2014 సోచీ వింటర్ ఒలింపిక్స్‌లో రాజ్యప్రేరేపిత డోపింగ్ ఆరోపణల కారణంగా ఐఒసి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వెనుక అమెరికా సహా 17 దేశాల నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీల బలమైన ప్రభావం ఉంది. ఐఒసి నిర్ణయంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందిస్తూ, రాజకీయ ఎజెండాతోనే రష్యాను ఒలింపిక్స్ నుంచి నిషేధించారని అన్నారు.

జెరూసలెంపై అమెరికా ఏకపక్ష నిర్ణయం

జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా ఏకపక్షం నిర్ణయం తీసుకుంది. జెరూసలెం విషయంలో దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న విధానానికి ముగింపు పలుకుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డిసెంబర్ 6న అధికారిక ప్రకటన విడుదల చేశారు. అమెరికా ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నిర్ణయం ఆమోదయోగ్యం కాదని పాలస్తీనా ప్రకటించింది. అమెరికా ప్రకటనకు నిరసనగా పాలస్తీనాలో పౌరులు ఆందోళన ప్రదర్శనలు చేశారు. అమెరికా నిర్ణయాన్ని ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి ఆగ్రహం వ్యక్తం చేశాయి. టర్కీ, ఈజిప్ట్, ఇరాన్, సౌదీ అరేబియా, పాకిస్తాన్ దేశాలు ఖండించాయి. ఈ నిర్ణయంపై యూరోపియన్ యూనియన్, రష్యా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. బ్రిటన్ ప్రధాని థెరిసా మే ఈ నిర్ణయానికి మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని తెలిపారు. ఇంతవరకూ చేపట్టిన శాంతి ప్రక్రియ దెబ్బతిన్నదని, అమెరికా వివాదాస్పద నిర్ణయం తీవ్ర పరిణామాలకు దారి తీస్తోందని ఆఫ్రికా, ఆసియా దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

బ్రెగ్జిట్ చర్చలు సఫలం

యూరోపియన్ యూనియన్ (ఇయు) విధించిన మూడు షరతులకు బ్రిటన్ ప్రధాని థెరిసా మే అంగీకారం తెలపడంతో బ్రెగ్జిట్ చర్చలు సఫలమైనట్లు యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్‌క్లాడ్ జంకర్ తెలిపారు. ఐర్లాండ్‌తో ఉన్న సరిహద్దు సమస్య, బ్రిటన్‌లోని ఇయు పౌరులకు రక్షణ, డైవర్స్ బిల్లు నేపథ్యంలో ఇయుకు 52 బిలియన్ డాలర్లు చెల్లించేందుకు బ్రిటన్ అంగీకారం తెలిపింది. ఈ ఒప్పందం వల్ల దాదాపు 30 లక్షల మంది యురోపియన్ ప్రజలకు బ్రిటన్‌లో సంపూర్ణ రక్షణ లభించనుంది. బ్రెగ్జిట్ తరువాత బ్రిటన్‌లో ఉన్న యూరప్ పౌరులకు సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన హక్కులు వర్తించనున్నాయి.

నేపాల్ ఎన్నికలు

నేపాల్ పార్లమెంట్ ఎన్నికలు నవంబర్ 26, డిసెంబర్ 7 తేదీల్లో రెండు విడుతలుగా జరిగాయి. మొత్తం 275 పార్లమెంట్ స్థానాలకు గాను 165 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 113 స్థానాల్లో నేపాల్ వామపక్ష కూటమి గెలిచింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యుఎంఎల్) 74 స్థానాలు, సిపిఎన్ – మావోయిస్టు పార్టీకి 32 స్థానాలు వచ్చాయి. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 21 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. ఈ గెలుపుతో మాజీ ప్రధాని సిపిఎన్–యుఎంఎల్ చైర్మన్ కెపి శర్మ ఓలీ మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

చిలీ అధ్యక్ష ఎన్నికలు

చిలీ అధ్యక్ష పదవికి డిసెంబర్ 17న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి సెబాస్టిన్ పినెరా 54.56 శాతం ఓట్లతో గెలుపొందారు. ఆయన ప్రత్యర్థి సెంటర్ లెఫ్ట్ నేత అలెజాండ్రో గులివర్‌కు 45.44 శాతం ఓట్లు వచ్చాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన పినెరా చిలీ పౌరుల్లో ఐక్యత కోసం, దేశాభివృద్ధి కోసం పాటుపడతానని అన్నారు.

ఫిలిప్పైన్స్‌లో వరదలు

ఫిలిప్పైన్స్ దీవులు టెంబిన్ తుఫాను తాకిడికి కకావికలమైపోయింది. డిసెంబర్ ఆఖరున వచ్చిన వరదల వల్ల రెండు వందల మంది మరణించారు. ఫిలిప్పైన్స్‌లో రెండో అతిపెద్ద ద్వీపమైన మిండానావోలో నివసిస్తున్న రెండు కోట్ల మందిపై తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంది. అనేక మంది గల్లంతు కాగా 70 వేల మంది నిరాశ్రయులయ్యారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(నవంబర్ 1 నుండి నవంబర్ 30, 2017 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (859), ఆంధ్రప్రదేశ్‌లోని 12 జిల్లాలలో (683) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1542)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	3	-	29	23	4	3	6	3	3	2	3	1	2	23	32	-	-	-	3	-
హైదరాబాద్	-	-	-	8	10	5	2	2	-	-	1	6	2	3	23	18	-	-	-	-	-
కరీంనగర్	-	1	1	5	15	3	7	3	-	-	-	3	-	2	26	10	-	-	-	-	-
ఖమ్మం	-	1	-	3	18	-	1	4	-	3	2	1	5	4	24	8	-	-	-	-	-
మహబూబ్‌నగర్	-	1	-	5	7	3	4	2	2	3	4	5	7	8	35	5	-	-	-	-	-
మెదక్	2	16	5	6	3	9	9	4	1	3	4	4	9	19	20	34	-	-	-	8	2
నల్గొండ	-	4	-	5	5	2	1	-	-	1	2	1	1	4	21	14	-	-	-	-	-
నిజామాబాద్	-	-	-	2	3	1	3	-	-	-	1	1	-	5	19	6	-	-	-	-	-
వరంగల్	2	9	-	1	1	4	5	2	1	1	2	2	10	30	20	5	-	-	-	4	1
వికారాబాద్	-	-	-	2	2	1	2	1	-	-	-	1	1	2	13	6	-	-	-	-	-
తెలంగాణ	**5**	**35**	**6**	**71**	**87**	**33**	**37**	**24**	**7**	**14**	**18**	**27**	**36**	**79**	**224**	**138**	**-**	**-**	**-**	**15**	**3**
అనంతపురం	-	-	-	11	14	7	1	4	2	5	2	5	11	6	21	-	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	2	4	-	-	-	-	2	3	3	5	-	12	7	-	-	-	-	-
కడప	-	1	-	2	9	-	-	-	1	-	2	-	-	2	19	3	-	-	-	-	-
గుంటూరు	-	1	-	5	2	1	3	1	-	3	1	1	1	2	19	12	-	-	-	-	-
కృష్ణా	-	-	-	2	3	1	2	1	-	-	1	1	-	4	14	33	-	-	-	-	-
కర్నూలు	-	5	2	2	4	3	5	7	2	2	3	4	6	5	15	19	-	-	1	-	-
తూర్పు గోదావరి	-	-	-	1	4	-	3	2	1	3	-	-	-	-	26	11	-	-	-	-	-
ప్రకాశం	-	-	-	4	4	5	2	2	-	5	1	5	2	7	17	18	-	-	-	-	-
శ్రీకాకుళం	వివరాలు అందలేదు																				
పశ్చిమ గోదావరి	-	-	-	3	1	2	3	1	1	2	-	1	-	2	12	14	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	3	2	1	5	1	-	2	4	2	1	3	15	13	-	-	-	-	-
విజయనగరం	-	1	-	-	2	2	3	1	-	4	-	-	3	2	15	8	-	-	-	-	-
విశాఖపట్నం	-	-	-	2	8	1	6	1	2	3	-	2	3	-	13	12	-	-	-	7	-
ఆంధ్రప్రదేశ్	**-**	**8**	**2**	**37**	**57**	**23**	**33**	**21**	**9**	**31**	**17**	**24**	**32**	**33**	**198**	**150**	**-**	**-**	**1**	**7**	**-**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 198 - January 2018 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/12/2017 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2017-19
Date of Posting : 29th, 30th

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao